
శ్రీ బాదం కొమస్వామి

పద్మశ్రీ సాహితీ సంచిక



894.827092
VYA

వ్యాస ప్రభాస

10

ADUA10113103

వ్యాసప్రభాస

శ్రీ బాదం రామస్వామి షష్ట్యబ్ది సాహితీ సంచిక

సంపాదకుడు

రావికంటి వసునందన్

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11991

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
11991



కిన్నెర ఆర్ట్‌థియేటర్స్

కిన్నెర పబ్లికేషన్స్

2-2-647/153, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ,

హైదరాబాద్ 500 013

10

ప్రథమ ముద్రణ : డిసెంబర్ 1985

894.827092
VYA

ప్రతులు : 2000

ముఖ చిత్రం : చంద్ర

ప్రకాశకులు : బాదం రామస్వామి ఛారిటబుల్ ట్రస్ట్,
హైదరాబాద్.


ప్రతులకు :
కిన్నెర పబ్లికేషన్స్
2-2-647/153
సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ,
హైదరాబాద్ 500 013.
ఫోన్ : 703318.

ముద్రణ :
మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్,
1-1-694/2/ఎ, గాంధీనగర్,
హైదరాబాద్ 500 380.

111

DANASHEELA
SRI BADAM RAMASWAMY SHASTIPURTHI
FELICITATION COMMITTEE

Sri M. V. Narayana Rao, I.P.S. (Retd.)	Chairman
Sri M. Raghuram	Secretary
Sri M. Venkateswarlu	Convenor
Dr. Takhur V. Hari Prasad	Member
Sri B. N. Reddy	Member
Sri G. Narayana Rao, I.A.S. (Retd.)	Member
Sri K. V. Ranga Reddy	Member
Sri R. Vasu Nandan	Editor



Smt & Sri Badam Ramaswamy on the occasion of "Sashtipurthi" (6-12-1985).

(9)

Editorial

The poet of poets, Kalidasa, describing the qualities of the kings of Raghuvamsha said, Aafalo daya karmanam which means that the kings of this royal family persevered in whateaver they decided to do, and did not give up till they achieved success. They did not even disclose the degree of effort involved in the task they took up. This is a sign of achievers of great deeds. It applies not only to the brave kings of Raghuvamsha, but also to pre-eminent business magnates like Mr. Badam Ramaswamy. It is because of this quality of his - this undaunted perseverance, which makes him strive towards his goal without a reprieve, that he has become a famous businessman and philanthropist not only in the twin cities of Secunderabad and Hyderabad but also in the State. Being a child of Goddess Lakshmi, (blessed with wealth & good fortune), he felt it his duty to pay his respects to Goddess Saraswati too, on his Sashtyabdi poorthi (60th Birthday) and he is bringing out this edition with contributions from great men of letters. This foreward acknowledges gratefully, the co-operation extended by great litterateurs, and the blessings showered by the well-wishers of Mr. Ramaswamy.

It would be most appropriate, at this juncture to say a few words about the multifaceted aptitude of Mr. Ramaswamy and the extensive social service he has done.

Towards the development

Badam Ramaswamy was born to Mrs.Badam Balakishtama and Mr. Badam Venkataiah on December 6th 1925 at Perruru, Mahaboobnagar District.

Mr. Balaiah and Mr. Rangaswamy were his elder brothers. Inspite of being the youngest son, Mr.Ramaswamy performed such deeds that brought name and fame to the small village of Perruru. The tradition in this illustrious family, right from the grandfather to the grandson (Ramaswamy), was to extend, their hospitality to any guest that came to their door

and to feed the less-fortunate. Perhaps, this philanthropy brought rich dividends to Mr.Ramaswamy in his later life - the evidence is his successful business ventures. Just as cutting and polishing brings out the worth and beauty of such hard stones as diamonds, so also Mr. Ramaswamy faced great hardships before he achieved success.

The time of test for Mr. Ramaswamy started when he was just three years old with the death of his father. His mother, his brother Balaiah and his brother-in-law Illuri Balaiah, shaped and moulded his early life. Mr. Ramaswamy started his education at the age of seven in a local school in the village of Ajjakollu, the home town of Mr.Balaiah another brother-in-law of his. When he was eleven he returned to his native village perruru and studied upto the forth class. In his fourteenth year he joined as an apprentice in a rice mill run by konda Lingaiah and Illuri Chenna Kishtaiah at Vanaparthi Road, Mahaboobnagar District. This was a stepping stone towards his developing a business acumen. For about seven months, during this period he used to pay Rs.5/-every month to the mill-owners towards his boarding expenses. Then, recognising his worth and his honesty the mill owners offered him the post of a cashier with a monthly Salary of Rs. 35/- Two years later, Mr. Ramaswamy rose to the position of Manager with a pay of Rs.100/- a month.

This was the first fruit of his indomitable endeavour. In the year 1945, he married Sarojini Devi. His first son was born twenty-three years after his marriage on 13th November, 1968. At present, his son, Badam Balakrishna is pursuing his collegiate studies. From his sixteenth year in 1944,Mr.Ramaswamy joined the local Congress group in Vanaparthy Road and contributed his might to the struggle for India's freedom. In 1947 he was arrested and imprisoned in Madanapuram Jail, Mahaboobnagar District. After his release from prison, he, his wife and his mother joined his sister Mrs. Ramalakshmamma and his brother-in-law Illuri Ballaiah at Kurnool.

There, Mr. Ramaswamy used to supervise the allocation of loans to irrigation contractors and supplying of rations to the labourers working for those contractors. This was how he was able to gather a first-hand knowledge of contract work and the problems of the labour class. This experience also helped him when he took up a number of Social Welfare Schemes later in life. After having gained a considerable amount of practical knowledge of contract work, Mr. Ramaswamy started taking up his own contracts from 1950 to 1956. Starting with earth work at the Left Canal of Tungabhadra near Gangavati, he extended his work to construction of bridges, linings and technical aspects of construction.

In 1957 he took up the Nagarjuna Sagar Left Canal work near Miryalaguda and the Right Canal work at Kharampudi (Guntur District) both of which he accomplished with impeccable perfection. Simultaneously he took up the laying of metre-guage railway lines in Maharashtra and Madhya Pradesh. He played a major role in the construction of the Hydro-electric project of Jog Falls (the second largest in the world) in Shimoga District, Mysore. From 1961 to 1965 he was busy with the construction of a bridge on the Tungabhadra, Dharwar District, a 12 mile long road on the National Highway from Trivandrum to Bombay, and many other such significant enterprises. During this period he also built a house at Adarsh Nagar, Naubat Pahad for his family members. In 1964 he purchased land at Road No. 14, Banjara Hills and constructed the Bhagyanagar Studios which has provided great incentives to Cine-artists and technicians. It was inaugurated on Vijayadasami day in 1977. He is also a partner of the Sangam Theatre Complex in Hyderabad which was built on a plot of 7,000 square yards. In 1966 he built the Krishna Hotel Market Complex on an area of 8,000 square yards. His six-apartment house in Adarsh Nagar was built in 1972 and was allotted to his friends and relatives. Mr. Ramaswamy was also the major partner of Bhagyanagar Builders - a recently set

up organisation (built on an area of 3000 square yards and located behind Sangam Theatre). In 1981 he constructed Badam Apartments at Somajiguda, Hyderabad on an area of 1000 square yards and in the same year he started work on the Bhagyanagar Studio Shopping and Residential Complex (4000 square yards). In 1983 he laid the foundation stone for the Tarnaka Badam Apartments (consisting of 100 Apartments). He has also started work on the Badam - Sohana Apartments (40) on a 2500 square yards area in 1984. In spite of having been a partner in all these construction works, Mr. Ramaswamy's has been the major role in them.

He has now undertaken the construction of Gopal-Badam Apartments in Somajiguda. The plot is of a thousand square yards and the complex will have 25 apartments. However, Mr. Ramaswamy continues to stay in a house which he bought for himself in 1979. In the same year, he and his family visited Russia - Moscow, Leningrad; Minsk and Tashkent. In 1981 he went to the countries of the South-East, Kuala Lampur, Hongkong, Manila and Singapore. In September, 1982 they went on a sight-seeing tour of London, France, Amsterdam, Frankfurt and Switzerland. In the same year they also visited Geneva, London and the United States - New York, Dallass, San Fransisco, Chicago, Las-Vegas, Washington etc. In April, 1983 he went round Thailand, Japan, Bangkok, Korea, Osaka and such other places of scenic beauty.

This was the 'progressive' period of Mr. Badam Ramaswamy. It is necessary to describe his achievements in such detail, because he made a study of the conditions of living in different countries from very close quarters. From his extensive tours he was able to understand the problems of the backward classes, and his wide experience of the poor people of the world helped him to be kind and benevolent to the needy.

Towards the philanthropy

The riches which he strived to acquire are now being employed by Mr. Ramaswamy for social welfare schemes which have, in turn, brought him the name of a benefactor. He has generously donated money to institutions which promote education, health, employees welfare, social welfare and spiritual activities. This has not only established his fame in this world but is also perhaps, winning him a reputation in the other world. Recounting his large-heartedness helps us to recognise the humane side his personality.

With the help and co-operation of his brother Badam Rangaswamy, he brought the status of a high school to the small primary school at Perruru. He was successful, also, in giving it a new shape in the form of its own building. In 1957, with a donation of Rs. 10,000 he set up a primary Health Centre there. And in 1981 he built a primary school building for boys and girls in the memory of his mother, Mrs. Badam Balakishtamma. He set up, in 1982, the Badam Rural Development Trust with the intention of helping the rural people and promoting their education. Along with other welfare activities he also established the Badam Venkataiah ITI in an area of 10 acres in the memory of his father. For this Institute he built a three-storeyed permanent building in an area of 15,000 square feet. These are just some of the examples of the service he rendered to his native village, Perruru.

Apart from all this, Mr. Ramaswamy also constructed the Ramaswamy Hall in the Degree College at Mahaboobnagar incurring an expenditure Rs. 20,000. He also donated 3,000 square yards of land towards the construction of the Vasavi Vysya students hostel. Right now, he is building a three storeyed hostel, Vasavi Vidyarthi Vasathigruham, and also a marriage hall in an area of 1200 square yards on the Station Road.

The Badam Ramaswamy Charitable Trust was set up in Hyderabad in the year 1964. It is a boon to the poor. Without any differences of caste and creed, this institution offers scholarships to students and interest-free loans to them on the condition that they should be returned when the students start earning. His main objective is to promote health schemes and social welfare schemes. This trust not only helps students of science and technology with monetary aid, but also provides opportunities for people like Dr. Brij Kishore (Geology) to pursue their higher studies abroad. Every year a hundred students benefit from these scholarships.

To collect funds for this trust, Mr. Ramaswamy built the Sangam Theatre in Hyderabad and the shopping centre around it.

Under the auspices of this Trust Mr. Ramaswamy has undertaken many social welfare activities. In 1982 he set up the Sanjay Memorial ITI near RTC Crossroads to promote technical education. He also started a health centre for the handicapped in 1985 in the premises of the Hyderabad Special School in contonement area of Secunderabad. He is now getting a building constructed for a Junior College at Khilla-ghanapuram, Mahaboobnagar. He has also given, at a subsidized rate, of Rs. 40,000, a part of the area belonging to Bhagyanagar Builders (behind Sangam Theatre) to the Hyderabad AVOPA. There are many such institutions that have benefitted from the kind gestures of Mr. Ramaswamy.

While promoting the welfare of his employees, Mr. Ramaswamy has sold some of the apartments at Tarnaka at just half the original price under two welfare schemes. Not only do these schemes offer housing facilities but also provide facilities like transport, health, education and entertainment to the inhabitants of the flats. At Narsing, on a four acre plot, he constructed flats for the econo-mically backward sections of his employees and sold them at halfrates - thus making available a rare

opportunity to them. Adjoining this plot at Narsing he has also acquired 6 acres of land with the idea of constructing a permanent building to house the Sanjay Memorial ITI Institute (now at RTC Crossroads) a guest house, a health centre and a recreation club.

Apart from the welfare schemes mentioned above, in 1977 he also produced a film in the Bhagyanagar Studios and called it "Anukunnadi Sadhistha" ("I will achieve what I strive for"). This film was completed in a year's time - just as he completed everything else he planned to do. Not only are the technicians and artists provided incentives in terms of attractive wages but other producers are also permitted the use of this studio at nominal rates. In 1975 during the first World Telugu Conference, he extended his hospitality to the delegates from Bombay and Madras at the Krishna Hotel. At Dawangiri in the year 1984, Mr. Ramaswamy was aptly conferred the title of 'Danashila' (The Bounteous Giver) .

Never looking back upon what he had achieved, Mr. Ramaswamy strove ahead to greater glory. As Treasurer of the Vasavi Academy he himself donated Rs. 2 lakhs for the setting up of the Vasavi Engineering College and its buildings. As the Chairman of the Construction Committee of Vasavi Seva Kendram, he helped in the establishment of the building complex, shopping centre and marriage hall at Lakdi-ka-pul. He has also worked as Treasurer and Vice-Chairman of the Andhra Pradesh Film Chamber of Commerce. At present he is an Executive Member of the same Chamber. Apart from these he is also the life member of the following:

1) Kinnera Art Theatres - Executive Member


2) Tyagaraja Gana Sabha - Executive Member

3) Vasavi Engineering College - Executive Member.

4) Vasavi Seva Kendram, Vysya Hostel, Arya Vysya Mahasabha etc. life Member.

It is difficult to describe the many other welfare activities that Mr. Ramaswamy has engaged in, in this brief account. However much he may have achieved he still hopes to reach greater heights in serving the society.

Being a self-made man who has an unswerving perseverance and a spiritual bent of mind, Mr.Ramaswamy has reached a prominent position in life. We pray that having performed his Sastyabdhi ceremony, he may live for many more years in glory and prosperity so that the people may continue to benefit from his service to humanity.



Miss. Kumudben Joshi, Governor of Andhra Pradesh, felicitating Sri Ramaswamy with shawl.

9(b)

9(c)



Presentation of "Sanmana Patram" by Smt. Jamuna.


(P)2



Momento presentation by the Governor of Andhra Pradesh.

8(ह)


ထင်ရှားဝတ္ထုရှင် ဒေါ်မေသန်း ကွယ်လွန်



9(h)

శ్రీ బాదం రామస్వామి


నిర్మాణాత్మక కార్యక్రమాలు




భాగ్యనగర్ స్టుడియో ప్రారంభోత్సవసభ 21–10–1977 ఎడమ నుండి కుడికి :
శ్రీయుతులు–మాణిక్యరావు (మంత్రి), అక్కినేని నాగేశ్వరరావు, బాదం రామస్వామి దంపతులు (నిలుచున్నవారు),
జలగం వెంగళరావు (ముఖ్యమంత్రి), బాదం రంగస్వామి(నిలుచున్నవారు) రాంరెడ్డి (మంత్రి), శ్రీమతి జమున.



బాదం వెంకటయ్య ఐ.టి.ఐ., పేరూర్.



బాదం బాలకిష్టమ్మ స్మారక పాఠశాలను ప్రారంభిస్తున్న
మంత్రివర్యులు శ్రీ కె. రోశయ్య



బాదం బాలకిష్టమ్మ స్మారక ప్రాథమిక పాఠశాల, పేరూర్ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న శ్రీ బాదం రామస్వామిగారు, ఆసీనులైన శ్రీ కొత్తూరు సీతయ్యగుప్త, శ్రీ జి. నారాయణరావు (ఐ.ఏ.ఎస్. మహబూబ్‌నగర్ కలెక్టర్), మంత్రివర్యులు శ్రీ కె. రోశయ్య ప్రభృతులు.




బాదం బాలకిష్టమ్మ స్మారక ప్రాథమిక పాఠశాల, పేరూర్

శ్రీ వాసవి విద్యార్థి వసతి గృహము, మహబూబ్‌నగర్




వైశ్యవిద్యార్థి వసతి గృహము, మహబూబ్‌నగర్
(3,000 గజాల స్థలం విరాళంగా ఇచ్చినది)




బాదం రామస్వామి హాల్ గవర్నమెంట్ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల,
మహబూబ్‌నగర్ (రు. 20,000/- విరాళం ఇచ్చినది)



సంగం సినిమా ప్రారంభిస్తున్న శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీతో
శ్రీ బాదం రామస్వామి.




సంగం సినిమా



స్పెషల్ స్కూల్ ఆవరణలోని ఉచిత వైద్యశాల.



రష్యా పర్యటన ముగించి వచ్చిన శ్రీ బాదం రామస్వామిని
అభినందిసున్న శ్రీమతి జమున, తదితర మిత్రులు.



మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 1975లో హైదరాబాద్‌కు వచ్చిన ఢిల్లీ, బొంబాయి రాష్ట్రాల ప్రతినిధులకు సముచిత ఆతిథ్యాన్ని సమకూర్చిన బాదం రామస్వామి సోదరులను కృష్ణా హోటల్‌కు వచ్చి అభినందిస్తున్న ముఖ్యమంత్రి, విద్యామంత్రి, రవాణామంత్రి.

సంపాదకీయమ్

సమగ్రవాణిజ్యవేత్త

సంఘసంక్షేమకర్త

దానశీల

శ్రీ బాదం రామస్వామి

ప్రవేశిక

రఘువంశ చక్రవర్తుల గుణగణాలను వర్ణిస్తూ కవికుల గురువు కాళిదాసు ఒకచోట –

ఆఫలోదయ కర్మణాం

అంటాడు. అంటే ఆ చక్రవర్తులు ఫలితం లభించే వరకూ; తలపెట్టిన పని లోగుట్టూ, పట్టినపట్టూ రట్టు చేసేవారుకారనీ, విడిచిపెట్టేవారు కారనీ అర్థం. ఇది కార్యశూరుల లక్షణం. రఘువంశ చక్రవర్తులకేకాదు రామస్వామిగారి వంటి వర్తక శ్రేష్ఠులకూ అనువర్తిస్తుంది పై లక్షణం.

అనుకున్నది అందుకునే వరకూ కునుకు తీయని దృఢప్రారంభులు కాబట్టే ప్రముఖ వాణిజ్యవేత్త శ్రీ బాదం రామస్వామిగారు, ఈనాడు హైదరాబాద్ సికిందరాబాద్ జంటనగరాల్లోనే కాక రాష్ట్రం మొత్తం మీద ఎన్నదగిన పత్రిక చక్రవర్తిగా, సమాజ శ్రేయోమూర్తిగా ప్రఖ్యాతి గడించారు. లక్ష్మీపుత్రుడైన ఆయన తమ షష్ట్యబ్ది సందర్భంగా చదువులతల్లి సరస్వతికి అక్షరసుమ సమారాధనం చేసే సత్సంకల్పంతో తెలుగునేలలో గణుతికెక్కిన అనేక సాహిత్యధనుల వ్యాస సంపుటిని వెలువరిస్తున్నారు. ఈ మంచి పనికి సమంచితంగా సహకరించిన సాటిలేని సారస్వత మూర్తులకూ, ఆశీర్వదించి అభినందనలందించిన పెద్దలకూ, ఈ సంచిక సంపాదకుని సగౌరవ కృతజ్ఞతాంజలులు. ఈ తరుణంలో రామస్వామి గారి కార్యశూరత గురించీ, సాంఘిక సంక్షేమ వీరత గురించీ నాలుగు మాటలు చెప్పుకోవడం సముచితమని భావిస్తున్నాను.

అభ్యుదయ దశ

క్రీ.శ. 1925, డిసెంబర్ 6వ తేదీన శ్రీమతి బాదంబాలకిష్టమ్మ, శ్రీ బాదం వెంకటయ్య గారి చిన్నకొడుకుగా జన్మించారు శ్రీ బాదం రామస్వామిగారు. వీరి అన్నలు శ్రీ బాలయ్య గారు, శ్రీ రంగస్వామి గారు. స్వస్థలం మహబూబ్ నగర్ జిల్లా, ఆత్మకూరు తాలూకాలోని 'పేరూరు'. చిన్నకొడుకై పుట్టినా పెద్ద పనులెన్నో చేసి, పేరూరుకే పేరుతెచ్చిన కార్యశూరులు శ్రీరామస్వామి. వీరి వంశంలో తండ్రి తాతలనుంచీ అతిథి అభ్యాగతులను ఆదరించడం, ఉన్నంతలో అన్నార్తులకు భోజనం పెట్టి ఆదుకోవడం కాదనకుండా, లేదనకుండా సాగుతూ వచ్చిన సంప్రదాయం. బహుశా ఆ దానశీలమే రామస్వామిగారి నేటి సమగ్రాభివృద్ధికి మూలధనమైందేమో అనిపిస్తుంది – వారి జీవిత ఘట్టాలను పరిశీలిస్తే.

ప్రజాలకు సానల ఒరిపిడి కాంతిని పెంచడానికేనన్నట్లు, శ్రీ రామస్వామి గారికి మూడవ ఏటనే తండ్రి కీర్తిశేషుడు కావడంతో పరీక్షలు ప్రారంభమైనాయి. ఆ కష్టకాలంలో శ్రీమతి బాలకిష్టమ్మగారూ, అన్న శ్రీ బాదం బాలయ్యగారూ, బావ

శ్రీ ఇల్లూరి బాలయ్యగారూ రామస్వామిగారి బాల్యాన్ని దిద్దితీర్చిన ముఖ్యులు. వీరి మరో బావగారు శ్రీ బాలయ్య గారి స్వగ్రామం అజ్జకొల్లులో తమ ఏడవ సంవత్సరం నుంచి ఆ కాలంనాటి వీధిబడి చదువు చదువుకున్నారు రామస్వామి గారు. 11వ సంవత్సరంలో పేరూరుకు తిరిగి వచ్చి 4వ తరగతి వరకూ విద్యాభ్యాసం చేశారు. తమ 14వ సంవత్సరంలో వనపర్తిరోడ్ (మహబూబ్‌నగర్) లోని కొండా లింగయ్య, ఇల్లూరి చెన్నకిష్టయ్యగారి రైస్‌మిల్‌లో అప్రెంటిస్‌గా చేరి వ్యాపార విధానాలను అధ్యయనం చేశారు. ఈ కాలంలో సుమారు 7 నెలల పాటు రామస్వామిగారే భోజన వసతి సౌకర్యాలకోసం మిల్లుకు నెలకు 5 రూపాయలు చెల్లించేవారు. ఏడునెలల తర్వాత రామస్వామి గారి కార్యదక్షతనూ, నిజాయితీని గుర్తించి నెలకు 35 రూపాయల వేతనంతో క్యాషియర్‌గా నియమించింది మిల్లు. ఆ తర్వాత మరో రెండు సంవత్సరాలకు నెలకు పందరూపాయల వేతనం మీద ఏకంగా మేనేజర్ పదవినే సంపాదించారు రామస్వామిగారు. వీరి కార్యశూరతకు మొదటి ఫలం ఈ పదవి. 1945వ సంవత్సరంలో సౌభాగ్యవతి సరోజాదేవి గారితో రామస్వామి గారికి వివాహం జరిగింది. దాదాపు 23 సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత 13వ నవంబర్ 1968న సుపుత్ర ప్రాప్తి కలిగింది. కుమారుడు చిరంజీవి బాదం బాలకృష్ణ. ప్రస్తుతం ఈ చిరంజీవి కళాశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు.

వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తూనే క్రీ. శ. 1944 సంవత్సరం అంటే తమ 16వ ఏట నుంచీ శ్రీ రామస్వామిగారు వనపర్తిరోడ్‌లో లోకల్ కాంగ్రెస్‌లో చేరి స్వాతంత్రోద్యమంలోనూ ఉత్సాహంతో పాల్గొంటూ వచ్చారు. ఫలితంగా 13-2-47న మహబూబ్‌నగర్ జిల్లా సెంట్రల్ జైల్, మదనాపురంలో నిర్బంధి తులయ్యారు.

కారాగార వాసానంతరం తల్లి శ్రీమతి బాలకిష్టమ్మగారితో, మొత్తం కుటుంబంతో కర్నూలులో ఉన్న అక్క బావలు శ్రీమతి రామలక్ష్మమ్మ శ్రీ ఇల్లూరి బాలయ్యగార్ల వద్దకు చేరుకున్నారు రామస్వామిగారు. బాలయ్యగారి

దగ్గర అదోనిలోని నీటి పారుదల కంట్రాక్టర్లు పెట్టుబడి మొత్తాలను అప్పుగా తీసుకుపోతుండేవారు. ఆ అప్పు మొత్తాలను అజమాయిషీ చేయడానికీ, కాంట్రాక్టు కూలీలకు రేషన్ సప్లై చేయడానికీ శ్రీరామస్వామి గారిని నియమించారు బాలయ్య గారు. ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకొని కంట్రాక్టు వ్యవహారాలను ఒంట బట్టించుకోవడమే కాక; శ్రమజీవుల, నిమ్న వర్గాల జీవనవిధానాన్నీ కష్ట సుఖాలనూ సానుభూతితో పరిశీలించి అవగతం చేసుకున్నారు. ఆనాటి అవగాహనే బహుశా రామస్వామిగారు ఈనాడు చేపట్టి నిర్వహిస్తున్న అనేక సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు బీజావాపనం చేసిందేమో !

ఇలా కొంత అనుభవాన్ని సంపాదించిన తర్వాత 1950 నుంచి 1956 వరకూ స్వంత కంట్రాక్టులు ప్రారంభించి; గంగావతి దగ్గర తుంగభద్ర ఎడమ కాలువ 8 మైళ్లపని ఎర్త్‌వర్క్ (*Earth work*) తో ప్రారంభించి క్రమంగా లైనింగ్స్, బ్రిడ్జెస్, టెక్నికల్ సైడ్ పనులు కూడా విజయవంతంగా నెరవేర్చారు.

1957లో నాగార్జునసాగర్ ఎడమకాలువ మిర్యాలగూడ (నల్గొండ) దగ్గర, 1958లో కుడికాలువ కారంపూడి (గుంటూరు) దగ్గర ఏకకాలంలో సవ్యసాచిలా కంట్రాక్టులు నిర్వహించారు. ఈ పనులుచేస్తూనే 1958-60 మధ్యకాలంలో హింగోలీ (మహారాష్ట్ర), ఖాండ్వా (మధ్యప్రదేశ్)ల నడుమ మొట్టమొదటి మీటర్‌గేజ్ రైలు మార్గాన్ని చేపట్టి పూర్తిచేశారు. 1960లో మైసూర్ షిమోగా జిల్లాలోని జోగ్ ఫాల్స్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణ కార్యక్రమంలోని అతిముఖ్యభాగాలను తమ నేతృత్వంలో తీర్చి పెట్టారు. ఇది ప్రపంచంలోనే పెద్ద దైన రెండవ (*waterfall*) అనే విషయం గమనార్హం. 1961–65 మధ్యలో ధార్వార్ జిల్లాలో తుంగభద్ర మీద బ్రిడ్జినూ, దక్షిణకర్ణాటకలో ట్రివేండ్రం-బాంబే జాతీయ రహదారిలోని కోటి రూపాయల విలువగల 12 మైళ్ల మంగుళూరు రోడ్డు కంట్రాక్టునూ, ఇంకా ఇతర కార్యక్రమాలనూ సమర్థవంతంగా నిర్వహించారు.

ఈ పనులన్నీ చేస్తూనే 1963లో ప్రారంభించి హైదరాబాద్ ఆదర్శ్‌నగర్ (నౌబత్ పహాడ్)లో ఒక ఇల్లు కట్టించి, కుటుంబసభ్యులకే ఇచ్చారు. 1964లో

బంజరాహిల్స్ రోడ్ 14లో స్థలంకొని 1976 లో ఈనాడు జంటనగరాల్లోని సాంకేతిక నిపుణులకూ, తదితర సినిమా పర్గాలకూ ఎంతో చేయూతనిస్తున్న 'భాగ్య నగర్ స్టుడియో' నిర్మాణం ప్రారంభించి 1977 విజయదశమినాడు ప్రారంభో త్సవం చేయించారు. 1965లో 7000 గజాల స్థలంకొని భాగస్వామిగా నిలిచి 1969లో 'సంగం' థియేటర్ నిర్మించారు. 1966లో 8000 గజాల స్థలం లకడీకాపూల్‌లో సంపాదించి "కృష్ణా హోటల్ మార్కెట్ కాంప్లెక్స్" నెల కొల్పారు. 1972 లో ఆదర్శనగర్‌లో 6 విభాగాలున్న ఇల్లు కట్టారు. పైన పేర్కొన్న ఇండ్లన్నీ స్నేహితులకో, నమ్ముకున్న వారికో కేటాయించారే తప్ప తామే ఉంచుకోలేదు. సంగం థియేటర్ వెనుక 3000 గజాల్లో నేడు వెలసిన భాగ్యనగర్ బిల్డర్స్‌లోని 50 విభాగాల్లో రామస్వామిగారు భాగస్వామి. 1981లో 1000 గజాల పరిధిలో 20 విభాగాలున్న 'బాదం ఎపార్ట్‌మెంట్స్' సోమాజిగూడ, హైదరాబాద్-4లో నిర్మించారు 1981లోనే 4000 గజాల్లో భాగ్యనగర్ స్టుడియో (*Pvt. Ltd*) షాపింగ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభించారు. 1983లో 4000 గజాల పరిధిలో 'తార్‌నాకా బాదం ఎపార్ట్‌మెంట్స్' పేరుతో 100 విభాగాలున్న ఇండ్ల సమూహాన్ని వినిర్మించారు. 1984 లో ప్రారంభించి 40 విభాగాలున్న 'బాదం సోహానా' హౌసింగ్ కాంప్లెక్స్‌ను 2,500 గజాల్లో నిర్మిస్తున్నారు. ఈ అన్ని నిర్మాణాల్లోనూ భాగస్వామేఐనా శ్రీ రామస్వామిగారిదే ప్రముఖపాత్ర.

1000 గజాల్లో 25 విభాగాలున్న 'గోపాల్ బాదమ్ ఎపార్ట్‌మెంట్స్'ను సోమాజిగూడలో నిర్మిస్తున్నారు ఇన్ని నిర్మాణాలు చేసినా దేనికీ అంటిపెట్టుకోక 1979లో బంజారాహిల్స్‌లో తమకోసం కొన్న ఇంటిలోనే నివసిస్తున్నారు.

1979లో సోవియట్ రష్యాలోని మాస్కో, లెనిన్‌గ్రాడ్, మిన్స్‌స్క్. బ్లాక్‌సీ, తాష్కెంట్ మొదలైన ప్రదేశాలు కుటుంబ సమేతంగా పర్యటించారు,

1981లో మలేషియాలోని కౌలాలంపూర్, హాంకాంగ్, మనీలా, సింగ పూర్ మొదలైన సౌత్ ఈస్ట్ కంట్రీస్ దర్శించారు.

1982 సెప్టెంబర్‌లో లండన్,ఫ్రాన్స్, ఆమ్‌స్టర్‌డామ్, ఫ్రాంక్ ఫర్ట్, జర్మనీలోని ఫోటోకెనో, స్విట్జర్లాండ్ చూచివచ్చారు.

1982లోనే జెనీవా, లండన్, అమెరికాలోని న్యూయార్క్, డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజల్స్, చికాగో, వాషింగ్టన్, లాస్‌వేగాస్ మొదలైన విదేశాలు పర్యటించారు.

1983, 25 ఏప్రిల్‌న ప్రారంభించి థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్, జపాన్‌లోని హాంకాంగ్, టోక్యో, కొసాకా, మొదలైన ముఖ్యనగరాలూ, కొరియాలోని రమణీయ ప్రదేశాలూ రెండు వారాలపాటు సకుటుంబంగా దర్శించారు.

ఇదంతా శ్రీ బాదం రామస్వామిగారి 'అభ్యుదయ దశ'. ఇంత వివరంగా చెప్పుకోవడం ఎందుకంటే ఇన్ని విభిన్నదశల్లో ఆయన విభిన్న సంస్కృతులనూ, జీవన విధానాలనూ, ప్రాంతీయ–దేశీయ–విదేశీయ పరిస్థితులనూ ఎప్పటి కప్పుడు అధ్యయనంచేసి; బీదవర్గాల అసహాయతను అర్థం చేసుకొన్నారని తెలుసుకోవడానికి. ఇంతటి 'సువిశాలలోకజ్ఞానం' సముపార్జించిన శ్రీ బాదం రామస్వామిగారి 'అభ్యుదయ దశ' 'సహృదయ దిశ'లో ఎలా పయనిస్తుందో గమనించడానికి.

సహృదయ దిశ

"స్వయంతీర్ణః పరాంతారయతి" అన్నట్టుగా శ్రీ బాదం రామస్వామి గారు తాము ధనికులు కావడమే కాకుండా ధర్మార్థమై తమ కష్టార్జితమైన అర్థాన్ని, కష్టాల్లో ఉన్న వారికి సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు సముచితంగా వినియోగిస్తూ సత్కీర్తిని సంపాదిస్తున్నారు. విద్య, వైద్యం, ఉద్యోగుల భద్రత, సామాజిక ప్రగతి, ఆధ్యాత్మిక కేంద్రాలు మొదలైన రంగాలకు భూరివిరాళాలు అందిస్తూ ఇహ పరాలను సాధిస్తున్నారు. వాటిలో ఉదాహరణలుగా కొన్నిటిని స్మరించడం మంచినీ, మానవత్వాన్నీ గుర్తించడం.

అన్నగారు శ్రీ బాదం రంగస్వామిగారి అండదండలతో అనేక వ్యాపారాలను నిర్వహిస్తూనే శ్రీ రామస్వామిగారు 1955లో ప్రారంభించి తమ పుట్టినూరు పేరూరులో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా రూపొందించారు దానికి ఒక స్వంతభవనాన్ని సమకూర్చడంలో కృతకృత్యులయ్యారు 1957లో 10,000/– రూపాయల విలాళం ఇచ్చి ఒక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మింపజేశారు 1981లో ''బాదం బాలకిష్టమ్మ స్మారక ప్రాథమిక పాఠశాల'' అనే పేరుతో బాలబాలికలకు ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మించారు. 1982లో పేరూరు గ్రామ ప్రజల సహాయార్థమూ, విద్యాభివృద్ధి కోసమూ ''బాదం రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్'' అనే ఒక సంస్థను స్థాపించారు. ఇతర సహాయ కార్యక్రమాలతోపాటు ప్రస్తుతం దీని కింద 10 ఎకరాలలో తండ్రిగారిపేర ''బాదం వెంకటయ్య *ITI* ''స్థాపించారు. దీనికోసం 15000 *Sq ft*లో 3 అంతస్తుల శాశ్వత భవనాన్ని నిర్మించారు. ఇవి పుట్టినూరికి శ్రీ రామస్వామిగారు చేసికొన్న సేవలు.

ఇవికాక మహబూబ్‌నగర్ డిగ్రీకళాశాలలో 'రామస్వామి హాల్' అనే పేరుతో 20,000/– రూపాయల వ్యయంతో 1963లో ఒక పెద్దహాలును నిర్మించారు వాసవి వైశ్య విద్యార్థి వసతి గృహాన్ని నిర్మించడానికి 3000 చ గజాల స్థలాన్నికూడా 1976లో విరాళంఇచ్చారు. ప్రస్తుతం 1200 చ.గజాల విస్తీర్ణం కలిగిన స్థలంలో స్టేషన్‌రోడ్‌లో బీద విద్యార్థుల కోసం ఒక మూడంతస్తుల 'శ్రీ వాసవీ విద్యార్థి వసతి గృహమును'ను, ప్రస్తుతం ఆ స్థలంలోనే ఒక కళ్యాణమండపాన్ని కూడా నిర్మిస్తున్నారు.

1964లో ''బాదం రామస్వామి చారిటబుల్ ట్రస్టు''ను హైదరాబాద్‌లో స్థాపించారు. ఇది పేదల పెన్నిధి. ఈ సంస్థ కులమత వివక్షణ లేకుండా బీద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం, అప్పుగా పడ్డీలేని పెద్దమొత్తాలను విద్యార్థి ఉద్యోగి ఐనప్పుడే తిరిగి అడిగే పద్ధతిమీద అందించడం, వైద్యసౌకర్యాలను కలిగించడం, ఇతర సాంఘిక కార్యక్రమాలను

నిర్వహించడం ప్రధాన లక్ష్యాలుగా సేవాభూమిగా కొనసాగుతున్నది. సాంకేతిక, వైజ్ఞానిక విద్యోపార్జనలో కళాశాల విద్యార్థులను ఈ విధంగా ఆదుకోవడమే కాక, డా. బ్రిజ్‌కిషోర్ (*Geology*) లాంటి విద్యార్థుల విదేశ విద్యలకు కూడా ఈ సంస్థ సహకరించింది. ప్రతి సంవత్సరం సుమారు 100 మంది బీద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఈ సంస్థ ఇస్తున్నది.

ఈ సంస్థకు శాశ్వతాదాయాన్ని కల్పించడానికై శ్రీ రామస్వామిగారు హైదరాబాద్‌లో సంగం థియేటర్‌నూ, దాని ముందరా పైనా షాపింగ్‌కాంప్లెక్స్‌నూ నెలకొల్పారు.

ఈ సంస్థ పేరుతో శ్రీరామస్వామిగారు చేసిన సాంఘిక సేవాకార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. *RTC* క్రాస్‌రోడ్స్‌వద్ద 1982లో సంజయ్ మెమోరియల్ *ITI*ని స్థాపించి నడుపుతూ సాంకేతిక విద్యాభివృద్ధికి దోహదంచేస్తున్నారు. సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ దగ్గరఉన్న 'హైదరాబాద్ స్పెషల్‌స్కూల్' ఆవరణలో వికలాంగులకూ, బీదలకూ ఉచితవిద్యా సహాయార్థమై 23.10.85. విజయదశమినాడు ఒక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. మహబూబ్‌నగర్‌లోని ఖిల్లాఘనపురంలో జూనియర్ కళాశాలకోసం ఒక భవనాన్ని కట్టిస్తున్నారు. సంగంథియేటర్ వెనుక కట్టించిన భాగ్యనగర్ బిల్డర్స్‌లోని ఒక విభాగాన్ని రు. 40,000 తక్కువ ధరకు సంఘసేవ చేసే సంస్థ 'హైద్రాబాద్ అవోపా'కు సమకూర్చి ప్రోత్సహించారు. ఇంకా ఎన్నో సంస్థలను ఆదరిస్తున్నారు.

ఇపన్నీ ఇలా ఉండగా తననే నమ్ముకుని, తాను స్థాపించిన వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల సంక్షేమార్థమై శ్రీ రామస్వామిగారు చేపట్టిన అనేక కార్యక్రమాల్లో అతిముఖ్యమైనవి కల్పవృక్షం, కామధేనువులాంటి రెండు విధానాలు. వాటిలో మొదటిది తాము కట్టించిన "తార్‌నాకా బాదం అపార్ట్‌మెంట్స్" లోని భవన విభాగాలను తన ఉద్యోగులకు సగం ధరకే విక్రయించడం. ఈ భవన సముదాయం ఎన్నో వసతి సౌకర్యాలనూ, రవాణా, వైద్యం, విద్య, వినోదం మొదలైన ఎన్నో సదుపాయాలనూ కలిగిన తార్‌నాకా ప్రాంతంలో

నిర్మించారు. అంత ఆర్థిక సామర్థ్యంలేని ఉద్యోగులకోసం హైద్రాబాద్ సమీపం లోని నార్సింగి గ్రామంలో 4 ఎకరాల స్థలంకొని అన్ని వసతులతో ఉన్న సిమెంట్ భవన విభాగాలను సగం ధరకే నిర్మించి అందిస్తున్నారు. పై రెండు వసతులూ ఆయనవద్ద పనిచేసే ఉద్యోగులకు వెలకట్టలేని రెండు వరాలు. ఈ విభాగాన్ని ఆనుకొనే నార్సింగిలో మరో 6 ఎకరాల స్థలాన్ని చారిటబుల్ ట్రస్ట్ పేరుతో కొని శాశ్వత భవనంతో, వసతి గృహం, ఆరోగ్యకేంద్రం ఆటస్థలం మొదలైన అన్ని సౌకర్యాలతో "సంజయ్ మెమోరియల్ *ITI*" (*RTC X Road* లోని సంస్థను) పునర్నిర్మించాలని సంకల్పించారు శ్రీ రామస్వామిగారు.

పై సేవాదీక్షలుకాక, 2 ఫ్లోర్‌లలో 1977 విజయదశమినాడు ఆధునిక పరికరాలతో బంజారాహిల్స్‌లో తాము ప్రారంభించిన భాగ్యనగర్ స్టూడియో లో– అనుకున్నది సాధించికాని నిద్రంచని శ్రీ రామస్వామిగారు – "అనుకున్నది సాధిస్తా" అనే స్వంత చలనచిత్రాన్ని ఏడాదిలోపునే వినిర్మించారు. ఆ సంస్థలోని ఉద్యోగులకూ, టెక్నీషియన్లకూ మంచివేతనాలూ, ఇతర సౌకర్యాలూ కల్పించ డమే కాకుండా, చలనచిత్ర పరిశ్రమను ప్రోత్సహించే ఆశయంతో ఇతర నిర్మా తలకు తక్కువ అద్దెకు స్టూడియోను సమకూరుస్తున్నారు. 1975లో మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా బొంబాయి, మద్రాసుల నుండి వచ్చిన ప్రతినిధులకు కృష్ణా హోటల్ తరఫున సమగ్రమైన ఆతిథ్యం ఇచ్చి సత్కరించారు ఈ సంఘ సంక్షేమ కార్యాలకుతగినట్లుగా ఆలిండియా ఆర్య వైశ్యసమాజ్‌వారు 1984 (దావణగిరి)లో శ్రీ రామస్వామిగారిని 'దానశీల' బిరుదంతో సముచితంగా సత్కరించారు.

ఇన్ని సేవా కార్యక్రమాలను మడమత్రిప్పని పురోగమనంతో సాధించిన రామస్వామిగారు హైదరాబాద్‌లోని 'వాసవీ ఎకాడమీ' కోశాధికారిగా ఉండి, స్వయంగా 2 లక్షల రూపాయలు విరాళం ఇచ్చి, వాసవీ ఇంజనీరింగ్ కళాశాల స్థాపనకూ, భవన నిర్మాణాలకూ అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు "వాసవీ సేవా కేంద్రం' నిర్మాణసంఘం అధ్యక్షులు (Construction Committee

Chairman) గా ఉండి, లకడీకాపూల్‌లో నేడు వెలసిన భవన సముదాయాలకూ దుకాణాలకూ, కళ్యాణ మండపానికీ, ఇతర కార్యాలయాలకూ ఎంతో సేవ చేశారు. "ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛేంబర్ ఆఫ్ కామర్స్" కోశాధికారిగా, ఉపాధ్యక్షులుగా పనిచేసి ప్రస్తుతం కార్య నిర్వాహక సభ్యులుగా ఉన్నారు. ఇవేకాక ఇంకా ఈ కింది కొన్ని ప్రముఖ సంస్థలలో జీవిత సభ్యులుగా, నిరంతరం పరోపకారానికే నడుంకట్టి ధైర్య హేమాద్రిలా నిలిచి ఉన్నారు శ్రీ రామస్వామిగారు.

1. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ – కార్య నిర్వాహక సభ్యులు
2. త్యాగరాజ గాన సభ ,,
3. వాసవీ ఇంజనీరింగ్ కాలేజ్ ,,
4. వాసవీ సేవా కేంద్రం, వైశ్య హాస్టల్, ఆర్య వైశ్య మహాసభ మొదలైన అన్ని సంఘసేవా సంస్థల్లో జీవిత సభ్యులు.

ఈ పరిమిత వాక్యాల్లో అనుదినం కాని రామస్వామిగారి దానధర్మాలూ, సాంఘిక సంక్షేమ కార్యకలాపాలూ ఎన్నో ఉన్నాయి. ఎన్ని చేసినా ఇంకెన్నో మంచి పనులు సంఘానికి సంతరించి పెట్టాలనేదే రామస్వామిగారి ఆశ, ఆశయం కూడా.

స్వయంకృషితో, అచంచల దీక్షతో, అసామాన్య పౌరుషంతో, ధార్మిక బుద్ధితో ఈనాటికి ఇంతవాడై నిలిచిన శ్రీ రామస్వామిగారు నిరంతరం ఇంకెంతో ఎదుగుతూనే ఉండాలనీ; ఈ షష్ట్యబ్ది తర్వాత కూడా పరిపూర్ణ ఆయురైశ్వర్యాలతో విలసిల్లే ఇంకో జీవిత కాలాన్ని సర్వాంతర్యామి ఆయనకు ప్రసాదించాలనీ ఆకాంక్ష.

★

శ్రియంధియం చిరాయుష్యం
దత్వాపాంతు త్రిమూర్తయః
ఖాదం వంశమణిం రామం
షష్టిపూర్త్యుత్సవోజ్జ్వలం.

—ఆచార్య దివాకర్ల వేంకటావధాని

కావ్యప్రయోజనము

ఆచార్య దివాకర్ల వేంకటావధాని

కావ్యమునకు ప్రాచ్య పాశ్చాత్యలాక్షణికులు పలువిధములైన నిర్వచనములనొసంగియున్నారు "కవయతి వర్ణయతీతి కవిః, తస్యకర్మ కావ్యమ్" (వర్ణించువాడు కవి. అతని కర్మ కావ్యము) అని విద్యాధరు డొసంగిన నిర్వచనము. ఇది కవి కావ్య శబ్దముల వ్యుత్పత్తిని మాత్రము తెల్పుచున్నది.

"రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్య"మ్మని జగన్నాథుడు కావ్యమును నిర్వచించెను. రమణీయమైన అర్థమును ప్రతిపాదించు శబ్దము కావ్యమని దీని అర్థము. ఇందు కావ్య స్వరూపమును, అది నిర్వహించు కార్యమును కూడ తెల్పబడినవి. ప్రాచ్యలాక్షణికులు పలువురిట్లు కావ్యమును నిర్వచించుచు కొందఱు శబ్దమునకును, కొందఱర్థమునకును, కొందఱు శబ్దార్థయుగళమునకును ప్రాధాన్య మొసంగియుండిరి. వారిలో కొందరు రసమార్గానుయాయులు; కొందఱలంకారమార్గానుయాయులు.

పాశ్చాత్య విమర్శకులిచ్చిన నిర్వచనములలో రసాలంకార శబ్దములు ప్రయోగింపబడకపోయినను నిశితముగా పరిశీలించినచో వారిలో కొందఱు రస మార్గమునకును కొందఱలంకార మార్గమునకును సన్నిహితులుగా నున్నట్లు కనిపించును. జాన్‌స్టూవర్టుమిల్, వర్డ్స్‌వర్తు, జాన్‌కేబెల్ మున్నగువారిచ్చిన నిర్వచనములు రసమార్గము నస్పష్టముగా సూచించుచు "క్రౌంచద్వంద్వ వియోగోత్థమైన శోకమే శ్లోకత్వమును పొందిన"దను ఆనందవర్ధనుని శ్లోకమును

దానిపై నాతడొసంగిన వ్యాఖ్యానమును తలపించుచున్నవి. లేహట్టు మున్నగు వారి నిర్వచనము లలంకారమార్గమునకు దగ్గఱగా నుండును.

పార్వతీ పరమేశ్వరులవలె వాగర్థములు రెండును సంపృక్తములై యుండుననుట సత్యమే కాని వాని స్వభావములో కొంతభేదమున్నది. వాక్కు కావ్యము యొక్క బహిస్స్వరూపమును సూచింప అర్థము అంతఃస్వరూపమును సూచించును.

లాక్షణికులు కావ్యాత్మ ఆని చెప్పిన రసాలంకార గుణరీతి ధ్వన్యుచిత్యాదు లన్నియు నర్థము నాశ్రయించినవే. కావ్యములను పఠించుటవలన శబ్దజ్ఞానమును, అర్థగ్రహణ సంజాతమగు ఆనందమును రెండునుసిద్ధించును కాని యీ రెండింటిలో ఆనందమునకే అధిక ప్రాధాన్యమున్నది. ప్రాచ్యలాక్షణికులీవిషయమునే విశదముగా చెప్పియున్నారు

లోకమున విజ్ఞానశాస్త్రమును గూర్చియు, చరిత్రాదులను గూర్చియు వివరించు గ్రంథములనేకములున్నవి. వానిని కూడ పలువురు పఠించుచుందురు. ఆ పఠనమువలనవారాశించునది విషయ పరిజ్ఞానమేకాని ఆనందము కాదు.వానిలో రసాలంకారాదులకు స్థానము లేదు. అట్లే రచయిత అందున్న దాని నున్నట్లు చెప్పవలయునే కాని స్వప్రతిభానుగుణముగా విషయమునకు వన్నెచిన్నెలు కల్పించుటకు కాని మార్పుచేర్పులు కూర్చుటకు కాని అవకాశములేదు.

ప్రాచ్య లాక్షణికులు వేదములు ప్రభుసమ్మితములనియు, పురాణములు మిత్రసమ్మితములనియు, కావ్యములు కాంతాసమ్మితములనియు చెప్పియుండిరి. అవి బోధించు విషయము సమానమేయైనను బోధించు విధానములో భేదమున్నది. ఒక విషయమును శాసన పూర్వకముగా చెప్పవచ్చును; స్నేహపూర్వకముగా చెప్పవచ్చును; వ్యంగ్యపూర్వకముగా చెప్పవచ్చును. ఈ విధానమే వేద పురాణ కావ్యములకు భేదము కల్పించుచున్నది.

పురాణములు వేదములవలె శబ్ద ప్రధానములుకాదు. అవి అర్థ ప్రధానములు వేదము ప్రభువువలె శాసించిన కర్తవ్య ధర్మమునే అవి మిత్రునివలె కథోపాఖ్యానముల ద్వారమున చక్కగా బోధించి దానినాచరించుట వలన గల్గు లాభములను ఆచరింపకపోవుట వలన కలుగు నష్టములను తెలియజేయును.

ఇంక కావ్యము పాఠకులకు వేదము ప్రభువువలె శాసించినట్టియు, పురాణములు మిత్రునివలె హేతువాదపూర్వకముగా బోధించినట్టియు కర్తవ్య ధర్మమునే స్వాధీనపతికయైన సాధ్వీరత్నము తన భర్తకువలె శైలీగుణాలంకారాదులచే సరసముగను హృద్యముగను ప్రకటించి వారి నున్మార్గము నుండి సన్మార్గమునకు ప్రిప్పజాలును కాంతవలె కావ్యమును కర్తవ్యమును వాచ్యముగా గాక వ్యంగ్యముగా వెల్లడిచేయును. ఇదియే కావ్యము లవలంబించు కర్తవ్యోపదేశ విధానమున గల వైలక్షణ్యము.

పై లాక్షణికుల యభిప్రాయము ననుసరించి యుపదేశ విధానమున భేదమున్నను వేద పురాణములకు వలెనే కావ్యమునకును కర్తవ్యోపదేశము ముఖ్య ప్రయోజనమని తేటతెల్లమగుచున్నది.

సంస్కృత లాక్షణికులలో ప్రాచీనుడైన భామహుడు సత్కావ్య నిషేవణము వలన ధర్మార్థకామమోక్షములందును కళలందును విచక్షణత్వమును, కీర్తియు, ప్రీతియు కలుగుననిచెప్పెను. భగవన్నారాయణ చరణారవిందస్తవాదిచే ధర్మప్రాప్తి కలుగుననియు, అర్థప్రాప్తి ప్రత్యక్ష సిద్ధమేననియు, అర్థము ద్వారముననే కామప్రాప్తి సిద్ధించుననియు, ఏతజ్జన్యఫలానానుసంధానముచే మోక్షము కూడా కలుగుననియు విశ్వనాథుడు పైభావమునే వివరించెను.[1]

---

1. ధర్మార్థ కామమోక్షేషు వైచక్షణ్యం కళాసుచ
కరోతి కీర్తిం ప్రీతించ సాధుకావ్యనిషేవణమ్.

మమ్మటుడు కావ్యప్రకాశమున యశస్సు, అర్థము, వ్యవహారజ్ఞానము అమంగళ పరిహారము, సద్యఃపరనిర్వృతి, ఉపదేశము అనునవి కావ్యప్రయోజనములని వివరించెను.[2]

భామహమమ్మటులు చెప్పిన యభిప్రాయములు రెండును కొంచె మించు మించుగా సమానముగానే యున్నవి. చతుర్వర్గ వివేకము కలిగించుట యుపదేశమునకును ప్రీతి సద్యఃపర నిర్వృతికిని ఉపలక్షకములుగానున్నవి. సద్యఃపర నిర్వృతి యనగా కావ్యపఠన సమనంతరమే రసాస్వాదన సముద్భూతమై యుదయించు విగళిత వేద్యాంతరమైన యానందము. ఇది హృదయ వేద్యము. ప్రీతియు హృదయసంబంధియే. మమ్మటుడు భామహుని భావములకు వ్యవహారజ్ఞానమును, అమంగళ పరిహారమును అధికముగాచేర్చెను. రామాయణాది మహాకావ్య పఠనమువలన వ్యవహారజ్ఞానము కలుగుటయు, శివేతరక్షతి యగుటయు సర్వవిదితములే. మొత్తముమీద ఈ యిరువురు లాక్షణికులును ఆనందోపదేశములు రెండును కావ్యప్రయోజనములుగా భావించినట్లు నిశ్చయింపవచ్చును.

ఉపదేశములేకవ్యుత్పత్తి వేదశాస్త్రపురాణముల వలననే కలుగుచుండగా కావ్యముల విశిష్టతయేమి యను ప్రశ్నరావచ్చును. ఈ ప్రశ్నకు సాహిత్యదర్పణ కారుడు చతుర్వర్గ ఫలప్రాప్తి వేద శాస్త్రములవలన నీరసముగా పండితులకే అతి కష్టము మీద కలుగుననియు, పరమానంద సందోహ జనకత్వముచే నది సుకుమార బుద్ధులకు కూడ కావ్యమువలననే సుఖముగా చేకూరుననియు సమాధానము చెప్పియున్నాడు. వేదశాస్త్రపురాణాదులవలనవలెనే సదాశ్రయమైన కావ్యము వలనకూడ హితప్రాప్తియు అహితనివృత్తియు కలుగునని విద్యానాథుడుకూడ నిభావమునే సూచించియున్నాడు. "యద్వేదాత్ ప్రభుసమ్మితాదధిగతం శబ్ద ప్రధానాచ్చిరం" అను వాక్యము నందలి చిర శబ్దమునకు "మీమాంసాపేక్షయా

---

2. కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యఃపర నిర్వృతయే కాంతాసమ్మితత యోపదేశయుజే

కృచ్ఛ్రేణేత్యర్థః'' అని కుమారస్వామి వ్యాఖ్యానము చేసియుండెను. ఈ పై వాక్యముల వలన వేదశాస్త్రపురాణములవలెనే కావ్యములు గూడ వ్యుత్పత్త్యుపదేశములను కలిగించుననియు, కాని వానిని రసానందమిళితములు కావించి సరసముగా సనుకూర్చుననియు వ్యక్తమగుచున్నది. వేదశాస్త్రాదులు వ్యుత్పత్త్యైక ప్రయోజనములు. కావ్యములట్లుగాక వ్యుత్పత్త్యుపదేశములతో నానందమును గూడ నొసంగునవి వేదశాస్త్రాదులందు కంటె కావ్యములందు పై లాక్షణికులు సూచించిన ఆధిక్యమిది.

తిక్తమైన ఔషధరసము ద్వేగకారి కాకుండుటకై దానిపై గుడవేశమును చల్లినట్లు కొందఱు కేవలశాస్త్రమును కూడ కవిత్వమును ప్రయోగింతురని క్షేమేంద్రుడు నుడినియున్నాడు.[1] అట్లే వేదపురాణేతిహాసములందుకూడ కర్తృ సామర్థ్యమునే కొంత కావ్యాంశ కానబడవచ్చును. కాని యది యందు చాల తక్కువగా నుండును. ఈ విధముగనే కావ్యములందును శాస్త్రాంశ కొంత గోచరించుట కవకాశమున్నది కాని యది యందప్రధానము. కొన్ని కావ్యములందు మహాభారతమునవలె కావ్యతా శాస్త్రత్వములు సమభాగములుగా నుండును. అట్లుండుట వానికే చెల్లినది అట్టి వానికే ఆనందవర్ధనాచార్యులవారు శాస్త్రకావ్యములని గౌరవించినారు.

ఆనందోపదేశములు నమకూర్చి పఠితకు హితము కలిగించుట కావ్యధర్మమని తేలినది. మరల నిరెంటిలో కావ్యమున దేనికి ప్రాధాన్యమను విషయమున నభిప్రాయభేదములున్నవి. ఆనందప్రదానమే కావ్యధర్మమనువారు కొందఱు; ఆనందోపదేశములు రెండును దత్ప్రయోజనములనువారు కొందఱు; ఈ రెండింటిలో మరల నానందమునకో ఉపదేశమునకో ప్రాధాన్యము సూచించువారు కొందఱు.

---

1. తత్ర కేవలశాస్త్రేపి కేచిత్ కావ్యంప్రయుంజతే
తిక్తౌషధరసోద్వేగే గుడవేశమిచోపరి.

ప్రాచ్యలాక్షణికులలో వలెనే పాశ్చాత్యులలో కూడా నీ విషయమున నతివాదులు మితవాదులు నున్నారు. దేశ కాల భేదమును బట్టి యానందోపదేశ ములో నొక్కొకప్పుడొక్కొక్కదానికి ప్రాధాన్యమీబడుట తటస్థించినది.

భట్టనాయకుడు "కావ్యేరసయితాసర్వో నబోద్ధా న నియోగభాక్" అని కావ్యము రసానందజనకమే కాని పురాణమువలె బోధించునదియు, వేదముల వలె శాసించునదియు కాదని పక్కాణించెను. దశరూపకకర్త ఆనందనిష్యందు లైన రూపకములం దితిహాసాదులంచువలె నుత్పత్తినే ఫలముగా చెప్పు వాడల్ప బుద్ధి యనియు అట్టి స్వాదుపరాజ్ముఖుడైన సాధువునకు నమస్కారమనియు చెప్పియుండెను.

ఇట నతడు ప్రత్యేకముగా రూపకములనే పేర్కొన్నను వానిచే సామాన్య ముగా కావ్యములన్నిటి నుద్దేశించెననియే భావింపవచ్చును. పాశ్చాత్యులలో షెల్లీ, కాస్టల్ వెట్రా, బోయ్‌లూ, బ్రూని, స్వీన్‌బరన్, రూసో మున్నగువారుకూడ నిట్టి యభిప్రాయమునే వెల్లడించిరి.

ఆనందము–కేవలము ఆనందమే–కావ్య ప్రయోజనము (కాస్టల్‌వెట్రా) ఆనందము కావ్యము నెల్లప్పుడు వెన్నంటియేయుండును. (షెల్లీ) డెకార్టీయొక్క వేదాంతము కవిత్వ కంఠమునుత్తరించవలె (బోయ్‌లూ) కవిత్వము యొక్క ఉత్కృష్టతను కళాస్రష్టయొక్క సిద్ధిని బట్టి నిర్ణయింపవలెనేకాని నీతి బోధకుని సామర్థ్యమునుబట్టికాదు' (లియోనార్డీ బ్రూనీ) మున్నగు వాక్యము లాయభిప్రాయ మును స్పష్టముగా ప్రకటనము చేయుచున్నవి.

భామహమమ్మటాదులు కావ్యమున కానందోపదేశములు రెండును ప్రయో జనములని భావించుట యిదివఱకు సూచింపబడినది. పాశ్చాత్యులలో కూడ నిట్లు భావించినవారు కొందఱున్నారు. ఉపదేశించుట ఆనందపఱుచుట కావ్యప్రయో జనములను సిద్ధ్ని వాక్యమును, ఆనందకరమైన బోధయే కావ్యప్రయోజనమను

స్కాలిజల్ వాక్యమును విజ్ఞాన వినోదముల సమ్మేళనమే కావ్యప్రయోజనమను హూరేస్ వాక్యమును, ఆహ్లాదపూర్వకముగా ఉపదేశించుటయే కావ్య ప్రయోజన మను జాన్సన్ వాక్యమును ఇందుకు తార్కాణములు.

కావ్యమానందములతోపాటుపదేశమునుగూడ కలిగింపవలెనని భావించి నను వానిలో ఆనందము ప్రధానమనియు నుపదేశమానుషంగికమనియు చెప్పిన వారిలో ఆనందవర్ధనుడు ప ముఖ్యుడు. కావ్యము ధర్మార్థ కామ మోక్షములందును కళలందును వైలక్షణ్యము కలిగించుననుటనుబట్టి శ్రోతలకు కావ్యము వలన వ్యుత్పత్తియు కలుగుమాట నిజమేయైనను ప్రీతియే ప్రధానము. అట్లు కానిచో ప్రభుసమ్మితములైన వేదము లకంటెను,మిత్రసమ్మితములైన పురాణములకంటెను కావ్యరూపమైన యీ వ్యుత్పత్తి హేతువుయొక్క జాయా సమ్మితత్వ లక్షణము నందలి విశిష్టతయేమి?

అందుచే ఆనందమే ప్రధానముగా చెప్పబడినది. చతుర్వర్గ వ్యుత్పత్తికి కూడ ఆనందమే పార్యంతికమైన ఫలమని ఆతని అభిప్రాయము. పాశ్చాత్య లలో జాన్‌డ్రైడెన్ సరిగా నిట్లే భావించెను. ఆనందము కావ్యమునకేకైక ప్రయోజనమకాకున్నను ముఖ్యప్రయోజనము ఉపదేశము నానుషంగికముగా మాత్రమే అంగీకరింపవచ్చునని ఆతడు చెప్పియుండెను.

కావ్యమున ఆనందము కంటె తత్త్వోపదేశములే ముఖ్యములని భావించిన వారును కొందరు లేకపోలేదు. పరమార్థప్రతిపాదకము కాని వాక్యమును విసుట నిష్ప్రయోజనమని కొందరు ప్రాచీనస్థులభిప్రాయపడిరి. ''యదీగ్ంభ్రణోత్యల కగ్ంభ్రణోతి''అను వేదవాక్యము వారి యభిప్రాయమునకు ప్రతిబింబము. పాశ్చా త్యులలో బ్రౌనింగ్, లావెల్, కోలరిడ్జి ,ప్లూటార్కుమున్నగు వారి వాక్యములందు కూడ తత్త్వోపదేశమునకే ప్రాధాన్యము గోచరించుచున్నది కావ్యమున తత్త్వము ముందు కవిత్వము తరువాత అని బ్రౌనింగ్. ఏదో ఒక విధమున తత్త్వబోధ చేయని కావ్యమును నేను గౌరవింపజాలనని లావెల్. కవి ప్రజాసామాన్యము

నకు తత్త్వదర్శి అని వ్యూటార్కు. మహాతాత్త్వికుడు కాని వాడెవ్వడును మహాకవి కాలేదని కోలరిడ్జి.

"కావ్యాలాపాంశ్చవర్జయేత్" అనుస్మృతి వాక్యము నందు కూడ ఉపదేశ ప్రాధాన్యమే ధ్వనించుచున్నది. కాని ఈస్మృతి వాక్యమసత్కావ్య విషయకమేకాని సత్కావ్య విషయకముకాదు. అవిగాక చతుర్వర్గవ్యుత్పత్తికిని, తత్త్వాదులకును ఆనందమే పార్యంతిక ఫలమనిన ఆనందవర్ధనుని సూచననుబట్టి యీ ఉపదేశ ప్రాధాన్యవాదులు కూడ తత్త్వము ద్వారా ఆనందమును వాంఛించిరని యొకరీతిగా సమర్థించుకొనవచ్చును.

లోకమున శాస్త్రము కావ్యమునకు కేవల విరుద్ధమను అభిప్రాయమున్నది. ఆరెంటికిని స్వభావ ప్రయోజనములందు చాల తారతమ్యముండుట స్పష్టమే. శాస్త్రమువలె కావ్యము పరమార్థమును బోధింపజాలదనియు, కావ్యమసత్యానౌచిత్యములకు కన్నతల్లి యనియు కొందఱి అభిప్రాయము. "శాస్త్రేష్వహీనాఃకవయో భవంతి" అను నానుడి యీ అభిప్రాయమునే సూచించుచున్నది. కాని కవి యసత్యము చెప్పుననుట విశ్వసనీయముకాదు. వస్తువులందు ప్రీత్యప్రీతులను వ్యంజించుటయే కావ్యముపని కాని అసత్యము చెప్పవలసిన పని దానికి లేదనియు, ఆ వ్యంజించుటయందు కావ్యమున అతిశయోక్తియుండవచ్చుననియు, ఈ అతిశయోక్తిరూపమైన అర్థవాదము కావ్యమందేకాక శ్రుతిశాస్త్రలోకాదులందు సైతము సర్వత్రకానవచ్చుననియు రాజశేఖరుడు చెప్పుచున్నాడు, సర్ ఫిలిప్ సిడ్నీ, కవియేదియు నిదమిత్థమవి చెప్పడు కావున నెన్నడు సత్యము చెప్పడని తెల్పియున్నాడు.

శాస్త్రము సత్యమును నగ్నముగా చెప్పును. కావ్యము దాని నలంకార సుందరముగా వెల్లడిచేయును. అందచేతనములు కూడ చేతనత్వమునంది రస పరిగ్రహముచే నత్యంతరమణీయములుగా భాసిల్లును. శాస్త్రజ్ఞుడు చంద్ర

బింబము తూర్పున నుదయించునని శుష్కముగా చెప్పిన సత్యమునే కవి "అయమైంద్రీముఖం పశ్యరక్తశ్చుంబతి చంద్రమాః" అని ఉక్తివైచిత్రితో అలంకార సుందరముగా వర్ణించును.

అందుచేతనే "కావ్యేనహన్యతే శాస్త్రం" అను అభిప్రాయ మేర్పడినది. కావ్య సౌందర్యము ముందు శాస్త్ర సత్యము నిలువజాలదని దీని భావము. మతియు శాస్త్ర సత్యములందు కంటె కావ్య సత్యములందు స్థిరత్వ మెక్కువ. అవి దేశకాలముల పరిధులను దాటినవి. శాస్త్రము మానవుల బుద్ధిని రంజింప జేయ కావ్యము హృదయమును రంజింప జేయును; అది ఆశ్చర్యము కలిగింప నిది యానందము నాపాదించును. బేకన్ పండితుడు చెప్పినట్లు శాస్త్రము మనస్సును వస్తువునకు వశము చేయ కావ్యమున వస్తువును మనస్సునకు వశముచేయును.

శాస్త్రజ్ఞుడు సృష్టిపరిశీలనము కావించి అందలి మూల సూత్రములను ప్రకటించును. కవి సృష్టి యందలి అసుందరవస్తువులను కూడ సుందరములు గావించి అపూర్వసృష్టికర్తగా ప్రతిభానించును. సత్యమును దర్శించు శాస్త్ర కారనియందలి శేముషియే కవియందు సౌందర్యమును దర్శించు నవనవోన్మేష శాలిని యైన ప్రతిభయై ప్రకాశించును. శాస్త్రము మానవుని బుద్ధిశాలిగా నొనరింప కావ్యమాతని నౌదార్య మూర్తిగా నొనరించి దివ్యత్వపు పొలిమేరలందు నిల్పును.

కావ్యమొసంగు నానందము బ్రహ్మానంద సబ్రహ్మచారియని లాక్షణికులు నుడివిరి. యువకుడును సాధువును ద్రడిష్ఠుడును బలిష్ఠుడును అగు నొక మహా రాజు పొందు నానందము మానుషానందమనియు, అట్టి మనుషానందములు లక్షకోటి కోట్లయినచో బ్రహ్మానందమగుననియు తైత్తిరీయోపనిషత్తు, ఆనంద మీమాంసయొనర్చినది. కావ్య జన్యానందము బ్రహ్మానంద భిన్నము కాకపోయి నను దానితో తుల్యమైనది. రసవత్కావ్యమును బఠించునప్పుడు సహృదయుడు

తాత్కాలికముగానైన నట్టి యానందము ననుభవించును గావున తత్ప్రేరణచే శాశ్వతమైన బ్రహ్మానందమును జూఱగొనుటకు యత్నించును. ఈ విధముగా రసానందము బ్రహ్మానందమునకు సంధుక్షకమగును.

ఆనందోపదేశములకో ఒక్కొక్క దేశమున ఒక్కొక్క కాలమున ఒక్కొక్క పరిస్థితులననుసరించి దానికి ప్రాధాన్యమిఱుట తటస్థించినది. భారత దేశము అస్వతంత్రమైయుండినప్పుడు కవులు పఠితలందు స్వాంతంత్ర్యపిపాసను జాతీయతాభావమును పెంపొందించుటకై కొన్నియుత్తమరచనలు కావించిరి

ఈ ప్రయత్న మన్ని భాషలందును జరిగినది. నిజమునకు భారతదేశ స్వాతంత్ర్యసిద్ధికి త్యాగమూర్తులైన నాయకోత్తములవలె కవిపత్తములు కూడ కొంతవరకు కారణములైరనుటలో సందేహములేదు. ఈ కాలపు రచనలలో కేవలమానందజనకత్వమేకాక జాత్యుత్థరణ ప్రయత్నము కూడ సర్వతోముఖముగా గోచరించును.

వీనిలో కొన్నింట జాతీయాభిమానముకంటె కొంత సంకుచితమే యైనను రాష్ట్రాభిమానము కూడ గోచరించును. ఇట్టి వానిలో ఆనందముకంటె ఉప దేశవుత్పత్తి ప్రాధాన్యమే ములుసూపుచుండును. ఇట్లు జాతినిర్వీర్యమైనప్పుడు చైతన్యము కలిగించి దానిని పునరుజ్జీవింపజేయుట కూడ సాహిత్య ధర్మమే.

ఆధునిక యుగమును కొందరు కవులు కళకళకొఱకే అన్నవాదమునను సరించి కావ్యము ఆనందైక ప్రయోజనమనియు అందు వ్యుత్పత్త్యు పదేశములకై యత్నించుట కావ్యత్వమునకు భంగము చేకూర్చుటయగుననియు భావించిరి. కవి సమాజమున కతీతుడనియు కోకిల తన కూజితములనువలె అతడు గీతముల నానందార్థమే ఆలపించుననియు, అతని సృష్టికి ఆహ్లాదజనకత్వము తప్ప అన్య ప్రయోజనము లేదనియు వారి నిశ్చితాభిప్రాయము. ఈ ఉద్యమము కొంత కాలము సాగినది. తరువాత దేశాంతరములందును ఖండాంతరములందను రేగిన రాజకీయ పరివర్తనములకు ఫలితముగా భారతదేశమున కూడ పెక్కు

రాష్ట్రీయులందొక అపూర్వ సంచలనము బయలుదేరినది. సామ్యవాదస్థాపనమే దీనికి లక్ష్యము.

విశ్వశ్రేయమునకు సాధనమైన ఈ సామ్యవాదమును ప్రచారము చేయుటకై కవిత్వమేకాక సర్వకళలును యత్నింపవలెననియు, కళకళకొఱకే అనుట సంకుచితభావముల ఫలితమనియు, కావ్యము సంఘదేశవ్యక్తి అభ్యుదయములను సాధింపవలెననియు నవ్యులు భావించి తల్లక్ష్యసాధనమునకై రచనలు సాగించిరి. ఇట్టి రచనలలో కూడ ఆనందమునకంటే ఉపదేశవ్యుత్పత్తులకే ఇంచుక ప్రాధాన్యము.

"విశ్వశ్రేయఃకావ్య"మ్మని నన్నయభట్టారకుని అభిప్రాయము. శ్రేయస్సున కానందోపదేశములు రెండును దోడ్పడును. హితముతోకూడినది సహితమనియు దాని భావార్థకము సాహిత్యమనియు చెప్పు వ్యుత్పత్తి ననుసరించి సాహిత్యము లోకమునకు హితమాపాదించునది అనగా శ్రేయమాపాదించునది కావలెను దాని కానంద ప్రధానమే ప్రధాన ప్రయోజనమైనను అది వ్యుత్పత్త్యుపదేశములను కూడ కలిగించినచో సువర్ణమునకు సౌరభము కలిగించునట్లగును.

విశ్వశ్రేయస్సాధనము కావ్యముయొక్క పరమధర్మమగుటచే ఆది ఆనందముతోపాటు ఉపదేశము కూడ నొసంగుచు, జగదభ్యుదయ హేతువు కావలయును. ఆనందమే కావ్య ప్రధానధర్మమని విశ్వసించువారు సైతమందు పాఠకులను పెడదారులకు త్రిప్పు దుర్నీతిని మాత్రము ప్రపంచింపకూడదు. పాఠకులను సహనశీలురను, సహృదయులను, సత్కార్యాచరణదక్షులను, మానవతామూర్తులను గావించి వారి ద్వైహికాముష్మిక సౌఖ్యములను చేకూర్చుటయే సాహిత్యము యొక్క పరమధర్మము.

❋

తెలుగునాట సాహిత్య విమర్శ

డా. ఆర్. అనంతపద్మనాభరావు

ఈనాడు తెలుగు సాహిత్య విమర్శస్థాయి ఎలావుంది? విమర్శ అంటూ వస్తున్నదా? అనే ప్రశ్న వదిలేద్దాం. గ్రంథ విమర్శలు తప్ప మిగతా సాహిత్య పరంగా ఒక్క విషయంపై నిలదీసి నలుగురు పండితులు తమ అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పడం లేదు. అర్జునుడు ఏ వర్ణమువాడు – అనే అంశంపై ఒకప్పుడు సిద్ధాంత రాద్ధాంతాలు జరిగాయి. ఇప్పుడు ఒక సాహిత్యోద్యమం మీద గాని, ఒక కావ్యం మీదగాని విమర్శ రావడం లేదు.

గ్రంథ సమీక్షలు తీసుకొందాం. "ముద్రణలో లోపాలున్నాయి. బైండింగు బాగుంది. పుటలు 164. వెల 16 రూపాయలు. వర్ధమాన రచయితలలో వీరగ్ర గణ్యులు. వీరి కలమునుండి యింకను ఉత్తమ గ్రంథాలు వెలువడి ఆంధ్ర భాషాయోష కలంకార ప్రాయము కావాలి"–ఈ ధోరణిలో సాగుతోంది సమీక్ష. కవి భావనలో ఈ దోషం ఉంది. కవికల్పన ఫలానాచోట బాగుంది - అనేమాట రావడంలేదు.

సాహిత్య సంస్థలు దేశంలో నలుమూలలా వార్షికోత్సవాలు కానీండి, సన్మానాలు కానీండి చేస్తున్నాయి. ఆ సందర్భంగా సెమినార్లు, గోష్ఠులు ఏర్పాటు చేస్తున్నారు. వక్తలు ఉపన్యాసాలు దంచేస్తున్నారు. అవి లిఖిత రూపంలో తీసుకొని వాటిని ప్రచురించే సంస్థలు తక్కువ. ఆర్థిక మాంద్యత దానికి కారణం. యువభారతి వంటి సంస్థలు చేపడితే అందులో ఎన్నో ఇబ్బందులు. ఇటీవల పత్రికల్లో విమర్శలు రాలేదా? అంటే వచ్చాయి. అనుభూతి కవిత్వంమీద, విప్లవ కవిత్వం మీద రాశారు. అయితే అవి వ్యక్తిగత విమర్శల స్థాయికి వెళ్ళిపోయి సైద్ధాంతిక చర్చ తగ్గిపోయింది.

ఈనాడు సాహిత్య విమర్శకులు లేరా? ఉంటే వారి విమర్శలు ప్రచురించే పత్రికలు లేవా? ఇది పెద్ద ధర్మ సందేహం. కొన్ని పత్రికలు సాహిత్య వ్యాసాలు ప్రచురించడమే మానేశాయి.

విశ్వవిద్యాలయాల్లో పిహెచ్.డి కోసం సిద్ధాంత వ్యాసాలు ఏటా తెలుగు దేశంలోను, మైసూరు, బెంగుళూరు, మధురై, మదరాసు, న్యూ ఢిల్లీల నుండి రమారమి ఒక వంద *M. Phil, Ph. D* ల పేర వస్తున్నాయి. వీటిస్థాయి తగ్గిపోయింది బాబోయ్! అనే వారి మాట వదిలేద్దాం. ఆ వచ్చిన సిద్ధాంత వ్యాసాలను ప్రచురణ చేయడంలేదు. కొన్ని సందర్భాలలో ఒక విషయంపై రెండు మూడు విశ్వవిద్యాలయాల్లో ఒకేసారి పరిశోధన చేస్తున్నారు.

భాషాపరంగా కొన్ని థీసిస్‌లు వచ్చాయి. ఆవి వెలుగులోకి రావాలి. ఏటా యూనివర్శిటీల్లో ఎవరెవరిమీద పరిశోధన జరుగుతున్నదీ ఒక *Bibliography* రావడం అవసరం. లోగడ పిహెచ్.డిలు వచ్చిన చాలామంది గ్రంథాలు అచ్చుకాలేదు. వాటిని కనీసం కుదించి నలుగురూ చదివేవిధంగా తయారుచేసి ప్రింటు చేయిస్తే బాగుంటుంది.

ఈ శతాబ్ది తొలి రోజుల్లో వచ్చిన విమర్శనావ్యాసాలు, పండితుల శాస్త్ర చర్చలు, వాదోపవాదాలు చూస్తే ఆశ్చర్యంవేస్తుంది. వాళ్లు చిన్న వ్యాకరణాంశం మీద, లేదా ఒక విషయాన్ని తీసుకొని భారతిలో, మరో పత్రికలో పుంఖాను పుంఖంగా వ్యాసాలు వ్రాశారు. చివరకు సంపాదకులకు విసుగుపుట్టి ఈ విషయంపై చర్చ యింతటితో ముగిస్తున్నాము అని వ్రాసేవారు.

ఇలా ఉన్న సాహిత్య విమర్శను ఒక తోవలో పెట్టడానికి ఏకోన్ముఖమైన కృషి జరగాలి. విమర్శనావ్యాసాల గ్రంథాలు ఎక్కువ సంఖ్యలో రావాలి. సాహిత్య అకాడమీ విమర్శ వేరుతో ఏటా బహుమతులు ప్రకటించి రచయితలను ప్రోత్సహించింది. ఇప్పుడా బాధ్యత తెలుగు విజ్ఞాన పీఠంపై పడింది.

సాహిత్య విమర్శ ప్రేణిలోకి థీసిసులు వస్తాయా? అని ప్రశ్న. సప్రామాణికమైన రచన కాబట్టి తప్పక వస్తుంది. తెలుగువారు తదితర భాషల్లో వస్తున్న విమర్శను గూర్చి తెలుసుకొని ఆదాన ప్రదాన ధోరణిలో సాగిపోవాలి.

పత్రికల్లో వస్తున్న సాహిత్య వ్యాసాలలోనే మనం ఆగిపోయాం. 600 పేజీలు వ్రాస్తేనే థీసిస్ అనే భ్రమ యీనాడు లేదు. సంతోషం.

ఆధునిక సాహిత్య విమర్శకుల్లో కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, ప్రాతఃస్మరణీయులు. శ్రీశ్రీ వంటివారిపై విమర్శనాత్మక వ్యాసాలు వచ్చాయి. గ్రంథాలు వచ్చాయి. అవి ఆయా రచయితలపై అభిమానం తోనో, విమర్శనా దృష్టితోనో వ్రాసినవి.

దిగంబర కవులపైనా, విప్లవ కవులపైనా విమర్శలు పుంఖానుపుంఖంగా వచ్చాయి. సవిమర్శలు చేస్తే మంచిదే. సిద్ధాంతపరంగా ఉన్న అభిప్రాయభేదాల మధ్య వచ్చిన మర్షణ ఫలితంగా అవి వచ్చాయి. శ్రీశ్రీ, సోమసుందర్, కె. వి. రమణారెడ్డి యీ ధోరణిలో వ్యాసాలు ప్రచురించారు. అయితేనేం కొంత విమర్శ కొనసాగింది.

సాహిత్య విమర్శకులు ఉత్తమ ప్రమాణాలు ఎంచుకొని విమర్శలు ప్రచురిస్తే మంచిది. ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర కావ్య విమర్శ లతో వెలువడటం హర్షించదగిన విషయం. విశ్వవిద్యాలయాలు, సాహిత్య సంస్థలు విమర్శను విస్తృతం చేసే ముఖంగా కృషిసాగిస్తే ముందు ముందు రోజుల్లో సాహిత్య వికాసానికి దోహదంకాగలదు. విమర్శ విమర్శ కోసమే అనే వాదంతో కాకుండా ప్రామాణికతను సంతరించుకోవాలి. అందుకు సద్విమర్శకులు ముందుకురావాలి.

కొన్ని అజ్ఞాత కావ్యాలు

ఆచార్య ఎం. కులశేఖరరావు

తెలుగులో ప్రచురణ వ్యవస్థ ఏర్పడిన తరువాత, గడచిన నూట ఏబది సంవత్సరాల నుంచి అనేక ప్రాచీన కావ్యాలు ప్రచురితమైనాయి. ప్రచారాన్ని పొందినాయి. అయినా, అనేకగ్రంథాలు, పూర్వకాలంలో రచితమైనట్టివి, యింకా వెలుగు చూడవలసే ఉన్నది. ఇటీవల నేను పరిశీలించిన తాళపత్రగ్రంథ సంచయంలో కొన్ని అపూర్వ గ్రంథాలు నా దృష్టిలోకి వచ్చినాయి. వాటిని గురించి ముచ్చటిస్తాను.

1. కిరాతార్జునీయము

ఈ కావ్యాన్ని కృష్ణామాత్యుడు రచించినట్లుగా కనిపిస్తున్నది. అతన్ని గురించి ఈవిధంగా ఉన్నది. ''ఇది శ్రీ పరమేశ్వర ప్రసాద (లబ్ధ) ద్విజ కులో త్తమ కోటిచింతల వంశపావన కాశ్యప (గోత్ర) కౌసన మంత్రి పుత్ర కృష్ణా మాత్య ప్రణీతంబైన కిరాతార్జునీయంబను మహాప్రబంధంబు నందు....'' ఈ కవి ఏ కాలమువాడో తెలిసికొనడానికి సరియైన ఆధారాలు కనిపించడంలేదు. కాని తన గ్రంథమును ప్రబంధమనీ, మహాప్రబంధమనీ పేర్కొనిఉండడంచేత ఆంధ్ర వాఙ్మయంలో ప్రబంధయుగంలోని, శ్రీకృష్ణదేవరాయలు, పెద్దనా మాత్యుడు మొదలైన ప్రబంధకర్తల తరువాతనే జీవించి ఉన్నాడనటం సమం జసం. ఎందుకంటే శ్రీకృష్ణదేవరాయలు తనఆముక్తమాల్యదా కావ్యమును మహా ప్రబంధమని పేర్కొని ఉన్నాడు. కృష్ణామాత్యుడు కూడ, అతనిని అనుసరించి, తన కావ్యాన్ని మహాప్రబంధమని సంకేతించినాడు.

మనకిప్పుడు లభించిన గ్రంథంలో మూడు ఆశ్వాసాలున్నాయి. ఈ ఆశ్వా సాన్తో ధర్మరాజు అర్జునుని ఇంద్ర కీలాద్రికి పంపడము, అక్కడ అర్జునుడు

తపమాచరించడము, రంభ ఆగమనము, మునీశ్వరుల విభ్రమము, రంభ అర్జునుని తపమును విఘ్నము చేయలేక, స్వర్గమునకు వెడలగానే, దేవేంద్రుడే స్వయంగా వచ్చి, అర్జునుని మెచ్చి, పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించడం, ఉమామహేశ్వరులు వచ్చి కాబరవేషములో అర్జునునితో యుద్ధంచేసి, అతని శౌర్యానికి మెచ్చుకొని పాశుపతాస్త్రమును అనుగ్రహించి, కైలాసగమనము చేయడము, పాశుపతాస్త్రమును ధరించిన అర్జునుడు, కౌరవుల నిర్విఘ్నముగా జయించి, ధర్మరాజునకు పట్టముకట్టడము అనే కథాంశాలు ఉన్నాయి. ఈ కవి శివభక్తుడుగా కనిపిస్తాడు. కావ్య ప్రారంభంలో శివస్తుతిపరములైన పద్యాలుండడమే దీనికి కారణం. ఇది ప్రబంధప్రక్రియకు చెందిన కావ్యం కాబట్టి, దీనిలో ప్రబంధోచితమైన శృంగార రసభరితమైన పద్యాలు ఉన్నాయి. ఈ పద్యం చూడండి.—

చక్కని రంభను నే, నతి
చక్కర నా మోవి యందు చాలగ గలదే
చొక్కపు గుబ్బల నిడుదలు
మక్కువ కాయంగ (చేయంగ) లేని మానమదేలా.

ఈ కావ్యం ప్రచురితమైనప్పుడు అనేక విశేషాలు తెలియవస్తాయి.

2. కొమ్మాలపాటి రామాయణము

ఈ రామాయణాన్ని రచించిన కవి పేరు నారాయణుడు. కావ్య నామమును బట్టి, ఈ కవి రామాయణమునంతను రచించినట్లు కాన్పించును. కాని, మనకిప్పుడు సుందరకాండ మాత్రమే లభించింది. ఈ కావ్యం కొమ్మాలపాడు అనే గ్రామంలో నివసించియున్న శ్రీరాములవారికి అంకితంకావడంచేత, దీనికి కొమ్మాలపాటి రామాయణం అనే వ్యవహారం వచ్చినట్లున్నది. ఈ రామాయణకర్త అయిన నారాయణుడికి పద్యరచనలో మంచి నేర్పుఉన్నట్లుగా కనిపిస్తున్నది. లంకను దగ్ధముచేసిన ఆంజనేయస్వామిని గురించి ఒక పద్యం ఇట్లా ఉన్నది.—

మాయసుమ్మ కోతిమాటమాత్రమెకాని
తోయజాక్షి జూచి తొలగిపోయె
కోతిగాదు పెద్దభూతమ్మ్మగాకున్న

ఖ్యాతిగ రక్కసున్ గద్దరించె
తరిమితరిమి వెంట తగిలి, పోనీయక
పరుగులు వెట్టించె బలుగు కోతి.

ఈ కొమ్మాలపాటి రామాయణము ఏ కాలమున రచితమైందో కాని, ఆంధ్ర సాహిత్య చరిత్రకారులెవరును దీనిని తమ చారిత్రక గ్రంథాల్లో పేర్కొనిఉండలేదు.

3. గొడుగుల వచనము

ఇది వచనకావ్యము. కర్త పేరు తెలియరాదు. రామాయణాంతర్గత యుద్ధ కాండములోని కథ దీనిలోని విషయము. రాముడు వానర సైన్యముతో లంకా నగరమును చుట్టుముట్టిన తరువాత, రావణుడు శత్రుసైన్యాన్ని పరికించడానికి కోట బురుజులపైకి ఎక్కి గొడుగులతో రావడము, ఆ కోట బురుజుపైననే లంఘించివచ్చిన సుగ్రీవునితో ముష్టియుద్ధము జరగడము, సుగ్రీవుని శక్తి సామర్థ్యములను మెచ్చుకొని, రావణుడు తిరిగి లంకానగరములో ప్రవేశించడము, దీనిలోని ప్రధాన వృత్తాంతము. దీనిలోని వచన రచనము చక్కగా ఉన్నది. ఈ వాక్యాలు చూడదగినట్టివి.

"అయ్యవసరంబున దశకంధరుండు,తన ప్రధానవర్గంబును పిలిపించి, వారలతో నిట్లనియె. ఆదే సువేలాచలంబునకు రాఘవేశ్వరుండబ్ధి దాటి (వచ్చి) మర్కట బలంబులతో విడిసెసని ఋక చారణులు మాకుం జెప్పిరి. మీరా రామ బలంబులు ఈవలికి రాకుండ ఆగుననుచు మాతో నాడిన మాటలు పౌరుషంబులు. ఇంక మిమ్మేమన నేర్తుము ; మమ్ము వల్లకున్నారుగా (?) అనుచు రావణుం డప్పుడు రాఘవుడున్న సువేలాద్రి తెరంగు చూతము రమ్మనుచు, నవబ్రహ్మలు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్టదిక్పాలకులు, బెట్టిన గండపెండేరంబు వెట్టి, కరండబు రత్నకంకణండబు ధరియించి, వజ్ర వైడూర్య గోమేధిక పుష్య రాగ మాణిక్య నవరత్నఖచిత (అలంకారములను) కంఠములను జేర్చి, ముక్తా హారంబులు దాల్చి, కర్ణాంగుళ దివ్యభూషణములు వెట్టి, పదివేల సూర్యప్రభలు గల కిరీటండబు దశ శిరంబుల ధరియించి..."

ఈ వచన కావ్యానికి ప్రతి మదరాసులోని ప్రాచ్యపుస్తక భాండాగారం లోనూ ఉన్నది. దీన్ని గురించి నా 'వచనవాఙ్మయవికాసం'లో ప్రస్తావించి నాను. కవిని గురించి తెలియుటలేదుకాబట్టి, కావ్య రచనా కాలాన్ని గురించి స్పష్టంగా తెలియరాదు.

4. పద్య నిఘంటువు

ఈ తాళపత్ర గ్రంథమును రచించిన వారెవరో తెలియదుకాని, ఈ పద్య నిఘంటువులో నూటపది పదాలకు నానార్థాలున్నాయి. సంస్కృతంలోని అమ రము వంటి రచన తెలుగులో చేయాలని ఈ కవి భావించినట్లున్నది. ఈ కవికి మంచి పద్యాలు వ్రాయడంలో నేర్పు ఉన్నది.

గోవిందంబన బసరము
గోవిందంబనగ దోడి గొల్లయు గిరియున్
గోవిందమనగ విష్ణువు
గోవిందమనంగ బిల్లగ్రోవియు నయ్యెన్.

స్వర్గమ్మన నాకమ్మును
స్వర్గమ్మన నిజము దేవ సభయున్ సృష్టిన్
స్వర్గమ్మన నిలుకడయును
స్వర్గమ్మన సాయకమ్ము చతురత నయ్యెన్''

ఇటువంటి పద్యాలు చాలనే ఉన్నాయి. నిఘంటు రచనలో ఇది చాల చక్కనిపద్ధతి. కవిని గురించి, అతని కాలాన్ని గురించి, ఈ గ్రంథంలో ఎక్క డను ప్రస్తావన లేదు.

5. యామున చరిత్రము

ప్రఖ్యాత వైష్ణవ భక్తుడయిన యామునాచార్యుని చరిత్రను వర్ణిస్తూన్న పద్యకావ్య మిది. నలువది తాళపత్రాల్లో నిక్షిప్తమైన సంపూర్ణ గ్రంథం. దీని రచయిత తిరునగరి కృష్ణయ్య అని తెలియవస్తున్నది. ఇతడెప్పుడు నివసించెనో

తెలిసికొనే అవకాశం కనిపించలేదు. కృష్ణయ్య తన కావ్యాన్ని విష్ణుమూర్తికి-తన యిష్టదైవానికి అంకితం చేసినాడు. ఈ కథ అంతా, గురు శిష్యుల సంవాద రూపంలో ఉన్నది. ఇది చంపూ కావ్యం. కవికి సరళంగా పద్యరచన చేయడంలో నేర్పున్నది.

నిన్న చెప్పిన పనసలు నేడు నీకు
వచ్చెనా, మరి లెస్స వచ్చె కాని
చదువు మా తండ్రి యామునాచార్యవర్య
తప్పకన్నియు చదివెను తండ్రి యెదుట

6. విరాట పర్వము

ఇది ఐదాశ్వాసాల్లో పాండవుల అజ్ఞాతవాసాన్ని గురించి చెప్పే ద్విపద కావ్యము దీనిని రచించినవాడు అమ్మయ నామధేయుడు. వల్లభసూరి మిత్రుడు. ఇతడి కావ్యమును దేవయ మంత్రికి అంకితము చేసినాడు. ఈ విశేషాన్ని ఈ విధంగా పేర్కొన్నాడు

ఇహలోక పరలోక హితమైన సుఖము
మహితరారోగ్యము మాంగల్య జయము
రమణ శ్రీగిరిపాటి రామలింగయ్య
క్రమము దప్పక యిచ్చు కలకాల మెపుడు
ఆ వేల్పు వచ్చిన అనఘాత్ము డేల
దేవయ ప్రభువర తిలకంబు దేర
భావింప సకల సామ్రాజ్య మిదేల"

ఈ దేవయ ప్రభువు ఎప్పటివాడో, ఎచ్చటివాడో తెలియరాదుకాని, ఇతడు శ్రీగిరిపాటి రామలింగని భక్తుడైనట్లు తెలియవస్తున్నది. శ్రీగిరిపాడు. శ్రీశైలము ఒకటే అగునేమో తెలియదు. లేక ఆపేరుతో మరొక క్షేత్రమున్న దేమో !తిమ్మయ కవి చక్కని రచన చేయడంలో నైపుణి కల్గినవాడు.

కావున నావంక కరకంఠుడైన
భావించి చూడను బ్రహ్మాది సురలు
కాదన యచ్చగన (?) నెంతవాడు
నీదు వల్లభుడెంత నివ్వను నేను
సైరంధ్రి యగుకాంత జగతిలో ధర్మ
చారిణియై కాని చరించు చాల
అనుమతించుట మేలు అతివ నన్నేల
మనసులో మెలిగెద మాటిమాటికిని
పనుపక నన్ను నల్పములైన పనికి
వనజాక్షి యిది నాకు వరముగానిమ్ము

ద్విపదలో వెలువడిన భాగములలో ఈ విరాటపర్వము అపురూపమైంది.

7. రామానుజ విన్నపములు

ప్రప్రథమంగా కృష్ణమాచార్యులు సింహగిరి వచనాలను రచించి తెలుగులో స్తుతివచనములకు ఒరవడి పెట్టినాడు. అప్పటినుంచి, భక్తిప్రధానాలైన అనేక వచనాలు తెలుగులో వెలువడినాయి. ఈ స్తుతివచనాలనే కొందరు విన్నపాలని పేర్కొనడం సంభవించింది. భక్తులు దైవానికి తమనుగురించి, తమ భక్తి అనుభూతులను గురించి వీటిలో విన్నవించుకొంటారు కాబట్టి విన్నపములు అనే పేరు వాటికి సార్థకమే అవుతున్నది. ఈ రామానుజ విన్నపాలను రచించినవాడు రామానుజుడే. ఇతడు పరపస్తు వంశంలో జన్మించినాడు. తిరువాయిమొళి పెరుమాళ్ళను ఆశ్రయించి పంచసంస్కారములను పొందినాడు. ఈ రామానుజుడు ఆంధ్ర గీర్వాణ కర్ణాటాది భాషల్లో, పద్య గద్యాల్లో అనేక సంకీర్తనాత్మక కృతులను రచించినానని చెప్పికొన్నాడు. రచన సరళంగాను, భక్తిప్రధానంగాను ఉంటుంది. విన్నపాలకు ప్రధానలక్షణం ఇదే.

"అపార కరుణానిధీ! ఆస్పదవస్తువయిన నాయందకానరా సౌహార్ద్రముంచి జాయమాన కాలంబున కటాక్షించి, జన్మాంతరంబున రామానుజాచార్యులని పేరు పెట్ట నియమించి, స్వకీయ మతాభిమానంబున పోషించి,సన్నిధికి రప్పించుకొని,

పేరొప్పజేసికొంటివి. ఉపనీతులుగా జూచి, పంచ సంస్కార సంపత్తికై తిరువాయిమొళి పెరుమాళ్ళ నాశయింప జేసితివి. గృహస్థభావమున నించి, నీవే తండ్రివై కృపామాత్ర ప్రపన్నాచార్యత్వంబున నించి సంప్రదాయములెల్ల దెలిపి, నిజశక్తి నాయందే నిలిపి, అంతరాత్మవై నీ దాసులకు దాసునిగా జేసితివి.''

ఇటువంటి వచనాల్లో విశిష్టాద్వైత సాంప్రదాయిక విశేషముల నెన్నిండినో యీ కవి పొందుపరచినాడు.

ఈ అజ్ఞాత కావ్యాలు, ముద్రణభాగ్యం పొంది, ఈ లోకం వెలుగును తాము చూచి, యీ లోకానికి వెలుగును ప్రసాదించే కాలము వస్తుందని ఎదిరి చూస్తాము.

భరతుని లక్షణ

ఆచార్య పి. యశోదారెడ్డి

భారతీయులకు కావ్యకళ అనాదిసిద్ధమైనది అత్యంతప్రధానమైన ఈకావ్య మనోజ్ఞతకు ప్రాణభూతమైన హేతువులను గూర్చిన అన్వేషణము శతాబ్దులకు పూర్వము నుండియే ప్రారంభమైనది. ఈయన్వేషణలో దిగ్దంతుల వంటి మేధావులెందరో పాల్గొని తపస్సు వంటి నిత్యసాధనతో పరిశ్రమించి, వేరువేరు హేతువులను దర్శించి వేర్వేరు సిద్ధాంతములను ప్రతిపాదించినారు.

ఈలాక్షణికులందరిలో ఆద్యుడని చెప్పదగినవాడు భరతుడు. ఈతడు నాట్య కళను సాంగోపాంగముగా చర్చించి, దానిపరిపుష్టికి కారకములై నలక్షణములనునిర్దేశించి శాస్త్రత్వమును సిద్ధింపచేసినాడు. ఈభరతమునికృతమైనదే నాట్యశాస్త్రము. ఈనాట్యశాస్త్రమునందు వాచికాభినయ సందర్భములో గుణ, దోష, ప్రసంగములకు పూర్వము 'లక్షణ' ప్రసక్తికొనివచ్చినాడు. ఈ విషయవిభాగము కాశీప్రతి–17వ అధ్యాయమునందును, బొంబాయి ముద్రణమున 16వ అధ్యాయమునందును కాన వచ్చుచున్నది. ఖరోడా, బొంబాయి ప్రతులలో ఈవిషయ విశేషమున్నది. 16వ అధ్యాయమేయైనను శ్లోకసంఖ్య మాత్రము భేదించుచున్నది.

ఈ మూడుప్రతులందు విభేదము కేవలము శ్లోకసంఖ్యలో మాత్రమేకాక విషయవివరణ, ఛందస్సంగ్రహ సందర్భములోకూడ విభిన్నతగోచరించుచున్నది. ఆ, ఈ, ప్రతుల విభేదమునుపాటింపక వ్యాసమున కుపయుక్తమైన విశేషమంతయు ఆయాగ్రంథద్వారమున నాచే గ్రహింపబడినది.

"వృత్తైరేవంతు వివిధైర్నానాచ్ఛంద సముద్భవైః।
కావ్యబంధాస్తుకర్తవ్యాః షట్త్రింశల్లక్షణాన్వితాః॥"

అని నానాచ్ఛందసముద్భవములైన వృత్తములతోపాటు ముప్పదియారులక్షణముల గూర్చి కావ్య బంధమును తీర్చవలసినదిగా భరతముని ఆదేశించినాడు. తరువాతి అధ్యాయములో ఈ 36 లక్షణముల గూర్చిన వివరణ మున్నది. మరొక పతిననుసరించి—

"షట్త్రింశదేతానితులక్షణాని । పోక్తానివై భూషణసమ్మితాని।
కావ్యేషుభావార్థగతానితజ్జ్ఞైఃఽనమ్యక్ర్పయోజ్యానియథారసంతు॥

అభి. భార. *Vol. II.*

అని భరతుని మాటగా తెలియుచున్నది. కావ్యమునందు ముప్పదియారు లక్షణములుండవలయుననియు, ఇవి భావములను, అర్థములను ఆశ్రయించి యుండుననియు, విభూషణసదృశములైన వీనిని కావ్యమునందు రసాంగణముగా ప్రయోగింపవలయుననియు చెప్పుటచే ఈ లక్షణలను అలంకారములందు చేర్చుటకు వీలు లేదు. కావున నివి అలంకారములకన్న వేరైన సహజధర్మములుగా భాసించుచున్నవి.

అందుకే కొందరు లాక్షణికులు ఈ లక్షణలను పురస్కరించుకొని పురుషునకు శౌర్యపరాక్రమాములు, లావణ్యాదులు స్త్రీలకు సహజధర్మములైనట్లు కావ్యమునకి లక్షణలు సహజ ధర్మములు. సహజసౌందర్యవతి రత్నాభరణాద్యలంకారములచే శోభించునట్లు లక్షణలచే నలంకృతమైన కావ్యము మరింతగా శోభించును. 'లక్షణ' విరహితమైన కావ్యముగుణాలంకార సముజ్జ్వలమైనను నీరసమేఅగును. లక్షణ లన్నియు కాలక్రమమున అలంకారములుగా మార్పు చెందినవని సూచించినారు.

భరతుడు లక్షణలను ప్రవేశపెట్టిన విధానమును, ప్రకరణములను పురస్కరించుకొని చూడగా భరతుని భావము అనూహ్యమై సందిగ్ధార్థయోజనకు దారితీయుచున్నది. స్థూలదృష్టితో పరిశీలించినప్పుడి 'లక్షణ'లలో అలంకారములను చేర్చినట్లు కనుపించును. కాని సూక్ష్మపరిశీలనము గావించినప్పుడు గుణాలంకారములతో కలియని విశిష్టధర్మముతో 'లక్షణ'లని తోచును బహుశః ఈ అస్పష్టతను పురస్కరించుకొని కాబోలు తరువాతి లాక్షణికులలో పలువురీ 'లక్షణ'ల ప్రసంగమునే వదలివేసినారు. భామహాదులీ జోలికిపోక చెప్పవలసినదంతయు

అలంకార ప్రసంగముగనే తీర్చినారు. జయదేవుడు తన చంద్రాలోకములో, విశ్వనాథుడు సాహిత్యదర్పణములో, సింగభూపాలుడు రసార్ణవసుధాకరము నందీ విషయమై కొంత ముచ్చటించినారు.

నవీన పరిశోధకులు కొందరీ లక్షణలను పురస్కరించుకొని "నిజమాలో చింప అలంకార గుణవృత్తి లక్షణలు ఒకదానితో ఒకటి కలియనంతటి విభేదము కలవికావు. అయ్యును కావ్యనిర్మాణ, కావ్యానుభవ, కావ్యశిక్షల విభేదములను పురస్కరించుకొని యేర్పడిన విభాగములని పేర్కొనినారు. మరికొందరు విద్వాంసులు లక్షణలను కావ్యభిత్తికలుగా గ్రహించి కావ్య నిర్మాణములో 'లక్షణలు' భిత్తికలవంటివికాగా అలంకారములు వానిపై తీర్చిన సుందరచిత్రముల వంటివని ఉపమించినారు. మరికొందరు విద్వాంసులీ 'లక్షణల' వైశిష్ట్యమును గూర్చి ఇవి సుందరి వక్షోజములకు మాంసలతవలెను, కటి దేశమునకు సూక్ష్మతవలెను సహజసౌందర్య లక్షణములని ప్రశంసించినారు.

ఉపమాద్యలంకారములు శరీరావయవములకన్న భిన్నములైన హారాద్యలంకారముల వంటివికాగా 'లక్షణలు' శరీరగత సౌందర్యము. ఇవి మరియే యితరాలంకార సాహాయ్యము లేకయే సుందరముగా భాసించునవి" అని అభిప్రాయముల వెల్లడించినారు.

ఈ లక్షణలను పురస్కరించుకొని తారపదచక్రవర్తి 'లక్షణ' ఒక విలక్షణమైన మనోహరార్థమనియు, కవి వ్యాపారమునకీ లక్షణల కలిమి యొక వినూత్నశోభను చేకూర్చుననియు, కావ్య సౌందర్య విశేషములలో నిదిప్రధానమైనదనియు పేర్కొనినారు. ఈ విమర్శకుననుసరించి సదావస్తుసౌందర్యకల్పనమే ఈ లక్షణ ప్రధానలక్ష్యము. ఇదియే దీని వైశిష్ట్యమని తెలియచున్నది. ఇంకను ఈ లక్షణ నామతః 3రిగా చూపబడినను ఇది అనేకరీతుల భాసమానమగుచుండినట్లు *'Indian Aesthetics & Science of Language'* అనే గ్రంథములో సూచించినారు.

కొన్ని లక్షణ గ్రంథములననుసరించి పలువురు లాక్షణికులు ఈ లక్షణలను పురస్కరించుకొని వివిధాభిప్రాయములను వెల్లడించినట్లు తెలియుచున్నది. వీనిలో పదుగురి అభిప్రాయములు గణనీయములైనవి. నాట్యశాస్త్రములో

భరతుడు ప్రవేశపెట్టిన లక్షణ ప్రసంగము స్పష్టముకాక సందిగ్ధార్థవంతమై యుండగా ప్రతిభావంతుడైన అభినవగుప్తుడు అభినవభారతిలో గణనీయులైన పూర్వాచార్యుల వాదములను 'ఇదంతు దశపక్షం వస్తు' అని సవివరముగా ప్రదర్శించినాడు.

ఆ పక్షముల వివరణ :

1. కావ్యాత్మయని చెప్పదగిన రసధర్ములైన ప్రసాద, మాధుర్యాది గుణములకన్న లక్షణలు వేరు. ఇవి శారీరక సంబంధములైన సామ్రదిక లక్షణములవలె అనగా పాశధ్వజాది చిహ్నములు సుందరములైన మహాపురుష లక్షణములుగా గుర్తింపబడినటుల కావ్య శరీరమునకు సంబంధించినవియగుటచే నివి కావ్యసామ్రదిక లక్షణములన జెల్లును. కావ్యశరీర సౌందర్య జనకములైన ఈలక్షణలు సిద్ధసాధ్య రూపముతో రెండువిధములు.

2. లక్షణలు వృత్తఖండలికలు, అనగా నాటక ప్రక్రియకు సంబంధించిన సంధ్యంగములు. నిమిత్త భేదముతో, పూర్వాపర సంబంధముతో బీజోపక్షేపమైన ఆర్థమును నిర్వహణపర్యంతము పరస్పర సంధాయకముగావించుటచేత ఈ లక్షణలు సంధ్యంగములుగా గ్రహింపబడినవి.

3. కవి ప్రతిభకు సిద్ధించిన మూడు వ్యాపారముల ఫలితము లక్షణ. ఈ పక్షమునసరించిన విద్వాంసులు అలంకార, గుణ, లక్షణలను వేరు చేయునప్పుడు 'ఆశ్రయాశ్రయి' భావముతోకాక ఈ గుణాలంకార లక్షణలను కావ్యమునందు ప్రవేశపెట్టు నపుడు కవి ప్రతిభకు సిద్ధించునట్టి మూడు వ్యాపారములననుసరించి విభేదమును సూచించినారు. మూడవ వ్యాపార పరిస్పందనవలన జనించు కావ్యసౌందర్యము లేదా కావ్యశరీరమే లక్షణ. ఈ లక్షణవలననే కావ్యమునకు స్నిగ్ధ స్పర్శకలుగును

4. నాల్గవ పక్షమునసరించి లక్షణలు కేవలము సంధ్యంగములుకావు. కాని ప్రబంధ ధర్ములు. ఈ సందర్భములో "అలంకారైర్గుణైశ్చైవ బహుభిః సమలంకృతమ్ । భూషణైరివ చిత్రార్థైస్తద్భూషణ సమ్మితమ్" అని లక్షణను నిర్వచించి అందుకుదాహరణముగా 'యధామేఘుడూతాఖ్యం తద్భూషణమ్'

అని ఉద్ధరించిన విధానమునుపురస్కరించుకొని లక్షణ అనగా గుణాలంకారాదు లను విరివిగా ఉపయోగించు రీతి అని గ్రహింప వీలగుచున్నది.

5. 'కవేరభిప్రాయ విశేషో లక్షణమ్' అనగా 'కవి అభిపాయ విశేషమే లక్షణ'యని తెలియుచున్నది.

6. రసౌచిత్యమును పురస్కరించుకొని అలంకార, గుణములను ఉపయోగించుటయే లక్షణ.

7. లక్షణలె కావ్యశరీరము. అలంకారములవలె ఇవి కావ్యశరీరమునలంకరించును. సుందరకావ్యశరీరమె లక్షణ. ఈ సౌందర్యము 'అమరుకశతకము, నందువలె కావ్యమున సహజసిద్ధమై యుండును.

8. ఈ లక్షణల వలననే భరతుడు ప్రతిపాదించిన మూడు అలంకారములు అనంతములగుటకు అవకాశము లభించినది. అనగా అలంకారములను వృద్ధి పొందించునవి.

9. శబ్దముచే శబ్దమును, అర్థముచే అర్థమును, అర్థముచే శబ్దమును, శబ్దముతో అర్థమును అలంకరింప చేయునది లక్షణ. అలంకార సహాయము లేకయే కావ్యమును అలంకరించునది లక్షణ.

10. మీమాంసశాస్త్రమునందువలె కావ్యవిశేషములైన అక్షరసంఘాతాదులు భూషణములన వెల్లును, అవియే లక్షణలు.

ఈ దశవక్షీయులెవ్వరో ఎప్పటివారో పేర్లెవ్వియో అభినవగుప్తుడు తెలుపలేదు. అయ్యును వీరిలో అపూర్వముగాతోచిన మువ్వురిని అనగా 1,3,7వ కక్షవారి మతములను స్వీకరించి విశేషముగా చర్చించినాడు.

ఈ మూడింటిలో మొదటి పక్షమునుపరించిన వాద సారాంశము– ''పృథక్సిద్ధాత్వాదలంకారః శరీర నిష్ఠితమేవ, యదపృథక్సిద్ధం, తల్లక్షణమ్– తల్లక్షణం. ఏన శరీర సౌందర్యం జాయతే, తస్యసిద్ధరూపం సాధ్యరూపం యధాశ్యామేతి, మదమంథరగామినీతిచ, ఏతదేవలక్షణం. తచ్ఛాలంక్రియతే"[1] అని ప్రదర్శించినాడు.

---

1 అభినవగుప్త – అభినవ భారతి. *p* 379.,

ఈ వ్రాతలను పురస్కరించుకొని 'లక్షణ' కావ్య సౌందర్యహేతువు. అది శరీర నిష్ఠము. అలంకారములు శరీర శోభాహేతువులేకాని శరీరము మాత్రము కావు. 'లక్షణ' అన్ననోశరీరముకన్న వేరుకానిది. కావున 'లక్షణ' అలంకారములో చేరదు. అలంకారములు పృథక్సిద్ధములైన కారణముతో కల్పితములు, కృత్రిమములు. 'లక్షణ'లపృథక్సిద్ధములనగా సహజములు. ఇవి సిద్ధసాధ్యభేదములతో రెండువిధములు. ఉదాహరణకు శారీరకశ్యామత సిద్ధలక్షణము కాగా మద మంథరగమనము సాధ్యలక్షణయైనదని గ్రహింపవచ్చును.

ఇట్లే మూడవ సిద్ధాంతానుయాయులు 'లక్షణ'ను కవిఊహలోని మూడవ స్పందనలో స్పందించిన కవి వ్యాపారముగా పేర్కొనుచున్నారు. దీనివల్లనే కావ్య శరీరము లావణ్యతను సమకూర్చుకొనును. ఈ మార్గానుయాయులు కవి ప్రతిభోత్థావకములైన మూడు పరిస్పందనలను గుర్తించినారు. ఈ మూడు పరిస్పందనలకు మూడు వ్యాపారములను కల్పించినారు.

ఊహాజనితమైన ఈ వ్యాపారకల్పనమునండే వీరి నవ్యత ఆధారపడియున్నది. వీరి వాదానుసారము కవిహృదయము తొలిసారి స్పందించినపుడే భావుకత్వ వ్యాపారము ప్రారంభమగును. ఈ భావమును శబ్దరూపములో ప్రకటించుటకు సంకల్పించగనే రెండవవ్యాపారము రంగప్రవేశమొనర్చును వెనువెంటనే ఊహాశక్తి జాగృతమై ఆవిష్కరింపబడును. తిరిగి ఈ భావములను ఇతర భావములతో, శబ్దములను వేరుశబ్దములతో సంయోగముచేయుటకాలోచింపగనే మూడవ స్పందనము తన పనిని ప్రారంభించును. ఈ సందర్భమునందే శబ్దార్థములు ఒక దానితో ఒకటి ఏకమై కావ్యనిర్మాణము చేయబడును. తరువాత గుణాదులను వ్యక్తపరచెడి వివిధాంగములు ప్రవేశించును. గుణాదులను వ్యక్తపరచెడి అంగవిశేషాదులే 'లక్షణలు'. శబ్దార్థరూపమైన కావ్యశరీరమునకిదొక మనోజ్ఞ స్పర్శ.

కావున కవి మూడవ స్పందనతో స్పందనము పొందిన వ్యాపార విశేషమే లక్షణ అని తెలియుచున్నది. మొదటి రెండు స్పందనలు గుణాలంకారాదులను ప్రకటింపగా ఆ అభివ్యక్తి ఫలితముగా నీ లక్షణ ప్రకటితమై పని చేయుచుండునని గ్రహింపవచ్చును. ఏడవపక్షము ననుసరించి ఈ లక్షణ కావ్య

సౌందర్యాపాదన ధర్మము లేదా గుణము. అందుకే 'లక్షణ' సహజసిద్ధమైన కావ్య సౌందర్యముగా గుర్తింపును పొందినది.

ఏ అలంకారముల తోడ్పాటు లేకయే కావ్యమును రసవంతము చేయు శక్తికలది 'లక్షణ'. వీరి దృష్టిలో 'లక్షణ' అనగా కావ్యము. అదే కవి వ్యాపారము. కేవలము దక్షణమాత్రము చేతనే కావ్యమునకు సౌందర్యసిద్ధి గలుగు నను వాదముతో వీరు ఈ 'లక్షణ' కొక ప్రత్యేక స్థానమును కల్పించి నారు.

ఈ మూడు పక్షముల వాద సారాంశమును నిరూపించి చివరకు 'లక్షణ' పై వెలసిన అభిప్రాయములను సమీక్షించినట్లుగా "తత్రచిత్త వృత్యాత్మకం రసం లక్షయన్ తదసోచిత విభావాది సంపాదః త్రివిధోఒభధావ్యాపారో లక్షణశబ్దేనోచ్యతే. ఇత్యేషాం సామాన్య లక్షణం"[1] "ఏకం కవి వ్యాపార బలాత్ యదర్థజ్ఞానం లౌకికాత్ స్వభావాద్విద్యమానం తదేవలక్షణమ్, ఇత్యుక్తః తస్యశరీరకల్పస్య అలంకారః అత్రఅర్థస్య అలంకార ఘటనా ప్రాయ సమంత రేణైకసుందరత్వం లక్షణకృతమేవ। యస్తు త్రివిధోప్యభిధావ్యాపారః సాలక్ష ణానాం విషయః"[2] అని లక్షణకు మరొక వినూత్న కల్పన గావించినాడు.

అభినవ భారతి ననుసరించి అభిదకు మువ్విధములైన వ్యాపారము లున్నట్లు గ్రహింపవలెను. త్రివిధ వ్యాపారరూపమైన అభిధయే 'లక్షణ'. ఇదే కావ్యశరీరము. దీనిని అలంకారములలంకరించును. సాధారణ వ్యవహారరూపము నుండి శబ్దార్థమును వేరుచేసి, వానికి కావ్యత్వ సిద్ధిని కలిగించునది కవి ప్రతిభ. ఇదే రసాభివ్యక్తికి మూలము. ఈ వ్యాపారమే 'లక్షణ'. ఇది కేవలము కవి ప్రభావ సంబంధియైన వ్యాపారము మాత్రమేకాక, ఆ వ్యాపార ఫలము అని నిర్ణయించినాడు.

అభినవగుప్తుని దృష్టిలో అభిధా వ్యాపారమనగా విభావ, అనుభావ, వ్యభి చారీ భావముల వ్యాపారము. ఈ విద్వాంసుడీ మూడు వ్యాపారములను సామాన్య కారణములుగా గ్రహింపక రసవ్యంజక సమర్థములైన కారణములుగా ఊహించి నాడు. ఈఊహను ఆధారముగా 'కవి ప్రతిభసంబంధమైన ఆలోచనావ్యాపారము

---

1. అభి. భార. P. 405 2. అభి భార. P. 404

లేదా ఊహాశక్తినే అభినవగుప్తుడు 'అభిధ' అని పేర్కొని ఈ అభిధ యొక్క మూడు వ్యాపార ఫలస్వరూప విశేషమును 'లక్షణ'గా స్వీకరింపవచ్చునని భావించినట్లు మనము ఊహించుట కవకాశమున్నది.

రసాభివ్యంజకములు గుణములు, వర్ణిత విషయమునకు భిన్నమై కావ్యమును అలంకరించునది అలంకారము. ముఖ్యమైన అభిధావ్యాపారము లక్షణ అని చెప్పే ఇంకను ప్రభువునకు హారాద్యలంకారములవలె, వీరాది ఉత్తమ గుణములవలె, విశాల వక్షస్థల నేత్రాదులవలె కావ్యము అలంకారములతో అలంకృతమై, గుణములనుకూడి 'లక్షణ'తో ప్రత్యేకింపబడి ఉండవలెనని భరతుడు సూచించినట్లు తోచుచున్నది.

ఈ వివరణమునే పురస్కరించుకొని కవి శిక్షావిషయములో ఆనగా కావ్య సాహిత్యములో అభినవగుప్తుడు అలంకారాదులకన్న లక్షణలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చినాడనుచు తారాపద చక్రవర్తి ఇంతవరకు చూపిన వాక్యములనే ఉద్ధరించి ఆ ఆధారముపై తమ అభిప్రాయమును వ్యక్తపరచినారు

భరతుడు నాట్యశాస్త్రమునందు లక్షణ–అలంకార సంబంధమును గూర్చి ఎట్టి విచారమునుగావింపలేదు. కాని 'యత్కించిత్ కావ్యబంధేషు సాదృశ్యేనోపమీయతే'[1] అని చెప్పిన సందర్భమును వ్యాఖ్యానించుచు 'కావ్యబంధేషు కావ్యలక్షణేషు సత్సు ఇత్యనేన గౌరివగౌ ఇతి నాయమ్ అలంకార ఇతి దర్శితమ్' అని కేవల సాదృశ్య మాత్రము అలంకారత్వసిద్ధిని పొందదని సూచించినారు. ఈ సందర్భమున కవిబంధమ్ అనగా కావ్యత్వ సిద్ధిని పొందిన కావ్యమే 'లక్షణ'గ నిరూపించిశాడు.

ఈ భావము నింకను దృఢపరచుటకు బంధోగుంపోభణిత్తైర్వక్రోక్తిః కవి వ్యాపార ఇతిహి పర్యాయాత్ లక్షణం త్వలంకార శూన్యమపిన నిరర్థకమ్' అనే వాక్యముల నుద్ధరించినాడు. ఈ వ్యాఖ్యను పురస్కరించుకొని *P. C.* లహరి అను నాతడు *This remark undoubtedly reminds one of the Kuntaka's theory of poetry and the individual skill of the poet*

---

1 అభి. భార. *P.* 404.

that underlies it." అనే భావమును వ్యక్తపరచినారు అనగా కవి వ్యాపారము వలననే గుణాలంకార లక్షణ విభాగము లేర్పడినట్లు గ్రహింపవచ్చును. ఇట్లే అభినవగుప్తుడు పదుగురి అభిప్రాయములను సాధ్యమైనంతవరకు తన కనుకూలముగా వ్యాఖ్యానించుటకు శక్తివంచనలేక ప్రయత్నించినాడు.

ఈ సందర్భమునందు అభినవగుప్తుడు తమ ఆచార్యులైన భట్టతౌతుల మాటలను ''లక్షణ బలాదలంకారాణాం వైచిత్యమ్'' అని ఉద్ధరించి వ్యాఖ్యానించినారు. వీరి వ్యాఖ్యనుసరించి ఇచట వైచిత్రపదమునకు ''వివిధత్వము, సౌందర్యము'' అను రెండర్థములున్నవి.

ఈ పదమునకున్న ద్వ్యర్థి సామర్థ్యమును పురస్కరించుకొని వైచిత్ర్య పదమును వివిధార్థమునందు గ్రహించినవారు భరతుడు పేర్కొనిన మూడలంకారములు ఈ లక్షణల వలననే అనంతముగ పరిణమించినవని పేర్కొనగ[1] అలంకారార్థమందు గ్రహించినవారు లక్షణ అలంకారములనే అలంకరించునది అని చెప్పుచున్నారు. ఈ ఆధారమువైననే అభినవగుప్తుడు 'లక్షణానిహి అలంకారానపి చిత్రయన్తి' అని చెప్పి లక్షణకు వ్యష్టి 'సమస్టి' రూపములను స్వీకరించినాడు.

ఇంకొక చోట ఇతడు లక్షణలు కేవలము నాటక సంబంధములైన సంధ్యంగములు అనే భావమును ఖండించుచు 'లక్షణా లంక్రతి గుణ దోషాః శబ్ద ప్రవృత్తయః వృత్తి సంధ్యంగాసంరంభః సంహారోయః కవేః కిల'' అని చెప్పిన తమ ఆచార్యుల మాటలను ఉద్ధరించి తాను స్వయముగా 'లక్షణాలంకారాదీనాంనోక్తి నియతం రూపమితి విశేషః' అని లక్షణకు అలంకారములకు భేదమును ప్రతిపాదించి లక్షణకు ప్రత్యేకతను కలిగించినాడు.

---

1. గుణానువాదనమనెడి లక్షణయోగముచే ప్రశంసోపమయు, అతిశయమనెడి లక్షణచే అతిశయోక్తియు ఇట్లే మనోరథముచే అప్రస్తుత ప్రశంస, మిథ్యాధ్యవసాయముచే అపహ్నుతి, సిద్ధిచే తుల్యయోగితలు వైచిత్ర్యయుతములగుచున్నవి. ఇట్లే లక్షణల పరస్పర వైచిత్ర్యము చేత అనంతములగు విచిత్ర భావములు సిద్ధించుచున్నవి. ఉదాహరణమునకు ప్రతిషేధమనోరథసమ్మేళనము వలన ఆక్షేపము సిద్ధించుచున్నది. అభినవభారతి. *Vol. II P.* 321

అభినవగుప్తుడు ప్రతిపాదించిన లక్షణ ఈ లక్షణలను పురస్కరించుకొని ప్రకటించిన అభిప్రాయములను గూర్చి ఆలోచింపగానివి పరస్పర విరుద్ధములై గోచరించుచున్నవి. అందు ఒకటి ఈ లక్షణలు కావ్యబంధము లేదా కావ్య శరీరమైనప్పుడు ఇది కావ్య శరీరమును వేరుగా అలంకరించుటకు వీలులేదు. తరువాత కానవచ్చు రెండవ సంగతి "లక్షణలు అలంకారములను అలంకరించును –అలంకారములు లక్షణలను అలంకరించును." ఈ అసంగతులను లాక్షణికులు సయితము ఊహించి కొంత కొంత సంతృప్తిని కలిగించుటకు ప్రయత్నించినారు.

ఉదాహరణమునకు 'లక్షణ'ను కవి వ్యాపారముగనే భావించినప్పుడు దీనికి 36 విభేదములు మాత్రమే కాక అసంఖ్యాకములుగ చెప్పవలసి యుండెను అను సందేహమును గ్రహించి అభినవగుప్తుడు 'షట్త్రింశదితిచనాన్య ద్వివరణ? కవిహృదయవర్తినామపి పరి సంఖ్యేయత్వాత్ కింతు బాహుళ్యేన తావద్' అనే సమాధానానుసారముగ లక్షణలను 36 అని సూచించుటను ప్రధానము లైనవి 36 అని గ్రహించవలయును. కాని, తక్కిన వానిని కవి వర్ణింపదలచినప్పుడు అభ్యంతరము లేక వర్ణింపవచ్చును అని తెలియుచున్నది.

దీనిని బట్టి రెండు ప్రధానాంశములు బయలుదేరుచున్నవి. 1. సమగ్రమైన ఈ కావ్యలక్షణ విశాల ప్రాంగణము కలిగి యుండుట 2. సంకుచిత పరిధితో అనేక ప్రకారములై యుండుట.

అభినవగుప్తుడు తమ గురుపాదులైన భట్టతౌతుల వైచిత్ర్యపదమున కున్న రెండర్థములను లక్షణ సందర్భము నందు గ్రహించినాడు. ఈ సందర్భమును పురస్కరించుకొని *P. C.* లహిరి గారు *Concept of Riti and Guna in Sanskrit Poetic*లో '*He closely studied the Individual Lakshnas of Bharata and told us that Bharatas Lakshna might well be taken as an elastic poetic principle which like Kuntakas vakrokti includes, with in its wide scope, other poetic elements* అని *Prof. P.C.* భట్టాచార్య సూచించినట్లు వ్రాసినారు.

లక్షణ ఒకవైపు కావ్యశరీరము మరొకవైపు 'కావ్య శరీరసౌందర్య హేతు' వగుటను పురస్కరించుకొని *P.C.* లహిరిగారు *Abhinava would*

probaly justify himself by saying that an object, which has an exquisite grace of its own, may serve to cart in to the background even the beauty of its decorating factor in that sense lakshna may be said to beautify even the Alankaras అని వ్రాసినారు.

వీరి ననుసరించి విశిష్ట సౌందర్యయుతమైనవస్తువు తన సహజ సౌందర్యముతో తనను అలంకరించుకొనుచు, ఆ భూషణ సౌందర్యమును కూడా కాదని ఆ అలంకారములకే నూతన శోభను కలిగించునట్లు లక్షణ అంకారముల నలంకరింపవచ్చునని తెలియుచున్నది ఈ సందర్భమునకు బలముగా ''అన్యోన్య శోభాజనానాభూవ' అనే కుమారసంభవ శ్లోకమును స్మరింపవచ్చును.

లక్షణ వివరములు

36. లక్షణలు : (ఇవి అభినవగుప్తుడనుసరించిన ఉపజాతి వృత్త ప్రతిలోనివి)

1. భూషణము :

రసౌచిత్యము నెరిగి గుణ–ఆలంకారములచే కావ్యము నలంకరించుట.

2. ఆక్షర సంహతి :

పరస్పర సమ్మిళితములగు అల్పాక్షరములచే విచిత్రార్థ వర్ణనము.

3. శోభ :

ప్రతి పదార్థములతోపాటు అప్రసిద్ధాలంకారములను గూడా ఔచిత్యమును పాటించి హృద్యముగా నిబంధించుట.

4. ఒక అర్థమునకు వేరొక అర్థముతో గల సంబంధము నెరిగి ఫలము విరుద్ధముగా నుండుటచే వివిధములైన యుక్తులతో శంకించుట

5. గుణకీ ర్తనము :

వివిధార్థ సముద్భవములైన గుణములను కీర్తించుచు దోషములను కల్పించకుండుట.

6. పోత్సాహనము :

ఉత్సాహ వర్ధకములును స్పష్టములును అయిన ప్రపిద్ధ వచనములచే ఒక అజ్ఞాత విషయమునందు ఉత్సాహము కల్పించుట,

7. ఉదాహరణము :

ఒక ఆర్థమును ప్రతిపాదించుటకు ఉపయుక్తమైన శబ్దముచే తత్సంబంధములును, అనుక్తములును అయిన అనేకార్థములు స్ఫురించుట.

8. నిరుక్తము :

ప్రసిద్ధి నాశ్రయించి ఒక శబ్దముయొక్క నిర్వచనమును సాధించుట.

9. గుణానువాదము :

హీనులను ఉత్తములతో పోల్చుట.

10. అతిశయము :

కొంత విషయమును చెప్పి మిగిలినది చెప్పుటకు అలవికాదని సూచించుట

11. హేతువు :

వాడుకలో నున్న అనేకార్థములను సూచించి, వానియందు అనాదరము చూపి, అసాధారణమైన ఒక అర్థమును ప్రమాణవచన పురస్సరముగా నిర్ణయించుట.

12. సారూప్యము :

పరోక్షమందు అనుకరణవలన లక్షణ సామ్యమును కల్పించి ఆదే ఇది యని చెప్పుట.

13. మిధ్యాధ్యవసాయము :

పారమార్థికములు కాని అర్థములచే వానిలో సమానములైన అర్థములను నిర్ణయించుట,

14. సిద్ధి :

ప్రసిద్ధార్థముల మధ్య ఒక సిద్ధార్థమును చొనివి హేతుపురస్సరముగా వానికి సాధారణ్యమును కల్పించుట.

15. పదోచ్చయము :

తాత్పర్యార్థము సమానముగా ఉండియు, వాచ్యార్థము భిన్నముగా ఉండు పదములచే నానార్థగ్రథితముగా ఒక వస్తువును ప్రశంసించుట.

16. ఆక్రందము :

సాక్షాద్వాచ్యము కారాని తీవ్రమగు అర్థమును చెప్పునప్పుడు సాదృశ్య యోజనముచే ఆత్మాభిప్రాయమును ఇతరులెరుంగు ట్లుపన్యసించుట.

17. మనోరథము :

హృదయస్థమగు భావమును సుశ్లిష్టార్థముగ అన్యాపదేశ కథనములచే ప్రకాశింపచేయుట.

18. ఆఖ్యానము :

ప్రశ్న పూర్వకముగా కాని, అప్రశ్న పూర్వకముగా కాని ఒక నిర్ణయము చేయుట.

19. యాచ్ఞ :

ఆదిలో కోపము కలిగించునవియైనను అంతములో హర్షమును కలిగించు హిత వాక్యములను ప్రియవాక్యములతో కలిపి ప్రబోధించుట.

20. ప్రతిషేధము :

విపరీత కార్యములందు ప్రవర్తించువానిని కార్యజ్ఞులు నివారించుట.

21. పృచ్ఛ :

అభిప్రాయద్యోతకములగు కాక్వాదులతో కూడిన వాక్యములతో తన్ను గాని, ఇతరులనుగాని ప్రశ్నించునట్లు మాట్లాడుట.

22. దృష్టాంతము :

పూర్వము ఉపలబ్ధమైన విషయముల నిదర్శనచే ప్రకృతమునకు వాని సామ్యమునపపాదించుట.

23. భాననము :

అనేకార్థములను ప్రకాశింపజేయుచు, పెక్కు ఉక్తి యుక్తులను కలిగి ఒక భావమును భాసింపజేయు వాక్యము.

24. సంశయము :

అనేక విధములైన విచారణములనుచేసి తత్త్వార్థము పరిజ్ఞాతము కాకుండ గనే వాక్యమును పూర్తిచేయుట.

25. ఆశిస్సు :

శాస్త్రీయార్థ సంపన్నమును,మనోరథసముద్భవమును అయిన ప్రార్థనీయ, అప్రార్థనీయాంశమును ఆకాంక్షించుట.

26. ప్రియము :

ఆదియందు క్రోధ జనకమును, అంతమందు హర్ష ప్రవర్ధకమును, ఆశీర్వాద వమన్వితమును అగు వచనము.

27. కపటము :

ఛలముచే ఇతరముల వచనములను అన్యథాగహించుట.

28. క్షమ :

దుర్జనోదాహృతములును, పరుషములును, క్రోధజనకములును అగు వాక్యములచే సభలో పీడితుడయ్యును క్రోధమును తెచ్చికొనకుండుట.

29. ప్రాప్తి :

ఆవయవ చిహ్నమును జూచి భావమును అనుమానించుట.

30. పశ్చాత్తాపము :

తొందరపాటుతో అకార్యమును తలపెట్టికాని, చేసికాని సంతాపమును చెందుట.

31. అనువృత్తి :

స్నేహమువలనకాని, దాక్షిణ్యమువలనకాని అర్థ సంయుక్తముగా వినయముతో పరుని అనువర్తించుట.

32. ఉపపత్తి :

ప్రాప్తములైన దోషములను ఉపపత్తి సహితముగా శమింపజేయుట.

33. యుక్తి :

పరస్పర శోభారూపమగు ఆనుకూల్యము కలిగిన ఉత్కృష్టములగు అర్థముల సంబంధము సాధింపబడుట.

34. కార్యము :

ఒకదాని యందలి గుణములను తొలగించి దోషములను, దోషములను తొలగించి గుణములను కూర్చుట.

35. అనునీతి :

అపూర్వ క్రోధ జనకమగు అపరాధమును తొలగించుటకై మధుర వాక్యములను పలుకుట.

36. పరిదేవనము :

ప్రయోజన వశమున వేరు పేరుతో చెప్పబడిన ప్రసిద్ధ దోషములను అన్య సంబంధములుగ కల్పించుట.

అనుష్టుప్ వృత్త ప్రతి ననుసరించి 36 లక్షణల వివరము

1. భూషణము :

వివరణమునందు మార్పులేదు.

2. అక్షర సంఘాతము : ,,

3. శోభ : ,,

4. ఉదాహరణము :

తుల్యార్థయుక్తమగు వాక్యముచే వేరొక అర్థమును సాధించుట.

5. హేతువు :

ప్రయోజన వశమున ఇష్టార్థమును సాధించుటకు మనోగ్రాహి యగునట్లు ఉపపత్తి సహితముగ చెప్పెడి వాక్యము.

6. సంశయము :

పూర్వపు ప్రతివలెనె.

7. దృష్టాంతము :

హేతువుచే పక్షమునందు సాధ్యమును సాధించునపుడు సహాయకారియును, సర్వలోకమనోగ్రాహియును అగు నిదర్శనము.

8. ప్రాప్తి :

పూర్వపు ప్రతివలెనె.

9. అభిప్రాయము :

సాదృశ్య రూపమున అభూత పూర్వమగు ఒక అర్థమును లోక హృదయ గ్రాహిగా కల్పించుట.

10. నిదర్శన :

ఇతరాపేక్ష. అనగా వ్యతిరేకమును నిరసించుటకు ప్రసిద్ధార్థములను కీర్తించుట.

11. నిరుక్తము :

పూర్వోక్తమైన అర్థ ప్రసిద్ధికొరకు దోషరహితమైన వాక్యమును చెప్పుట.

12. సిద్ధి :

తాను కోరిన అర్థము సిద్ధించుటకొరకు స్పృహనీయములును, అతర్కితోపలబ్ధములును అయిన ప్రయోజనాంతరములను కీర్తించుట.

13. విశేషణ :

ప్రసిద్ధములను, ప్రధానములును అయిన పెక్కునర్థములను విడిచి. విశేషముగా ఒక్కదానిని పేర్కొనుట.

14. గుణాతిపాతము :

ఉపమాన భూతములగు వివిధార్థములందున్న మధురోదాత్త గుణముల సాదృశ్యముచే ఉపమేయమునందు గుణములను కల్పించుట.

15. అతిశయము :

సర్వజన సాధారణములగు గుణములను మొదట కీర్తించి, పిమ్మట విశేషమును చెప్పుట.

16. తుల్యతర్కము

తుల్యార్థములగు రూపకములను, ఉపమలను ప్రయోగించి అప్రత్యక్షార్థమును గోచరింపచేయుట.

17 పదోచ్చయము

బహుపదములను మరికొన్ని పదములలో కూడ సదృశార్థముగ ప్రయోగించుట.

18. దృష్టము

ప్రత్యక్షవస్తువులను పరోక్షముగ కాని, పరోక్షవస్తువును ప్రత్యక్షముగాకాని వర్ణించుట.

19. ఉపదిష్టము

శాస్త్రార్థమును పరిగ్రహించి విద్వన్మనోహరముగా ఉపదేశించుట.

20. విచారము

ప్రత్యక్షార్థమును విధించుటకు చెప్పబడిన అర్థమునానుసరించి అనేక ఉపాయసహితమైన విచారము చేయుట.

21. వివర్యయము

ఊహించినది చూచినది ఒకరిచే చెప్పబడినది అగు (విచారదృష్ట. ఉపదిష్ట) అర్థ తత్వమును సందేహమువలన అన్యథాపరికల్పించుట.

22. భ్రంశ

వాచ్యార్థమును విడిచిపెట్టి అన్యార్థమును ఆశువుగా చెప్పుట.

23. అనునయము

విరుద్ధాభినివేశులగు ఇరువురికి ప్రీతినికలిగించునదియు, అర్థసాధకమగు నదియునగు వాక్యము.

24. మాల

ఈప్సితార్థ సిద్ధికొరకు అనేక ప్రయోజనములను కీర్తించుట

25. దాక్షిణ్యము

హితములును, ప్రసన్నములును అయిన వాక్యములతో చేష్టలతో ఇతరు ను అనువర్తించుట.

26. గర్హణ

ప్రయోజనవశముచే దోషములను గుణములుగను, గుణములను దోషము లుగను కీర్తించుట

27. అపాపతి

వాక్యమాధుర్య సంపన్నముగా ఒక అర్థమును చెప్పినపుడు వేరొక అర్థము ప్రతీయమానమగుట.

28. ప్రసిద్ధి

లోకప్రసిద్ధములును, సాతిశయములును అయిన బహువాక్యముల తో వాక్యార్థమును సాధించుట.

29. పృచ్ఛ

పూర్వపు ప్రతివలెనె.

30. సారూప్యము

తానింతకుముందు చూచి, విని, అనుభవించియున్న విషయములను చెప్పుటచే కలిగిన సాదృశ్యము క్షోభజననమగుట. అనగా హృదయమందు స్థిరముగా నిలువకపోవుట.

31. మనోరథము

పూర్వపు ప్రతివలెనె

32. లేశము

వాక్యకుశలురు సదృశార్థమును ప్రతిపాదించుచు ఉపాయముగా వాక్యార్థ మును చెప్పుట.

33. క్షోభము

తాను దోషరహితుడైనను విచిత్రార్థములైన పరిదోషములను తనయం దాపాదించుకొనుట.

34. గుణకీర్తనము

లోకమందలి గుణాతిశాయులైన, అనేకులైన నామములలో ఒకనినే నిర్దేశించుట.

35. అనుక్తసిద్ధి

ఒక విషయముయొక్క ప్రస్తావముచే మిగత అర్థమంతయు చెప్పనవస రము లేకయే ప్రతీతమగుట.

36. ప్రియోక్తి

ప్రసన్నమైన మనస్సుతో పూజ్యులను పూజించునప్పుడు తన మనస్సులోని హర్షమును వెల్లడి చేయుటకు చెప్పెడి మాటలు.

ఇట్లే రెండు ప్రతులందు దాహృతములైన 3 లక్షణలపేర్లు, వివరణ మంతయు నొకే విధముగనున్నది. ఈక ఉదాహరణ, హేతు, సంశయ. దృష్టాంత, ప్రాప్తి, నిరుక్త. సిద్ధి, అతిశయ, పదోచ్చయ, పృచ్ఛ, మనోరథ, గుణకీర్తనలను లక్షణలను నిర్వచనమునందు సమానమైయున్నను సంఖ్యాక్రమ విషయమున భేదించుచున్నవి. ఇక అభినవగుప్తుడు అనుష్టుప్‌చ్ఛంద ప్రతియందలి అభిప్రాయ, నిదర్శన, విశేష, గుణాతిపాత, తుల్యతర్క, దృష్ట, ఉపదిష్ట, విచార, విపర్యయ, భ్రంశ, అనునయ, మాలాదాక్షిణ్య, గర్హణ, ప్రసిద్ధి, సారూప్య, కేళ, క్షోభ, ప్రియోక్తులను ఉపజాతి వృత్త ప్రతి యందలి యుక్తి, ఆశీస్సు, క్షమ, గుణానువాద, ఆక్రంద, సారూప్య ఉపపత్తి, పశ్చాత్తాప, మిథ్యాధ్యవసాయ, ప్రియ, అనువృత్తి, భావన, యాచ్ఞ, కపట, ప్రతిషేధ, పరిదేవన, ప్రోత్సాహనములతో సమములని అత్యంత ప్రయాసతో ప్రదర్శించినాడు.

లక్షణపరంపర :—

భరతుడు ప్రతిపాదించిన లక్షణలను పురస్కరించుకొని అభినవగుప్తుడు కావించిన విపులవ్యాఖ్యానమేకాక ఆతనికి పూర్వమే భట్టతౌతుడు తన కావ్యకౌతుకమునందు ఈ లక్షణలను గూర్చి వివేచించినాడు.

భోజుడు లక్షణ ప్రసంగావసరమున భరతుడు ప్రయోగించిన 'కావ్య భూషణ' భూషణసమ్మిత పదములను పురస్కరించుకొని వానిని 64గ స్వీకరించినాడు.

బహురూపమిశ్రుడు తన దశ రూపములో లక్షణలను భావములుగమ, అలంకారములుగను గుర్తించినట్లు తెలియుచున్నది.

కుంభకర్ణ ప్రభుకృత సంగీత రాజమందు ఈ లక్షణల ప్రసక్తి యున్నదని కొందరు విద్వాంసులు ప్రకటించినారు.

సాహిత్య సారక ర్త రత్నేశ్వరుడు ఈ లక్షణలను గూర్చి ప్రసంగించి నాడు.

సింగభూపాలుడు భూషణములను పేరుతో 36 లక్షణలను పేర్కొనినాడు (అముద్రితము)

నాటక చంద్రికాకారుడు ఈ లక్షణల ప్రసంగ వశమున సాహిత్య దర్పణ కారుని విమర్శించి రసార్ణవ సుధాకరకారుని అనుసరించినట్లు శ్రీరాఘవన్‌గారు అభిప్రాయపడుచున్నారు.

మాతృగుప్తుడీలక్షణల గూర్చి ప్రాసినట్లు రాఘవభట్టుకృత శాకుంతల వ్యాఖ్య సాక్ష్యమిచ్చుచున్నది.

మాలతీమాధవటీకాకారుడైన జగద్ధారుడు కొన్ని లక్షణలను, అనర్ఘరాఘవ వ్యాఖ్యాతరుచిపతి రెండు లక్షణలను, రత్నాకర కృతహరవిజయ వ్యాఖ్యత రాజానక అలకుడు కొన్నింటిని పేర్కొనినట్లు రాఘవన్ సూచించినారు.

ఇట్లే అభినవగుప్తునికి పూర్వము సయితము భట్టనాయకుడు, భట్టలోల్లటుడు, శ్రీశంకుకుడు, ఉద్భటుడు మొదలయినవారు ఈ లక్షణను గూర్చి ప్రసంగించియుండవచ్చునని శ్రీరాఘవన్ *Some concepts of the Alankara-sastra* అనే గ్రంథములో ప్రాసియున్నారు.

స్వరూప విశేషములలో -ఒకటి లక్షణయేకావ్యబంధము. రెండుకావ్యబంధ సౌందర్యము కవి ప్రతిభచే సాధితములను పురస్కరించుకొని కొందరు నవీన విద్వాంసులు ఈ లక్షణ కుంతకుని వైదగ్ధ్య భంగిమతో సరిపోలుచున్నదనినారు. ఇట్లే లక్షణ అలంకారములను ఎక్కుడుగా శోభింప చేయుచున్నదను విషయమును పురస్కరించుకొని 'వక్రోక్తి సర్వాలంకారములకు మూలమనుచు భామహుడు చెప్పిన విషయమును స్మరింపచేయుచున్నదని పేర్కొనినారు. ఇట్లే అలంకారములతో సిద్ధింపని కావ్య సౌందర్యము అక్షర సంఘాతమను లక్షణ ప్రభావమే అని సూచించి అక్షరసంఘాతమనగా పదౌచిత్యమనినాడు.

ఈ సందర్భములో అతి జాగరూకుడై పదౌచిత్య రూపమైన సాభిప్రాయపదముల నుండి భరతుడు ప్రతిపాదించిన ఓజోగుణమును వేరుచేయుటకు ప్రయత్నించుచు ఈ గుణాదుల వలన కావ్యమునకు సిద్ధించు సౌందర్యము కవి వ్యాపారమే అనిపేర్కొని రసాభివ్యక్తి ఉద్దేశించిన కవి యొక్క అభిధా వ్యాపారమే లక్షణ అనినాడు.

తిరిగి గుణాలంకార లక్షణల సంయోగము నంగీకరించుచు "ఏతేషాంచ లక్షణానాం సంకర్ణత్వేన లక్ష్యం దృశ్యతే" అనుచు గుణాలంకార సంయోగములేనిదే లక్షణలు సిద్ధింపనట్లుగా ధ్వనింప చేసినాడు. అట్లే ఈ లక్షణలను అలంకార గ్రాహకములుగా స్వీకరించినాడు.

ఇంకొకచోట లక్షణలను పురస్కరించుకొని "పరమౌచిత్యాఖ్యాపనలు ప్రయోజనములుగా" అనగ ఔచిత్య ప్రధానములైనవిగా పేర్కొనినాడు. ఈ విషయమునే గ్రహించి భోజుడుశృంగార ప్రకాశములో 'ఏతానికావ్యన్యవిభూషణాని పాయశ్చతుష్షష్టిరుదాహృతాని ప్రబంధభోకరాయతజ్ఞైః సమ్యక్ ప్రయోజ్యానియథారసాని" అని నిర్ణయించినారు.

ఈ సందర్భమునందే అనగా ఆరవపక్షవాదమును సమర్థించు సందర్భమున అభినవభారతి తమ గురువులైన భట్టనాయకులు చెప్పిన 'అలంకారై సర్వే విభావాద్యుచితో నిర్వర్త్యమాణః కావ్యలక్షణత్వేన సూచితః' అనే వాక్యములను ఉద్ధరించి విభావాదులననుసరించి ఉచితరీతిని రసవ్యంజకముగా అలంకారాదులను ప్రయోగించుటయే లక్షణ అని పేర్కొనినాడు.

ఈ విధముగా లాక్షణికుల అభిప్రాయములన్నిటిని పురస్కరించుకొని చూడగా మూడు ప్రధాన సిద్ధాంతములు లక్షణలను పురస్కరించుకొని బయలుదేరినట్లు భావింపవచ్చును. అవి (1) లక్షణలు కావ్యశోభాకర ధర్మములు. (2) ఇవి నాటక వస్తువును పురోగమింపచేయుటకుద్దేశించిన సాధ్యంగములు. రసపుష్టికారక వృత్యంగములు. అందుకే నాట్యాలంకారములు. (3) ఇవి సంధ్యంగకములవంటివి అయ్యును కేవలనాటికోచితములుకావు కావ్యనాటక సాధారణములు—అనునవి.

1. లక్షణలు కావ్యశరీరము 2 ఇవి సౌందర్యకారకములు. 3. అలం కారములవలె బాహ్యములుకాక అప్రథ సిద్ధములైనవి. 4. ఇవి స్వయముగా కావ్యమునకు శోభనుకూర్చుటయేకాక అలంకారములగూడి కావ్యమును మరింత శోభాయమాన మొనర్చును—అను విషయమునందు గురు శిష్యులైన భట్టతౌత, అభినవ గుప్తులకెట్టివిభేదములేదు. భరతుడు చెప్పిన 'ఏతానివాకావ్యభూషనాని ప్రోక్తానివైభూషణ సమ్మితాని' అనే వాక్యము లాధారముగా అలంకారములకన్న భిన్నమైనను కావ్యమునలంకరించు ప్రత్యేక సౌందర్య విశేషములని భావించి అభినవగుప్తుడు వీనిని కావ్యసాధారణ శోభాకర ధర్మములుగా పరిగణించినాడు. అనగా అభినవగుప్తుడు వీనిని ఒక వంక గుణాలంకార ధర్మములుగను మరొక వంక అంతకన్న వేరైన సౌందర్య జనకాంగకములుగను స్వీకరించినాడు.

దీనిని పురస్కరించుకొని కొందరు ఇవికావ్య—నాటక సాధారణ ధర్మ ములని గుర్తించినారు. మొదటి, రెండవ, నాల్గవపక్షానుయాయులు సాముద్రిక లక్షణసామ్యముతో,లక్షణలనుగుర్తించినను వానినికేలము నాటకమునకు మాత్రమే పరిమితముకావించినారు వీరిదృష్టిలో ఇవి కథా సౌందర్యపోషక రూపవస్తు పురోభివృద్ధి కారకాంగకములు.

విచిత్రముగా జయదేవుడు ఈ లక్షణలను ప్రత్యేకముగా పేర్కొని

''ఇత్యాదిలక్షణం భూరి కావ్యస్యాహుర్మహర్షిః।
స్వర్ణభాజిష్ణు భాస్వనుత్వ ఫాలత్వ ప్రభృతీవమహీభుజఃII''

అని ప్రభువులకు స్వర్ణభాజిష్ణువైకఫాలభాగమువలె కావ్యమునకీ లక్షణలు అతి శయకారకములనుచు సాముద్రిక లక్షణాధారముపై వీనిని శ్రవ్య కావ్యశోభాకర ధర్మములగ ప్రతిపాదించినాడు. చంద్రాలోకవ్యాఖ్యాన సందర్భములో వైద్య నాథపాయగుండుడు ఈ లక్షణలను కావ్యజ్ఞాపకములని కావ్యసామాన్యమొనర్చి నాడు.

సింగభూపాలుడు ''శరీరం వస్త్వలంకుర్యాత్ షట్త్రింశద్భూషణైఃII'' అని వీనిని భూషణములుగా గ్రహించినను నాటకవస్తుగత సౌందర్యములుగనే స్వీకరించినాడు.

విశ్వనాథుడు ''ఏషుకేషాంచిత్ గుణాలంకార భావసంధ్యంగ విశేషాం తర్భావేఽపినాటకే ప్రయత్నతః కార్యత్వాత్ విశేషోక్తిః'' అని 36 లక్షణంనేకాక నాట్యాలంకారములనుచు 33 లక్షణలను పేర్కొనినాడు. ఈ సంఖ్య అనుష్టుప్ ఉపజాతి ప్రతులు రెండిటి నుండి గ్రహించుటచే ఏర్పడినట్లు రాఘవన్‌గారు భావించినారు.[1]

దశరూపకకర్త ''షట్త్రింశద్భూషణాని సామాదిన్యేకవింశతిః।
లక్ష్య(క్ష్మ) సంధ్యంతరాభ్యాని సాలంకారేషుతేషుచ॥
హర్షోత్సాహేషు అంతర్భావాన్నకీర్తితా ఇతి పూర్వశ్లోకాదధ్యాహారః॥''

అని అనుచు భావములో, అలంకారములో అయిన వీనిని ప్రత్యేకముగా గ్రహింప లేదని చెప్పిసందిగ్ధతను కల్పించినాడు. అనగా అవసరమును పురస్కరించుకొని కావ్యనాటక సాధారణములుగా అలంకారభావములతో కలసియుండునవేకాని ప్రత్యేకములుకావనినాడు.

దండిసయితము ''యచ్చసంధరీంగ వృత్యంగ లక్షణాద్యాగమాంతిరే।
వ్యావర్ణిత మిదం చేష్టం అలంకారతయైవ నఃll'' దశ. 11. 336

అని అన్నిటిని అలంకార బ్రహ్మరూపముగనే దర్శించి లక్షణలకు ప్రత్యేకపు టునికిని ప్రసాదించలేదు.

రాఘవభట్టువీనిని నాటకాశ్రయ లక్షణములుగనే పరిగణించినాడు. భోజుడు తనశృంగార ప్రకాశములో ''లక్షణైశ్చతుష్షష్ట్యా యుక్త ం– కుర్వీత నాటకమ్'' అని వీనిని నాటక ధర్మములుగనే పేర్కొనినాడు.

ఈయన చెప్పిన లక్షణ సంఖ్యను పురస్కరించుకొని రాఘవన్ ''*Bhoja is given to elaboration and he takes up some of the Anustubh list of* 36, *Some of the upajati list of* 36, *adds a few*

---

1. ''*That most of them are the lakshnas themselves of the upajati list S.C.As P.* 30

which are his own and thus makes a good number of 64'' అని భావించెను[1] భోజుడు ఈ లక్షణలను సంధ్యంగములకన్న కొంతవేరని భావించెను అనికేవలము నాటక ధర్ములుగనే ''ఏతాని కావ్యన్య విభూషణాని ప్రాయచ్చతుష్షష్టిరుదాహృతాని। ప్రబంధ శోభాకరణాయ తజ్ఞైః సమ్యక్ ప్రయోజ్యానియధారసాని।। అనే శ్లోకద్వారమున సూచించినాడు.

శారదాతనయుడు ఈ లక్షణలను భూషణములుగా గ్రహించుచునే 'చతుష్షష్టిరలంకారాః కథితానాటకాశ్రయాః' అన్నివాసి వానిని కేవలము నాటక ధర్ములుగనే ప్రతిపాదించినాడు.

అభినవగుప్తుడు వీనిని సంధ్యంగకములవంటివికాక కావ్య సాధారణ శోభాకర ధర్ములని చూప ఎంత ప్రయత్నించినను తరువాతి అలంకారికుల ఆదరణలేక లక్షణ కావ్య సామాన్యముగా కావ్యమునంతటిని వ్యాపించియుండునను కావ్యపద్ధతి నశించినదనే చెప్పవచ్చును.

నాకుజూడ ఈ విభేదమంతయు లక్షణశబ్దమును గ్రహించుటలో లాక్షణికులు దృష్టి భేదమును పురస్కరించుకొని ఏర్పడినట్లు తోచుచున్నది. లక్ష్యమునకు 'లక్షణ' యుండుట తప్పనిసరి కావున ఆ దృష్టియందు గ్రహించిన విద్వాంసులు దానిని కావ్యముగను కవి ప్రతిభావ్యాపారముగను, కవి వాగ్విశేషముగను స్వీకరించినారు. అనగా కావ్యము కవి వ్యాపారమని ప్రాథమికదృష్టి ననుసరించి ఆ వ్యాపారమే లక్షణ అనినారు. అనగా వారి దృష్టి కావ్యలక్షణము, పద్ధతి, మొదలైనవి.

దీనిని కేవలము నాటక సంబంధిగా భావించినవారు వాచకాంగ సందర్భము ననుసరించి భరతుడు చెప్పిన 36 లక్షణల అర్థము నాలోచించి సంధ్యంగములని భావించినారు. ఆ తరువాత దీనిని ఆభూషణములుగా గ్రహించినవారు అలంకారములకే అలంకార విశేషములని పేర్కొనినారు దీనిపై ఆలోచనాపరులైన మహానుభావుల ఊహాప్రత్యూహలపై తర్కవితర్కముల తోడుకాగా విషయము మరింత గహనమైనది.

---

1. *S. C. A. S P. 26*

లక్షణ అత్యంత ప్రధానమైనది. ఇది గుణాద్యలంకారములు కావ్యమునకు కూర్పలేని శోభను కూర్చును. ఇవి అపృథక్‌సిద్ధ సౌందర్యములు. అంతేకాదు లక్షణయే కావ్యము అనిన మాటలో 'కావ్యము' అనినప్పుడు వాడు రాముడన ప్రాణశరీరములు రెండు కలిసియేయుండునని గ్రహించినప్పుడు లక్షణకావ్యశరీర-కావ్య ఆత్మధర్మములని గ్రహింపవచ్చును. అప్పుడాత్మ వివేచనచేయక రసప్రాధాన్యమునేగ్రహించుటచే ఈలక్షణ వెనుకచిక్కినది.కాని భరతుడు నిజముగా నాటక పరికరముగానే వేర్కొనినాడు కావున ఆ దృష్టితో ఇవి నాటకాలంకారములే కాని లక్షణలే కావ్యము అనే అభిప్రాయమే కావ్యాత్మధ్వని అని సిద్ధాంతీకరించుటకు ఆనందవర్ధనునికి దారిచూపినట్లు నాకు పొడకట్టుచున్నది.

వేమన పద్యాలు - బ్రౌన్ పరిశ్రమ

డా. ఎన్. గోపి

జాతి మాట సరేగానీ పుట్టిన స్థలాన్నిబట్టి చెప్పాలంటే బ్రౌన్ భారతీయుడు. ఆయన కలకత్తాలోని హుగ్లీ నదీ తీరంలో 1798 నవంబరు 7వ తేదీన జన్మించాడు. 14 ఏళ్ళు వచ్చేదాకా ఈ దేశం గాలి పీల్చాడు, నీళ్ళు తాగాడు, ఇక్కడి మట్టితత్వాన్ని బాగా వొంటబట్టించుకున్నాడు. 14వ ఏట తల్లీ, సోదరులతో పాటు ఇంగ్లాండు వెళ్ళాడు. అక్కడున్నది ఐదేళ్లే. 1817లో కుంపినీ ఉద్యోగిగా తన 19వ యేట మళ్ళీ మద్రాసులో అడుగుపెట్టాడు. మధ్యలో మూడేళ్ళు లండన్‌కి సెలవుమీద వెళ్ళటంతప్పిస్తే మొత్తం 48 సంవత్సరాలపాటు ఇండియాలోనే గడిపాడు. బ్రౌన్ బాల్యజీవితం, ఉజ్వలమైన యవ్వనం. వృద్ధాప్య ఆరంభం అన్నీ ఇక్కడే గడిచాయి. తన యాభైయేడో యేట పక్షవాత రోగంతో ఇండియాను శాశ్వతంగా వదిలివెళ్లాడు. బ్రౌన్ లండన్లో 1884 దాకా మరో 29 యేళ్ళు బతికాడు. కాని అది శేషజీవితం. శేషజీవితమే అయినా ఇక్కడి సారస్వత వ్యాసంగం కొనసాగింపు తుదిశ్వాసదాకా సాగుతూనే ఉంది.

ఈ లెక్కల ప్రకారం చూసినా బ్రౌన్‌ను మరోసారి ''భారతీయుడు'' అనాలనిపిస్తున్నది. భారతీయుడేకాదు, ''తెలుగువాడు'' అనికూడా అనాలనిపిస్తున్నది. తన జీవితంలోని అత్యధిక సమయాన్నీ, సంపాదననీ, మేధనూ, పరిశ్రమనూ సర్వం తెలుగు సారస్వత పునరుద్ధరణకే వెచ్చించిన త్యాగశీలిని 'తెలుగువాడు' అని అంటే అది మన గౌరవంకోసమేగానీ ఆయనకు ఒరిగేదేమీలేదు.

1824 ప్రారంభంలో బ్రౌన్ మొదటిసారి వేమన పేరు విన్నాడు. అప్పుడాయనకు 26 యేళ్ళు. అబేదుబాయ్ రాసిన 'హిందువుల ఆచారాలు, పండుగలు' అనే పుస్తకంలో వేమన ప్రసక్తి బ్రౌన్‌ను బాగా ఆకర్షించింది. అప్పటికి

బ్రౌన్ తెలుగు గ్రంథాలేవీ అధ్యయనం చెయ్యలేదు. అయితే తెలుగు వాడుక భాషలో బాగా మాట్లాడగలుగుతున్నాడు. కడపలో పోలీసు ఆఫీసులో సంభాషణ వల్ల నేర్చుకున్న భాష అది. వేమనను గురించి వినటం, వెంటనే వేమన పద్యాల తాటాకు పుస్తకాల సేకరణకు ఉద్యమించటం రెండూ దాదాపు ఏకకాలంలోనే జరిగాయి. 1824 ప్రారంభంలో అన్నమాట! అప్పుడు బ్రౌన్ మచిలీపట్నంలో ఉన్నాడు. 16 ప్రతులు సేకరించటం, సేకరించినవాటికి శుద్ధప్రతులు రాయించటం, పాఠనిర్ణయాలు చేస్తూ అర్థమైనకాడికి ఎంచిన పద్యాలను ఇంగ్లీషులోకి అనువదించటం ప్రారంభించాడు. ఆంగ్లానువాదాన్ని మార్చిలో మొదలుపెట్టి నవంబరు వరకు అంటే కేవలం 9 నెలల్లో చాలా పద్యాలకు అనువాదం ముగించాడు. తొందరపాటు అనిపించేంత యువకోత్సాహం, కార్యదీక్ష ఉండేవి బ్రౌన్‌కు. ఆ అసాధారణ చైతన్యమే తెలుగు సాహిత్య పునర్వికాసానికి అంకురార్పణ చేసింది.

ఆ అనువాద ప్రతికి ఆయన ఓ *Preface* రాసిపెట్టుకున్నాడు. దానివల్ల "పరిచయమైన కొత్తలోనే" వేమన గురించి బ్రౌన్ వెలిబుచ్చిన అభిప్రాయాలూ, అంచనాలు కొన్ని ఈవిధంగా ఉన్నాయి.

వేమన తెలుగుదేశంలోనేకాక చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా గొప్ప పేరు ప్రఖ్యాతులున్న కవి. సారళ్యం, విషయ బాహుళ్యం దృష్ట్యా వేమన పద్యాలు ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కొత్తగా తెలుగు నేర్చుకుంటున్న వారికి ఈ పద్యాలు విశేషంగా ఉపయోగిస్తాయి. అయితే చాలా పద్యాల్లో అన్నీ తెలిసిన మాటలే ఉండికూడా అర్థంకాక అయోమయంలో పడేస్తాయి. తత్త్వం దృష్ట్యా చూస్తే వేమన వ్యాసులవారికోవలోకి వస్తాడని అంటాడు బ్రౌన్. మకుటంలో వేమన తన్నుతాను సంబోధించుకున్న సంగతిని గుర్తిస్తూ జనులతో సంబంధంలోని ఏకాంత జీవితం గడపటంవల్లనే అట్లా అడ్రెస్ చేసుకున్నాడు అంటాడు. మొట్టమొదటిసారి వేమన పద్యాలకు విభాగాలు చేసింది బ్రౌనే. నీతి, అధిక్షేప, మార్మిక అంటూ విభజించాడు. *The satirical part is chiefly directed against the National religion and customs particularly against Bramins,* అని గుర్తించాడు. కాని వెంటనే సద్దుకొని *None of it is personal* అని దిద్దుకున్నాడు. ఆరోజుల్లో బ్రౌన్‌కు ఈ వ్యాసంగంలో

చేదోడు వాదోడుగా ఉన్న గురువులు తిప్పాబొట్ల వెంకటశివశాస్త్రి, అద్వైత బ్రహ్మయ్యగార్లు.

పై అభిప్రాయాల్లో బ్రౌన్ తొలకరిదశ కొంతా, పండితుల ప్రభావం కొంతా కనిపిస్తుంది. అనువాదాలకు లొంగవు కాబట్టి తాత్త్విక పద్యాలమీద అయోమయ పద్యాలంటూ (*obstruse*) చిరాకు పడ్డాడు కాలక్రమాన మార్మిక పద్యాలంటూ (*Mystic poems*) కొంత గౌరవపదం వాడాడు. వేమన మకుటం లోని సంబోధన గురించికూడా సంపదాయం తెలియకనే ఒంటరితనం అను కోటం కనిపిస్తుంది. ఇక వ్యాసులవారి కోవలోకి రావటం గురువు బ్రహ్మయ్యగారి బోధనే అయిఉంటుంది. బ్రహ్మయ్యగారు బ్రౌన్‌ను మొదటి నుంచీ 'తెలుగు రావాలంటే ముందు భారతం చదువమ'నేవాడట క్లాసిక్స్ చదివితేనే భాష వస్తుందనేవాడు. ముందుగా తన తమ్ముళ్ళ రచనలు చదవటం మంచిదని కూడా సూచించాడు.

"Brahmia begs me to read the Bhasa first. Sita Rama Sastri his younger brother at 18 is superior genius of poet, superior to his 2nd brother Ramalingam with whom however he advises to begin. (D1773 Notes).

వేమన పద్యాల గురించి కూడా బ్రౌన్‌కు ఓ సలహా చెప్పాడు బ్రహ్మయ్యగారు.

Connect nothing in Vemana, says he, but let his text be permanant-devote go deep rather to the classic authors (D 1773 Notes)

గురువులెంత చెప్పినా వినకుండా వేమన పద్యాలను చదువుతూ పోయాడు బ్రౌన్.

1829లో మొదటి ముద్రణ వేసేవరకు కూడా బ్రౌన్‌కు మార్మిక పద్యాల పట్ల విసుగు తగ్గలేదు. అందుకే అర్థం కాని పద్యాలను చాలావరకు ఈ సంపుటిలోంచి తీసేశాడు. ప్రజల్లో ఉన్న ప్రాచుర్యం వల్ల కొన్నింటిని ఉంచక తప్పలేదు.

ఐదేళ్ళ తర్వాత కూడా వేమన సిద్ధాంతాల పట్ల బ్రౌన్ అవగాహన అంతంత మాత్రంగానే ఉండేది. ఆరోజుల్లో వేమనను జంగయ్యగా ఊహించాడు. ఆందుకే ఒకచోట ఒక పద్యంలో 'చదివి' అనే మాటను 'భవిని' అని దిద్దాడు (*D* 1774) 'భవిని' అనేది జంగాలు జంగమ తరాలకు పెట్టిన పేరు.

(The name given by Zangamas to all persons and things that are not connected to Zangams).

ఇటిపేరు తీసేసి మతం పేరు పెట్టుకోవడం జంగాల్లో కనిపిస్తుంది. వేమన చేత తిట్లు పడని మతం జంగమ మతం ఒక్కటే అని బ్రౌన్ అభిప్రాయ పడ్డాడు. అయితే ఈ అభిప్రాయాన్ని మరో పదేళ్ళకు మార్చుకున్నాడు. బసవేశ్వరుని ప్రస్తుతి వేమన పద్యాల్లో కనపడకపోవడం దీనికి ఒక కారణంగా చెప్పాడు.

"The brief account I formerly gave of the poet may be corrected in a few points according to information since received. It appears that he was not Jangama, as is indeed shown by his silence regarding their great teacher Basava"

అన్నాడు కాని ఆయన మనస్సు పీకుతూనే వుంది వేమన అభిప్రాయాలు ఎక్కువగా శైవ పద్ధతిలోనే వున్నాయని గుర్తించాడు బ్రౌన్. కాని వేమన మతదర్శనం గురించి ఆలోచించినప్పుడు ఆయనకు గందరగోళమే ఎదురై వుంటుంది. అందుకే ఎటూపాలుపోక "*Vemana indeed belonged to no sect*" అని ఊరుకున్నాడు.

బ్రౌన్ వేమనను గ్రీకు కవి లూషియన్‌తో పోల్చాడు. ఇద్దరూకూడా కొత్తగా భాషనేర్చుకుంటున్నవారికి ఉపయోగపడతారని ఆయన ఉద్దేశం. అయితే తరువాత్తరువాత బృహత్ గ్రంథపరిష్కరణలో పడేటప్పటికి వేమన పద్యాలపట్ల బ్రౌన్‌కు తేలిక భావం ఏర్పడిందా ? అనిపిస్తుంది. వేమన పద్యాలు "*Neither poetical nor classical*" అని అంటాడు. ఇది ఇతర కవులతో పోల్చి అన్నమాట. కావ్యసరణిలో లేవు పెద్ద ప్రామాణికాలు కావు అనే ధ్వని

ఉంది. ఈ మాటల్లో ఎంత సేపూ బ్రౌన్‌కు ఉపయోగదృష్టే, *useful to beginner* ఆని *yet more profitable* అని అంటూవుంటాడు.

అయితే ఇక్కడో విషయం గమనించాలి. *Neither poetical nor classical* అనే మాటకు ఆయన ఉద్దేశించిన అర్థం గ్రాంధికభాష అనే. బ్రౌణ్య నిఘంటువులో ఆరోపంగా చేర్చేనాటికి "కావ్య సంబంధమైన" అనే అర్థం ఇచ్చాడు. తొలి ముద్రణంలో ఓపద్యానికి రాసిన నోట్సులో *Poetical* అంటే 'గ్రాంధిక' అని స్పష్టంగా చెప్పాడు.

"*For* పుట్టింది *a form of the verbalnown which belongs to the* గ్రామ్య *or Collaquial dialect we might substitute* పుట్టుక *as a poetical* (గ్రాంధిక) *form*" (1–122)

బ్రౌన్‌కు మొదటి నుంచి వాడుక భాషపట్లేమొగ్గు గురువులు కావ్యభాష చదువమని పోరితే చదివాడుగానీ ఆయన ప్రాణమంతా వాడుకభాషపైనే ఉండేది. ఈ అభిమానంవల్లనే బ్రౌన్ డిక్షనరీలో అర్థాలు ఎక్కువగా వ్యవహారిక భాష లోనే ఉంటాయి. మనం అనుకునే వ్యావహారిక భాషను ఆయన 'గ్రామ్యం' అని వ్యవహరిస్తాడు. వేమన పట్ల బ్రౌన్ అభిమానం ఎక్కువగా భాషాపరమయింది అని అంటే ఆయన అసమానమైన కృషిని తక్కువ చెయ్యటం మాత్రంకాదు. వేలాది అర్థాల నిరూపణకు, ఛాయాభేదాల ప్రదర్శనకు ఆయన వేమన పద్యాల "పంక్తులనే" ప్రయోగాలుగా స్వీకరించాడు.

గ్రామ్య భాషవైపు మొగ్గు ఉన్నప్పటికీ కావ్య భాషపైన గౌరవాన్నే ప్రకటించాడు బ్రౌన్. కావ్యభాషను "కృషిచేస్తే అబ్బే" భాషగా వర్ణించాడు. భాషగురించి సారస్వత ఉద్ధరణ గురించి బ్రౌన్ అభిప్రాయాలు తెలుసుకోటానికి ఓ అపురూపమైన *Jotting* లభిస్తున్నది.

"The Language of Telugu Classiks is indeed in a degree Uninteligible to the Common Telugu of present day. But is not the language even of Milton and Dryden obscure to uneducated Britons? Cultivation alone will revive literature, The commentatars (D. 310 I Vol I) on Shakespeare to elucidate many expressions that are not prevent obscure; Cultivation having restored them to the language. A similar revival of

Telugu litrature may be confidently looked for provided proper manner be adopted. English scholars have had the honour of reviving sanscrit learning. Let them have extend their aid to the language of Telingana"

(D. 1773 Vol. 4)

1824 నుంచీ బ్రౌన్ వేమన గురించి ఆరాలుతీస్తూనే ఉన్నాడు. వేమన జన్మస్థలాన్ని గూర్చి మిగతా చర్చలు ఎట్లా ఉన్నా కర్నూలు జిల్లాలోని కృష్ణపాడ్, కడపజిల్లాలోని చిట్వేల్ లు కూడా వేమన ఊళ్లు అనే ప్రవాదం ఉన్నదని రాశాడు. స్వయంగా వెళ్లి విచారించినా ఫలితం కనిపించలేదని రాశాడు. అయితే అనంతర పరిశోధకులకు ఈ ఊళ్లపైకి దృష్టి అంతగా పోలేదు. మ్యాక్ డొనాల్డు అనుకుంటాను వీటిని కొంత పట్టించుకున్నాడు. ఇప్పుడు మళ్ళీ వాటిని పరిశీలించటం అవసరం

1824 నుంచీ 1839 అంటే 15 యేళ్లలో వేమన కాలాన్ని గూర్చి కూడా బ్రౌన్ తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు. మొదటి నుంచీ వేమన పదిహేడవ శతాబ్ది ఉత్తరార్ధంవాడని నమ్ముతున్నాడు. దానికి 'నందన సంవత్సరం' పద్యాన్ని, ఇతర పద్యాల్లోని వివిధ పరిస్థితులను ఆధారంగా తీసుకున్నాడు. 1839 నాటికి వేమన కాలాన్ని నాలుగు శతాబ్దాలు వెనక్కితోశాడు. *"I Now learn it is the general belief that his writings are fully four Centuries old"* అన్నాడు. ఈ మార్పుకు ఉపపత్తులు చెప్పలేదు.

వేమన పట్ల బ్రౌన్ అవగాహనలో ప్రారంభంనుంచీ ఒక క్రమపరిణామం కనిపిస్తుంది. ఈ పరిణామానికి ఆయన మనస్తత్వం సహృదయతా కారణాలుగా కనిపిస్తాయి. తనుచెప్పింది శిలాక్షరం అన్న ఒంటెత్తుదృష్టి, అహంకారం బ్రౌన్‌కు ఏకోశానాలేవు. ఉన్న ధనాన్ని కరగదీసుకోవటమేకానీ దేన్నీ 'క్యాష్'చేసుకుందామనే ఆలోచన లేని నిస్వార్థపరత్వమే బ్రౌన్‌తో ఇంతపనీ చేయించింది.

విశ్వాసాల దృష్ట్యా బ్రౌన్ బ్రాహ్మణ పోటస్టెంటు. విగ్రహారాధననూ మూఢ విశ్వాసాలను ఇతర దురాచారాలను నమ్మేవాడుకాదు. స్థానికులను ఆర్థం చేసుకోవాలన్న తపనేకానీ తన వర్ణ అహంకారాన్ని ఎక్కడా

ప్రదర్శించిన దాఖలాలు కనిపించవు. నందన కరువు (1833) కాలంలో చీఫ్-సెక్రటరీకి పంపిన నివేదికలో *Scarcity* అనేమాట వాడకుండా *Famine* అని యధార్థ పరిస్థితిని రాసినందుకు చీవాట్లు తిన్నాడు. వంచనా శిల్పంతో కూడిన పాలనాభాషలో రాయక పోవటం బ్రౌన్ నిజాయితీకి నిదర్శనం. *To benefit the Hindus was always my primary objective* అని రాసుకున్నాడు.

1829 వరకు వేమన పద్యాలు 'శతకం' అనే అభిప్రాయమే ఉండేది బ్రౌన్‌కి. ఇవి పాతకాలం ఇంగ్లీషులోని *garlands, centuries* లాంటివి అని వర్ణించాడు. కానీ తర్వాత వేమన పద్యాలను శతకం అనటం తప్పు అని అభిప్రాయం మార్చుకున్నాడు. "*Vemana's Verses are less Correctly called on Satakam as they Vary in Metre and etc.*" (*D.* 1391 *Vol.*8· *page* 61 *Brown Dictionary Notes.*)

వేమన పైన వ్యాపంగం చేసినందుకు బ్రౌన్ బ్రాహ్మణుల నిరాదరణకు గురయ్యానని చెప్పుకున్నాడు. వేమన పద్యాల తొలి ముద్రణం వెలువడే నాటికి వేమన పద్యాల పట్ల బ్రాహ్మణుల ఆయిష్టం బాగాతెలిసివచ్చింది బ్రౌన్‌కు. కాలేజీ బోర్డు వారు దానిని అచ్చువేసి బ్రౌన్‌కు 50 కాపీలు ఇచ్చారు. మిగిలినవి చెత్త బుట్టల్లోకి అదృశ్యం ఆయినాయి. అట్లా అదృశ్యం కావటానికి కారణం స్పష్టంగా చెప్పాడు బ్రౌన్.

"In 1829 I had printed Vemana, as this author Saturized Brahmans they dislike or Scorn his volume and at their desire the college Board Shelved it and it was forgotton..... After ten years I discovered those rolled up as waste paper in the Library" (1866).

ఈ పరిస్థితుల్లో బ్రౌన్ కొంత నిరుత్సాహపడ్డా పట్టుదలమాత్రం సడలలేదు.

బ్రౌన్ స్థానికులతో ఎప్పుడూ కలిసేవాడు కాదనీ వారిళ్ళకు ఎన్నడూ విందులూ వినోదాలకు వెళ్ళలేదని రాసుకున్నాడు. తనతో పనిచేసేవారితో తప్ప అతనికి ఎవరితోనూ సంబంధాలు ఉండేవికావు. స్థానికులతో సత్సంబంధాలు సాధ్యం కాకపోడానికి వేమన పద్యాలు కారణం అని తెలుసుకున్నాడు.

"It was rarely Virited by natives and was considered a deliberate enemy to popular creed. My publishing Vemana's diatribes against Brahmans and my cherishing Jangam Literature, which they shun proved my antipathy to the Hindu idolatry (1866) అంటూ వాపోయాడు.

ఈ వివరాల ప్రదర్శనలో ఒక వర్గాన్ని వక్రంగా చిత్రించాలనే చాపల్యం ఈ వ్యాసకర్తకు లేదు. బ్రౌన్ వేమనకోసం పడిన తంటాలు, పాట్లను తెలియజెప్పడమే ప్రధానంగా ఇక్కడి దృష్టి. వేమన పద్యాల కారణంగా బ్రౌన్ ఒక రకమైన సాంఘిక వెలిని అనుభవించాడు.

1824లో బ్రౌన్ అనువాదానికి ఎక్కువగా వెంకటశివశాస్త్రి పైనే ఆధార పడినట్టున్నాడు. (*In the year* 1824 *I first read Vemana, my learned assistant Venkata Siva Sastri, interprteted it fully* (*Brown Dict. Notes P.* 312, *No. D*1391 *Vol.*3).

బ్రౌన్ వేమనమగూర్చి ఎంతశ్రద్ధవహించి శ్రమపడ్డా వేమన పద్యాలలో తన పండితులు చేసిన పరిశ్రమను దాచి పెట్టలేదు. వాళ్లు ఉద్యోగ ధర్మంగానే చేసి ఉండవచ్చు. వేమన పద్యాలపట్ల వారికి అంతగా ఆసక్తి లేకపోవచ్చు. అయినా కష్టపడింది వాళ్లేననీ అయితే తన పర్యవేక్షణలో (*Under the direction*) అని మాత్రమే రాసుకుని సౌజన్యాన్ని వ్యక్తపరిచాడు.

అయితే ఒక విదేశీ దొర ప్రారంభించిన ఈ వత్సంప్రదాయాన్ని తర్వాత మనవాళ్లు పాటించక పోవటం నిజంగా శోచనీయం వావిళ్ల మొదలైన ప్రచురణ కర్తలు బ్రౌన్ పేరు చెప్పకుండా పద్యాలు ముద్రించుకోవటం చూస్తే మన కన్నా ఆయనెంత ఉన్నతుడో అర్థమవుతుంది.

ఇండియా నుంచి వెళ్ళిపోయిన తర్వాత చాలా యేళ్ళ వరకు బ్రౌన్ వేమన గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. 1873లో తన సాహిత్య జీవితాన్ని సింహావలోకనం చేస్తూ వేమన మొదటి ముద్రణాన్ని ఒక బాల్యప్రయత్నంగా (*Juvenile effort*) వర్ణించుకున్నాడు అప్పటి తన వయస్సూ సంప్రదాయ పరిచయ పరిమితీ మొదలైనవి ఆయనకు గుర్తుపచ్చి ఉంటాయి. అయితే ఆ

పుస్తకం తెలుగు ఇంగ్లీషు నేర్చుకొనే జిజ్ఞాసువుల్లో చాలా ఆసక్తిని రేకెత్తించిందనీ, పేరు తెచ్చుకున్నదనీ రాశాడు. పద్యాల ఎంపిక విషయంలో కూడా పై రెండు ముద్రణల పట్ల ఆయనకు సంతృప్తి కలుగలేదు. 1828 నాటి తొలి సంపుటి గురించి "*that's merely a selection*" అని వినయంగా చెప్పుకున్నాడు. పద్యాల ఎంపికలో ఏవోకొన్ని అంతస్సూత్రాలు పాటించినా అవి ఆయన అనుకున్నంత శాస్త్రీయంగా పరిణమించలేదు. గూఢార్థ పద్యాల పరిహరణ అనన్వయ పద్యాల ఏరివేత బ్రౌన్ ఇష్టా ఇష్టాల ప్రకారమే సాగాయి. రెండో ముద్రణం పట్లకూడా బ్రౌన్‌కు స్వాతిశయం లేని కించిత్ అభిప్రాయమే ఏర్పడింది ఈ రెండో సంపుటి పదేళ్ళ తరువాత వెలువడవలసినట్టుగా లేదని పెరిగిన పద్యసంఖ్య తప్ప ఏ విశేషం కనపడదని ప్రకటించాడు.

"The Second edition printed in 1839 through ten years leter is only an extended selection with the text occasionally amended".

ఇంకా నిర్దుష్టమైన ప్రమాణాలతో ఓ సమగ్ర సంపుటి కొరకు బ్రౌన్ కృషిచేస్తూనే ఉన్నాడు. 1842 లో వీరభద్రయ్య అనే జంగమయ్యచేత (తన పర్యవేక్షణలో) ఒక రాత ప్రతిని తయారుచేయించాడు. (*D.* 1762) అయితే అదికూడా నచ్చినట్లులేదు. అందుకే "*It is to observe that a final edition is yet to be printed...*" అని రాసుకున్నాడు. వేమన పద్యాల గురించి బ్రౌన్ 18 ఏళ్ళు పరిశ్రమించాడు. ఈ కృషిలో రెండు ముద్రణలు వెలువరించాడు. అయితే అప్పటికీ ఇప్పటికీ కూడా పాశ్చాత్య పద్ధతిలో నిర్దుష్టంగా వెలువడిన ప్రతులివి. 1842లో బ్రౌన్ వేమన పద్యాల వ్యాసంగానికి స్వస్తి చెప్పినట్లు కన్పిస్తుంది.

వేమన పద్యాలను మొదటిసారిగా విభాగాలు చేసింది బ్రౌనే అని చెప్పుకున్నాం. పిటి వర్గీకరణలో యిబ్బందులు ఎదురొక్కన్నట్లు తెలుస్తుంది. బ్రౌన్ స్వహస్తాలతో రాసుకున్న చిత్తు నోట్సులో రకరకాల పిచ్చిపేర్లు, కొట్టివేతలు కనిపిస్తాయి. మార్మిక పద్యాలకు బ్రాహ్మనికల్ పోయమ్స్ అని పేరుపెట్టాడు. అధిక్షేప పద్యాలను యాంటీ బ్రాహ్మనికల్ పోయమ్స్‌గా గుర్తించాడు. కొన్నింటిని పెనసరం పద్యాలనీ (*crabbed*) పనికిరాని పద్యాలనీ (*worthless*)

విసుక్కున్నాడు. అయితే అవిబహుశా ప్రక్షిప్తాలు (*spurious*) కావచ్చుననే సమాధానపడ్డాడు కొన్ని మంచి పద్యాలేకానీ మర్యాదలేని మోటు పద్యాలు అని (*Good but indelical*) అభ్యంతరం వెలిబుచ్చాడు. కొన్నింటిని మేరమీరిన పద్యాలు పాక్షిక పద్యాలు (*losse – partial*) అని పిలిచాడు. అశ్లీల పద్యాలను దృష్టిలో పెట్టుకుని కావచ్చు. పోకిరి పద్యాలు (*black guardisms*) అని నిరసించాడు. అయితే ఈ మథనం లోంచి అనితర సాధ్యమైన విభాగాలను సాధించాడు. బ్రౌన్ నీతి, అధిక్షేప, మార్మిక, చిల్లర అని బ్రౌన్ చేసిన విభజన కన్న మెరుగైన ది ఇప్పటికీ రాలేదు.

వేమన పద్యాల మకుటాన్ని గురించి బ్రౌన్ కొంత ఆలోచన చేశాడు. తొలి ముద్రణలో విశ్వదాభి, విశ్వాభి, విశ్వతోభి అని మూడు పాఠాంతరాలు ఇచ్చాడు. చివరగా విశ్వదాభినిస్వీకరించి *Listen O Vema, dear to the Lord of All!* అని అర్థం చెప్పాడు. కానీ అంతకు ఐదేళ్ళ ముందు విశ్వతాభి పాఠం "తీసుకొని విశ్వత+అభిరామ అంటూ ఛేదంచేసి *Listen O vema Delight ful if the world*" అని అర్థం చెప్పుకున్నాడు. అయితే విశ్వత పాఠం ప్రసిద్ధికెక్కలేదు.

వేమ, వేమన అనే పేర్లు తెలుగు వాళ్ళలో కనిపించవనీ రాశాడు బ్రౌన్. కానీ అప్పటికి ఆయన అన్ని ప్రాంతాల్లో విచారించి చెప్పినమాట కాదిది. రాయలసీమ తదితర ప్రాంతాల్లో వేమారెడ్డి, వేమయ్య, వేమనారాయణ, వేమక్కలు ఉన్నారని మనం ఇవాళ చెప్తే ఆది భుజాలు ఎగరేయ దగ్గ కొత్త విషయము ఏమీకాదు. వేమన అనేది [illegible]దు అయ్యుంటుందని కూడా బ్రౌన్ ఊహించాడు. డాంటేకవికి డ్యూరాంటే, డ్యూరియన్ అనే బిరుదులున్నాయని ఇది అట్లాంటిదే కావచ్చుననీ అభిప్రాయపడ్డాడు. అయితే నిత్య సత్యాన్వేషి అయిన బ్రౌన్ కొన్నాళ్ళకు తెలుగు పేర్లలో వేమనలున్నారని గుర్తించి తొలి అభిప్రాయాన్ని దిద్దుకోవడం ఆయన సహృదయతకు నిదర్శనంగా వుంది.

బ్రౌన్‌కు పరిష్కరణ విషయంలో ఎంతో శ్రద్ధాసక్తులు జాగ్రత్త ఉన్నాయనటానికి ఓ ఉదంతాన్ని ఉదాహరణగా చూపవచ్చు. 1834 వరకు దాదాపు మూడువేల పద్యాలను కుప్పలుబోసి పెట్టుకున్నాడు. వీటితో కొత్త ముద్రణ కోసం రాతప్రతిని తయారుచేసే పనిని ఓ పండితునికి అప్పగించాడు. కానీ ఆ

ప్రబుద్ధుడు పద్యాలను ఇష్టంవచ్చినట్లు మార్చటం, కొన్ని పాదాలకు పాదాలే తీసివేసి సొంత పైత్యాలను ఇరికించటం బ్రౌన్ దృష్టికి వచ్చింది. అప్పటికి నాలుగోవంతు పని జరిగింది. అయిన పరే వెంటనే అతన్ని తొలగించాడు. బ్రౌన్ జాగ్రత్తపరుడు కాకపోతే పద్యాలపట్ల, సూత్రాలపట్ల పూనకం లాంటి శ్రద్ధలేకుండా ఉంటే ఆరోజుల్లోకూడా వేనవేల పద్యాలు మరింత ప్రక్షిప్త పంక్తులమై ఉండేవి. బ్రౌన్ పరిష్కరణలో పండితులకు స్పష్టమైన సూచనలు, ఆదే శాలు ఇచ్చేవాడనికూడా ఆయన రాతలవల్ల తెలుస్తుంది. పరిష్కరణకు బ్రౌను తీర్పు, న్యాయం అనే మాటలను వాడుకలోకి తెచ్చాడు. పరిష్కారానికి వీలు కాని పద్యాల పక్కన తీర్పుకాని కారణాలు రాయమనేవాడు కొలేషన్ మ్యాను స్క్రిప్టు (*D* 3103 *Vol* 1) చూస్తేగాని (రాళ్ళపల్లి మాటలో) ఆ తెల్లదొర "అప్పు" మనకు తెలియదు.

పరిష్కరించేటప్పుడు వెంకట శివశాస్త్రి రాసిన కొన్ని రిమార్కులు గమనించండి.

"ఈ పద్యము అర్థపరిష్కారము కాకపోయినందున తీర్చలేదు". "పద్యము ఎంత విచారించినా అనన్వయమని తోచినందున తీర్చలేదు". "తాత్పర్యము గూఢము". "ఈ సీసపద్య చరణములన్నీ మిశ్రమములయ్యో చక్కని వైనందున బాగా విచారించి తీర్చవలసినది కనక ఇప్పుడు తీర్చలేదు". "ఈ పద్యము ఏపద్యముగానైనను నడువలేదు. యతి గణ ప్రాసములు లేవు. చరణముల సంగతిన్ని తెలియలేదు. అనన్వయము కనుక తీర్చలేదు". "ఈపద్యము అర్థము పొసుకుపాటు లేనందున తీర్చలేదు". "ఈపద్యము అర్థము సందర్భించ లేదు గనక తీర్చలేదు." "ఇది న్యాయమని తోస్తున్నది".

పండితులు ఎన్ని తీర్పులు చేసినా చివరి తీర్పు మాత్రం బ్రౌనుదే. పండితులు స్వతంత్రించి తుదినిర్ణయాలకు సాహసించేవారు కాదనటానికికూడా కొలేషన్ మ్యానుస్క్రిప్టులోనే ఉదాహరణ లభిస్తుంది. ఇది వెంకటశివశాస్త్రి రాసిన కామెంటు.

"ఈ పద్యమున్నూ దీని పై పద్యమున్నూ బూతు శబ్దములతో కూడియున్నవి గనక ఆటువంటి శబ్దములకు బదులుగా మరుగు శబ్దములు కూర్చి చెప్పఁతె గనక అందుకు దొరగారి సెలవు కావలెనని ఇప్పుడు తీర్చలేదు".

మరుగుశబ్దములు చేర్చి మూల పాఠాలకు హానికలిగించే నిర్వాకం బ్రౌన్ పద్ధతికి విరుద్ధమైనది. పద్యార్థం మరీ విశృంఖలం అనిపిస్తే నంపుటి నుంచి పరిహరించటం చేస్తాడని ఆయన వెలువరించిన పుస్తకాలు చూస్తే తెలుస్తుంది. కొలేషన్ పుస్తకంలో *Impossible, difficult* లాంటి మాటలు కూడా కనిపిస్తాయి.

వేమన పద్యాల్లోని అనేకం సంస్కృత భాషలోని సూక్తులకు అనువాదాలని అభిప్రాయపడ్డాడు బ్రౌన్. ఇది తొలిరోజుల్లోని అభిప్రాయం. జాతిజీవనంలోనే ఇవి అనుస్యూతంగా ఉన్నాయనీ బ్రౌనుకు అప్పటికి తెలియదు. అందుకే *It is evident that many of the verses of Vemana are translations of Sanscrit aphorisims;which in Hitopadesa, the Bhagavatgeeta the Ramayana* (*D* 1773 *Vol* 1) అని అన్నాడు.

అయితే బ్రౌన్ వేమన పద్యాలను గూర్చి ఎన్నెన్ని దృక్కోణాల్లో ఆలోచించాడో ఎంతెంత విస్తృతమైన పరిశీలనలు చేశాడో దీనివల్ల గ్రహించవచ్చు.

బ్రౌన్ ఈపనంతా ఎందుకుచేసివుంటాడు ? బ్రిటిషువారి వలసాధిపత్యావసరాలమేరకు చేశాడా ? అందులో ఆయన స్వార్థం ఖాత మెంత ? ఇదీవల కొందరుచేస్తున్న ఇటువంటి మీమాంసలు శుష్కవిశ్లేషణలే అనిపిస్తాయి. మిగతా కుంఫినీ ఉన్నతాధికారుల్లో విలాసజీవులు '*Wise Government*' భక్తులే ఎక్కువగా ఉన్న కాలంలో బ్రౌన్‌దొర లాంటి సదాశయుడు, సారస్వతలోలుడు ఉండటం ఎంత గొప్ప సంగతి ! ఆయనవల్ల మన సారస్వతానికి జరిగిన మహోపకారం ఎటువంటిది అనే దృష్టి ఏర్పడాలి మనకు. తెలుగు సారస్వతం మూఢ సంప్రదాయాల్లోకి, అనార్ద్ర ఛాందసాల్లోకి కూరుకుపోయిన కాలంలో దానిని విశాల పథాల్లోకి మళ్ళించిన డెమోక్రాట్ బ్రౌన్. గ్రంథ పరిష్కరణను ఒక కళగా తీర్చిదిద్ది. అపూర్వమైన *Methodology*ని ప్రసాదించిపోయిన నిజమైన పండితుడు బ్రౌన్. గ్రంథం చివర *Glossorial Index*లో పదపట్టికలు చేర్చటం, కవి భాషను లేక మాండలికాన్నిబట్టి అతడు పుట్టిన ప్రాంతాన్ని ఊహించటం వంటివి బ్రౌన్ పెట్టిపోయిన ఒరవడులే.

బ్రౌన్ చేసిపోయిన ఉపకృతికి తెలుగుదేశంలోని ఒక ఊరుకే ఆయన పేరు పెట్టుకోవచ్చు. అయితే మనం ఒక లైబ్రరీని కూడా ఆయనపేర నెలకొల్ప లేకపోయాము. ఈవిషయంలో సాటి తమిళసోదరులతో పోల్చుకుంటే మనం ఎక్కడున్నామో తెలుస్తుంది. వారికున్న సాహిత్య చైతన్యంలో సగం మన కున్నా బ్రౌన్‌ను ఈపాటికి ఆకాశానికి ఎత్తిఉండేవాళ్ళం.

బ్రౌన్ ప్రారంభించిపోయిన పరిష్కరణ మహాయజ్ఞాన్ని కొనసాగిస్తే తప్ప ఆయనకు నిజమైన కృతజ్ఞత చెప్పలేము. ఎన్నటికీతీరని సాహిత్యవిపాస, చిత్తశుద్ధి, నిస్వార్థపరత్వం ఇవన్నీ బ్రౌన్ నుంచి మనం నేర్చుకోవలసిన మంచి అక్షరాలు.

పొడుపుకథలు - ప్రతీకవాదం

డా. కసిరెడ్డి వెంకటరెడ్డి

మృత్పిండం లాంటి ఈ మానవుడు అమృత తుల్యుడుగా మారడానికి పట్టిన కాలమెంతో, జరిగిన పరిణామాలెన్నో అనూహ్యం. మానవ నాగరికతా సంస్కృతుల ఆద్యంతాలు ఊహకందేవే గాని ఇతమిత్థమనీ యథార్థాన్ని నిరూపించడం అసాధ్యం అతి సుదీర్ఘమైన అటువంటి కాలఖండంలో మానవ చరిత్రకే అత్యంత ప్రాధాన్యముంది. ఆ మానవ చరిత్రలోనే భాష పుట్టి పెరిగింది, భావం వికసించింది. ఒక వస్తువును నిరూపణ చేయడానికి, ఒక విషయాన్ని వివరించడానికి ఒకేపద్ధతికాక అనేక పద్ధతులావిర్భవించాయి వస్తుపరిచయం విషయ పరిచయం కలిగించడమే ప్రకటనా ప్రాధాన్యమైనా, అనుసరించిన మార్గాలు మాత్రమనేకం. ఆ అనేక మార్గాలే అలంకారాలుగా, వక్రోక్తులుగా, రీతులుగా, ధ్వనులుగా పిలువబడ్డాయి.

సాదృశ్యాలు, సారూప్యాలు, ఉత్ప్రేక్షలు, అతిశయోక్తులు వేర్వేరని పించినా, అన్నింటిలోనూ వస్తువులకు – వస్తువులకు, జీవులకు–జీవులకు, వస్తువులకు–జీవులకు, జీవులకు –వస్తువులకు అంతస్సూత్రంగా ఉన్న ఒకానొక సంబంధం గోచరిస్తుంది అదే ప్రతీక. ప్రాచీన భారతీయ కావ్యాస్త్రాలంకార మర్మజ్ఞులు ఈ ప్రతీకల విషయం ప్రస్తావించలేదు. కాని వీటిని లక్షణార్థాల క్రిందనే గ్రహించారు. ప్రతీకలన్నీ యేదో ఒక అలంకారంలో అంతర్భవిస్తాయి. ఓ చోట ఉపమగా భాసిస్తే మరోచోట రూపకంగా భాసిస్తాయి.

పాశ్చాత్యులు ప్రతీకలకొక ప్రత్యేకవాదాన్ని (*Symbolism*) పరిపోషించారు. అంతేకాక ఫ్రెంచి రచయితల్లో "డికడెంట్స్" (*A group of writers*) తమను తాము ప్రతీకవాదులుగా ప్రకటించుకున్నారు. సంకేతాలు ప్రతీకలు

లేకుండా భావప్రకటన మసాధ్యమని వీరిలో కొందరు అభిప్రాయపడ్డారు. పాశ్చాత్య రచయితల్లో ఈ ఉద్యమాన్ని పెంచి పరిపోషించినవారిలో మెలార్మ్, బాడ్లేర్, వెర్లేన్, బౌలా మొదలైనవారు ముఖ్యులు. అమెరికాలో ఎమర్సన్ హెచ్‌డి థోరు, హెర్మన్ మెల్‌విల్, ఎడ్గిరలన్‌పో మొదలైనవారు ప్రతీకవాదోద్యమం పెరిగే అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. ఆంగ్లకవులలో ఆర్థర్ సైమన్స్, ఆస్కార్ వైల్డ్, ఎజ్రాపౌండ్, టి. ఎస్ ఇలియట్, డబ్ల్యుబి ఏడ్స్ తదితరులందరూ ప్రతీకవాద పరిపోషకులైన మహారచయితలే. ప్రతీకవాదాన్ని పరిపోషించిన పాశ్చాత్య రచయితల అభిప్రాయాలీ విధంగా ఉన్నాయి.

"కవితా వస్తువు వాచ్యం కాకూడదు, సూచ్యం కావాలి. సాధారణ జీవితమే ఒక ప్రతీక. ప్రతివిషయం ప్రతీక ద్వారా వ్యక్తం కావాలి. కవి అనుభూతుల అభివ్యక్తీకరణానికి ప్రతీక లుపయోగించుకోవడం తప్పనిసరి. క్షణక్షణం మారే అనుభూతుల్ని వ్యక్తం చేయాలంటే కొన్ని గుర్తులు కావాలి. అవే ప్రతీకలు. భావ చిత్రాల అనుక్రమణిక ద్వారా పఠితలు ఈ ప్రతీకల్ని గ్రహిస్తారు. ఏనాటిదో అయిన ఒకానొక విషయానికి సంబంధించిన స్మృతి స్పష్టాస్పష్టంగా ఉన్న సమయంలో సంపూర్ణావగాహన కలగడానికి ప్రతీకలే సహకరిస్తాయి."

ఇవి ఒక్కరి అభిప్రాయాలు కావు. అనేకుల ఆలోచనల్ని గుదికూరిస్తే తేలిన సారాంశం–పిండితార్థం.

"అసద్యశమూ వ్యక్తిగతమూ అయిన అనుభూతుల్ని అభివ్యక్తం చేయడానికై రూపకాల (ప్రతీకల) కలగొలుపుద్వారా చేసే ప్రయత్నమే సింబాలిజం అని ఎడ్మండ్ విల్సన్ నిర్వచనం." [1]

"పందొమ్మిదవ శతాబ్దపు చివరి భాగంలో సహజత్వానికి వ్యతిరేకంగా జనించి, అస్పష్ట సంకేతాలద్వారా, ఆధ్యాత్మిక మూల్యాన్ని వ్యక్తంచేయడానికై ప్రారంభమైన ప్రయత్నం నుండి ఉద్భవించిన కళాసంబంధమైన ఉద్యమమే సింబాలిజం" [2] అని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. ఇంతేగాక ప్రతీకవాదపరమావధిని ఈ విధంగా తెలియజేస్తున్నారు.

"సంగీతంలో అనుపయుక్తమైన పదార్థానికి స్థానంలేదు. ప్రక్రియ (రూపం) పదార్థం ఒకదానితో ఒకటి విడివడని స్థితిలో సమ్మిశ్రితాలై ఉంటాయి. కవిత్వంలో కూడా ఇటువంటిదే అయిన సంపూర్ణత్వం సిద్ధింపచేసుకోవడమే సింబాలిస్ట్ కవిత పరమావధి." [3]

ఈ విధంగా నిర్వచనాల్ని, లక్షణాల్ని నిర్దేశించి, పరమావధుల్ని ప్రకటించి ప్రతీకవాదాన్ని ఒక ఉద్యమంగా పాశ్చాత్య రచయితలు నడిపి-చినా, ప్రజల దైనందిన జీవన సమస్యలకు ఈ ఉద్యమం దూరంగా ఉండినందువల్ల దీనికి ప్రజాదరణ లభించనే లేదు.

ఇక భారతీయ సాహిత్యానికి సంస్కృతికీ పునాదిరాళ్ళయిన వేదాల్లో, ఉపనిషత్తుల్లో, పురాణాల్లో ప్రతీకలు కోకొల్లలుగా ఉన్నాయి. వేదోపనిషత్తుల్లోని అర్థాలు దురవగాహమైనప్పుడు ప్రతీకార్థాలు పక్కకు నెట్టబడ్డాయి, పురాణా లు అర్థ స్పష్టతకు కథల్ని ప్రవచించాయి. దానితో పరియైన అర్థం బోధపడే పరిస్థితిపోయి వేదార్థం మరీ దురవగాహమైంది. సాయణుల భాష్యమైనా వేదాన్ని సమగ్రంగా స్పృశించలేదు. ఇక పాశ్చాత్యుల వ్యాఖ్యానాలు భారతీయుల్ని అనేక భ్రమప్రమాదాలకు లోనుజేశాయి. వేదోపనిషత్తుల్లోని ప్రతీకల్ని ఆధునిక యుగంలో కొంతవరకైనా స్పష్టపరచిన మహాపురుషులు శ్రీఅరవిందుల – శ్రీదయానందులు.

ఋగ్వేదంలో చెప్పబడ్డ చెట్టుమీది రెండు పక్షుల్లో, క్రింది కొమ్మమీది పక్షి చేదుగా తీయగాఉన్న పండ్లనుతింటూ సుఖదుఃఖానుభూతుల్ని పొందడమనేది జీవునికి ప్రతీక, పై కొమ్మమీది పక్షి శాంత గంభీరంగా కూర్చొని సుఖదుఃఖాల కతీతంగా ఉండడం ఈశ్వరునికి ప్రతీక [4]

ఛాందోగ్యోపనిషత్తులో కేవల "సామ" శబ్దానికే పృథివ్యగ్నులనీ, అంతరిక్ష వాయువులనీ, ద్యులోకాదిత్యులనీ, నక్షత్ర చంద్రులనీ అనేకార్థాలు సంకేతింపబడ్డాయి. [5]

ఇక మన పండుగలైన నాగుల చవితికీ, నాగులపంచమికీ, వినాయక చవితికీ, మహాలయ అమావాస్యకు, విజయదశమికీ, సంక్రాంతికీ, మహాశివ

రాత్రికి, రథసప్తమికి, ముక్కోటి ఏకాదశికీ, హోళీకి, ఇంకా అనేక పర్వ దినాలకు పండితులు ప్రతీకార్థాలు ప్రవచిస్తూనే ఉన్నారు. అంతేకాక పురాణ గాథల్లోని ప్రతి పన్నివేశానికి ప్రతీకార్థాలున్నాయనీ, ప్రతీకలమీదనే పురాగాధా నిర్మాణం జరిగిందని అంటున్నారు

ఇలా భారతీయ సాహిత్యంలో అడుగడుగునా కనిపించే ప్రతీకలు పొడుపు కథల్లో అణువణువునా స్పృశిస్తున్నాయంటే అతిశయోక్తికాదు. ఇలాంటి ప్రతీకలు మానవుడు పుట్టినప్పటి నుండీ వున్నాయని, అక్షరాలన్నీ ప్రతీకలే యనీ, చైనీయుల బొమ్మల భాష సంపూర్ణంగా ప్రతీకాత్మకతను పుణికి పుచ్చుకున్నదనీ నిరూపించడానికి అనేక ఆధారాలున్నాయి. ఈవిధంగా ప్రతీకలు మానవ జగత్తును సర్వే సర్వత్రా స్పృశించి భావప్రకటనా సౌందర్యాన్ని పెంచాయి.

అట్లే పొడుపు కథాకారుడు తాను సందర్శించిన ప్రకృతి చిత్రాల్ని హృదయఫలకం మీద ముద్రించుకొన్నాడు తన మనోభావాలకు సామ్యమున్న వాటిని బహిర్గతం చేశాడు. ఇక్కడ భావన మరుగుపడింది. ఆ భావన కనుగుణమైన ప్రతీక మాత్రమే బహిర్గతమయింది. వీటిని శ్రోత వింటున్నాడు, పఠిత చదువుతున్నాడు. కాని ఆ పొడుపు కథాకారుని భావనను అందుకున్నప్పుడు మాత్రమే ప్రతీకయొక్క వ్యంగ్య మర్యాదను సమాదరించ గలుగుతున్నాడు

ఏ విధంగానూ ప్రతీక సూచింపబడుతుంది. అంతరార్థం సూచింపబడదు. ఆ అంతర్భావనను కనుగొనాలి పొడుపుకథల్లో నూటికి తొంబదిపాళ్లు ఇది కనుగొడమే. అయితే ప్రతీకల ప్రయోగంలో కనిపించే వైవిధ్యంవల్ల అవి అనేక కాలంకారాలుగా అవతారాలెత్తాయి.

శబ్దచిత్రాల్ని, అంతరార్థాల్ని దృష్టిలో ఉంచుకొని పొడుపుకథల్లోని అటువంటి అలంకారాలు పరిశీలించాల్సిన అవసరముంది అది చాలా పెద్ద విషయం. ఇక్కడ మాత్రం పొడుపు కథల్లో వస్తువులకు వస్తువుల్నీ, జీవులకు జీవుల్నీ, వస్తువులకు జీవుల్నీ, జీవులకు వస్తువుల్నీ, వాటి వాటికున్న సామ్యధర్మాల్నిబట్టి ప్రయోగింపబడ్డ ప్రతీకల్నీ స్థూలంగా పరిశీలిద్దాం.

వస్తువులు : వస్తువులు

సర్వ సాధారణంగా జీవం లేని వన్నీ వస్తువులని భావిస్తుంటాం. కాని పృథ్వ్యాప్తేజో వాయ్వాకాశాలు ఈ విషయానికి బాధకంగా కనిపిస్తాయి. జీవుడు పంచభూతాత్మక స్వరూపుడనడంలో సత్యం లేకపోలేదు. ప్రకృతి కూడా పంచ భూతాత్మకమయిందే. ప్రకృతి–జీవుల అవసరాల్ని దీర్చే కొన్ని పరికరాలే వస్తువులు. ప్రకృతిలో వస్తువు అంతర్భాగమే అయినందువల్ల ప్రధానంగా వస్తువు ఉపయోగపడేది మానవునికే అనాలి. పొడుపుకథల్లో అలాంటి వస్తువులకు వస్తు వులనే ప్రతీకలుగా వాడినవి లెక్కలేనన్ని ఉన్నాయి.

సిన్నయింట్ల
సిలుకు చెక్కలు (అగ్గిపుల్లలు)

మట్టి మిద్దెల పై కప్పులకు దూలాలు, వాట్లు, చిలుకుచెక్కలు ఉపయోగి స్తారు. గదిగోడలపై దూలాలుంటాయి. దూలాలతో జోడించి వాట్లు అమరుస్తారు. వాట్లపై చిలుకుచెక్కలు పేరుస్తారు. వాటిపై వేపాకుపరచి, బురదపూసి, చౌడు మట్టిని పోసి దిమ్మిస వేస్తారు. వర్షం పడ్డప్పుడు నీరు ఆమిద్దె మీద నిలవక క్రిందికి జారిపోతుంది. ఎంత చిన్న పొడుపుకథకైనా వెనుక ఎంతో కొంత సామాజిక జీవన మిలా ఉంటుంది. ఇక్కడ మిద్దెకావిధంగా ఉపయోగపడే చిలుకు చెక్కలు అగ్గిపుల్లలకు ప్రతీకలు. చిన్న ఇల్లు అగ్గిపెట్టెకు ప్రతీక. ఇక్కడ కేవలం ప్రతీకలే సూచింపబడ్డాయి. వీటినే పొడుపు లంటారు. అగ్గిపెట్టె, అగ్గి పుల్లలు ఆశించిన ఆర్థాలు. వాటినే విడపులంటారు.

పట్టు సంచిలో
బంగారం గుండ్లు (ఎట్టిమిరపకాయలు)

పచ్చిమిరప పండుమిరప అయినప్పుడు అది పట్టు (ఎట్టి) సంచి వలె కనిపిస్తుంది. అందుకే పండు మిరపకు పట్టుసంచి ప్రతీకఅయ్యింది. ఆ పండు మిరపలో మిరపగింజలుంటాయి. అవి బంగారం రంగులో ఉంటాయి. అందు వల్లనే మిరపగింజలకు బంగారం గుండ్లు ప్రతీకలయ్యాయి.

బంగారం సెంబులు
ఎండి క(గ)చ్చకాయలు (పొప్పడిపండు)

బొప్పాయి, పండుగా మారినప్పుడు స్వర్ణవర్ణ సంశోభితమవుతుంది. అందుకే బొప్పాయికి బంగారుచెంబు ప్రతీకగా చెప్పబడింది ఆ పండులోని ధాన్యం నలుపుతెలుపు బూడిద కలిసిపోయిన రీతిలో ఉంటుంది సరిగా అది గచ్చకాయల రంగే అనాలి. కాని ఇక్కడ ''ఎండి' (వెండి) శబ్దాన్ని ప్రయోగించడం వల్ల తెలుపుకే అధికంగా ప్రాధాన్యమిచ్చినట్లుంది పొప్పడి గింజలకు వెండి గచ్చకాయలు ప్రతీకలయ్యాయి.

ఒక్కటే గుంతలో
రెండు పీనుగలు (వేరుసెనగ)

సికటింట్ల – సింతపండు (జీవిలి)

నల్లని చెరువుల
ఎట్టని తామర (దీపం)

గట్టు గాలంగ
బట్ట లెండేర్సి (రొట్టెలు)

ఈ పై పొడుపుకథల్లో వేరుసెనగ పొట్టుకు గుంత, వేరుసెనగ గింజలకు పీనుగులు, చెవికి చీకటిల్లు, జీవిలికి (గుబిలికి) చింతపండు, చమురున్న దీపం బుడ్డికి నల్లని చెరువు, జ్యోతికి ఎట్టని తామర, పెనం వేడెక్కడానికి గట్టుకాలడం, రొట్టెలు చేయడానికి బట్టలు ఎండవేయడం ప్రతీకలుగా ప్రయోగింపబడ్డాయి.

ఈవిధంగా పశుపక్ష్యాది సర్వజీవ జంతురాశికి ఉపకరించే వస్తువులకు వస్తువులనే ప్రతీకలుగా ప్రయోగించిన ప్రహేళికలు తెలుగులో లెక్కకు మిక్కిలి ఉన్నాయి.

జీవులు : జీవులు

ప్రాణమున్న ప్రతిదీ జీవే, జీవమున్నదే జీవి. పిపీలికాది బ్రహ్మపర్యంత మున్న జీవరాశి యెంతో ఊహించి చెప్పినా, ఆ ఊహ ఆకుకందదు, పోకకు

పొందదు. అటువంటి జీవులకు జీవులే ప్రతీకలవుతాయి. జీవుల అంగాంగాలకు అంగాంగాలే లేదా జీవులే ప్రతీకలవుతాయి. సామ్యధర్మంలోని సంపూర్ణత్వాని కెదురు చూడకుండా తెలుగు పొడుపుకథ ఆంశిక మాత్రసామ్యానికే అలరిపోయి ప్రతీకల్ని పరిగ్రహించింది

ఎద్దు పండంగ
మోకు సాగంగ (గుమ్మడి)

వ్యవసాయదారుడు మోటకొడతాడు, మోటకు మోకుంటుంది. మోకుకాడికి ఎద్దుల్ని కడతాడు. ఎద్దు పండుకొంటే మోటు సాగదు– మోకు ఆడదు. మోకు ఆడడాన్నే సాగడం అంటారు. మోకు సాగితేనే మోట నడిచినట్లు లెక్క. ఎద్దు పండుకొన్న మోకు సాగిందని ఈ పొడుపుకథ చెబుతోంది. కేవల ప్రతీకలనే పరిశీలనలోకి తిసుకుంటే అది అసంగత మనిపిస్తుంది– అసంభావ్య మనిపిస్తుంది. అసంభావ్యమనిపించే సంభావ్యతే పొడుపుకథకున్న ఒకానొక లక్షణం.

గుమ్మడి తీగకు పూత పూస్తుంది, పిందె పడుతుంది, కాయ అవుతుంది. కాయ కదలదు, అక్కడే ఉంటుంది. అది అక్కడే పండవుతుంది. పూత-పిందె-కాయ–పండు అయిన క్రమ పరిణామ వికాస కాలంలో గుమ్మడికాయ ఉన్న చోట ఉండగా తీగమాత్రం కొనసాగుతూనే ఉంటుంది. మూలబలం, వాతావరణానుకూల్యం మీద తీగ అటివృద్ధి ఆధారపడి ఉంటుంది. గుమ్మడికాయకు పండుకొన్న ఎద్దు ప్రతీక అయ్యింది. గుమ్మడి తీగకు మోట మోకు ప్రతీక అయ్యింది.

సూస్తే సిన్నవాడు
సురుకు దెబ్బలవాడు
రాజిగాని తమ్ముడు భోజగాడు (తేది)

చిన్నవాడైనా చురుక్కుమనే దెబ్బలు కొట్టువాడిందులో ప్రతీక. ఇటువంటి ప్రతీకల్ని విశేషణ మూలాలనవచ్చు. విశేష్యమేదో తెలువదు. ఆ గుణ వర్ణనం మాత్రముంటుంది. తదాధారంగా విడుపును కనుగోవాలి. రాజగాడుపాము,

వాని తమ్ముడు భోరున ఏడ్పు పుట్టించే వాడై న తేలు. ఇంతకూ తేలుకు చిన్న వాడు, చురుకు దెబ్బలవాడు, రాజు తమ్ముడు భోజగాడు ప్రతీకలయ్యాయి.

వేయి గోవుల మంద
ఒకటిగా చేరింది
వేసిందొక పేద్ద
తియ్యాని ముద్ద (తేనెపట్టు)

తేనెటీగలకు వేయి గోవుల మంద ప్రతీక తేనెపట్టుకు తియ్యని పెద్ద ముద్ద ప్రతీక,

ఆలూరు భోగంది
అధిక సకక్కంది (కోడి)
ఇస్తారెనక్క – బెస్తోడువాయె (కుక్క)
వాగులున్న వన్నెకాడు (చేప)
జివం జివం బిండ కింద
జింక పోతులాట
తొంగి తొంగి సూసెనమ్మ
దొంగ రాములక్క. (తొడేలు)

ఈ పైపొడుపు కథల్లో కోడికి భోగంది, కుక్కకు బెస్తోడు, చేపకు వన్నెకాడు, తొడేలుకు దొంగ రాములక్క మొదలై నవి ప్రతీకలయ్యాయి. ఈ పొడుపు కథలన్నింటిలో ప్రాణులకు ప్రాణులనే ప్రతీకలుగా వాడడం గమనించ దగింది.

వస్తువులు : జీవులు

జీవుడు లేని వస్తువు కర్థంలేదు. వస్తువులేని జీవునికి సుఖం లేదు. జీవుడు, జీవుని సుఖసాధనాలై న వస్తువులు పరసరాధారాలు, పరస్పర పరిపోషకాలు. ఆ కారణాన్నే సాధర్మ్య సారూప్యాల్ని బట్టి వస్తువులకు జీవుడు, జీవునికి వస్తువులు ప్రతీకలుగా ప్రయోగింపబడ్డాయి.

బట్ట (క్క) కుక్కకు
బండెడు పేగులు (మంచం)

తెల్లపొడలున్న కుక్కను బట్టకుక్క అనీ, కోడెను బట్టకోడె అని అంటారు నవారుమంచానికి క్రింతలుంటాయి. అందువల్ల తెల్లతెల్లపొడల జంతువనడం సమంజసమే. నవారుకు పేగులు ప్రతీక, నవారున్న మంచానికి బట్ట కుక్క ప్రతీక. ఇక్కడ మంచం వస్తువు, కుక్క జీవుడు. వస్తువుకు జీవుడు ప్రతీక అయ్యాడు.

చీకటింట్లు కోరాదు
చీకు ముల్లు తొక్కరాదు
బారి పగ్గ మెయ్యరాదు
బిట్ట కోడెను పట్టరాదు (తేలు, పాము, పులి)

ఈ పొడుపు కథలోని ప్రతీకల్లో జీవులున్నాయి, వస్తువులున్నాయి. ప్రతీకలైన పొడుపుల్లో సమాధానాలైన విడుపుల్లో యాథార్థ్యమే కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. గాఢాంధకార బంధురమైన జగత్తుకు చీకటిల్లు ప్రతీక. తేలుకు చివికి పోయిన ముల్లు ప్రతీక. పాముకు పొడుగ్గావున్న వగ్గం ప్రతీక. పెద్దపులికి బట్ట కోడె ప్రతీక. ఒకే పొడుపు కథలో ఈ విధంగా జీవులకు వస్తువులకు, జీవులకు జీవులకు ప్రతీకలుంటాయనడానికి ఈ ప్రహేళికల్ని ఉదాహరించవచ్చు.

జింక ఉరుకంగ
పాలు కారంగ (విసుట్టాయి)

పల్లె పల్లెకు ఇప్పుడు పిండి గిర్నీలు వచ్చాయి. ఇవి రాక పూర్వం ప్రజలకు తిరగలే దిక్కుగా ఉండేది. ఆ తిరగల్ని తిప్పడం జింక ఉరకడంగా చెప్పబడింది. పిండి పడడాన్ని పాలు కారడంగా సంకేతించడం జరిగింది. ప్రహేళికలోని ప్రతీకలు రెండు, ఒకటి జీవుడు, మరొకటి వస్తువు. విడుపు వస్తువు.

తల్లి దయ్యం
పిల్ల పగడం (రేగుచెట్టు–రేగుపండు)

రేగుచెట్టు తల్లి, రేగుపండు పిల్ల. తల్లికి దయ్యంప్రతీక, పిల్లకు పగడం ప్రతీక. రేగు చెట్టును ముట్టుకొంటే ముండ్లు దయ్యంలాగా పట్టుకొంటాయి రేగు పండు పగడంవలె అందంగా ఉంటుంది. అందుకే వాటికవి ప్రతీకలుగా ప్రయోగింపబడ్డాయి.

మా ఇంటెనుక బట్టె
బట్టెకో బొట్టె (పిడుకలగూడు)

గుట్ట వెనుక – రొట్టెబిల్ల
(గుడెనుక–రొట్టెబిల్ల) (బిసిడ)

ఇంటి దగ్గరిదాక
ఇనుప సంకెళ్లు (చీమలబారు)

కండ్లోడు – సీతాఫలం

పుండ్లోడు – కాకరకాయ

చెవులోడు – జీడిపండు

నారా(నరా)లోడు–బీరకాయ

నామాలోడు – పొట్లకాయ

ఈ పై పొడుపు కథల్లో పిడుకలగూడుకు ఇంటి వెనుక బట్టె, బిసిడికి రొట్టెబిల్ల, చీమలబారుకు ఇనుప సంకెళ్లు, సీతాఫలానికి కండ్లోడు, కాకరకాయకు పుండ్లోడు, జీడి పండుకు చెవులోడు, బీరకాయకు నరాలోడు,పొట్లకాయకు నామాలోడు ప్రతీకలుగా చెప్పబడ్డాయి.

అనంతకోటి జీవరాశి, అసంఖ్యాక పదార్థరాశి, ఒక్కొక్క దానికి ఎన్నెన్ని సామ్యాలో! అవి అన్నీ అనుభవాల వల్ల మాత్రమే అవగతమవుతాయి.

తెలుగునాట జానపదులు వేసిన ఈ ప్రతీకల్ని ఇంకాలోతుకుదిగి పరిశీలించాల్సిన ఆవసరముంది. పొడుపుకథలు ప్రతీకవాదం అనే శిల్పిక క్రింద

వస్తువులు–జీవులు అనే ఈ వింగడింపు స్థూలంగా చేయబడింది. సంపూర్ణ సామ్యం అసంపూర్ణ సామ్యం, కేవల విశేషాల్యాలు, విశేషణ సంబంధులు, ఏమాత్రం సామ్యం లేనివి ఎన్నో లభిస్తాయి. జానపదులు ప్రయోగించే ప్రతీకలు అలవోకగా వేసినవే. ప్రయత్నపూర్వకంగా తెచ్చిపెట్టుకున్నట్టు ఏ ఒక్కటీ కనిపించదు.

వల్లబండ కింద – **నలుగురు**దొంగలు (బట్టె–చన్నులు)

నల్లబండ బట్టె, **నలుగురు**దొంగలు చన్నులు. **బట్టె**కు నల్లబండ ప్రతీక. దొంగలకు చన్నుల ప్రతీక.

ఎట్టెద్దును పట్టుకోనువోతె
వంకెద్దొచ్చి పొడిసె (రేగుపండు–రేగుముల్లు)

రేగుపండు **ఎట్టెద్దు**, రేగుముల్లు వంకెద్దు. రేగుపండుకు ఎట్టెద్దు ప్రతీక. **రేగు**ముల్లుకు వంకెద్దు ప్రతీక.

రాజు నల్లన – **తా**టిచెట్టు
పతాని పచ్చన – **తా**టి ఆకులు
కనుగుడ్డు తెల్లన – లుంజ (ముంజ)
కలి పుల్లన – కల్లు

తాటిచెట్టుకు రాజును, **తా**టి ఆకులకు మంత్రిని, ముంజకు కనుగుడ్డును, కల్లుకు కలిని ప్రతీకలుగా ప్రయోగించాడు జానపదుడు. ఇవన్నీ ఆయాచితంగా, అలవోకగా, ఆశువుగా పడ్డ ప్రతీకలే. నిత్యజీవితంలో తన చుట్టూరా కనిపిస్తున్న ప్రతిపదార్థాన్ని ప్రతీకగా ప్రయోగించే నేర్పు జానపదునిదె! అందుకే ఈ ప్రతీకలన్నీ సహజాతి సహజంగా ఉన్నాయి.

నిజానికి మానవుని మేధ ఎదిగిన కొద్ది,తనతో సర్వస్వాన్ని, సర్వస్వంతో తననూ ఉపమించుకోడం ప్రారంభించాడు. ఈ పోల్చుకోవడంలో ఆతడనాది నుండి నేటివరకు ప్రయోగించిన ఉపమానాలు, సాధర్మ్యాలు, సారూప్యాలు, సోత్ప్రేక్షలు, అతిశయోక్తులు అన్నీ ప్రతీకలే. కనుకనే వైవిధ్యపూర్ణమైన ఆలంకారిక ప్రపంచమంతా ప్రతీకల్లోనే అంతర్భవిస్తుందన్నా అతిశయోక్తేంకాదు.

అధస్సూచికలు :

1. Edmund wilson defines symbolism as "an attempt by carefully studied means - complicated association of ideas represented by a medley of metaphors - to communicate unique personal feelings" — The Axel's castle.

2. Symbolism has been defined as artistic movement flourishing at the end of the nineteenth century, in reaction to faith in nature, and endeauouring to represent spiritual values by means of abstract signs.

—Practical Criticism - p-114

3. In music, there is no dross, no inert residue. Form and content coalesce. It was 'to this purified wholeness that symbolist poetry aspired, Valery remarks in his essay on Baudelaire that poe.

—Literary Criticism : A short History P: 595.

4 ద్వాసుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే।
తయోరన్యః పిప్పలం స్వాద్వ
త్త్యనశ్నన్నన్యో అభి చాకశీతి॥

—ఋగ్వేదమ్ (1–164–20)

5. ఛాందోగ్యోపనిషత్తు (1–6–1, 1–6–2, 1–6–3, 1–6–4)

కృష్ణశాస్త్రి కవితామూర్తి

డా. ఎన్. నిర్మలాదేవి

భావకవిత్వోద్యాన వనంలో తీయగా గొంతెత్తిన వసంతకోకిల కృష్ణశాస్త్రి. తెలుగు సాహిత్యంలో ఆయనకు పూర్వమే భావకవితా బీజాలు అంకురించినా భావకవిత్వోద్యమానికి ప్రతినిధిగా పరిగణింపబడినవాడు ఆయనే! ఇతర భావకవుల రచనల్లోకన్న ఆయన రచనల్లో భావకవితా లక్షణాలు మరింత సుస్పష్టంగా భాసించడం, ఆయన భాషలోనూ,భావంలోనూ,కూర్పులోనూ, అడుగడుగునానిండి నిండికృతమైయున్న భావకవితాముద్ర, ఆయన రచనల్లోని ఉదాత్తత, భావకవిత్వోద్యమానికి గావించిన అనన్యసామాన్యమైన ప్రచారము – ఇవన్నీ 'భావకవిచక్రవర్తి'గా తెలుగులో భావకవిత్వానికి ప్రతినిధిగాను ఆయన్ని నిలబెట్టాయి. కనుకనే కవిసామ్రాట్టు శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారు "ఎవ్వరేమన్నా భావకవిత్వమనే దానికి రూపమిచ్చి పెంపొందించినవాడు కృష్ణశాస్త్రి..... అతనికాంతే ఈ సౌధమంతా వ్యాపించి ఉంది" అని ప్రస్తుతించారు. అయితే మిగిలిన భావకవుల్లాగా కాకుండా ఆయన కాలంతోపాటు ఎదుగుతూ వచ్చిన హృదయంతో కాలానుగుణంగా వచ్చిన పరిణామాలను గమనించి, ఆకళించుకొని ఆయా ఉద్యమాలకన్నింటికీ ప్రతిస్పందించి తదనుగుణమైన కావ్యాలాపాన్ని గావించినట్టి నిత్యప్రత్యగ్రశీలుడు. కనుకనే కి.శే. శశాంక వేరొక్కన్నట్టు ఆయన త్రిదశుడు– భావ, అభ్యుదయ, విప్లవ కవిత్వోద్యమాలన్నింటికీ మార్గదర్శకుడు. ఆయన ఏ రకమైన కవిత్వాన్ని వ్రాసినా, ఏ సాహిత్య ప్రక్రియను చేబట్టినా అనుభూతి ప్రగాఢత్వం,కైలీసౌకుమార్యం, భావ లాలిత్యము ప్పేటగా అల్లుకునిపోయున్న తనదైన ఒక విలక్షణమైన వాణి, బాణీలతో విరాజిల్లుతుంటుంది. కృష్ణశాస్త్రి కవితా ముద్రగా రూఢికెక్కినట్టివి. ఆయన కవితా పరిణామాలను గూర్చి దిఙ్మాత్రంగా వివరించడమే ఈ వ్యాసముఖ్యోద్దేశం.

భావకవిత్వం సంప్రదాయ కవిత్వపు రోకటిపోటుకు తిరుగుబాటుగా ఆవిర్భవించింది. సాహిత్యంలోను, సామాజిక జీవితంలోను ఉన్నట్టి నిగళాలను తెగద్రెంచుకొని స్వచ్ఛందంగా గానాన్ని సారించాలనే తపనే భావకవిత్వానికిరూపాన్నేర్పరచింది. కనుకనే భావకవిత యువహృదయాలకు నూతనోత్తేజాన్ని కలుగజేసించి అత్యంత ఆకర్షకమైంది. సంప్రదాయవాదుల తీవ్ర నిరసనావహేళనలకు పాత్రమైంది. కవితాసాంప్రదాయంలోని పడికట్టు రాళ్ళను లాక్షణిక బంధనాలను తృణీకరించినట్లే భావకవి సమాజంలోని అసమానతలను, మూఢాచార సాంప్రదాయాలను, కుల మత తత్త్వాలను బంధనాలను, అధికార శక్తుల నిరంకుశత్వాన్ని నిరసిస్తాడు స్వేచ్ఛగా ప్రకృతిలో విహరించే పక్షుల్నీ, పవనాల్నీ, మబ్బుల్ని, మబ్బుల్నీ – మధుపాల్నీ చూసి వాటిలాగా తానూ స్వేచ్ఛావిహారం గావించాలనీ ఆకాంక్షిస్తాడు. అవన్నీ అతనికి ఆదర్శప్రాయమవుతాయి. ఈ లక్షణం మనకు కృష్ణశాస్త్రిగారి స్వేచ్ఛా గానం–1 & 2. 'నేను' 'కవికుమార', 'శాపం' 'వశినని' 'అబ్బ' 'ఓయి' 'సంధ్యాసమీరణ' అనే కృష్ణపక్షకావ్య ఖండికల్లో సాక్షాత్కరిస్తుంది.

''తిమిరలత తారకాకుసుమములుదాల్చి
గర్కశ శిలయు నవజీవకళల దేలి
ప్రమోదుమోక చివురులెత్తి మురువుసూప
జగమునింద స్వేచ్ఛాగాన ఝరులనింతు''నంటూ తన స్వేచ్ఛాగానం నిరాశలో వెలుగుని, కర్కశత్వానికి కోమలత్వాన్నీ సంతరిస్తుందంటాడుకవి. మోడు వారిన బ్రతుకులను కొత్త ఆశలతో చిగురింపజేస్తుంది. ఈ స్వేచ్ఛాగానంతో ''క్రౌర్యకౌటిల్య కల్పిత కఠిన దాస్య శృంఖలములు'' తమంతకు తామే చెదిరిపోతాయి. కవి తన స్వేచ్ఛాప్రియత్వానికి సిగ్గుపడడంలేదు.సమాజానికి వెఱవదమూలేదు.

''నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు?
నాయిచ్ఛయేగాక నాకేటి వెఱపు?'' అంటాడు. తాను పక్షిగా, తారగా, మెఱపుగా, చినుకుగా, మేఘంగా, మధుపంగా, చందమామగా, పువ్వుగా, చిగురాకుగా, పాటగా, సెలయేరుగా, గాలిగా, అలగా మారిపోవాలనీ, మారిపోతాననీ తనలో పెల్లుబికే స్వేచ్ఛాకాంక్ష నభివ్యక్తం చేస్తాడు.

ACC NO. 11,991

ప్రకృతిలో వీటి కన్నింటికీ స్వేచ్ఛ ఉంది. చరాచరజగత్తులోని ప్రాణి కోటిలో ఉత్తమోత్తమైన జన్మనెత్తిన మానవుడికి స్వేచ్ఛ లేకపోవటమేమిటనే యోచన నాటి భారతీయులందరిసి వేధించేది "స్వాతంత్ర్యము నాజన్మహక్కు" అన్న బాలగంగాధరతిలక్ సింహగర్జనకు దేశం నలుమూలల నుండీ ప్రతిధ్వనులు మార్మోగసాగాయి. కృష్ణశాస్త్రికూడా నాటి అధికారులను "రాజవీధుల రతనాల రథమునెక్కి ఊరేగు మత్తులనీ, నిర్జీవ పాషాణ విగ్రహాలనీ, దివాంధాలనీ" నిరసిస్తాడు. వాళ్ళ చలువరాతి మేడలను, చెరసాలలుగాను, స్వర్ణాభరణాలను తళుకులీనెడు సంకెళ్ళుగాను, వాళ్ళను బానిసలుగాను పేర్కొంటూ తనపై అధికారుల, దుర్మదాంధుల పెత్తనమేమీ సాగదంటాడు.

"ఏను స్వేచ్ఛాకుమారుడ నేను గగన
పథవిహార విహంగమపతిని నేను
మోహన వినీల జలధరమూర్తి నేను
ప్రళయ ఝంఝూప్రభంజన స్వామి నేను" అంటూ తానూ వాళ్ళ ప్రాబల్యాన్ని ప్రభంజనంలాగ తుడిచిపెట్టేయగలనని హెచ్చరిస్తాడు.

తన హృదయ స్వేచ్ఛ నరికట్టడానికి లోకం చేసే యత్నం నిష్ఫలమని పరిహసిస్తాడిలా—

"వెర్రిలోకమా! హృదయంపు స్వేచ్ఛనెటులు
పంజరంబున బంధింతె?"

లోకం కవిసేచ్ఛను అరికట్టడానికి యత్నిస్తుంది. స్వేచ్ఛగా కోకిల్లాగా గానం చేస్తున్నాడు కవి.సమాజం దీన్ని సహించలేకపోయింది. "పికమ! పాడకు మంచు శపించినారు" అంటూ ఆవేదనని వ్యక్తం చేస్తాడు కవి. తన స్వేచ్ఛా విహారాన్ని సాగనీయకుండా లోకం రెక్కలని తెగ్గొట్టి పంజరంలో బంధింప పూనుకుందిట!

"పక్షినని పాడగలనని ప్రణయవీథి
నిత్యలీలా విహారముల్ నెరపుదునని
పక్షముల దూల్చి బంధించి పంజరాన
గానమును ప్రాణము సారింపబూనినారు"

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

కవి పక్షిలా స్వేచ్ఛా ప్రియుడు. ఆశల రెక్కలపై ప్రణయలోకాలలో విహరిస్తాడు. అతని ఆశలని నిర్మూలించి ప్రణయగానాన్ని హరించి కట్టుబాట్లనే పంజరంలో బంధించాలని లోకం యత్నిస్తుంది. సమాజపు ఈ క్రౌర్యానికి ఆవేదన పొందుతాడు కవి. 'హృదయ వనజాత సుకు మృదు మనోహర దళముల దయతను ద్రుంచినారె, పెంధూళి చిదిమి వెదజల్లినారె, అని తన హృదయ సౌకుమార్యం సమాజపు క్రౌర్యానికి బలికావడానికి వ్యధ చెందుతాడు స్వేచ్ఛారహితమైన ఈ లోకపుబ్రతుకు అతనికి అప్రియంగాతోచి సంధ్యాసమీరుణ్ణి తనను కూడా సేచ్ఛాలోకాలకు తీసుకుపొమ్మని కోరుతాడు–

"ఎత్తికొనిపోవరాదె నన్నెచటికేని
నిత్య తేజోమయానంద నిలయమునకు
నిముసమేనియు నిట నుండనేరనోయి" అంటూ తీవ్ర స్వేచ్ఛా ప్రయత్నాన్నభివ్యక్తం చేస్తాడు. ఇదే తన భావాలను సూటిగాను తీవ్రంగాను వెల్లడించేటట్లు చేస్తుంది కవిని. ఆయన వాంఛించిన స్వేచ్ఛ కేవలం రాజకీయపరమైనది కాదు.అది హృదయసంబంధమైనది భావసంబంధమైనది. ఈ స్వేచ్ఛవల్లే ఆయన భావాలు సంప్రదాయావధులను దాటి ప్రకృతి సౌందర్యపు లోతులనీ, మానవత్వపు టంచులనీ అందుకోగలిగాయి.

ప్రకృతి ప్రీతి

ఇటువంటి స్వేచ్ఛావాదియైన భావకవికి ప్రకృతి అంతా స్వేచ్ఛామయంగా కనబడింది. విశ్వరహస్యపుటగాధాలను దర్శించాలనే కాంక్ష ; తాను ప్రకృతి ప్రత్యణువులోను విలీనమై ఆ ఆనందాన్ని, స్వేచ్ఛని అనుభవించాలనే వాంఛిస్తాడు. కృష్ణశాస్త్రి ప్రకృతి ప్రీతిలో ప్రకృతి సౌందర్యాన్ని ప్రేమించడం, తానూ అందులో విలీనం కావాలనుకోవడం, ప్రకృతికి మానవత్వాన్నాపాదించి తనతో సహానుభూతిని భాంనిచడం గోచరిస్తుంది. ఈ ప్రకృతి ప్రీతిలోనుంచే కృష్ణపక్షకావ్యంలోని తొలిగీత మావిర్భవించింది.

నల్లమల అడవుల్లో కవి ప్రయాణిస్తుండగా కృష్ణశాస్త్రిగారికి ఆ వన సౌందర్యమత్యంత అద్భుతంగా కనిపిస్తుంది. దానితో కవి హృదయం రాగరంజితమై వెంటనే–

''ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా !
ఎట్లైన
నిచటనే యాగిపోనా'' అంటూ ప్రకృతిలోని ప్రత్యణువులోను తాను విలీనం కావాలనే వాంఛను ప్రకటిస్తుంది.

''పగడాల చిగురాకు తెరచాటు తేటినై
పరువంపు విరిచేడె చిన్నారి సిగ్గునై'' అనడంలో ప్రకృతి అయన కళ్ళకి ఎంత రమ్యంగా కనబడిందో వెల్లడవుతోంది. మామూలు కళ్ళకి జడపదార్థమైన 'విరి' (పువ్వు) భావకవి కళ్ళకి ''పరువంపు విరిచేడె'' (వయసులోనున్న సుమకాంత) దానికి 'చిన్నారి సిగ్గు' ఉంది. అలాగే మానవసహజమైన అనుభూతులను ప్రకృతికి కల్పిస్తూ ''అలరు పడంతికి చక్కలిగింతలను, విరిచేడెకి పులకింత అను 'నీన'కు మంతనాలాడ్డాన్ని సుమకాంతకు ప్రీడని కల్పిస్తాడు కవి. ప్రకృతి ''నవవికస్వర దివ్యసౌందర్యమూర్తి, విశ్వసుందరి, పరమ పవిత్రమూర్తి''గా ఆయనకు సాక్షాత్కరించి పులకరింపజేస్తుంది. పూల యొక్క రంగు రంగుల రేకులు సొగసులీనే చీరలుగా వెన్నెలపూల నవ్వులుగా, మంచు బిందువులు విరి కన్నె దాల్చిన ముత్యాలసరాలుగా దీపిస్తాయి. ఉభయసంధ్యల్లోనూ సూర్యుడు పొడుపు మలపై బంగరు ముగ్గులుంచి సంజ మబ్బుల కుంగరాల్ సంతరించి పోతూన్నట్లుగా గోచరిస్తుందాభావుక హృదయానికి. ప్రకృతి సౌందర్యం దివ్య భాగ్యంగానూ, దానిముందు హేమ మణి రత్న గణాలన్నీ విలువ లేనివిగానూ తోస్తుంది ఆయనకు.

''హేమ మణి రత్న గణ మేల లేమ మనకు
సాంధ్యసమయ సువర్ణిత చ్ఛాయలరసి
తారకాశోభితాంబరతలము గాంచి
చింతలను బాయుదము చేయి చేయి కలిపి''

అంటూ తన వ్యధలను పోగొట్టేది ప్రకృతి సౌందర్య వీక్షణమని తెలుపుతాడు కవి.

''సౌరభములేల చిమ్ము బుష్పవజంబు
చంద్రికలనేల వెదజల్లు చంద్రమామ
ఏల సలిలంబు పాఱు, గాడ్పేల విసరు'' అంటూ ప్రకృతిలోని స్వార్థ రాహిత్యతను, పరోపకార దృక్పథాన్ని గ్రహించి ముగ్ధుడయి తన ప్రణయ భావనకి ఆదర్శంగా తీసుకుంటాడు. వాటిలాగే నిర్వ్యాజమైన ప్రేమ తనదే నంటాడు. తన కష్టసుఖాలని ప్రకృతికి విన్నవించుకుంటాడు. దాన్ని ఆత్మీయంగా భావిస్తాడు. కనుకనే ప్రకృతి సౌందర్యాన్ని బాహ్యదృష్టితో కాకుండా సూక్ష్మావలోకనంతో సందర్శించగలిగాడు అంతసౌందర్యాన్ని. దానితో హృదయానికి దగ్గరైంది ప్రకృతి. ఇంతగా ప్రగాఢముద్రవేసిన ప్రకృతి సౌందర్యదిదృక్షలో కవి ఆకలీ దాహమూ చింతలూ-వంతలూ అన్నీ మరచిపోయి తాదాత్మ్యాన్ని భజిస్తాడు. అది కలిగించిన స్పందన నభివర్ణించడానికే ప్రాధాన్యమిచ్చాడు. ఈయత్నంలోనే ప్రకృతిలో కవికి ఊహాసౌందర్యమూర్తి సాక్షాత్కరిస్తుంది. ప్రకృతికి మానవత్వాన్ని కల్పించడంలోనూ ఈ గుండె లోతులను స్పృశించిన అనుభూతి స్పందనమే హేతువైంది.

కృష్ణశాస్త్రి కవిత్వానికి జీవం ఆయనలోని సౌందర్యతృష్ణే ! భావుకుడైన కవి ప్రకృతిలోని ప్రతివస్తువులోను దివ్యసౌందర్యదీప్తిని దర్శిస్తాడు. కాని సాంఘిక బంధనాలు సమాజంలోని కౌటిల్యం ఈ సౌందర్య భావన అతిశయించే కొద్దీ తీవ్రమైన వేదనని కలిగిస్తాయి. ఆ ఆవేదనే భావకవిత్వంలోని వేదనా ప్రీతిగా రూపొంది హేతువౌతుంది. భావకవితకు (*Romantic Melancholy*) ఈ ఆవేదన రగిలేకొద్దీ కవి భావం మరింత సున్నితమవుతుంది. అప్పుడు కవి తన హృదయంలో రగులుతున్న ఈ జ్వాలకు విశ్రామస్థానాన్ని అన్వేషిస్తాడు. తన హృదయాన్ని ఆకర్షించిన సౌందర్యాంశాల నన్నిటినీ ప్రోగుచేసి విశ్వసౌందర్యమూర్తిగా తన ఊహాప్రేయసిని సృష్టించుకుంటాడు. ఈ ఊహాప్రేయసి సాక్షాత్కారంకోసం కవి సాగించే నిరంతరాన్వేషణ కవిత్వంగా దీపిస్తుంది. దీనినే కృష్ణశాస్త్రిగారిలా తెలియజేస్తారు.

''ఒక ఆంధ్రకవి కృష్ణపక్షంలో ప్రవాసియై తిరిగితిరిగి, కంటపడిన ప్రతిలావణ్యాన్ని కదిపి కదిపే, ప్రక్కప్రోగిన ప్రతి హృదయాన్ని పలకరించి పలకరించి, లోకంలో తనకు నచ్చిన సౌందర్యంలేదనీ, తన్నుప్రేమించి తాను

ప్రేమించే ప్రేయసి లేదనీ క్రుంగిపోయి క్రుంగిపోయి ముచ్చిచ్చులో వేగి వేగీ "నాకుగాదులులేవు ఉషస్సులులేవు" అన్న నరకంలోకి వచ్చాక తపస్సు పూర్తయ్యాక శాంతచిత్తుడై, కానే ప్రేయసిని సృష్టించుకుంటాడు. ఎలాగ? తన మనస్సును ఎన్నడో ఎన్నడో సోకిన ప్రతి సౌందర్య ఖండాన్ని, తన హృదయాన్ని ఎన్నడో పలకరించిన ప్రతి ప్రేమ శకలాన్ని, ఎక్కడెక్కడికో పరిగెత్తుకెళ్ళి, ఏరిఏరితెచ్చుకుని, అన్నిటినీ కలిపికలిపీ ఆమెను నిర్మించుకున్నాడుట. అంటే ఏమిటి? కవిది ఆరని చిచ్చు తీరని తృష్ణ – కృష్ణపక్షము, ప్రవాసమునర్వాత ఊర్వశీ కార్తికిని."

కృష్ణశాస్త్రి బాధ లౌకికమైనదికాదు. తన హృదయాన్ని విశ్వహృదయంలో లీనంచేయడానికి ఆయనపడే ఆరాటం నిరంతరం ఆయన హృదయంలో రగిలేజ్వాల. ఈ జ్వాల సాధారణంగా ప్రతి మానవుడి హృదయంలోను అట్టడుగు పొరల్లో దాగుంటుంది, సంస్కారవశాన ఒక్కొక్కళ్ళల్లో ఉద్దీప్తమై సుస్పష్టంగా ప్రకాశిస్తుంది. ఈ జ్వాలా స్వరూపాన్ని పట్టుకోగలిగినవాడు మహర్షి అవుతాడు. అతని వాక్కులు ఋక్కులవుతాయి ఈ వెలుగు స్పష్టాస్పష్టంగా భాసించినపుడు అది మరింత స్పష్టం కావడం కోసమై జీవుడు పడే తపన అతని సౌందర్యాన్వేషణ. దీనిలోనుండి ఆవిర్భవించినదే కృష్ణశాస్త్రి కవిత్వం. ఈ సౌందర్యతృష్ణ ప్రకృతి సౌందర్యంలో లీనం కావాలనుకోవడంతో ప్రారంభమై ఊహా ప్రేయసి సృష్టితో తీవ్ర దశను చేరుకొని భగవద్భావనగా పరిణమిస్తుంది. విశ్వసౌందర్యాన్వేషణ తత్సౌందర్య స్రష్టనుగూర్చిన అన్వేషణగా పరిణమించి అత్యుజ్జ్వలంగా భాసిస్తుంది. ఈ అన్వేషణలో స్పష్టంగా కనిపించేవి మూడు దశలు–ఇవి క్రమంగా ప్రకృతి, స్త్రీ, భగవంతుడు .... వీటిని ఆశ్రయించుకుని ఉంటాయి.

నల్లమల అడవులలోని సౌందర్యం కృష్ణశాస్త్రిలోని సౌందర్యతృష్ణను తట్టిలేపింది అక్కడి చరాచర ప్రకృతిలోని సౌందర్యాన్ని గురించి వారి హృదయం కావ్యగానాన్ని వినిపించింది. గలగలమని వీచు చిలుగాలిలో కెరటమూ, జతజలమని పారు సెలయేటిలో తేటగానూ అయి లీనమవ్వాలని కాంక్షిస్తాడు. ప్రకృతి సౌందర్యంలో కవి స్త్రీమూర్తిని భావించుకుంటాడు. ప్రతిపూవు అరవిరసినపూల మధ్య కనిపించినప్పుడు రంగు రంగుల సొగసు చీరెలను కట్టి చెలికత్తెల నడుమ చిరునవ్వు వెన్నెలలనుచిందించే స్త్రీమూర్తిని జ్ఞప్తికి తెస్తుంది. ఇలా ప్రకృతిలో

స్త్రీత్వాన్ని దర్శించగల కని హృదయంలో ప్రేమభావన ఉత్పన్నమవుతుంది అది నిర్వ్యాజమైనది. స్వచ్ఛందప్రణయభావనలో లౌకిక భోగభాగ్యాలు అత్యల్పంగాతోస్తాయి. నల్లమేఘాలలోదాగిన తన ప్రేయసిని వేయికన్నులతో వెతుక్కుంటాడు. ఆ కారు మొయిళ్ళలోని మెరుపుల్లోనేకాక ప్రకృతి అంతటా ప్రేయసి జాడలే కనిపిస్తాయి.

ఏడజనిన మనోహరి జాడలరిసి
కలగు హృదయంబు, నెమ్మది చలనమొందు
కనులుమూసిన, లోకమోహన మనోజ్ఞ
మూర్తి చిరునవ్వు చిలుకును ప్రేమల పిలుచు'' నంటాడు. కళ్ళుమూసుకొన్నప్పుడు కూడ ఆమె సౌందర్యమూర్తి అతని ప్రేమలనిలుస్తుంది. ఆమె ఆయన హృదయంలోని సౌందర్యదీప్తికి స్వరూపం కాఁట్టి కనులు మూసుకున్నప్పుడే మరింత స్పష్టంగా కనిపిస్తుంది. కనిపిస్తుందేకాని అందదు. ప్రియురాలు కవి హృదయంలో గూడుకట్టుకున్న సౌందర్యమే. ఈ సౌందర్యం ఆయన హృదయంలో నిరంతరం సంచలనాన్ని కలిగించి ఏ దూరపు తీరాల్లోకో పిలుస్తూంది. ''అవలీదరి నీ పిలుపు పవలురేఁయను మోహ్యము ఇదె వచ్చుచున్నాను ప్రియురాలా! ఇక నిలువలేను నా ప్రియురాలా'' అంటూ ప్రయాణమౌతాడు. ఈ యాత్రా పథంలో కడియాలరవళులు చిరుగాలి మ్రోతలు తనకు దారి చూపిస్తున్నాయి. అది అంతమే లేని పథంలాగుంది. అందులో తన పదచిహ్నాల్లాగే తన ఆర్ద్రహృదయంలోకూడ అడుగుజాడలు కనిపిస్తున్నాయి. దానికో ఆశ, అవి కనరానప్పుడు నిరాశేకలుగుతూన్నప్పటికీ శూన్యంలోకి ప్రయాణం సాగిస్తూనే ఉన్నాడు. అనంతమైన విషాదాన్ని గుండెల్లో నింపుకున్నకవిని ప్రకృతి తపింపచేస్తుంది. గగన సీమంతినిలో తన ఊహా ప్రేయసిసాక్షాత్కరించింది. ఆమె జడలోని నక్షత్రాల పూలు కాంతి గీతాన్నాలపిస్తున్నాయి, పిలుస్తున్నాయి. తానువాటిని భరించలేకుండా ఉన్నాడు. ఆ విరహ వీక్షణాలు మధురంగాను, ఆ మాధుర్యం తనకు భయంకరంగానూ ఉంది.

తన హృదయంలో ఒక విరహవింపంచి మ్రోయసాగిన నాటి నుంచి పవలు–రేయి తిరుగాడుచు మునిగియటోని ఏయర్థమెరుగని వేసటేలేని వెట్టి అన్వేషణాన్ని సాగిస్తూనే ఉన్నాడు. ప్రేయసి కన్నుల్లో అనంతాంబరపు నీలినీడలు

కనిపిస్తున్నాయి ఏదో అపూర్వమధుర రక్తి స్ఫురిస్తోంది కాని అర్థంకావడంలేదు. ఆమె తన ''యెదలోపలి యెదలో నెమ్మదిలో జీవిత రహస్య మార్గమ్ములలో వదలని కోరిక!'' అంటూ తనలో నిరంతరం రగిలే సౌందర్య తృష్ణకు స్వరూపమని స్పష్టంచేస్తాడుకవి ఒక నిశావసానంలో అతని అడుగుల మ్రోల ఒక తారగా, ఒక దివ్య మందార సుమంగా,ఒక మోహనీహార ప్రపుల్ల రుచిగా ఆమె వ్రాలింది. ఈ ప్రణయాన్ని అతని సుకుమార హృదయం భరించలేక పోతోంది.

''త్రిజగతీపతి కోటీర దివ్యరత్న
రాజినేలు వజ్రాలతురాయి వీవు
ఏను పాతాళలోకంపు టిరుకు సందు
లందు దీగబ్రాక వెరచు గాఢాంధరేఖను'' అంటూ తమిద్దరి మధ్యనున్న అంతరాన్ని తెలియజేస్తాడు. ఆమె అత్యున్నతలోకాలకు చెందినది. తాను అధోలోకాలకి చెందినవాడు. తామిద్దరిమధ్యా అంతరం ఎంతో ఉంది. అతని కోసం ఆమె ఉన్నతలోకాలలోంచి పతనమైనా కావాలి లేదా తాను ఉన్నత పథాలలోకి ఎదగనైనా ఎదగాలి. ''పతిత వెట్లౌదు నేనెట్లు పక్షినౌదు'' నంటూ ఆక్రోశిస్తాడు. ఆమె అతనికి అపూర్వకరుణార్ద్రనిరవమూర్తిగా ద్యోతకమవుతుంది. తనకు ప్రాణమైన వేదనామూల్యమే ఆమెగా సాక్షాత్కరిస్తుంది.

తన పరమరమణీయమైన భావసౌందర్యాన్నంతా ఊర్వశిలో దర్శిస్తాడు కవి–''తొలి పొద్దు నునుమంచు తీవెసోనగాను, వర్షాశరత్తుల నిబిడ సంగమమున బొడమిన సంధ్యాకుమారిగాను, తిమిరనిశ్వాసముల మాసి కుములు శర్వరీ కపోల పాళికగాను, నిట్టూర్పుగాను, కన్నీరుగాను, విశ్వ వేదనామూల్య భాగ్యంగాను, తాను గళమ్మార పాడుకొనిన అఖాత శోకగీతమ్ము లందొక శోకగీతిగాను'' పేర్కొంటాడు. అతని చిరంతన వేదన స్వరూపం. అతని విరహగీతాలలోని భావం ఆమె. ఆమె ప్రణయభావనలో ఈ విషాదంలోనుంచి అపూర్వ సుఖానుభూతిలోకిసాగుతాడుకవి ఆమె తలపుతోనే అతని మనసు వలపు తమకంతో కలగిపోతుంది.

''నీ కనుచూపు చీకటుల నీడలు నాయెద నిల్వలేదు, వే
రాకలిగొన్న నా బ్రతుకునందు త్వదీయ మనోజ్ఞహాసరే
ఖాకీయ కాంతిసుధ కాల్వలు కట్టగలేదు, కాని యే
మోకలగున్ మనమ్ము వలపుం దమకమ్మున్న నిన్దలంచినన్'' అంటూ

తన ప్రణయం భౌతికవాసనలేని పరమ సుకుమారమైనదని స్ఫురింపజేస్తాడు. ఈ ప్రణయంలో శారీరకవాంఛలేదు. ఆమె సౌందర్యాన్ని భావించుకోవడంలోనే అతనికి తృప్తి ఆ మధువమస్తకమకుట మాణిక్య రాజ్ఞి అతని ప్రేయని కావడమే అతనికి అపూర్వవరం. భౌతికస్పర్శలేని ఈ ప్రణయానికి వియోగమూ లేదు. కనుకనే—

"వదలునా యెటనెదురేగి వెదకు వలపు
కలుగునా నాకు నీ వియోగమ్ము సకియ" అంటాడు.

ఆమె అతని ఊహాప్రేయసి. ఆ సోయగానికి శరీరంలేదు. విశ్వసౌందర్యసారమే ఆమె సోయగం. ప్రకృతిలో అంతటా ఆమె వలపే అతనికి గోచరిస్తుంది. తన ప్రేమకు శరీరంలేదు. కనుక తనకి వియోగం ఇంక ఎట్లాగ సంభవిస్తుంది? ఆమె ప్రణయభావనే ఆతనికి ఏదో వెలుగుగా అతని బ్రతుకంతా వ్యాపించి ఉంది. ఆ వెలుగు వేదనాతప్తమైన అతని హృదయంలో కార్తీకపు వెన్నెల్లా పరచుకుంది. అతని భావనలో ఊర్వశిసౌందర్యపరదేవత. తాను ఆమె ఆరాధకుడు ఆమె సౌందర్యాన్ని తన హృదయసీమల్లోనే సాక్షాత్కరింప చేసుకుంటాడు. ఆమె విరహమూ అతనికి వరమే.

ఇలా కవి ప్రణయంలో హృదయానుభూతేగాని శారీరకవాంఛాస్పర్శ లేదు. ఆమె అంగుళ్ళ మెరపులే తప్ప కౌగిలింతల కవోష్ణానుభూతులను భావింపడు ఆమె కంటి చూపుల కరుణామృతాన్ని, ఆమె చిరునవ్వుల కాంతి కిరణాలనీ ఆశిస్తాడేగాని బింబాధరాల మధురిమనూ, చెక్కుటద్దాలపై చుంబనాలను వాంఛించడు. ఇది అమలిన శృంగార భావన. ఈ అద్వైప భావనతో పునీతుడైన కవి అంతర్ముఖుడై సత్యదర్శనుడవుతాడు.

తనలో రగిలే బాధ భగవద్విరహ బాధగా తన అన్వేషణ విశ్వసౌందర్య మూర్తి కోసం అన్వేషణగా రూపొందతుంది. "మోహ నిద్రాతి సాంద్రాంధ్య మ్రదనుండి ఎట్లువిననై తినో ఇన్ని నాళ్ళు ప్రత్యూషస్సుల ఆ మహాప్రభువు తానే తొలికోడియై ప్రబోధమ్ము సేయ" అని ఇంతకాలం తను స్వామి పిలుపును విసిపించుకోక పోవడానికి ఆవేదన చెందుతాడు. వ్యథాతప్తమైన ప్రతిహృదయానికి గమ్యస్థానం భగవంతుడేనన్న సత్యం స్ఫురిస్తుంది. స్వామి కళ్ళల్లో కాంతి అతనికి విశ్వసౌందర్య రహస్యాన్ని విప్పిచెప్పినట్లు అనిపిస్తుంది.

'వెలికిం జూచెదను లో
పలికిం జూచెదనొ యింక బహిరంతరములో
వెలుగొ ఆనందమొ యిది
జలనిధియో చదలో తెలియకాల రమేశా!" అంటూ తన ఆవధులు దాటిన ఆనంద స్వరూపాన్నావిష్కరిస్తాడు. కృష్ణశాస్త్రి భావనలో స్వామి రూపము పరమ సుందరమైనది

"ఆపగ సోగపాగనొదల జుట్టి ఆపయినోరగా
నవ సుధాకర రేఖతురాయిగాగ వెట్టి సుందర
తరుణమూర్తి'గా సాక్షాత్కరిస్తాడు. కవి హృదయంలో ఆ ఆడుగుల సవ్వడి నిరంతరం ధ్వనిస్తూనే ఉంటుంది ఆయన సౌందర్యతృష్ణకు, ఆరని అంతర్జ్వాలకు గమ్యస్థానం గోచరిస్తుంది. ఇలా ఆయన రచనల్లో ప్రాయికంగా ఆయన సౌందర్య తృష్ణకు ఒక క్రమపరిణామం కనిపిస్తుంది.

ఇలా కృష్ణశాస్త్రి భావకవిత్వం పరమరమణీయంగా భాసిస్తూ ఆయనకు భావకవి సార్వభౌమత్వాన్ని కల్గించింది

అభ్యుదయకవిత

చాలామందికి కృష్ణశాస్త్రి పరమభావుకుడిగానే సుపరిచితుడు. ఆయనలోని సామాజిక స్పృహ, అభ్యుదయకాముకత్వము అనావిష్కృతంగానే ఉండిపోయాయి ఆయనకు సన్నిహిత మిత్రుడైన చలం కూడ "కృష్ణశాస్త్రి బాధ లోకానికి బాధ, శ్రీశ్రీ దంతా ప్రపంచపు బాధ" అంటూ శ్రీశ్రీలోని అభ్యుదయ భావనను గుర్తిస్తాడే తప్ప కృష్ణశాస్త్రిలో నున్నదానిని గుర్తించలేదు. దేవరకొండ బాలగంగాధరతిలక్ గుర్తించిన "మాతోపాటు వస్తున్నాడంటాడు నడుస్తాడా మరి?" అంటూ సంశయాన్ని వెల్లడించాడు. ఆచంట జానకిరామ్ కూడా గుర్తించాడుగాని తనకు భావకవిగానే ఎక్కువ ప్రీతిపాత్రుడు కృష్ణశాస్త్రి అంటాడు. ఇలా ఆయనలోని అభ్యుదయ విప్లవాత్మకతలు సహృదయుల దృష్టి కంతగా రాకపోవడానికి కారణం కృష్ణపక్ష కావ్యం ఆయనను భావకవి చక్రవర్తిగా సంతరించి పెట్టిన కీర్తికిరీటపు కాంతిచ్ఛటలే కావచ్చు.

సూక్ష్మంగా పరిశీలిస్తే కృష్ణపక్ష కావ్యసంపుటిలోనూ ఆయనలోని సామాజిక స్పృహ, అభ్యుదయ భావన సువిదిత మవుతాయి. ఆయన 'స్వేచ్ఛాగానం'లో నాటి భారతప్రజ చిరకాల దాస్యంతో ఏవిధంగా నిశ్చైతన్యంతో మోడువారి పోయిందో తెలిపి తన స్వేచ్ఛాగానఝరులతో నవజీవచైతన్యాలను, స్వేచ్ఛాకాంక్షను కలిగిస్తానంటాడు. నాటి జమిందారీ విధానాన్ని నిరసిస్తూ వారిని లోకపాలకులుగా మురిసే బానిసీళ్ళుగానూ తాను వారిపాలిటి ప్రళయ ఝంఝూప్రభంజన స్వామియై వారిపాలనను సమూలంగా పెకిలించివేయగలనని హెచ్చరిస్తాడు కవి.

1939లో ఏర్పడిన బెంగాల్‌లోని క్షామం కవి హృదయాన్ని కలచివేసింది. ''ఊపి ఊపి మనసున ఒక్కొక్క వేదన కావ్యమౌను మరియు గానమౌను'' అన్నట్టుగానే 'ఆకలి' అనే గీతాన్ని ఆయన శోకసంతప్త హృదయ మాలపించింది ఇలా—

''కాలదేవత గుండె ఒరిసి
కాళనెత్రు కురిసి
రాకాసి యెలుగు
చీకట్ల మూలుగు''

భయంకరమైన క్షామాగ్నికి ప్రతిబింబంగా ప్రవాసిన ఈ గీతం ఆయనలోని సామాజిక స్పృహనావిష్కరిస్తుంది. నాటి ప్రజలు అనుభవించిన దుర్భరక్షుధాగ్ని కీలల వ్యధాభరిత జీవనాన్ని మన ముందర సాక్షాత్కరింపచేస్తుంది. దేశంలో ఆకలి రాకాసిలా గొంతు చించుకుంటున్నా సామ్రాజ్యాధీశులు వినిపించుకోవడం లేదు. అసలు ఈ క్షామము, ఆకలి మానవ కల్పితాలేనని ఉన్నవాడు లేనివాడిని గురించి పట్టించుకోకపోవడమే దీనికి కారణమనీ సూచిస్తూ—

''రాజిపోయిన రాచనగరులో
పానుపంటని వేడి నిదురలో
మెలుకువొచ్చీ వీడరు
ప్రళయమొచ్చీ వినరు'' అంటాడు కవి. ఈ విధంగా కృష్ణభూమ్రికి పీడిత ప్రజలపై ఉన్న సానుభూతి, సమసమాజ స్థాపనకై ఆయనపడే తపన ఇందులో

తేటతెల్లమవుతాయి. ఇవి 1940 ప్రాంతాలకు మరింత సుస్పష్టంగా ద్యోతక మవుతున్నాయి. 1946లో ఆంధ్రాభ్యుదయ రచయితల తృతీయ మహాసభ అధ్యక్ష పీఠాన్నుండి పలికిన ఆయన మాటల్లో ఆయనలోని అభ్యుదయ కామన కంఠోక్తి గావించబడింది. తనను ఆ సభకు అధ్యక్షత్వాన్ని వహించమనడిగా కోరడమే తనకెంతో సంతోషాన్ని కల్గించినదనీ, తాను అభ్యుదయం వైపే వున్నట్టు గుర్తించడ కన్నా తనకు వేరే గౌరవప్రద మేమీలేదనీ, తన నలభ య్యేళ్ళ జీవితంలో మరొక గొప్పమాట అనిపించుకోలేదనీ అంటారు. "నేడు పాత ప్రపంచం శిథిలమయి ఆ స్థానంలో మరో క్రొత్త ప్రపంచం ఉద్భవిస్తోంది. ఈ విషయం దృష్టిలో పెట్టుకుని చైతన్యంతో ప్రసన్న బుద్ధితో ఎవరు దేన్ని గురించి వ్రాసినా అభ్యుదయ రచనే అవుతుంది" అంటూ "పీడించేవాళ్ళు పీడింపబడేవాళ్ళుగా వున్న యీ వర్గసమాజం ఉండాలని ఎవరూకోరరు. రానున్న విధానంలో సాధారణమానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతి ఘటింప జూచేవారు ఎప్పుడూ అభ్యుదయ వాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవాలనుకోవటమే అభ్యుదయం. ఇది మనసులో పెట్టుకుని వ్రాసేదే అభ్యుదయ రచన" అని కృష్ణశాస్త్రిగారు అభ్యుదయ కవిత్వాన్ని గురించి వివరిస్తారు. తదనుగుణంగానే కావ్యరచనను సాగించి చూపినట్టి ప్రగతిశీలి దేవులపల్లి.

"దులిపి దులిపినా తరగదు ధూళి, తుడిచి
తుడిచినా బూజు ప్రాజట్టు విడదు, కోణ
కోణమున ఇర్గు మూల్గు, పురాణ మీ ది
వాణ మొనర్చిరో యీ అభాజనులను"

అంటూ సమాజంలోని బూజువట్టిన సంప్రదాయాలనీ, మూఢాచార విశ్వాసాలనీ నిశితాతి నిశితంగా విమర్శిస్తాడు కవి. "చిదికినవి, వికృతమైనవి, ముదిసినవి ఏనాటి కుంచబోమమ్మ" అని కాలంతోపాటు మారని సంప్రదాయాలను మారు స్తానంటాడు. మన "మన్ను—మిన్నుల" నడుమ నున్న సంకెల, కారుకొన్న ద్వేషము, పేరుకొన్న మోసము, క్రూరహింసారిరంసలను నిరసించి "యెగుడు దిగుడులేని సొగసైన వీడుగా మూడు పదికోట్ల మననాడు నిర్మింతు"నంటాడు. ఈ సమాజాభ్యుదయం సాధించడంలో—

"మనకింక నిద్రలేదు.....వీల్లేదు
మనకింక ఇల్లు లేదు.....అక్కర్లేదు
అనుకున్న కడపల అందుకునేదాకా
అనలవర్షం క్రింద మనం నడవాలి
తప్పదు"

అంటూ అచంచల దీక్షతో జీవనశంఖాన్ని పూరిస్తారు

లోకమంతా స్వార్థంతో నశిస్తున్నప్పుడు మానవుడిని వినాశనం నుంచి కాపాడ్డానికి ఏ ఉదాత్తావేశం నరుడిని ఆవరించి అమరుణ్ణిచేస్తుందో ఆ నిత్యశుద్ధ ధాత్రి యైన శక్తి తనను ఆవేశించాలని కోరుకుంటాడు. సమాజంలోని మూఢాచారాలు మాసిపోవకమానవనీ ప్రతిఘటన ఎంతతీవ్రంగావస్తే సమాజంలో అభ్యుదయకరమైన మార్పు అంత తొందరగా వస్తుందంటూ "గోలపెట్టురాత్రీ, గుండె బాదుకో రాత్రీ! వెళ్ళిపోయేలోగా వెక్కి వెక్కి యేడు: అప్పుడుగాని అరుణోదయం కాదు" అంటాడు. సంఘంలోని శ్రమజీవులు, అట్టడుగువర్గాలవారు ఉన్న దుస్థితికి మనమే కారణమంటాడు కవి

"వాని ఫాలం అర్థరహితమయ్యేటట్లు
వేని చేయి తుడిచివేసింది ?
వాని మనసులో వెలుగు
వేని యూర్పు ఆర్పింది ?"

అంటూ నిలదీసి ప్రశ్నిస్తాడు.

1940లో వ్రాసిన విద్యార్థి ఉద్యమ ప్రబోధగీతమైన "ఆకాశము నొసట పొడచు అరుణతార" అన్నదానిలోని అరుణతార సామ్యవాదానికి ప్రతీక. రెండవ ప్రపంచయుద్ధం పూర్తికాకముందే "మనజాతికి ముక్తి అమరజీవరక్తి ముందున్నా"యంటూ

"యుగయుగాల పీడకలలు సొగయజేయు సంకెలలు
తెగనివి కావోయి, ప్రేమల ధగధగా స్వతంత్ర
విశాకాశ నొసట పొడుచు అరుణారుణ తార"

అని భవిష్యద్దర్శనం చేస్తాడు కృష్ణశాస్త్రి. ఇలా తన అభ్యుదయ కాముకత్వాన్ని, మాటలవరకే పరిమితం చెయ్యక వేళ్ళ నిర్మూలన, అస్పృశ్యతా నివారణోద్యమాలలో పాల్గొని నాటి సమాజంచేత వెలివేయబడినా చలించని సంఘ సంస్కర్తలు ఊర్వశీ ప్రణయోన్మత్తుడుగా భావించబడిన కృష్ణశాస్త్రిలోని సమాజాభ్యుదయభావాన్ని ఉజ్వలంగా భాసింపజేసేది, "మనది కృతమహాయుగం ముందున్నది మందేమరి యువ మహాయుగం" అన్న గీతం. కృతమహాయుగం న్యాయానికీ ధర్మానికీ, శాంతికీ, సౌఖ్యానికీ, సమానత్వానికీ, సౌభ్రాత్రానికీ సంకేతం. మనిషికీ మనిషికీ, జాతికీ జాతికీ, దేశానికీ దేశానికీ మధ్య యెల్లలను తుడిచివేసిన వ్యవస్థ కది ప్రతీక. అటువంటి సాంఘిక వ్యవస్థను కవి ఆహ్వానిస్తాడు.

విప్లవతత్త్వం

పదిమంది శ్రమను ఒకడు సంపదగా, పదిమంది కష్టాన్ని ఒకడు సుఖంగా మలచుకునే వ్యవస్థను, మోసం, ద్వేషం, కౌటిల్యం, భేదభావాలు నిండిన వ్యవస్థకు కలికాలం చిహ్నమనీ దానిపై నిరసననీ, తిరుగుబాటు ధోరణినీ వ్యక్తం చేస్తాడు.

"ఒక్కపెట్టున మృత్యువుకన్ను
ఉగ్రంగా చనవుగా
ఉరుముతుంది రుద్రశంఖం
ఉన్మత్త విలయశంఖం"

జాతిలో రగిలిన ఆత్మగౌరవం ఉద్ధృతంగా విప్లవ వీరగర్జన చేస్తుంది. మృత్యుకన్ను అతి తీవ్రంగా ఉంటుంది. అది రుద్రశంఖం. దాని ధ్వని విలయాన్ని సృష్టిస్తుందిట.

"తమ కమ్మత ముంచుకున్నారు
తమ మధువు నించుకున్నారు
మాకు ఆకలి నిచ్చి" అని క్షుద్బాధితుల ప్రతినిధిగా ఆక్రోశిస్తాడు కవి. ఆకలి, నాశం, సంకెళ్ళు ఇవి పీడితులకు రోషం, ద్వేషం, హెచ్చి మానం ఇచ్చే

వరకేనని హెచ్చరిస్తాడు. అదేకనుక వచ్చినట్లైతే "మఘవకోటీరమే మంటి కాగిలి వంటుతుంది"అంటూ పీడితవర్గానికి ప్రతినిధిగా నిలబడి దోపిడీ వ్యవస్థను కూలద్రోసే విప్లవనాయకుడిగా గర్జిస్తాడు.

ఇలా కృష్ణశాస్త్రి కవితామూర్తి త్రిదశలుగా భాసిస్తోంది.

"కావ్యశాస్త్రవినోదేన ....."

ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

"ధీమంతులైన సత్పురుషులు కావ్యశాస్త్ర వినోదంతో కాలక్షేపంచేస్తే మూర్ఖులు దుర్వ్యసనాలు, నిద్ర కలహము – వీటితో కాలం వెళ్ళబుచ్చుతూ ఉంటారు" అని ఒక ప్రసిద్ధ శ్లోకంలో చెప్పబడింది:

"కావ్యశాస్త్ర వినోదేన కాలో గచ్ఛతి ధీమతామ్
వ్యసనేన తు మూర్ఖాణాం నిద్రయా కలహేన వా"

ప్రాచీనకాలంలో అనేకవిధాలైన కావ్యవినోదప్రక్రియలు ప్రచారంలో ఉండేవి మహారాజాదులు కూడా ఇలాంటి సాహిత్య వినోదాలు ఏర్పాటుచేస్తూ ఉండేవారు. తీరిక లభించి నప్పుడల్లా ఇలాంటి విద్యాగోష్ఠులు జరుపుతూ ఉండే వారు. కవిపండిత పోషణం ఒక ప్రధాన కర్తవ్యంగా భావించేవారు. ఈ విషయంలో ప్రాచీన గ్రంథాలలో ఎన్నో ఆధారాలు లభిస్తాయి.

మహారాజు తన ఆస్థానంలో ఇలాంటి వినోదాలు ఏ విధంగా ఏర్పాటు చెయ్యాలో, కవి పండితాదులకు వారి వారి యోగ్యతల ప్రకారం సభలో ఎలాంటి స్థానం కల్పించాలో, రాజశేఖరుడు కావ్యమీమాంసలో విశదీకరించి ఉన్నాడు:

"రాజా కవిః కవిసమాజం విదధీత. రాజని కవౌ సర్వో లోకః కలిః స్యాత్. స కావ్యపరీక్షాయై సభాం కారయేత్. సా షోడశభిస్తమ్భైః చతుర్ద్వార్వై రష్టభిర్మత్త వారణీభిః ఉపేతా స్యాత్ తదను లగ్నం రాజ్ఞః కేలిగృహమ్. మధ్యేసభాం చతుఃస్తమ్భాన్తరా హస్తమాత్రోత్సేధా సమణిభూమికా వేదికా.

తస్యాం రాజాసనమే. తస్యచోత్తరతః సంస్కృతాః కవయో నివిశేరన్ బహు భాషా రవిత్వే యో యత్రాధికం ప్రవీణః స తేన వ్యపదిశ్యతే. యస్త్వనే కత్ర ప్రవీణస్స జ్ఞాత్వా తత్ర తత్రోపవిశేత్.

తతః పరం వేదవిద్యావిదః, ప్రామాణికాః, పౌరాణికాః స్మార్తాః, భిషజః, మౌహూర్తికాః, అన్యేపి తథావిధాః, పూర్వేణ ప్రాకృతాః కవయః తతః పరం నట నర్తక గాయన వాదన వాగ్జీవన కుశీలవతాలావచరాః అన్యేపి తథావిధాః, పశ్చిమేన అపభ్రంశినః కవయః తతః పరం చిత్రవేప్యకృతో మాణిక్యబన్ధకాః, వైకటికాః, స్వర్ణకారవర్ధకీ లోహకారాః అన్యేపి తథా విధాః దక్షిణతో భూతభాషా కవయః తతఃపరం భుజఙ్గగణికాః. ప్లవకశౌభిక జమ్భకమల్లాః, శస్త్రోపజీవినోఽన్యేపి తథావిధాః.

తత్ర యథాసుఖమాసీనః కావ్యగోష్ఠీం ప్రవర్తయేత్, భావయేత్. పరీక్షేత చ వాసుదేవ సాతవాహన శూద్రక సాహ సాఙ్కాదీన్ సకలాన్ సభాపతీన్ దానమానాభ్యామనుకుర్యాత్.

తుష్టపుష్టాశ్చాస్య సభ్యా భవేయుః, స్థానే చ పారితోషికం లభేరన్లోకోత్తరస్య కావ్యస్య చ యథార్హా పూజా కవేర్భవి, అన్తరాన్తరా చ కావ్యగోష్ఠీం శాస్త్రవాదానను జానీయాత్. మధ్వపి నానవదం శం స్వదతీ.

కావ్య శాస్త్రవిరతా విజ్ఞానిష్వవిరమేత దేశాన్తరగతానాం చ విదుషామన్యద్వారా సఙ్గం కారయే దౌచిత్యాద్యావత్సతి పూజాం చ వృత్తికామాంశ్చోపజపేత్, సంగృహ్ణీయాచ్చ. పురుషరక్షానామేక ఏవ రాజోదన్వాన్రాజనమ్. రాజ చరితం చ రాజోపజీవినోఽన్యను కుర్యుః. రాజ్ఞ ఏవహ్యసావుపకారో యద్రాజోపజీవినాం సంస్కారః.

మహానగరీషు చ కావ్య శాస్త్రపరీక్షార్థం బ్రహ్మసభాః కారయేత్. తత్ర పరిక్షో త్తీర్ణానాం బ్రహ్మరథయానం పట్టబన్ధశ్చ. శ్రూయతేచోజ్జయిన్యాం కావ్య కారపరీక్షా:—

"ఇహ కాలిదాసమేణ్ఠావ తాతుర రూప సూర భారవయః
హరిచన్ద్ర చన్ద్రగుప్తౌ పరీక్షితా విహ విశాలాయామ్"

శ్రూయతే చ పాటలీపుత్రే శాస్త్రకార పరీక్షాः-

"అత్రోపవర్షవర్షా విహ పాణిని పిఙ్గలావిహ వ్యాడిः
వరరుచి పతఞ్జలీ ఇహ పరీక్షితాంः ఖ్యాతిముపజగ్ముः"

"ఇత్థం సభాపతిర్భూత్వా యः కావ్యాని పరీక్షతే
యశస్తస్య జగద్వ్యాపి స సుఖీ తత్ర తత్ర చ"

"రాజు తాను కవియై కవిసమాజం ఏర్పరచాలి రాజు కవి అయితే ప్రజలందరూ కవులౌతారు. కావ్యపరీక్షకోసం రాజు సభ ఏర్పాటుచేస్తూ ఉండాలి. ఆసభాభవనానికి పదహారు స్తంభాలు, నాలుగు ద్వారాలు, ఎనిమిది వసారాలు తేదా పైన కట్టిన చిన్న గదులూ ఉండాలి దానిని ఆనుకొని రాజుగారికేళిగృహం ఉండాలి' సభామధ్యాన, నాలుగు స్తంభాల నడుమ, మాణిక్యాలతో చపటాచేసిన, గజంఎత్తు వేదిక ఉండాలి. ఆ వేదికపై రాజాసనం అమర్చాలి. రాజుకు ఉత్తరంగా సంస్కృతకవులు కూర్చోవాలి. కొందరు బహుభాషలలో కవులుకావచ్చు. అయితే వారికి ఏభాషలో ఎక్కువ ప్రౌఢిమ్యం ఉంటే వారిని ఆభాషాకవులుగా పరిగణించాలి. అనేక భాషలలో సమానప్రౌఢిమ్యం ఉన్నవాడు మారిమారి ఆయా భాషా కవుల మధ్య కూర్చొనవచ్చు.

సంస్కృతకవుల తరవాత వేదవేదాంగాది విద్యావేత్తలు, దర్శనశాస్త్రదువిలు, పౌరాణికాలు, స్మృతి పండితాలు, వైద్యులు, జ్యోతిష్కులు, అట్టివారే అయిన ఇతరులు, అనగా మాంత్రిక తాంత్రికాదులు కూర్చోవాలి. రాజుకు తూర్పుగా ప్రాకృతభాషాకవులు, వారితరువాత నటులు, నర్తకులు, గాయకులు, సంగీత వాద్య వాదకులు, వాగ్జీవనలు, అనగా మాటలతో జీవించే కథాకథకులు మొదలైనవారు కాకలవులు (నాట్యకత్తెల వెనుకనుండి కాని ప్రత్యక్షంగా కాని గీతాలుగానం చేసేవారు). హస్తతాళాదులతో నాట్యం చేసేవారూ, ఇంకా ఇట్లాంటి వారందరూ కూర్చోవాల.

రాజుకు పశ్చిమంగా అపభ్రంశ భాషాకవులు, వారి తరువాత చిత్రకారులు, శిల్పకారులు, మాణిక్యాలను అలంకారాలతో బిగించేవారు, రత్న పరీక్షకులు, స్వర్ణకారాలు, వడ్రంగులు, కమ్మరాలు, అట్టివారే అయిన

ఇతరులు కూర్చోవాలి. రాజుకు దక్షిణాన భూతభాషాకవులు, వారి తరువాత విటులు. వేశ్యాస్త్రీలు, క్రీడుపై నాట్యంచేసేవారు, పాములవాళ్ళు, ఐంద్రజాలికలు, మల్లులు, ఆయుధజీవులు, అట్టివారైన ఇతరులు కూర్చోవాలి.

రాజు ఆ సభలో కూర్చుండి కావ్యగోష్ఠి నడిపించాలి. కావ్యార్థాల భావన చెయ్యాలి. పరీక్షించాలి. వాసుదేవ–సాతవాహ –శూద్రక–సాహసాంకాదులైన సభాపతులుగా వ్యవహరించిన ప్రాచీనరాజులను అనుకరిస్తూ దానమానాదులతో చేత కవులను సత్కరించాలి.

సభ్యులందరూ సంతుష్టులై, పరిపుష్టులై ఉండాలి. తగు సమయాలలో పారితోషికాలు పొందుతూఉండాలి. రాజు లోకోత్తరమైన కావ్యానికి గాని, కవికి గాని తగువిధంగా సంమానంచెయ్యాలి. కావ్యగోష్ఠి జరుగుతూన్నప్పుడు మధ్యమధ్య శాస్త్రవాదాలు కూడా అనుమతించాలి. మధువైనా నంజులేకపోతే రుచించదు కదా?

కావ్యగోష్ఠి – శాస్త్రగోష్ఠులమధ్య విరామం కలిగినపుడు శిల్పుల గోష్ఠిలో క్రీడించాలి దేశాంతరాలనుంచి వచ్చిన పండితుల పరిచయం ఇతరుల ద్వారా సభాసదులకు చేయించాలి. ఔచిత్యాన్ని పురస్కరించుకొని, వారు తనరాజ్యంలో ఉన్నంత కాలమూ వారికి సన్మానం చేయించాలి. వృత్తి కోసం వచ్చిన విదేశీయులను రహస్యోపాయాలతో తనవైపు ఆకర్షించుకొని, వారిని సంగ్రహించాలి. పురుషరత్నాలు ఉండే ఏకైక స్థానం రాజు అనే సముద్రమే. రాజ సేవకులు (మంత్రి సేనాపత్యాదులు) కూడా రాజచరితమే అనుకరించాలి. రాజ సేవకులు మంచి సంస్కారం కలవారైతే చివరికి లాభం పొందేది రాజే కదా!

కావ్యశాస్త్ర పరీక్షలు జరపడానికి మహానగరాలతో బ్రాహ్మణసభలు ఏర్పరచాలి. అక్కడ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి బ్రహ్మరథంమీద ఊరేగింపు, పట్టువస్త్రధారణమూ లభించాలి. ఉజ్జయినిలో ఇలాంటి కావ్య పరీక్షలు జరిగే వన్నట్లు ఒక శ్లోకం వినబడుతూన్నది.

''ఈవిశాలానగరంలో కాళిదాస–భర్తృమేంథాల పరీక్ష జరిగింది. ఇక్కడనే అమర–రూప–ఆర్యసూరులు పరీక్షింపబడ్డారు. హరిచంద్ర – చంద్రగుప్తులను పరీక్షించినది కూడా ఇక్కడనే''.

పాటలీపుత్రనగరంలో శాస్త్రకారుల పరీక్ష జరుగుతూండేదని కూడా వినవస్తూన్నది.

"ఉపవర్ష–వర్షలు, పాణిని – పింగళీలు, వ్యాడి, వరరుచి–పతంజలులు ఈ నగరంలోనే పరీక్షితులై ఖ్యాతికాంచినారు".

"ఈ విధంగా సభాపతిగాడుడి కావ్యాలను పరీక్షించే రాజుకీర్తి జగద్వ్యాప్తం అవుతుంది. అతడు సర్వదా సుఖవంతుడై ఉంటాడు".

కావ్యమీమాంసలో రాజశేఖరుడు చెప్పిన ఈ విషయాలు పరిశీలిస్తే ఆనాటి సాహిత్య గోష్ఠులకు సంబంధించిన ఎన్నో అంశాలు స్పష్టం అవుతున్నాయి.

1. ఈ సాహిత్య గోష్ఠులను రాజులు, రాజామాత్య సేనారుత్యాదులు నిర్వహించేవారు.

2. రాజధాని నగరంలోని రాజాస్థానంలోనే కాకుండా ఇతర నగరాలలో కూడా ఇవి జరిగేవి.

3. సకల భాషాకవులకు సమానమైన గౌరవమర్యాదలు లభించేవి.

4. ఇవి కేవలం అభినందన సభలే కాకుండా పరీక్షార్థం ఏర్పరచిన సమావేశాలవడంచేత పూర్తి ఆత్మవిశ్వాసంకల కవులు మాత్రమే వీటిలో పాల్గొనేవారని ఊహించడానికి అవకాశం ఉంది.

5. ఈ సమావేశాలలో కవులు మాత్రమే కాకుండా వివిధ శాస్త్రాలలో ఉద్దండ పండితులు, శిల్పులు, కర్మకారులు, గాయకులు, నటనర్తకులు మొదలైన వారుకూడా పాల్గొనడంచేత కవులు వారి అందరితోటీ ప్రత్యక్షసంబంధం సంపాదించుకొని తమ విజ్ఞానాన్ని బహుముఖంగా విస్తృతం చేసుకోవడానికి అవకాశం ఉండేది. దీనివల్ల వారి కవిత్వంలో విషయవైవిధ్యం ఉండడానికి అవకాశం లభించేది.

6. భాషాప్రాంతాదిభేదాలకు తావులేకుండా అర్హతకల అందరికీ వీటిలో పాల్గొని సత్కారం పొందే అవకాశం లభించేది.

ఇలాంటి సమావేశాలలో ఆయా కవులు తమ కావ్యాలను చదివి వినిపించగా వాటిని విని ఆనందించడం జరిగేది.

పూర్వకాలాల్లో కొన్ని విద్వత్కవి గోష్ఠులలో అనేక విధాలైన ప్రహేళికల ద్వారా కూడా వినోద కార్యక్రమాలు జరుగుతూ ఉండేవి. వైకి ఒక అర్థం కనబడుతూ అసలు అర్థం గుప్తంగా ఉన్న రచనకు ప్రహేళిక అని పేరు.

"వ్యక్తీకృత కమప్యర్థం వ్యరూపార్థస్య గోపనాత్
యత్ర బాహ్యాన్తరావర్థౌ కథ్యేతే సా ప్రహేళికా"

వీటిలో కొన్ని పొడుపుకథలవలె ఉంటాయి. ఉదాహరణకు–

"తరుణ్యావిద్ధితః ఖంతే నితంబస్థలమాశ్రితః
గురూణాం సన్నిధానేపి కః కూజతి ముహర్ముహుః"

"పెద్దలయెదుటనే, తరుణీ కంఠమును ఆలింగనము చేసికొనగా, ఆమె నితంబమును ఆశ్రయించి, మాటి మాటికిని ధ్వని చేయునది ఎవరు?" అని ప్రశ్న. అర్ధజలపూర్ణకుంభమని సమాధానము

ఇలాంటి ప్రహేళికలు, క్రీడకోసమై ఏర్పరచిన సభలలో వినోదముకొరకో, ప్రహేళికానిపుణులు చాలామంది ఉన్నప్పుడు వారు ఉల్లాసంతో మాటలాడుకొనడానికి, ఇతరులకు అర్థం కాకుండా మాటలాడుకోవడానికి (మూడువిధాలుగా పని చేస్తాయని దండి కావ్యాదర్శంలో చెప్పి వీటిలో పదహారు భేదాలు సోదాహరణంగా వర్ణించాడు.

"క్రీడాగోష్ఠినిరేషు తజ్జైరాకీర్ణమన్యత్రజే
పరవ్యామోహన్ చాపి సోపయోగాః ప్రహేళికాః" (కావ్యా. 3. 67)

బాణభట్టు కాదంబరిలో ఈ ప్రహేళికలతో పాటు మరికొన్ని ఇతర వినోద ప్రక్రియలు కూడా పేర్కొన్నాడు. శూద్రక మహారాజు ఇలాంటి వినోదాలతో కాలయాపనం చేసేవాడట.

"..... .....కదాభి దక్షరచ్యుతక–మాత్రాచ్యుతక–బిన్దుమతీ – గూఢచతుర్థ పాద–ప్రహేళికాప్రదానాదిభిః..... .....సుహృత్పరివృతః దివసమనై షీత్"

ఇక్కడ చెప్పిన అక్షరచ్యుతక–మాత్రా చ్యుతకాదులు కావ్యవినోద ప్రక్రియలు; శ్లోకంలో ఒకచోట ఉన్న అక్షరం లోపింపచేస్తే మరొక అర్థం వస్తుంది అది అక్షరచ్యుతకం. ఉదా :–

"కుర్వన్దివాకరాశ్లేషం దధచ్చరణడమ్బరమ్
దేవ యూష్మాకసేనాయాః కరేణుః ప్రసరత్యసౌ"

'కరేణుః'అనగా ఏనుగు."ఓదేవా నాసేనలోని ఏనుగు పగలు తొండమును ముడుచుకొనుచూ, లేదా తొండము ఆకాశముపైకి ఎత్తుచూ, (దివా+కరాశ్లేషమ్) పాదముల ఆడంబరము ధరిస్తూ ముందుకు పోతున్నది." అని దీని అర్థం. "కరేణుః" లోని 'క' తీసివేయగా 'రేణుః–ప్రసరతి' అని అవుతుంది. "రాజా! నా సైన్యముచే ఎగురగొట్టబడిన పరాగము సూర్యుని స్పృశిస్తూ (దివాకర + ఆశ్లేషమ్), యుద్ధాడంబరం చేస్తూ (దధత్+చ+రణ డమ్బరమ్) వ్యాపిస్తున్నది" అని అర్థం.

ఈ విధమైనదే మరొక శ్లోకం ఉన్నది. రావణుడు సీతతో ఇలా అన్నాడట :–

"భవిత్రి రంభోరు త్రిదశవదనగ్లానిరధునా
స మే రామః స్థాతా న యుధి పురాతో లక్ష్మణసఖః।
ఇయం యాస్యత్యుచ్చైర్విపదమరితో వానరచమూ
లఘిష్ఠేదం షష్ఠాక్షర పర విలోపం పఠ పునః"

"ఓ సీతా ! ఇపుడు త్రిదశుల (దేవతల) ముఖములకు గ్లాని (వాడిపోవుట) రానున్నది. లక్ష్మణ సహితుడైన రాముడు నా ఎదుట నిలువజాలడు. ఈ వానర సేన శత్రువుల (రాక్షసుల) వలన గొప్ప ఆపదను పొందగలదు" అని మొదటి మూడు పాదాల అర్థం. అపుడు సీత "ఓరీ ! నీచుడా ! పై పాదాలలో ఏడవ అక్షరం తీసివేసి మళ్ళీ చదువు" అన్నదట. అలా చదివితే మొదటి పాదంలో

'త్రిదశవదన గ్లానిః' అనేది 'దశవదనగ్లానిః' అని అగును. 'రావణునికి వినాశము కలుగగలదు'అని అర్థం. రెండవపాదంలో ఏడవఅక్షరమైవ'న'తీసివేయగా ''స మే రామఃస్థాతాయుధి'' అనగా ''రాముడు యుద్ధములో నిలువగలడు''అని అవుతుంది. మూడవ పాదంలో ఏడవ అక్షరం 'వి' తీసివేయగా ''ఇయం యాస్యత్యచ్చైఃపదమ్" ఈ వానరసేన శత్రువుకంటె ఉన్నతపదమును పొందగలదు అని అవుతుంది. ఇలాంటివి అక్షరచ్యుతకాలు.

ఒక మాత్ర (అచ్చు)ను తీసివేసి చదివితే ఆదే శ్లోకం మరొక అర్థం ఇస్తుంది. అది మాత్రాచ్యుతకం,

ఉదాహరణ :—

''మూలస్థితిమధఃకుర్వన్ పాత్రైర్జుష్టో గతాక్షరైః
విటఃసేవ్యఃకులీనస్య తిష్ఠతఃపథికస్య సః''

''మర్యాదలను తలక్రిందుచేస్తూ నిరక్షరాస్యుడే చేత సేవింపబడే విటుణ్ణి సన్మార్గంలో ప్రవర్తించే ఏ కులీనుడు ఆశ్రయిస్తాడు'' అని అర్థం. 'విటఃలోని 'ఇ' కారాన్ని తీసివేసి 'వటఃఅని చదివితే—కులీనుడైన పథికుడు ఊడలను క్రిందికి దింపినదీ, పక్షులచేత సేవింపబడినదీ అయిన వటవృక్షాన్ని సేవించాలి'' అన్న అర్థం వస్తుంది.

బిందుమతిలో హల్లులకు బదులు సున్నలు పెట్టి శ్లోకంలో ఉండవలసిన అక్షరాల సంఖ్యకు అనుగుణంగా వ్రాస్తారు. అచ్చుల గుర్తులు మాత్రం ఉంటాయి. ఊహించి శ్లోకం పూర్తిచేయాలి. ఈ అర్థం గల శ్లోకం వ్రాయాలని నిర్దేశిస్తారు.

ం ం ం - ం ం ం - ం ం - ం ం - ం ం ఃఁ ।
ం ం - ం ం - ం ం ఃఁ ం ం - ం ం - ం ం ఃఁ ॥

దీనిని ''తవావవాదఃప్రత్యబ్ధి పతాకాఃప్రతి సంగరమ్ ఫలం ప్రత్యద్భుతోపాయం యశాంసి న తు న క్వచిత్'' అనే అర్థం వచ్చేటట్లు పూర్తిచేయాలి. అది ఇలా అవుతుంది :—

''ఉదధావుదధావాజ్ఞా సంయుగే సంయుగే జయః
సాహసే సాహసే సిద్ధిః సర్వత్ర తవ కీర్తయః''

''ఓ రాజా! నీ ఆజ్ఞ ప్రతి సముద్రం మీదా చెల్లుతూన్నది. ప్రతి యుద్ధం లోనూ జయం లభిస్తూన్నది. ప్రతి సాహసకృత్యంలోనూ ఫలసిద్ధి కలుగుతూన్నది, అంతటా నీ కీర్తులే.''

శ్లోక చతుర్థ చరణానికి చెందిన అక్షరాలు మొదటి మూడు పాదాల లోనూ చేరిఉంటే అది గూఢ చతుర్థ పాదం.

''ద్యువియద్ధామినీ తారసంరావ విహతశ్రుతిః
హైమిషుమాలా భుభుభీ.....''

పూర్వార్థంలో ఉన్న 2, 1, 7, 5, 11, 9, 13, 16 అక్షరాలు తీసి కూరుస్తే "విద్యుతామివ సంహతిః'' అనే చతుర్థ పాదం ఏర్పడుతుంది.

ప్రహేళికకు దండి ఇచ్చిన లక్షణం వెనుక చూచి ఉన్నాం. భోజవిరచితమైన 'సరస్వతీకంఠాభరణం'లో కూడా ప్రహేళికా లక్షణ ప్రభేదాములు చూపబడ్డాయి. అవేకాకుండా ఇంకా అనేకవిధాలైన ప్రహేళికలను గూర్చి విదగ్ధముఖమండనాది గ్రంథాలలో విస్తృతంగా ప్రతిపాదింపబడినది. కొన్ని శాస్త్రీయ పరిభాషాదులను కూర్చి చెప్పిన పద్యాలు, సమస్యా పూరణాదులు ఇవన్నీ కూడా ఈ ప్రహేళికా ప్రక్రియలో చేరినవే.

ఇపుడు కొన్ని ఉదాహరణలు చూద్దాం. ఒక యాచకుడు ఒక ధనికుని వద్దకు వెళ్ళి ఇలా అంటాడు—

''అద్విగురద్వంద్వోఽహం గేహే మే నాస్తిచావ్యయాభావః
తత్పురుష కర్మధారయ యేనాహం స్యాం బహువ్రీహిః''

ఈ శ్లోకంలో అన్ని సమాసాల పేర్లూ వచ్చినాయి. "నేను రెండు ఎద్దులు లేనివాడను. అయితే నా గృహంలో వ్యయం లేకపోవడంలేదు. అందుచేత, ఓ

పురుషుడా ! (కత్ + పురుష) నేను చాలా ధాన్యం కలవాడనగుటకు ఏదైన పని ఆలోచించుము (కర్మ+ధారయ)''.

''సర్వస్యద్వో'' ''ఏకోగోత్రే'' ''వృద్ధోయూనా'' (ఇది సూత్రంలో భాగం) ''స్త్రీ పుంవచ్చ'' అనే పాణిని సూత్రాలు నాలిగింటినీ నాలుగు పాదాలలో కూర్చి ఒక శ్లోకం వ్రాయబడింది. సూత్రాల అర్థం వేరు, ఇక్కడ తీసికొన్న అర్థం వేరు:–

''సర్వస్య ద్వే సుమతి కుమతీ వమ్మదాపత్తిహేతూ
ఏకో గోత్రే ప్రభవతి పుమాన్ యః కుటుమ్బం బిభర్తి
వృద్ధో యూనా సహ పరిచయాత్త్యజ్యతే కామినీభిః
స్త్రీ పుంవచ్చ ప్రభవతి గృహే తద్ధిగేహం వినష్టమ్''

''మంచిబుద్ధి, చెడ్డబుద్ధి అనేవి ప్రతివానికీ నంపదను, ఆపదను కలిగిస్తాయి. కుటుంబం పోషించగలిగిన పురుషుడే సమర్థుడైన పురుషుడు. యువకునితో పరిచయం ఏర్పడితే కామినులు వృద్ధుణ్ణి విడిచివేస్తారు. స్త్రీ పురుషుడవలె వ్యవహరించే ఇల్లు నశిస్తుంది.

ఒక జ్యోతిశ్శాస్త్ర విదుడు పారిభాషిక భాషలో (*Code language*) తన మిత్రునికి ఒక రహస్యం అందజేస్తున్నాడు ఈ శ్లోకంలో :–

''సన్తప్తా దశమధ్వజాదిగతినా సంమూర్ఛితా నిర్జలీ
తుర్యాద్యాదశవ ర్ద్వితీయ మతిమస్నికాదళాభ్రన్తసీ,
పష్ఠీ పఞ్చమమధ్యమా చ దశమభ్రూః సప్త మీవర్జితా
ప్రాప్నోత్యష్టమవేదనాం త్వమధునా తూర్ణం తృతీయో భవ''

జ్యోతిష్కులు మేషాదిరాసులను గూర్చి చెప్పేటప్పుడు ద్వితీయం, చతుర్థం పంచమం ఇత్యాది విధంగా నిర్దేశిస్తారు. ఈ శ్లోకంలో ఆ పద్ధతిలోనే రాసులు పేర్కొనడం జరిగింది. దశమధ్వజాదిగతినా – దశమం మకరం. దశమధ్వజుడు మన్మథుడు. ఆది మేషం. ఆదిగతి అనగా మేషవాహనుడైన అగ్ని అందుచేత దశమధ్వజాదిగతినా అనగా మన్మథాగ్నిచేత అని అర్థం. మన్మ

థాగ్నిచే బాగా తపింపబడినదై, నిర్జలప్రదేశంలో చతుర్థ (కర్కాటకం=పీత) ద్వాదశ (మీన) ములవలె మూర్ఛచెందినది. ఏకాదశాభస్తనీ – ఏకాదశం కుంభం, కుంభములవంటి స్తనములుగలది, పంచమ మధ్యమా–పంచమం సింహం; సింహం నడుమువంటి నడుము గలది, దశమభూ:–దశమం ధనస్సు. ధనస్సువంటి కనుబొమ్మలు కలది, సప్తమీనర్జితా – సప్తమి తుల తుల (సాటి)లేనిది; అట్టి షష్ఠి = కన్య; అష్టమవేదనామ– అష్టమం వృశ్చికం; వృశ్చిక బాధవంటి బాధను పొందుతున్నది. ద్వితీయమతిమన్ – ద్వితీయం వృషభం ఓ వృషభంవంటి బుద్ధికలవాడా, తూర్ణం=శీఘ్రముగా, తృతీయ:భవ = మిథునము అగును. ఈ శ్లోకంలో పన్నెండురాసుల పేర్లూ వచ్చివేసినాయి.

వ్యాకరణశాస్త్రానికి సంబంధించిన కొన్ని నియమాలను ప్రతిపాదించే వాక్యాలు ఉన్నాయి. వాటికి పరిభాషలు అని పేరు. ఆ వ్యాకరణ పరిభాషలను కూర్చి శివరామప్రసాది అనే ఒక పండితుడు రాధాకృష్ణుల ప్రణయాన్ని వర్ణిస్తూ 30 శ్లోకాలు రచించాడు. అది ఆయనకున్న ప్రతిభావైదుష్యాలకు చిహ్నాలు. ఉదాహరణకు–

"వార్ణాదాఙ్గం బలీయ:" అని ఒక పరిభాష ఉన్నది. వర్ణమును సిమిత్తంగా చేసుకొని చెప్పిన కార్యం కంటె అంగసంజ్ఞను నిమిత్తంగా చేసుకొని వచ్చిన కార్యం ఎక్కువ బలంకలది. అందుచేత ముందుగా ఆశాస్త్రకార్యమే చెయ్యాలి అని దానికి అర్థం. దీనిని శ్లోకంలో కూర్చి ఈ కవి ఈ విధంగా వ్రాశాడు ;–

"వార్ణాదాఙ్గం బలీయ: స్యాదితి మత్వా విలాసినీ
నోవాచ వచనం కిఞ్చిదావివిఙ్గ మదాన్ముదా"

అక్షరాలతో సంబంధించిన పనికంటె శరీరంతో సంబంధించిన పని బలీయమైనదనే విషయం తెలిసిన ఆ విలాసిని నోటితో ఏమీ మాటలాడకుండా శరీరంతో కొగలించుకుంది.

క్లిష్టసమస్యా పూర్తి అనే ప్రక్రియ తెలుగువారికి సుపరిచితం. ఇలాంటి సమస్యలకు ఒకటి రెండు ఉదాహరణలు. "మృగాత్సింహ: పలాయతే" అని

సమస్య: "లేడికి భయపడి సింహం పారిపోతున్నది" అని దీని అర్థం. దీనికి అనేక పూరణాలున్నాయి.

"అసమానే సమానత్వం భవిత్రా కలహే మమ
ఇతి మత్వా ధ్రువం మానీ మృగాత్సింహః పలాయతే"

"నాతో ఏ విధమైన పోలికా లేని దీనితో కలహిస్తే దీనికి నాతో సమాన గౌరవం ఇచ్చినట్లు అవుతుంది అని భయపడి సింహం లేడినుంచి దూరంగా పారిపోతున్నది"

"తిష్ఠార్జునార్య సంగ్రామే త్వాం హనిష్యామ్యహం శరైః
తిష్ఠామి కర్ణ కిం మూఢ మృగాత్సింహః పలాయతే"

అర్జునా! నిలబడు. "ఈనాడు యుద్ధంలో నిన్ను వధించేస్తాను" "కర్ణా నిలబడియే ఉన్నాను. ఓమూఢుడా! ఎక్కడైనా సింహం లేడిని చూచి పారిపోతుందా?"

"పురః పత్యుః కామాచ్ఛ్వశురమియమాలిఙ్గతి సతీ" – "ఈ పతివ్రత భర్తయెదుటనే కామముతో మామను ఆలింగనము చేసికొంటూన్నది" అని సమస్య. దీనికి కూడా మూడునాలుగు పూరణాలు ఉన్నాయి. వాటిలో ఒకటి–

"కదాచిత్పాఞ్చాలీ విపినభువి భీమేన బహుశః
కృశాఙ్గి శ్రాన్తాసి క్షణమిహ నిషీదేతి గదితా
శనైః శీతచ్ఛాయం తటవిటపినం ప్రాప్య ముదితా
పురః పత్యుః కౌమాచ్ఛ్వశురమియమాలిఙ్గతి సతీ"

"ద్రౌపది భీమునితో కలిసి అరణ్యంలో సంచరిస్తూన్నది. ఓ కృశాంగీ! చాలా అలసిపోయినావు. క్షణకాలం ఇక్కడ కూర్చుండుము" అని భీముడు చెప్పగా ఆమె చెట్టునీడలో కూర్చొని అతని సమక్షమున మామగారిని (వాయువును) ఆలింగనము చేసికొంటూన్నది.

శ్లోకంలోని ఒక్కొక్కపాదంలో ఒక్కొక్క హల్లుమాత్రం ఉపయోగించి వ్రాసిన శ్లోకాలూ, వివిధ యమకాలూ, రెండు భాషలు ఉన్న శ్లోకాలు ఈ విధంగా అనేక ప్రక్రియలు ఉన్నాయి. ఇలాంటివన్నీ సాహిత్య గోష్ఠులలో ఉపయోగించి ఆనందించేవారు. సంస్కృతభాషలో లక్ష ప్రహేళికలు ఉన్నాయనీ, తమ పూర్వ పురుషులు సంపాదించిపెట్టిన రెండువేల ప్రహేళికలదాకా తమవద్ద ఉన్నాయనీ శ్రీ శ్రీభాష్యం విజయసారథిగారు 1968 ప్రాంతంలో ప్రచురించిన 'ప్రహేళికలు' అనే గ్రంథంలో వ్రాసినారు.

ఇలాంటి సాహిత్య వ్యాసంగాలవల్ల వినోదం మాత్రమే కాకుండా భాషా పాటవమూ, వివిధ శాస్త్ర పరిచయమూ కూడా కలుగుతాయి.

కులపాలికా ప్రణయం

ఏ. వి. అరుణాదేవి

తెలుగులో భావకవిత్వం 20 వ శతాబ్ది ఆరంభంలోనే ఉద్యమరూపం ధరించి దాదాపు 30 సం॥ల కాలం కొనసాగింది. పాశ్చాత్య సాహిత్యంలోని 'రొమాంటిసిజం' ప్రభావ ఫలితమే భావకవిత్వ యుగం.

శక్తివంతమైన సామాన్యుల భాషలో తగిన ఛందస్సునెన్నుకొని వెలువరించడం భావకవిత్వంలో ప్రధానంగా మనకు కన్పించే ముఖ్యలక్షణం.

భావావేశము, వ్యక్తిత్వ ప్రకటన, ప్రకృతి యెడల ఆశ్చర్యకరమైన దృక్పథం, సామాన్య నిరాడంబర జీవితాదరణ, స్త్రీ సమారాధన, విరహప్రకటన భావకవుల ముఖ్యోద్దేశాలు.

సంప్రదాయ సాహిత్యానికి వ్యతిరేకంగాసాగిన ఈ ఉద్యమం దేశదేశములు వ్యాప్తినొంది ప్రథమంగా వంగదేశమును ప్రభావితం చేసింది. కాగా అందు మైఖేల్ మధుసూదనదత్తు, బంకిం చంద్ర చటర్జీ, రవీంద్రుడు ప్రథములు.

భరతాది లాక్షణికులు రసరాజ మని తెల్పిన 'శృంగారము' భావకవిత్వంలో కొత్తతెన్ను తొక్కింది. ప్రేయసిని ప్రకృతిదేవతగా, ప్రణయదేవతగా, దేవతగా భావించి సేవించుట భావకవుల విశిష్టత.

లాక్షణికాభిప్రాయమున 'ప్రణయ' శబ్దమునకు స్నేహము, యాచన, ప్రీతి అను అర్థములున్నను భావకవుల భావనలో స్త్రీ పురుషుల పరస్పర శృంగారమునుగ్గడించుటకే పరిమితమైనది. 'శృంగార ఋచిరుజ్వాలః' అని కీర్తింపబడి సర్వజగన్మోహన సృష్టికి కారణభూత మగుటయే యిందులకు కారణం.

భావకవిత్వంలో చిత్రింపబడిన ప్రణయమును అమలిన శృంగారము, స్వేచ్ఛా ప్రణయము కులపాలికా ప్రణయమని 3 విధములుగా విభజించుకొన వచ్చును.

రాయప్రోలువారు "మన కావ్యములలోవలె, లిరిక్కుల లోవలె అనురాగము సంభోగ పరిణామమును పొందనక్కర లేదని భావాత్మకమైన స్నేహయోగంగా పరిణతమైతే చాలు" నని తమ 'తృణకంకణము'లో అమలిన శృంగారమునకు-పీఠం వేసినారు.

స్వేచ్ఛాప్రణయమునకు కృష్ణశాస్త్రి ప్రతినిధి. ఇవి భావ కవిత్వంలో నెల కొన్న రెండవ సిద్ధాంతము. "స్వచ్ఛందమైన ప్రేమకు సామాజికమైన కట్టు బాట్లుండకూడదని" యీవాద సారాంశము ప్రణయమునకు అవకాశములేనిచోటి వివాహ వ్యవస్థకు వ్యతిరేకంగా యీ స్వేచ్ఛాప్రణయ వాదముద్భవించినది.

ప్రణయమునకు అవకాశములేని వివాహము నిరసింపదగినదే. కాని ప్రణ యము యొక్క సర్వతోముఖాభివృద్ధికి వివాహమే ప్రధాన కారణము కావున ఈ వ్యవస్థ సుస్థిరత నంది యుండకున్నచో సమాజములో ప్రేమమూర్తియైన బలహీనునకు ప్రణయిని దక్కకుండాపోయి క్రూరుడు మూర్ఖుడునైన బలవంతు నిదే పైచేయియగును.

వివాహమునకు సామరస్యము కుదిరినపుడు స్త్రీపురుషుల జీవితముసాఫల్యత నందగలదు. కావున ప్రణయమునకు వివాహమును ఫలముగా చెప్పి నాయని, విశ్వనాథ మొదలగు భావకవులు కులపాలికా ప్రణయమును తమ తమ కావ్యములందు పొందికగా బంధించి ఆనందమునందించినారు.

పరస్పరాను రాగము, ఆరాధనము, సమర్పణము కలిగిన స్త్రీ పురుషుల నడుమ వ్యవస్థాబద్ధమైన ప్రణయము కుల పాలికా ప్రణయమునకు కుదురువంటిది. ఇట్టి వ్యవస్థ ఇహపరములకు సాధనమై సమాజ స్థిరతకు మూలాధారమగును.

సదాచార సంప్రదాయ రహస్యములను ప్రకృతి స్వరూపిణియైన స్త్రీ తన ననుసరించెడి పురుషునకు ప్రకటించును. అట్టి రహస్యములన్నియు ఆమె ఆధీ

నములో నుండును. 'కుల' మనగా పాతివ్రత్యాది గుణశీలములు, గృహము అని అర్థములు నిర్ధారితములై యున్నవి.

భావనా జగత్తు నుండి భౌతిక జగత్తునకు దిగిరానిదైన స్వేచ్ఛాప్రణయ వాహినిని భౌతిక జగత్తులోనికి దింపి వివాహ వ్యవస్థ యను ప్రవాహము లోనికి ప్రవహింప జేసి దాంపత్య జీవనపు ఇలాతలంలోని పొలాలకందజేసిన వారికో విశ్వనాథ,నాయని ముఖ్యులు. "గిరికుమారుని ప్రేమ గీతాలు,సౌభద్రుని ప్రణయ యాత్ర, ఫలశ్రుతి"–యీ కులపాలికా ప్రణయమును చిత్రించిన కావ్యములు

గిరికుమారుని ప్రేమగీతాల ద్వారా విశ్వనాథుని కులపాలికా ప్రణయాన్ని, తత్సిద్ధాంత సమన్వయాన్ని పరిశీలించినచో 'భార్య' కుల పాలికా ప్రణయమున వర్ణింపబడినది. "ఉరుములో తమ హృదంతరాలు ధ్వనిస్తున్నా"యంటాడు కవి ఒక చోట. భార్యాభర్తలైన వారిరువురి ఆత్మధ్వనులు "లోకనాథ చరణ జనిత రావము"లన్న మాట.

ఇది విచిత్రమ్మ నాకు నాకే–మదీయ
హృదయమున నన్ననే ప్రతిష్ఠించుకొనుచు
స్నిగ్ధ దేవతామూర్తిని నేన పూజ
చేసికొందు నను వరలక్ష్మీ దయితుని–

శారీరకంగా వారు భిన్నులైనా తనలో ఆమె ఆమెలో తాను ఉన్నారని– ఒండొరులలో ఏ ఒక్కరు పూజించుకున్నా అది ఇరువురికి చెందుతుందనే ఆరాధ్య భావనను వ్యక్తం చేశాడు.

దృక్ సంగమం + మన స్సంగమం తర్వాత సంకల్పమే ప్రేమ. ప్రణయాన్ని పొందు పర్చేవి హేతువులైనవి శీలం, సౌందర్యం, కులీనత ఆత్మ గత తత్ప్రణయం మొదలైన వాటిని పేర్కొంటూ తన కామెపై గల సుదృఢమైన ప్రేమను ఉన్నతంగా చమత్కారంగా చిత్రిస్తాడు.

"పాపమిట్లు నిరాకరింపబడి కూడ
నా యెడల నిత్యమునుఁ బ్రసన్నము లెసుమ్ము

నీదు సౌందర్య శీలముల్ నీ కులీన
తయును నీ యట్టి దగు నగాధంపు ప్రేమ''

కల్పనా సమర్థమైన సుద్భధమైన ప్రేమ బంధం ఎలా కల్గిందో చెపుతూ–

''ఇన్ని నాళ్ళకు తెలిసినదీ ప్రణయపు
సుద్భధ బంధ కారణము నా యెన విధేయ
మై పసి తనంపు నాటి పిత్రాజ్ఞ నెంచి
జనని యనుమతి గని భక్తి వినతమయ్యె"

అని వెల్లడిస్తూ,

''ఈ శరత్పూర్ణిమా చంద్రికా సుధా మ
రిచిలో నున్ననేను స్ఫారీభవన్న
వీన శంపాలతా కృతి పూనియుంటి
ఈ సగము నాకు నాకె కన్పింపబోదు''

అంటాడు. ఇందు శంపాలతాకృతి పొందినానని చెప్పబడినది. ఇట్టి తనూ విలాస శంపాలతాకృతి స్త్రీకి సమంజసము కాని పురుషునకు కాదు. ఐననూ 'పూనియుంటి' నని చెప్పడం చేత అర్ధనారీశ్వరత్వాన్ని పొందినాడన్నమాట. ఆమెకు తనకు అభేదం చెప్పబడుటే కాక ఆతనిలో భాగమే ఆమె అని చెప్పబడినది.

తన దివ్యత్వాన్ని చాలాచోట్ల వ్యక్తం చేశాడు విశ్వనాథ. తానామెను పార్వతీదేవి వలె భావించి.....

ప్రాతరమృత నిష్యంద సీరజ మృదు తర
నవ్యతనువల్లి నిండ జందన మలంది
మద్భుజాశ్లేషితాంక సంవలిత పగు గ
శమ్ము కాలాగురు కళంకితమ్ముజేసి

కమ క్రస్తూరికా తిలకమ్ము దిద్ది
ఫాల సీమ బంగరు చంద్ర వంక పొదిపి

దీర్ఘ రమ్య సీమంత వీధిక గనులను
కృప విభూతి రేఖలను దీర్ఘీకరించి..."

రంగారు బంగారు అలంకారం చేస్తానంటాడు.

"అస్మదీయ పురాకృతమైన పుణ్య
మింతయని యిట్టిదని నాకు నెరుగబడని
వేళలో నీవు మత్కంత విదళనక్రి
యార్థ కల్పిత శిలవని యాదుకొంటి"

అని వివరిస్తాడు కవి. ఇట్టి చిత్త శుద్ధి విషయమైన ఉదాత్త మధురిమతో స్మరింపబడిన పదతి సౌభాగ్య పుష్కలతకు మేరలుండునా? అట్టి ఆమె అపాంగ రేఖా చలన్మంద హాస వాహినీ తరంగాలకు గుండె చలించి ప్రేమగీతాలు వ్రాసినాడు విశ్వనాథ.

"ప్రాక్కవిపశ్చిన్మతంబున రసము వేయిరెట్లు గొప్పది, నవకథా కృతిని మించి" అని శ్రీ మద్రామాయణ కల్ప వృక్షంలో తెల్పిన విధముగా

"మన్మనోజ్ఞతనూ వినిర్మాణ కలిత
భూత పంచీకరణ వేళ మొగ్గుబడి ర
సమ్ము కావలయు గాక ఆషాఢ గతున
కంబుదనకేల నా హృదయంబుకరుగు ?

అంటాడు.

అంబుదుడు రసాత్మకుడు. రసమూర్తి. బహుధానిష్టమై తద్రస ముండుటచేత అంబుదుడు నీలదేహుడు. గిరికుమారుడు విశ్వనాథుడు – ఓయీ! నేనూ నీవలె నీలదేహుడను అంటాడు. మబ్బువలె ఈతడెట్లు నీలదేహుడు కాగలడు? "రసోల్బణంవల్ల. ఎందుకంటే పూర్వులు 'శృంగారం' యొక్క వర్ణము 'నీల' మని విదితం చేశారు. శ్రీకృష్ణుడు నీలదేహుడై శృంగార పురుషుడై హేతువుగా కన్పిస్తున్నాడు. కావున శృంగారమూర్తియై నీలదేహు

డైనాడు విశ్వనాథుని గిరికుమారుడు. తనకు తత్సనాతన శృంగారమూర్తి కృష్ణమూర్తికి అభేదాన్ని అద్వైతాన్ని నిరూపించినాడు

"ఈ ప్రణయపయోరాశి మధించినాను
ఆ కవ్వపుగిరి మనస్సహి పతిగను....."

ఆశయను కవ్వపు కొండతో ప్రణయపయో రాశిని చిలుకగా హాలాహలం పుట్టింది. దాని నాతడు జ్ఞానాకృతిచే గొంతున నిముడ్చుకొనినాడట. దానితో ఆమె తాను ఒకటైనారట. ఆతడు సూర్యుడు ఆమె ప్రొద్దుదిరుగుడు పూవు. ఆమె సుధాస్రవంతిక తాను శారదా స్వచ్ఛ విజ్ఞానమూర్తి. ఆతడాకాశము ఆమె వృథ్వి. అతడు సాగరుడు ఆమె సాధుజిలసరిత్తు. తామిరువురు కృష్ణలో జమిలి నావల వంటివారట. కులపాలికా ప్రణయ ధర్మపు పాదున పూచిన పూవుల గుబాళింపులే ఈ కావ్యం.

"ఈ సుకవినైన నాజన్మమెల్ల దేవి
ఆచ్చపు తెలుంగు పడతివైనట్టి నిన్ను
మరల నా తేనె పాటగాఁగలగబోయు
త్వత్పదార్పితమ్ముగ నేను ధరవోతు"

పత్రికారచన : పరిణామాలు, ప్రయోజనాలు

శ్రీ పి. ఎస్. ఆర్. ఆంజనేయశాస్త్రి

వార్తయందు జగము వర్తిల్లుచుండును. అనేది భారతసూక్తి దీనికి 'వర్థిల్లుచుండును'' అని పాఠాంతరం కూడా చెప్పుకోవచ్చు. వార్త అంటే; వృత్తాంతం, సమాచారం, నడవడి, జీవనోపాయం, అర్థానర్థాల్ని తెలిపే శాస్త్రం, ఒకరకం పాషాణం అని అర్థాలున్నాయి. వృత్తాంతానికి మళ్ళీ కథ, చరిత్ర, ఉదాహరణ, వ్యాపారం అనే అర్థాలు కూడా కద్దు. నలుగురికి తెలియ దగిన అంశాన్ని సమాచారం అనడం సరేసరి. నడవడుల్ని గురించిన విషయాలుకూడా వార్తలవుతాయన్నమాట వివిధ వృత్తులు వాటి సాధకబాధకాలు జీవనోపాయం క్రింద వార్తగానే లెక్కించుకోవచ్చు. అర్థానర్థాల్ని తెలిపేశాస్త్రం అనేది ఆర్థికశాస్త్రానికి చెల్లుతుంది, రాజకీయాలకూ చెందుతుంది. దీన్ని బట్టిచూస్తే, వార్త యందు జగమువర్తిల్లు (వర్థిల్లు) చుండును అనేది ఒక సమగ్రస్వభావాన్ని స్ఫురింపజేస్తుంది. నేటి పత్రికలకు ఇది పూర్తిగా వర్తిస్తుంది వ్యాసుడు సూత్రీకరించిన బ్రహ్మసూత్రాలు బ్రహ్మాండ నిర్మాణానికి, అధ్యాత్మశాస్త్రానికి చెందినవే కావచ్చుగాని, ''వార్తయందు జగము వర్తిల్లుచుండును'' అనే సూక్తి పత్రికా రచనకు సంబంధించిన బ్రహ్మసూత్రం లాంటిది.

ఏదైనా 'వార్త'ను నలుగురికీ చెప్పడానికి, నిర్ణయాలు తీసుకోడానికి ఎక్కడికక్కడే రచ్చబండ ఉంటుండేది. క్రమంగా ముద్రణా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన తరువాత పత్రికలు ముద్రించడం అలవాటైంది తెలుగులో మొదటి పత్రికలు మతపరంగానూ, సాహిత్యపరంగానూ వెలువడ్డాయి. మొదటి పత్రికేది? పత్రికా ప్రచురణకు అవసరమైన అచ్చుయంత్రం పుట్టుపూర్వా

లేమిటి? – ఈ విషయాలన్నీ ఇప్పటికే చాలామంది అనేకరీతుల్లో చర్చించారు. వాటిజోలికి పోవడం ఇప్పుడు పిష్టపేషణం అవుతుంది. కానీ ఒక్క సంగతి మాత్రం అనుకుంటేచాలు. మొట్టమొదటి పత్రికఅంటూ, రాయలసీమప్రాంతంలో క్రైస్తవ మిషనరీల ఆధ్వర్యంలో ముద్రణ అయింది; ఆతర్వాత సాహిత్య సిద్ధాంత రాద్ధాంతాలకు వాదోపవాదాలకు పత్రికలు గోదావరీ మండలం నుంచి ఆవిర్భవించాయి. ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియలన్నింటికీ ఆద్యుడై యుగ కర్తగా ప్రశస్తుడైన కందుకూరి వీరేశలింగం ఈ పత్రికా రచనకు కూడా ప్రచారంతెచ్చినవాడేనని, అందులోనూ ప్రథముడనీ చెప్పకతప్పదు. మనసినిమా పరిశ్రమలాగానే, మన పత్రికా పరిశ్రమకూడా మొదట ప్రవాసాంధ్ర పరిశ్రమలా గానేఉండి, తర్వాత ఉమ్మడి మద్రాసురాష్ట్రం రాజధాని అయిన చెన్నపట్టణంలో కాలూనింది. పరిపాలన భాషాప్రయుక్తంగా వికేంద్రీకరణకు గురిఅయినట్లే, పత్రికలు కూడా క్రమేపీ వికేంద్రీకరించడం జరిగింది. సాహిత్య స్పర్థల్ని వెళ్ళగ్రక్కుకోడానికి నడిపించిన కొన్ని పత్రికల స్వరూప స్వభావాల్ని మినహాయిస్తే 'వార్త' అనే పదానికి సరైన నిరూపణగా పత్రిక అంటూ ప్రజాదృష్టికెక్కింది 'ఆంధ్రపత్రిక'. దానికొక జాతీయచరిత్ర ఉంది. అలాటి చరిత్ర హైద్రాబాద్‌లో 'గోల్కొండ పత్రిక'కు ఉండేది. 'ఆంధ్రపత్రిక' నుంచి ఇంకా రాబోతున్నాయనిపిస్తున్న పత్రికలదాకా పత్రికారచన రకరకాల దశలుదాటింది.

పత్రికారచనంటే పత్రికల్లో ముద్రించే దాన్నిరాయడం అలారాసేవారిని పత్రికారచయితలంటున్నాం. ఇంకో విచిత్రమైన పేరుకూడా వాడ్తున్నారు– పాత్రికేయులని. ఆ పదం నాకు నచ్చదు. అది అపత్యయార్థకమైన తద్ధిత ప్రయోగం: ఆంధ్రికేయుడు, గాంగేయుడు, కౌంతేయులులాగా పాత్రికేయులంటే పత్రికలకు పుట్టినవారనే అర్థంవస్తుంది. వారు పత్రికల్ని పుట్టించేవారుగాని, పత్రికలకు పుట్టినవారుకాదు. జర్నలిస్టుల్ని – అందువల్ల – పాత్రికేయులనడం కన్న పత్రికా రచయితలనడమే సబబు. పాత్రికేయులంటే పత్రికకు సంబంధించినవారనే సంబంధార్థకమైన తద్ధితం కావచ్చుకదా అన్నప్పటికీ – పత్రికారచనకు సంబంధించని అనేకమంది పత్రికకు సంబంధించి పని చేస్తుంటారు. కాబట్టి ఆ విధంగాకూడా జర్నలిస్టును పాత్రికేయుడనడం సరికాదు. జర్నల్ అంటే పత్రిక, జర్నలిజం అంటే పత్రికారచన, జర్నలిస్టు అంటే పత్రికా రచయిత.

రంగు, రుచి, వాసనా లేకుండా వార్త ప్రకటించడం తొలినాళ్ళలో ఆదర్శం. ఇప్పటి పద్ధతి అందుకు పూర్తిగా విరుద్ధం. ముద్రణలో, రాయడంలో అభిప్రాయ స్ఫురణలో రంగు, రుచి, వాసనా లేకపోతే ఇప్పుడు వార్త అరుచిగా ఉంటుంది. మొదట్లో వార్త 'పిరమిడ్ పద్ధతి'లో రాసేవారు. ఇప్పుడంతా 'ఇన్వర్టెడ్ పిరమిడ్‌పద్ధతి' అనుసరిస్తున్నారు. 'బొంబాయిలో కాంగ్రెస్ మహాసభలు జరిగినవి...నెహ్రూపండితుడు మాట్లాడిరి... క్విట్టిండియా నినాదములు మార్మ్రోగెను... ఆతీర్మానమును మహాసభలామోదించినవి. అనే పద్ధతిలో అనగనగా ఒక రాజంటూ మొదలుపెట్టి ప్రధానాంశం చివరవరకు చెబుతూ వార్త రాసే 'పిరమిడ్‌పద్ధతి' పోయింది. విశాలప్రాధాన్యంగల ముఖ్యాంశం ముందుచెప్పి తర్వాత మిగతా విషయాలు రాసుకొచ్చే 'ఇన్వర్టెడ్ పిరమిడ్ పద్ధతి' వార్తారచన బహుళానుసరణకు వచ్చింది. వైవ్ డబ్ల్యుస్ అండ్ హెచ్ అనేది వార్తనిర్వచనం. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు, ఏమిటి, ఏ విధంగా అనే అంశాలు వార్తలో స్పష్టంకావాలి. అప్పుడే అది సమగ్రవార్త. ఈ లక్షణాలన్నీ పరిపూర్తి చేస్తేనే వార్తకు సాధికారత్వం లభిస్తుంది. ఏదైనా కొత్త అంశాన్ని ప్రజల దృష్టికి తేవడం 'వార్త'కు ప్రత్యేక లక్షణం. లభించిన ఒక సమాచారం నుంచి ఒక ప్రత్యేక అంశాన్నో, అపూర్వ విషయాన్నో పైకి తేవడం, ఆ దృష్టితో వార్తను వ్రాయడం, అటువంటి ప్రత్యేకతకోసం అన్వేషించడం పత్రికా రచయిత నిరంతర కృషి. ఒకే వార్తను అనేక పత్రికలు అనేక దృక్కోణాలతో, అనేక విధాలుగా ప్రచురిస్తుంటాయి. వార్తలో ప్రత్యేకాంశం, కొత్తసంగతి ఏమిటో కనిపెట్టి దాన్ని ప్రస్ఫుటం చెయ్యడం – ఒక్కొక్కరొక్కొక్క పద్ధతిలో చేస్తుంటారు. అది వారి విజ్ఞానం, సంస్కారం, నైపుణ్యాలమీద ఆధారపడే ప్రత్యేకత. ఇక్కడ జర్నలిస్టు వ్యక్తిత్వం వెలుగులోకి వస్తుంది. ఇదే వార్తకు వైవిధ్యాన్ని సంపాదించిపెడుతుంది.

దేశం స్వాతంత్ర్య సాధనకు ముందున్న పద్ధతివేరు, తర్వాత పెరిగిన పద్ధతి వేరు. రాజకీయపార్టీలోనే కాదు, ఈ సంగతి ప్రతిరంగంలోనూ కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే ఉంటోంది. పత్రికారంగం కూడా ఇందుకు భిన్నం కాదు దానికి కారణం – అప్పట్లో ప్రతివారికీ స్వాతంత్ర్యం సంపాదించుకోవాలనే జాతీయ లక్ష్యం ఉండేది; స్వాతంత్ర్యం సంపాదించుకున్నాక ప్రతివారికీ ఒకే లక్ష్యం మళ్ళీ ఏర్పడింది. అది, దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న తాప

త్రయం. దానితో ప్రతిరంగానికీ వ్యాపారం, లాభార్జన ప్రధాన లక్ష్యమై పోవడంతో పత్రికలుకూడా ఇప్పుడు వ్యాపారాత్మకంగానే నడిచితీరవలసిన పరిస్థితులే ర్పడుతున్నాయి. ప్రజల్ని నడిపించడం అప్పటి పత్రికల ఆశయమైతే, ప్రజల్ని ఆకర్షించుకోవడం యిప్పటి పత్రికల మనుగడ అవుతోంది. ఓట్లు సంపాదించుకోడానికి రాజకీయ పార్టీలు వేసే ఎత్తులు, డబ్బు రాబట్టుకోడానికి సినిమాల్లో ప్రదర్శించే ట్రిక్కులు, సర్కులేషన్ పెంచుకోడానికి పత్రికలు అనుసరించే గిమ్మిక్కులు కాలానుగుణంగా 'నువ్వా నేనా' అన్నట్లేఉన్నాయి. పత్రికల సంపాదకీయాలకు ఈ రోజుల్లో ఉన్న "ప్రాధాన్యం" ఈ పరిస్థితిని చెప్పక చెబుతుంది.

"ప్రాధాన్యం" పదానికి ఇన్వర్టెడ్‌కమాస్ పెట్టాను. అంటే ఆ పదానికి ఉన్న అర్థానికి పూర్తి వ్యతిరేకార్థం వస్తుందన్నమాట. వ్యంగ్యానికి కూడా ఈ ఇన్వర్టెడ్‌కమాస్ ఒక సంకేతం. ఇంగ్లీషు భాషలోని పంక్చుయేషన్ గుర్తులు మన భాషకు కొత్త అర్థాలు స్ఫురింపజేయడం, వాటిని మనం సొంతం చేసుకోడం ప్రతికారచన తిరిగిన అనేక మలుపుల్లో ఒకటి ఇన్వర్టెడ్‌కమాస్ కావడంద్వారా ఆ మధ్య దినపత్రిక లెజిస్లేచర్–జుడీషియరీల మధ్య ఉవ్వెత్తున వివాదానికి హేతుభూతమైన విషయం జ్ఞాపకం ఉండే ఉంటుంది. ప్రశ్నార్థకం, ఆశ్చార్యార్థకం గుర్తులన్న నా వార్తకు ఒక అభిప్రాయస్ఫురణను కలిగిస్తాయి. వార్త రాసే పద్ధతినుంచి శీర్షికలు పెట్టడం, వార్తను పేజీ పైభాగంలో ప్రచురించడం లేదా దిగువ భాగంలో ప్రచురించడం, మొదటి పేజీలో ప్రచురించడం, సింగిల్ కాలమ్ శీర్షిక కాకుండా, రెండు కాలాలకు మూడు కాలాలకు, ఒక్కొక్కప్పుడు పెద్ద అక్షరాలతో ఎనిమిది కాలాలకు కూడ శీర్షిక విస్తరించడం– ఇలా రకరకాల పద్ధతులవల్ల ఆ వార్తకు ఆ పత్రిక దృష్టిలో ఉన్న ప్రాధాన్యం వ్యక్తమవుతూ ఉంటుంది. తొలిరోజుల్లో పత్రికలు చూస్తే సింగిల్ కాలం శీర్షిక – అదీ అతి సాదాగా – పెట్టేవారు. 'గాంధీ అసాసినేటెడ్' అని సింగిల్ కాలంలో శీర్షిక పెట్టి ప్రచురించిన పత్రికలు కూడా ఉండేవి. 'హిందూ' పత్రికలో, 'ఆంధ్ర పత్రిక'లో చాలాకాలం సింగిల్ కాలం శీర్షికలే ఉండేవంటే ఇప్పుడా ఆశ్చర్యమనిపిస్తుంది. శీర్షికల్ని బట్టి పత్రిక పాలసీ ఏమిటో తెలిసిపోయే దశకు జర్నలిజం పెరిగింది. శీర్షిక లెందుకు? పాఠకుల్ని ఆ వార్త వైపు ఆకర్షించడానికి. ఆ లక్ష్యం నెరవేరడంకోసం చిత్రవిచిత్రంగా శీర్షికలు పెట్టడం కూడా ఈ రోజుల్లో ఒక నేర్పు ఉదాహరణకు–ఒక దినపత్రిక ఆమధ్య మంగళగిరి నియోజకవర్గం ఎన్నికల ఫలితం ప్రచురించిన వార్తను 'వద్దంటే వెళ్లాను మంగళగిరికి' అనే శీర్షికపెట్టింది. ఆశీర్షికను బట్టి ఫలితమేమిటో, అభ్యర్థి

పట్ల పత్రిక అభిప్రాయమేమిటో సాధారణ పాఠకుడికికూడా అర్థమైపోయే శైలి కనిపిస్తుంది. వార్తలు రాసే పద్ధతి, శీర్షికలుపెట్టే పద్ధతినిబట్టి ఆయా సమస్యల పట్ల పత్రికపాలసీ ఏమిటో ప్రస్ఫుటమైపోతున్నప్పుడు. క్రమక్రమంగా సంపాదకీయాల ప్రాముఖ్యం తగ్గిపోయింది. నిజం చెప్పాలంటే ఈ రోజుల్లో పత్రికల సంపాదకీయాలు అంత శ్రద్ధగా చదివేవారు లేరంటే అతిశయోక్తి కాదు పూర్వంలో పత్రికలు సంపాదకీయాలద్వారా ప్రజలకు మార్గదర్శకత్వంవహించేవి. ఇప్పటి పత్రికలు సంపాదకుడినుంచి ఎంతో కొంత పనిరాబట్టడం కోసం సంపాదకీయాలు ప్రచురిస్తున్నాయా అనే అభిప్రాయం కలిగించడం అసత్యం కాదు. అయితే, ఈనాటికీ, సంపాదకీయాన్ని చదివి విశ్లేషించుకొనే పాతకాలపు మేధావులు ఉన్నప్పటికీ, వారి సంఖ్యమాత్రం స్వల్పం అనడం నిర్వివాదం. కాని, ఒకప్పుడు, ముఖ్యంగా 1947 కు ముందు పత్రికల సంపాదకీయాలు ప్రజలకు మార్గదర్శకత్వం వహించాయి. ముట్నూరు కృష్ణారావుగారు నిర్వహించిన కృష్ణాపత్రిక, కాశీనాథుని నాగేశ్వర్రావుగారు నడపిన ఆంధ్రపత్రిక, సురవరం ప్రతాపరెడ్డిగారు ఆధ్వర్యం వహించిన 'గోలకొండ పత్రిక', నార్లవెంకటేశ్వరరావుగారు వ్రాసిన ఆంధ్రప్రభ సంపాదకీయాలు అప్పట్లో జనజీవితానికి దారిచూపించాయి. రాజకీయ రంగంలోని వారికి కరదీపికలుగా ఉండేవి. మహాత్మాగాంధి, ఖాసాసుబ్బారావు, ఈశ్వరదత్తు, కోటంరాజు రామారావు, కోలవెన్ను రామకోటేశ్వరరావు మున్నగు వారిని ఈ సందర్భంలో సంస్మరించుకోడం ఉత్తమ పత్రికారచనకు కొంత ఊపిరి ఇవ్వడం వంటిదే అవుతుంది. పత్రికాభిప్రాయాల్ని మన్నించడం అప్పటి నాయకుల్లో కూడా ఉండేది. ఇప్పుడు నాయకులదారి నాయకులది, పత్రికలదారి పత్రికలది, ప్రజలదారి ప్రజలది ప్రతివారూ స్వతంత్రులే, ఒకరి నుంచి ఒకరు బాగుపడవలసినదంటూలేదనే అభిప్రాయం లోలోన మెదులుతున్నప్పటికీ పైకి మాత్రం ప్రజాస్వామ్యం, ప్రజాభిప్రాయం, పత్రికాస్వేచ్ఛ, రాజకీయశాశనం అంటూ ఉండడం పరిపాటి.

ఆ నాటి పత్రికలు ఏదైనా విషయాన్ని రాశాయంటే, కేవలం జాతీయ ప్రయోజనం ఒక్కటే లక్ష్యంగా ఉండేది. ఏ ఉద్యమాన్ని బలపరిచినా, దేన్ని తెగడినా బహుజనహితంకోసమే జరిగేది. నాటి పత్రికలకు రాజకీయమైన పార్టీ అండదండలు ఉండడం ఎవరూ ఎరుగరు. అందుకని నాటి అభిప్రాయాలు స్వచ్ఛందమైనవిగా, లోకకల్యాణానికి ఉద్దేశించినవిగా ప్రజలు నమ్మేవారు.

స్వాతంత్ర్యానంతరం ఈ వాతావరణం పూర్తిగా మారిపోయింది. రాజకీయాలు వ్యాపారమూ, జీవనోపాధి అయినట్టి పత్రికలు కూడ వ్యాపారమూ జీవనోపాధిగా మారిపోవడం ఇప్పటి అనుభవం. ఆ రోజుల్లో ఒక పత్రిక వస్తోందంటే, అది ఎటువంటి మార్గదర్శకత్వం వహించగలదోనని ఆసక్తి వుండేది. ఇప్పుడొక పత్రిక వస్తోందంటే, దీకి వెమక ఏ పార్టీ వుంది లేదా ఏ వ్యక్తులున్నారు, ఇక వారి వారి కొమ్ము కాయడాని కే పత్రిక పనికివస్తుంది–అనే అభిప్రాయాలతో ప్రజలు ఆలోచించడం కూడా మొదలైంది. క్రమశః ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి జర్నలిజాన్ని ఆశ్రయించడం కూడా జరుగుతోందని కొంత ఆత్మ పరీక్ష చేసుకుంటే తెలుస్తుంది. ఈ విధంగా పత్రికారచనా, ప్రజాజీవితం రెండు ప్రత్యేక రంగాలుగా, రెండు ప్రయోజన సాధనాలుగా మారిపోవడంతో పరస్పర గౌరవం కోల్పోయాయనవచ్చు. పత్రికా విమర్శల్ని లెక్కించని తత్వం ప్రజా జీవితంలోనివారికి, ప్రజా జీవితంలోని లోటుపాట్లను పరిమిత ప్రయోజన లక్ష్యంతో తూర్పారబట్టడం పత్రికా విమర్శలకు పరిపాటి అనేభావం ప్రజల్లోనూ కలుగుతోంది. దీనితో ప్రజలు పత్రికల్ని మార్గదర్శకత్వం కోసం కాకుండా, కాలక్షేపంకోసం చదవడం ప్రారంభించారు. ఇందువల్ల పత్రికలు ప్రజల్ని ఆకర్షించుకొనే మార్గాలు వెతకడానికి పోటిపడవలసి వస్తోంది. ప్రజలకు మార్గదర్శకత్వం వహించగల మేధావి స్థాయినుంచి పత్రికా సంపాదకుడు, పత్రికల సర్క్యులేషన్ పెంచే గిమ్మిక్స్ మాస్టర్‌గా పరిణామం చెందవలసి వస్తోంది. పత్రికలు, మన సినిమాల్లాగానే నవరస కషాయాలుగా తయారుకావలసి వస్తున్నాయి. ఈ పత్రికా వ్యాపారం మధ్య ప్రజలకు–కొన్ని వర్గాలకైనా–కిక్ ఎక్కించడంకోసం ఎల్లో జర్నలిజం కూడా తన పురివిప్పుకొని విన్యసించడం చూస్తున్నాం. పత్రికా విమర్శల్ని లెక్కచేయనంతటి మందపు చర్మం ప్రజా జీవితంలో వుంటున్న వాళ్ళు పెంచుకోవడంవల్లనే ఎల్లో జర్నలిజం కూడా అవసరమైందేమోననిపిస్తుంది. అధ్యయనంకాదు ఆకర్షణ, మార్గదర్శకత్వంకాదు ఉద్రేకపరచడం, జాతీయ ప్రయోజనంకాదు పరిమిత పక్షపాతవైఖరి, ప్రతిభా ప్రోత్సాహంకాదు గ్రూపిజం, అభిరుచులు ఔన్నత్యంకాదు ఎవరేది కోరితే అది అందివ్వాలనేతత్వం పత్రికారంగంలో కనిపిస్తోందంటే–ఆశ్చర్యంకాదు. అన్ని జీవనరంగాల్లో లాగానే పత్రికా రంగం కూడా ఎన్నో మార్పులకు లోనైంది, లోనుకావలసిన పరిస్థితులు చుట్టుముట్టాయి. అయినప్పటికీ పత్రికా రచనలో ప్రమాణాల్ని, పరిశ్రమను, ఉన్నత ప్రయోజనాలను సాధించడానికి ఇప్పటికీ

కృషి జరుగుతూనే వుంది. క్లాస్ పత్రికలు, మాస్ పత్రికలు అనే వర్గీకరణకు ఈ పరిస్థితి దారితీసింది. ఆకర్షణ, వ్యాపారం ప్రధాన లక్ష్యంగా నడిచేవి మాస్ పత్రికలు; అభిరుచి, అధ్యయనం ముఖ్య లక్షణంగా నడిచేవి క్లాస్ పత్రికలు. వర్గ చైతన్యం, వర్గ పోరాటాల మూలంగా ఆర్థికంగా వర్గ నిర్మూలన జరిగినప్పటికీ మేధాపరంగాను, అభిరుచి పరంగానూ వుండే వర్గాలను తొలగించడం మాత్రం అసాధ్యం. అప్లయిడ్ ఆర్ట్స్ అన్నింటిలోనూ క్లాస్–మాస్ తేడాలు తప్పవు. పత్రికా రచన కూడా సాహిత్య సంబంధమైన అప్లయిడ్ ఆర్ట్.

మొదట్లో పత్రికలు సాహిత్య వివాద పరంగా పెంపొందాయకున్నాంకదా! సాహిత్య ప్రమాణాల పరంగానే పత్రికా రచన వ్యాపిస్తూ వచ్చింది. గ్రాంథికంగా సాగిన పత్రికా రచన వ్యావహారిక భాషోద్యమ పరిణామంగా శిష్టవ్యావహారికం లోకి పరిణమించింది. ఇప్పుడు శిష్ట వ్యావహారికం కూడా మరింత సరళమైంది. సాహిత్యం తర్వాత పత్రికారచనకు ప్రధానమైన ఆలంబనం స్వాతంత్ర్యోద్యమం తర్వాత రాజకీయ రంగం తొలి రోజుల్లో రాజకీయాల్ని సాహిత్య స్థాయిలో నిలిపి పత్రికలు చర్చించాయి. క్రమంగా సాహిత్యాన్ని కూడా రాజకీయాల స్థాయికి తెచ్చి పత్రికలు చర్చిస్తున్నాయి. ఈ మార్పుకు కూడా కారణం–1950 కన్న ముందు పత్రికా రచనను ఒక ఆశయ సాధనకోసం సాధనంగా చేసుకున్నారు. ఆ తర్వాత పత్రికా రచన ఒక వృత్తిగా, వ్యాపారంగా పెంపొందడం అధికమైంది. పత్రికా రచన ఇప్పుడొక మీడియంగాని వెహికల్‌గాని కాదు; పత్రికా రచన ఇప్పుడొక ఉద్యోగం, వృత్తి. ప్రియురాలుగా యువతిపట్ల వుండే భావం, గృహిణిగా యువతిపట్ల వుండే భావం ఒకరకంగా వుండవు కదా! 1950 కి ముందు పత్రికా రచన ప్రియురాలు వంటిది; ఆ తర్వాత పత్రికా రచన గృహిణి వంటిది. ప్రియురాలు ఎలావున్నా, ఏంచేసినా, ఎన్ని ఆసౌకర్యాలున్నా అదొక త్రిల్. గృహిణి అయ్యేటప్పటికి కొన్ని రొటీన్‌గా కోర్కెలు, బాధ్యతలు, హక్కులు, ఆరాటాలు, అసంతృప్తులు, ఆవేదనలు, ఆనందాలూ అన్నీ కలబోసుకొంటాయి.

వృత్తిగా పత్రికా రచన 1950 ముందుకన్న ఎన్నో భద్రతల్ని, సదుపాయాల్ని, చట్టపరమైన హక్కుల్ని పొంది ప్రత్యేకస్థాయి నందుకొంది. ఒకప్పుడు కష్టమయంగా, త్యాగమయంగా వుండే పత్రికా రచన ఇప్పుడు గ్లామర్

రంగంగా మారిందన్నా తప్పులేదు. ఒకప్పుడు ప్రజాపూజ్యంగా ఉండే పత్రికా రచన ఇప్పుడు రాజపూజ్యంగా కూడా మారింది. పత్రికా విలేఖరులు, పత్రికా ప్రతినిధులు ముందుపీటకు అర్హులై ఆదరణీయులవుతున్నారు సుమారు 80వ సంవత్సరాల తెలుగు పత్రికారచనా వ్యాసంగం ఇప్పటి స్థాయికి రావడానికి అష్టకష్టాలూ పడ్డ పయోనీర్లకు నివాళులు.

జర్నలిస్టులంటే ఎవరు? పత్రికలకురాసేవారన్నంత మాత్రాన: సంపాదకుడికి లేఖలు రాసేవారు, పత్రికల్లో ప్రచురణకు వ్యాసాలు, కథలు, కవితలు, నవలలు రాసేవారు కూడా జర్నలిస్టులుకారు. సంపాదకీయాలురాస్తూ పత్రికల సంపాదక విభాగం నిర్వహణకు ఆధిపత్యం వహించే సంపాదకుడు, సంపాదకుడి ఆదేశం ప్రకారం ఆయాబాధ్యతలు నిర్వహించే అసిస్టెంట్ ఎడిటర్లు, న్యూస్ ఎడిటర్లు సబ్ ఎడిటర్లు ఆదివారం అనుబంధం నిర్వహించే ఉపసంపాదకులు, ఆయా వార్తలతో, ఫోటోలతో కంటికింపుగానూ వార్తా ప్రాముఖ్యం స్పష్టంచేస్తూనూ పేజీలు సిద్ధంచేసే మేకప్ ఎడిటర్లు, వీరంతా జర్నలిస్టుల కోవలోకివస్తారు. ప్రెస్ ఫోటోగ్రాఫర్లు, ఇప్పుడెక్కువగా ఆఫ్‌సెట్ ముద్రణ విస్తరిస్తున్నది కాబట్టి లేఅవుట్ ఆర్టిస్టులు, ప్రూఫ్‌రీడర్లు జర్నలిస్టుల వర్గం క్రిందకే చేరుతారు. వీరంతా కలిసి రూపొందించే పఠనీయమైన పత్రికలు, వాటి స్వరూప స్వభావాలూ కూడా పాఠకుల అవసరాలను తీర్చే విధంగా భిన్నభిన్నంగా శాఖోపశాఖలుగా వర్ధిల్లుతున్నాయి,

అందరి దృష్టిలోనూ పత్రికంటే ముఖ్యంగా దినపత్రిక స్ఫురిస్తుంది. జర్నలిజంలో ప్రధానంగా ఆక్రమించుకుంటున్నది కూడా దినపత్రికే. ఇంతకుముందు ప్రస్తావించుకున్న అన్ని తరహాల జర్నలిస్టులూ దినపత్రికా రచనలో భాగస్వాములవుతున్నారు. తర్వాత అందరకీ తెలిసినవి—వారపత్రికలు. వారపత్రికల్లో ముఖ్యంగా రెండు విభాగాలు కనిపిస్తున్నాయి కథలు, నవలలు, ఇతర శీర్షికలతో ఓ ఆకర్షణీయమైన ముఖచిత్రంతోవచ్చే వారపత్రికలు ఒక విభాగం, రాజకీయ వ్యవహారాలకు, సమీక్షరచనలకు, అసెస్‌మెంట్ వ్యాసాలకు ప్రాముఖ్యం ఇచ్చే వారపత్రికలు మరో విభాగం. వార్తాపత్రికలు, కాల్పనిక సాహిత్య పత్రికలు, రాజకీయ పత్రికలు నడవడానికి పత్రికావిలేఖరులు. ఆయా పత్రికలకు అనేక కేంద్రాలనుంచి తమ సిబ్బందిద్వారా వార్తలు సేకరించి అందచేసే వార్తాసంస్థలు,

పత్రికలకు వివిధ విషయాలపై కావలసిన సమాచారవ్యాసాలను, ప్రత్యేకసమాచారాన్ని, ఇతర విశేషవ్యాసాలను అందించి సహకరించే న్యూస్‌సిండికేట్లు ముఖ్యాధారాలు. వీటిలోపనిచేసే పత్రికారచనా సంబంధమైనసిబ్బందిని కూడా జర్నలిస్టులంటారు.

ఇకపోతే - పక్షపత్రికలు, మాసపత్రికలు, అప్పుడప్పుడు ప్రచురణజరిగే పీరియాడికల్స్ కూడా జర్నల్స్‌గానే వ్యవహరిస్తారు. ఇవికాక బాలలకోసం ప్రత్యేకంగా, మహిళలకోసం విడిగా, సినిమారంగంగురించి వేరేగా పత్రికలుంటున్నాయి. శాస్త్రవిజ్ఞానం గురించి, క్రీడల్నిగురించి, ఉద్యోగసమాచారాల్నిగురించి, రకరకాల కాంపిటీటివ్ పరీక్షలకు పనికివచ్చే కామన్‌నాలెడ్జికి సంబంధించి కూడా పత్రికలు ఉన్నాయి. ప్రభుత్వాల పక్షాన ప్రచురించే పత్రికలు, రేడియో-ప్రోగ్రాములతో పాటు రేడియోలో ప్రసారమైన కొన్ని వ్యాసాలతోపాటు వచ్చే 'వాణి' వంటి పత్రికలు కూడా ఉన్నాయి. అయితే, సాధారణంగా దినపత్రికలు, వార పత్రికలు, ఇప్పుడు పేరొక్కన్న అన్ని తరహాల పత్రికల స్వభావాలకు తగిన శీర్షికల్ని నిర్వహిస్తూ సమగ్ర పత్రికలుగా కూడా వెలువడుతూడడం ఇటీవలి పరిణామం. దినపత్రికల్లో అనుదినం సినిమావార్తలు, కథలు, సీరియల్ నవలలూ ప్రచురణ అవుతున్నాయంటే జర్నలిజంలో పరిణమించిన వ్యాపారశైలికి వేరే తార్కాణం అక్కరలేదు.

ఇలా బహుముఖంగా విస్తరించిన జర్నలిజంలోగల భిన్నలక్ష్యాలను గురించి కూడా స్థాలీపులాకంగా పేరొక్కంటాను. వార్తను రంగువాసనలతో రాసే శైలితోపాటు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం అనేది ఇప్పుడు ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకుంది. దీనికి అమెరికాలో వాటర్‌గేట్ ఉదంతాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. బయటపడకుండా కుమ్మక్కయిపోయి ఉన్నఅక్రమాన్నో, రహస్యాన్నో వ్యతికారచయితలు తీసుకున్నచొరవ, తీసుకున్న పరిచయాలు, తమకున్న తెలివితేటల్ని ఉపయోగించి అవసరమైతే సామదాన భేదోపాయాన్నికూడా వాడి సంపాదించే పద్ధతిని, దాన్ని బహిర్గతంచేసి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే రచనను ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంగా పేరొక్కంటున్నారు. ప్రధానంగా ఇది క్రియా రంగంలో విస్తరిస్తోంది. ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం పేరుతో - ముఖ్యంగా ఇంగ్లీషు వార పత్రికల్లో-వస్తున్నదంతా ఆ పేరుతో చలామణీ అవుతున్నదేగాని నిజానికి అది

కాదు రకరకాల పత్రికల్ని ముందేసుకొని, ఒక అంశాన్ని గురించి ఆ అన్ని పత్రికల్లోనూ వచ్చిన విశేషాలన్నింటినీ క్రోడీకరించి, ఆ అంశం గురించి కాల క్రమేణా సంభవించిన పరిణామాలన్నింటినీ కూడా సమీక్షిస్తూ ఆకర్షణీయంగా రాసే సమగ్ర రచన ఇన్వేస్టిగేటివ్ జర్నలిజంగా అనిపించేట్లు ప్రచురించడం జరుగుతోంది అందరూ అన్ని పత్రికలూ చదివే అవకాశం ఉండదుకాబట్టి పాఠకులకు అదొక ప్రత్యేక రచనగా గోచరిస్తుంది. నిజానికి అదొక 'డైజెస్ట్' లాంటి రచన. ఇంగ్లీషు జర్నలిజంలో బాగా ప్రచారంలో ఉన్న ఈ డైజెస్ట్ పద్ధతి ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం కూడా తెలుగులో ఎక్కువగా కనిపించదు.

ప్రజల్లోకి ఎక్కువగా చొచ్చుకుపోగలిగేది పిక్టోరియల్ జర్నలిజం; అంటే ఫొటోలు ప్రచురించి వాటి ద్వారా వార్తను వ్యక్తం చెయ్యడం. దీని వల్ల పాఠకులు వార్తను గురించి తెలుసుకోవడమే కాక వార్తజరిగిన ప్రదేశంలో తాము ఉండి పాల్గొన్న తృప్తిపొందే సావకాశం ఉంది. అందుకనే, అనేక సమావేశాల్లో వేదిక మీద ఉన్న ముఖ్యవ్యక్తులకు గోడకట్టినట్లు చుట్టు మూటి ఫొటోగ్రాఫర్లు ఫోటోలు తీసుకుంటున్నప్పటికీ సహించకతప్పదు. ఆ సందర్భంలో అక్కడలేని అనేకవేలమంది పాఠకులకు అక్కడి దృశ్యాన్ని చూపించి తృప్తిపరచడానికి ఈ పిక్టోరియల్ జర్నలిజంకు ఉన్నశక్తి పెద్దది. ఒక కాలం పొడవు వార్తరాసినదానికన్న ఒక ఫొటో ప్రచురించి పాఠకుని ఊహాపోహలకు చిల్వలు పల్వలు కట్టేశక్తి నివ్వవచ్చు. తుఫానులు, ప్రసిద్ధ వ్యక్తుల అంతిమ యాత్రలు, శాస్త్రవిజ్ఞాన సంఘటనలు మొదలైన వార్తల విషయంలో పిక్టోరియల్ జర్నలిజంకుగల ప్రాధాన్యం ద్వారా ఆ విభాగం ప్రత్యేకతను అవగాహన చేసుకోవచ్చు. ఇందులో కార్టూన్ జర్నలిజం ఒక ముఖ్యశైలి ఒక వ్యాసం ద్వారా జరిగే విమర్శకన్న ఒక్క కార్టూన్ ద్వారా చెప్పగల విమర్శ మిక్కిలి నైశిత్యంగలిగినదన్న విషయం ప్రతివారికీ అనుభవంలో ఉన్న విషయమే సాధారణంగా పత్రికలురాగానే కార్టూన్లు, జోకులు తిరగవేసి పత్రికను పక్కకు పెట్టేవారు చాలామంది ఉన్నారు. రాజకీయపరమైన, సామాజిక వరమైన కార్టూన్లు పాఠకుల ఆలోచనలకు పదును పెట్టగల సాధనాలుకూడా.

రాజకీయపరమైన పత్రికా రచన తర్వాత అందరికీ కావలసినది సినిమా పత్రికారచన. రాజకీయాలు, సినిమాలు ప్రజలకు సమానంగా ఆసక్తిగల రంగాలు.

సినిమాపత్రికలుకూడా బాగా వ్యాప్తిచెందడానికి, అందులోనూ పాఠకులకు కిక్ ఇవ్వడం కోసం రకరకాల చవుకపారుతనం కూడా చోటుచేసుకోడం సినిమాల పట్ల ప్రజలకున్న ఆసక్తిని కాష్‌చేసుకోవడానికే. సినిమా జర్నలిజం కొంత ఇబ్బందికరమైంది కూడా. సినిమా ప్రముఖులతో వ్యక్తిగతంగా ఉండే సన్నం బంధాలను బట్టి ఈ జర్నలిజం పెంపొందగలుగుతుంది. సినిమా రంగంలోని కుళ్ళును, రాజకీయరంగంలో కుళ్ళును విమర్శించినంత సులువుగా విమర్శించడం వీలుపడదు నిజంగా సినిమా జర్నలిజం కత్తిమీద సాములాంటిది. సినిమావారితో మమేకమైనా అయిపోవాలి, లేదా నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరిగే ధన్యగుణమైనా ఉండాలి. పత్రికా పరంగాగాని, రచనాపరంగాగాని రాజకీయ పత్రికా రచయితకున్నంత స్వేచ్ఛ, మన్నన సినిమాపత్రికా రచయితకు ఇవ్వడంగాని, సినిమాపత్రికా రచయిత తన వ్యక్తిత్వంతో వాటిని సాధించుకోవడంగాని ఇప్పటివరకూ అరుదుగా ఉంది. అయితే సినిమాపత్రికలు పెరిగి, వాటిలోకూడా నిష్ణాతికత పెంపొందిన దరిమిలా సినిమాలపట్ల ప్రజల ఆవగాహన, అప్రీసియేషన్ ధోరణుల్లో మార్పుకలిగింది. సినిమా జర్నలిజం సినిమారంగాన్ని మార్చలేకపోయినా, ప్రజల్లో సినిమాల్ని గురించిన దృక్పథంలోమార్పు తేగలదనిస్తోంది.

బాలల పత్రికల రంగంలో తెలుగులో న్యాయపతి రాఘవరావుగారి 'బాల' పత్రిక నాటినుంచి కొంత శ్రద్ధాసక్తులు కనిపించాయిగాని అదొక ప్రత్యేక రంగంగా గుర్తించదగినంత అభివృద్ధి చెందలేదు. బాలలకు ఉద్దేశించిన పత్రికలు మాత్రం చాలవరకు చిత్తశుద్ధితో నడుస్తున్నాయి. మహిళలకు ఉద్దేశించిన పత్రికలు ఇంగ్లీషు భాషల్లో ప్రబలినంతగా తెలుగులో ప్రబలలేదు. దినపత్రికలు, వారపత్రికలే మహిళా సమస్యల్ని చర్చిస్తున్నాయి అదీకాక ఇంగ్లీషులో మహిళా పత్రికలు పరిబలడానికి అనువుగా ఉన్న సాంఘిక జీవనం తెలుగు వారిలో లేకపోవడం కూడా ఇందుకు ఒక కారణం. తెలుగు జర్నలిజంలో ఎంతో అవసరం ఉన్నప్పటికీ, శ్రద్ధగా అభివృద్ధికి ఇంకా రాని మరోవిభాగం హాస్యపత్రికలు, రాజమండ్రి, హైదరాబాదుల నుంచి హాస్య పత్రికలు కొన్ని నడిచాయి, నడుస్తున్నాయిగాని వారపత్రికలలోనే హాస్యానికి జోకుల రూపంగా కార్టూన్ల రూపంగా ప్రచారం జరుగుతున్నందువల్ల ప్రత్యేకించి హాస్యపత్రికల మనుగడ సుస్థిరం కాలేకపోతోంది. దానికితోడు తెలుగు రచయి

తలు సెంటిమెంటుకు, శృంగారానికి, సీరియస్‌నెస్‌కు – ఇటీవలగా బీభత్సానికీ గుర్తించిన మార్కెటును హాస్యానికి గుర్తించలేదు. హాస్య రచనలు, హాస్య పత్రికల్ని నిర్వహించగలిగినంతమంది హాస్యరచయితలు తెలుగులో లేరన్నా అత్యుక్తికాదు. ఇక మిగిలినవి సెక్స్‌పత్రికలు, డిటెక్టివ్ పత్రికలు. వీటికి శాస్త్రీయత, పరిశోధన అనే పేర్లతో ఎటువంటి రచనలు చేసినా సరిపోతుంది. సెక్స్ విజ్ఞానం, క్రయిం విజ్ఞానం అంటూ ఏ చెత్త సృష్టించినా కాస్త చేయితిరిగిన రచయిత ఆయితే – ఈ పత్రికలకు మార్కెటు సృష్టించుకోవడం విశేషం కాదు. ఆయినప్పటికి ఈ రంగంలో ఎక్కువగా పెన్‌నేమ్స్‌తోనో, కుహనానామాలతోనో రాసేవారు ఎక్కువ. సినిమా జర్నలిజం పెరిగినంతగా తెలుగులో హ్యూమర్ జర్నలిజం, సెక్స్ జర్నలిజం, డిటెక్టివ్ జర్నలిజం, పెరగలేదు సినిమా, హ్యూమర్, సెక్స్, డిటెక్టివ్ జర్నలిజంకు ప్రధానంగా ఇంగ్లీషు విదేశపత్రికలు మూలమూ, ఆధారమూ అన్నప్పటికి అసత్యంలేదు.

ఈ విభాగాలన్నికాక, హౌస్ జర్నల్స్ అని కూడ కొన్ని ఉన్నాయి. పెద్దపెద్ద కంపెనీలు కొన్ని వృత్తిపరమైన సంఘాలు, సంస్థలు తమ సిబ్బంది లోని సాహిత్య సాంస్కృతికాభిరుచులకు ప్రోత్సాహం, ప్రచారం కల్పించడానికి, సంస్థ కార్యకలాపాల్ని ప్రచారం చేయడానికి వారివారి పత్రికల్ని నిర్వహిస్తాయి. ఆ సంస్థల సౌరసంబంధశాఖలు వీటిని నడుపుతాయి. తెలుగులో వ్యవసాయ పత్రికలు, కోళ్ళపరిశ్రమ గురించిన పత్రికలు వస్తున్నాయిగాని ఫొటోగ్రఫీ గురించిన పత్రికలు లేవనిపిస్తుంది. అలాగే యువతరానికి, వృద్ధులకు ప్రత్యేకించిన పత్రికలుకూడలేవు. ప్రతి పత్రికా, యువతరాన్ని ఆకట్టుకోడానికే తాపత్రయ పడుతోందిగాని యువతను నిర్మాణాత్మకంగా నడిపే విశేష పత్రికలు కనిపించవు. వృద్ధులైనవారు పతాకశీర్షికనుంచి, ఎడిటెడ్ అండ్ పబ్లిష్‌డ్ బై – అనే లైన్ వరకూ చదివి కాలక్షేపం చేసుకోలుసిండేకాని వృద్ధాప్యానికి సంబంధించిన ప్రత్యేక సమస్యలు, ఆరోగ్యవిశేషాలు మానసిక లక్షణాలు, సాధకబాధకాల్ని చర్చించే ప్రత్యేక పత్రికలుకూడ మనకు పెంపొందలేదు.

రేడియో జర్నలిజం, టీవీ జర్నలిజం అనే ప్రత్యేక విభాగాల్ని గురించి కూడా నాలుగు మాటలు. రేడియోలో, టీవీలో వార్తా ప్రసారాలు నిర్వహించేందుకు విభాగాలు పనిచేస్తున్నాయి. ఆ విభాగాలోకూడా ఎడిటర్లు, సబ్ ఎడి

టర్లు, విలేఖరులు కాక వార్తలు చదివేవారు కూడా ఉంటారు. రేడియో, టీవీలకు వార్తలు రాయడానికి క్లుప్తత అతి ముఖ్యమైన లక్షణం. పత్రికలలో కాలం పొడుగునా రాసే వార్తను రేడియో, టీవీలకు ఒకటి రెండు నిమిషాలకు మించకుండా సంక్షిప్తీకరించడంలో ప్రధానాంశాలేవీ లుప్తంకాకుండా రాసే నేర్పు అవసరం. ఇంగ్లీషులో రాసేప్పుడు కామాపొండు, కాంప్లెక్స్ వాక్యాలు రాసినా చెల్లుతోందిగాని తెలుగులో వార్తారచనకు ఉపయోగించే భాషబహుసరళంకావడం, చిన్న చిన్న వాక్యాలలో సులభంగా అర్థమయ్యేట్లు రాయడం, అందులోనే సౌందర్యాలి, వ్యక్తిత్వం నిక్షిప్తం చెయ్యడం అవసరమౌతోంది. రేడియో, టీవీల్లో విన్నది విన్నట్లు అర్థం కావడం అత్యవసరం. మళ్ళీ వెనక్కు వెళ్లి ఇంకొకసారి చదువుకొని రిఫర్ చేసుకోవడానికి అక్కడ వీలులేదు కాబట్టి క్లిష్టమైన అన్వయాలతో గాని ద్విత్వాలు సంయుక్తాక్షరాలు వాడుతూగాని, పలకడానికి క్లిష్టంగా ఉండే కఠిన పదాలు ఉపయోగించడంగాని చేసేమిరా వీలుకాదు. కనుక రేడియోరచనే మిగతారచనలకన్న భిన్నం. అందులో రేడియో, టీవీ వార్తా రచన ఒక ప్రత్యేక పద్ధతి.

జర్నలిజంలోని పలుతీరుల్ని స్థూలంగా ప్రస్తావించాను. మరొక్క రంగం కూడా వుంది. అది ఆధ్యాత్మిక పత్రికారచన – స్పిరిట్యుయల్ జర్నలిజం. రామకృష్ణమఠంవంటి సంస్థలు, ప్రభుత్వాల దేవాదాయశాఖల వంటివి, తిరుపతి తదితరదేవస్థానాలు పత్రికలు ప్రచురిస్తుంటాయి, ఈ పత్రికలకుకూడా జర్నలిస్టులు అపసరం. సాధారణంగా జర్నలిజంలో ఇంగ్లీషువాసన తప్పదు. ఆధ్యాత్మిక పత్రికా రచనలో కూడా ఆంగ్లంనుంచి అనువాదాలు ఉండవచ్చును గాని ప్రధానంగా స్వచ్ఛందత, భారతీయత, పవిత్రతలను ఆ జర్నలిజంలో అన్యవాసనలు కనిపించనవసరంలేదు. అన్యవాసనా దూరంగా ఉండే జర్నలిజం, స్పిరిట్యుయల్ జర్నలిజం ఒక్కటే కావచ్చు.

పత్రికలు–పత్రికా రచన ప్రధానమైన రాజధానీ కేంద్రాలలోనేకాక, జిల్లా కేంద్రాలలోకూడా విస్తరిస్తోంది. పెద్ద పెద్ద పత్రికలు అంతర్జాతీయ వార్తలకు రాష్ట్రప్రాధాన్యంగల వార్తలకు ప్రాముఖ్యం కల్పిస్తే గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లాస్థాయి సమస్యలు, సాధకబాధకాలను గురించి చిన్న పత్రికలు కృషిచేస్తున్నాయి. పెద్దపత్రికల నిర్వహణ సమస్యలు వేరైతే, చిన్న పత్రి

కల మనుగడ సమస్యలు వేరు. ఇక్కడ ఆవిషయాలు ఆ ప్రస్తుతం. జర్నలిజం ఒక పవిత్ర వృత్తి. అనుక్షణం జాగరూకతతో, వెయ్యికళ్ళతో ప్రతివిషయాన్నీ సంపూర్ణంగా అవగాహనచేసుకొని కొంత రంధ్రాన్వేషణ ప్రవృత్తి చూపిఅయినా నిర్దుష్టతను సంపాదించి ఆతరువాత సమాజప్రయోజనందృష్ట్యా కొంత పరిహరించి (ఎడిట్ చేసి), మంచిని ప్రోత్సహించేవిధంగా రాసి ప్రచురించడం జర్నలిస్టుకు అవసరం. ఇంత నిక్కచ్చి జర్నలిజం ఈనాటి వ్యాపారధోరణుల్లో విజయవంతం కాకపోవచ్చు. అందుకని జర్నలిజంలోకూడా సెన్సేషనలిజం, మడ్‌స్లింగింగ్, ఎల్లో జర్నలిజం వంటివి కనిపిస్తుండవచ్చు. అయితే వీటిని ప్రామాణికంగా ఎవరూ స్వీకరించరు. పత్రికారచన ఒక సాధనగాకాకుండా జీవనోపాధిగా మారడం, పత్రికలు మార్గదర్శకాలు కాకుండా వ్యాపార సంస్థలుగా మారడం–కొన్ని విపరీతాలకు, ప్రమాణాల పతనానికి, అన్నిరంగాల్లో లాగానే చవుకపారు అభిరుచుల పెంపుదలకు దోహదపడే సమాజం ఉన్నప్పటికీ, అభిప్రాయ ప్రకటనాస్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛవల్ల సమాజవ్యవస్థలో కుళ్ళు కడిగివెయ్యడానికి బలవత్తరమైన ఆవకాశం ఏర్పడక తప్పదు. అంతేకాక జర్నలిజం సువ్యాప్తం కావడంతో, గహనమైన ఏ అంశాన్నయినా తేలికభాషలో ఆకర్షణీయంగా, మనసుకు హత్తుకొనేట్లుగా చెప్పే నేర్పుకూడా సువ్యాప్తమౌతోంది. ప్రతి అంశాన్నీ 'జర్నలిస్టిక్ స్టయిల్'లో చెబితే ఆకళింపుచేసుకోగలిగే పాఠక ప్రవృత్తికూడా విస్తరిస్తోంది. ఏ రచనకైనా పండితశైలి పోయి పత్రికాశైలి అనుసరణీయమౌతోంది. జర్నలిజం చేసిన మహోపకారమిది.

'ప్రగతికి నిదర్శనం - దూరదర్శన్'

శ్రీ వోలేటి పార్వతీశం

చూపు వరం, చూడటం కళ. ఇది జగమెరిగిన సత్యం. చూడటమేకాదు చూపించటం కూడా ఒక కళ అన్నది దూరదర్శన్ నిరూపించిన మరోసత్యం పది సార్లు చదివినదానికన్నా ఒకసారి వ్రాసినది ఎక్కువగుర్తుంటుంది మనకి. అలానే పదిసార్లు వ్రాసినదానికన్నా, ఒక్కసారి చూసింది మరింత ఎక్కువ గుర్తుంటుంది మనకి. మనం కళ్ళారా చూసినదాని ప్రభావం మన మనస్సుమీద ఎక్కువగా పడుతుంది. అంతేకాదు మనకు చిరకాలం గుర్తుంటుంది. దూరదర్శన్ వ్యవస్థను నెలకొల్పడానికి ఇదొక మూల ప్రాతిపదికగా చెప్పుకోవచ్చు. పత్రికలకంటే, రేడియోకంటే ఎక్కువ ప్రాముఖ్యతను దూరదర్శన్ వముపార్జించుకోవడానికి కారణంకూడా ఇదే.

మన దేశంలో దూరదర్శన్ ఇటీవలికాలంలో గణనీయమైన అభివృద్ధి సాధించిన మాట వాస్తవం. అయినా, అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చిచూస్తే మన పురోగతి స్వల్పంగానే కనిపిస్తుంది. ప్రపంచంలో ఏ మూల జరిగిన విశేషాన్నైనా క్షణాల మీద చూపించగల్గే సాధన సామగ్రిని సమకూర్చుకున్నాయి ఇతర దేశాల టెలివిజన్లు. భారతదేశంలో దూరదర్శన్ వ్యవస్థ ఏర్పడి పాతిక వసంతాలు గడిచాయి. గత సంవత్సరమే దూరదర్శన్ రజతోత్సవాలను జరుపుకొంది.

పుట్టి పాతిక సంవత్సరాలు గడిచినా, పెరుగుదల కొంత మందకొడిగానే సాగిందని చెప్పక తప్పదు. అయితే, ఇటీవలి కాలంలో మాత్రం ఈ పెరుగుదల మునుపెన్నడూ లేనంత వేగాన్ని పుంజుకొంది. కారణం దూరదర్శన్ ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించడమే కాకుండా, దాని విస్తరణకు తగినంత ప్రాముఖ్యతను ఇవ్వడమే.

దేశ విదేశాల్లోని ఏ విశేషవార్తనైనా అతి తక్కువకాలంలో సేకరించి, ఆ వివరాలను సచిత్రంగా ప్రజల కందించడంలో దూరదర్శన్‌కి సాటి మరొకటి రాదు అలా అని టి.వి. కేవలం వార్తలకే పరిమితంకాదు. భిన్న జాతులవారు, భిన్న భాషలవారు, విభిన్న సంస్కృతులవారు నివసిస్తున్న ఈ దేశంలో అందరికీ ఆమోదయోగ్యమైన కార్యక్రమాలను ప్రసారంచేసి ప్రజలను రంజింపచేస్తూ, భారతీయులందరిలో ఒక భావసమైక్యతను సాధించగలిగే అవకాశం ఉంది కేవలం వినోదానికో, విజ్ఞానానికో పరిమితమై పోకుండా, సమాజంలో ఉన్న సమస్యలను ఎత్తిచూపి వాటికి పరిష్కారాలు సూచించడంలోకూడా దూరదర్శన్ ప్రముఖ పాత్ర వహిస్తోంది.

ఎంత ప్రయోజనకారి అయినా, ఈ టీ.వి. సామాన్యుడికి అందుబాటులో లేనప్పుడు అది నిష్ప్రయోజనం అని మనకు తెలుసు. ఈ విషయం ప్రభుత్వమూ గుర్తించింది. అందుకే టీ.విల ధరలు వీలైనంత మేరకు తగ్గించడానికి ప్రయత్నిస్తోంది. టీ.వి కేవలం నగరవాసుల, పట్టణవాసుల వినోదానికే కాదు, గ్రామీణులకు సహితం అందుబాటులో ఉండాలనే దృఢ నిశ్చయంతో చాలా మటుకు గ్రామాల పంచాయితీలకు ప్రభుత్వం కమ్యూనిటీ సెట్‌లను పంపిణీచేసింది.

దేశ వ్యాప్తంగా చూచినట్లయితే, దేశంలోని ప్రతి రాష్ట్రం ఈ దూరదర్శన్ వ్యవస్థలో అంతర్భాగంగానే ఉంది. ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించినంత వరకు హైదరాబాద్‌లో మాత్రమే దూరదర్శన్ కార్యక్రమ నిర్మాణ కేంద్రం (ప్రొడక్షన్ సెంటర్) ఉంది. ఇది ఉపగ్రహ దూరదర్శన కేంద్రం.

హైదరాబాద్‌లో సూత్రప్రాయంగా బేస్ ప్రొడక్షన్ సెంటర్ ఏర్పడి ఇప్పటికి ఒక దశాబ్దం దాటింది. అప్పట్లో ఇక్కడ తయారైన తెలుగు, కన్నడ కార్యక్రమాలు శాటిలైట్ ఇన్‌స్ట్రక్షనల్ టెలివిజన్ ఎక్స్‌పెరిమెంట్ (*SIET*) ట్రాన్స్‌మిషన్ ద్వారా గ్రామీణులకోసం ప్రసారం చేయబడేవి.

హైదరాబాద్‌లో రెగ్యులర్ ట్రాన్స్‌మిషన్ 1977లో అక్టోబర్ 23న అప్పటి భారతరాష్ట్రపతిచే ప్రారంభించబడింది. ఈ ట్రాన్స్‌మిషన్‌కోసం, ఉద్దేశించబడిన 150 మీటర్ల ఎత్తు ట్రాన్స్‌మీటర్ మలక్‌పేట్ సమీపంలో నెల

కొల్పడం జరిగింది. దీని శక్తి 10 *KW*. దీనివల్ల 1600 గ్రామాల పరిధిలో, పదిహేడువేల చ।।కి।।మీ విస్తీర్ణంలో కల ప్రజలు ఈ దూరదర్శన్ కార్యక్రమాలు చూడగలుగుతున్నారు.

ఈ ట్రాన్స్‌మీటర్‌కు సుమారు 10 కి॥మీ॥ దూరంలో సోమాజిగూడా ప్రాంతంలో స్టూడియో ఏర్పాటుచేయడం జరిగింది. ఈస్టూడియోలోనే ప్రస్తుతం కార్యక్రమాలన్నిటిని రూపొందిస్తున్నారు. ఈ స్టూడియో ప్రాంగణంలోనే 3 బాండ్ల *TVRO*ను కూడా నెలకొల్పడం జరిగింది. దీనివల్లనే ఉపగ్రహం ద్వారా ప్రసారమయ్యే జాతీయ కార్యక్రమాలు, ఏరియా స్పెసిఫిక్ కార్యక్రమాలు చూడగల్గుతున్నాం.

ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో కాక మరో 14 ప్రాంతాల్లో లోపవర్ ట్రాన్స్‌మీటర్లను నెలకొల్పారు. అవి కాకినాడ, విజయవాడ, తిరుపతి, నెల్లూరు, కడప, కరీంనగర్, విశాఖపట్టణం, వరంగల్, నిజామాబాద్, రాజమండ్రి, కర్నూల్, అనంతపూర్, ఆదోని, మహబూబ్‌నగర్‌లలో పనిచేస్తున్నాయి. వీటి వల్ల ఆయా ప్రాంత ప్రజలు కేవలం ఢిల్లీ కార్యక్రమాలనేకాక, 1984 ఆక్టోబర్ 15వ తేదీ నుండి ఉదయం పెలిస్కూల్ కార్యక్రమాలు, నవంబర్ 14వ తేదీ నుండి ఏరియా స్పెసిఫిక్ కార్యక్రమాలు చూడగల్గుతున్నారు.

గత సంవత్సరాంతానికి అంటే 1984వ సంవత్సరం చివరకి, పోస్టాఫీసు లైసెన్స్ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఒక లక్ష ముప్పై వేలకు పైగా టి.వి సెట్లున్నాయి. వీటిలో హైదరాబాద్ ట్రాన్స్‌మీటర్ పరిధిలోనే ఒకలక్ష నాలుగువేల వరకు ఉన్నాయి. నేటికి వీటి సంఖ్య గణనీయంగా పెరిగిందని ఊహించవచ్చు. అప్పటి లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో నూటముప్పైఆరు లక్షల మంది ఈ దూరదర్శన్ కార్యక్రమాలు చూడగల్గుతున్నారు. అందులో 60.50 లక్షల మంది హైదరాబాద్ ట్రాన్స్‌మీటర్ పరిధిలోవారుకాగా, 32.50 లక్షలమంది లోపవర్ ట్రాన్స్‌మీటర్ల పరిధిలోవారు.

1984 సంవత్సరాంతంలో నిర్వహించిన ఒక సర్వేప్రకారం దూరదర్శన్ ద్వారా ప్రసారమైన కార్యక్రమాల్లో చలనచిత్రాలు 21.9%, నాటికలు 14.5%,

సంగీత కార్యక్రమాలు 10.5%, వార్తలు 9 5%, టెలిస్కూల్ విద్యాకార్యక్రమాలు 6.3%, క్రీడా కార్యక్రమాలు 0.4% ఉన్నాయి. ఈ సర్వే ఫలితాలను చూస్తే అర్థమయ్యేవిషయమేమిటంటే బృహత్తర ప్రయోజనాలను సాధించవలసిన దూరదర్శన్ ఎక్కువగా వినోదాత్మక సాధనంగానే ఉపయోగపడుతున్నట్టు తెలుస్తోంది. వినోదాన్నేకాక, విజ్ఞానాన్ని కూడా సమానస్థాయిలో అందించాలి. అందుకు దూరదర్శన్ కంకణం కట్టుకుంది.

ప్రగతిపథంలో మన ప్రయోగమనానికి నిదర్శనం—ఈ దూరదర్శన్.

CULTURE HERO IN TELUGU FOLKLORE - AN ANALYSIS

Prof. N. KRISHNA KUMARI

Sitaramacharyulu has many interesting observations in respect to participal relative constructions. He treated them on par with other nominal attributive Constructions.

He oberves that the relative participles could be attributes to indeclinable like atla "like", (Samasa.8.).

Either a descriptive adjcetive or a participle can separate possessed and possessor construction of inalienable type.

ex :

oḍalu	tellani	turagōttamu
body	white	horse best

(Samasa.15): there can be coordinated attributes. ex : *ā*, ī, neeramulu 'these and those crimes', kottina tittina y*ā*taḍu 'he who best and abused' (Šamasa 17), and the coordinated attributes can be separated by appropriate words;

ex : ī kannulu terawani śisuwu

this eyes not opened infant.

He stated the general participle (Taddharma) could be used in all the tenses with no help of time adverbs (Kriya-1). While Cinnayasuri states that inanimate obeject doesn't require accusative marker Sitaramacharyulu notices that certain animate nouns also do not require the accusative case marking and illustrates them from texts where objects are the words for elephant and horse.

Sitaramacharyulu observes many pragmatic uses of certain syntactic construction. He observes that past and nonpast (taddharma). Verbs with addition of certain addressive forms (like ayya and amma denoting male and female, respectively)can be used in interrogation (Kriya-3). the non-past assertive verb has negative implication with the addition of addresives. (Kriya-4); signifying speed the past verb can be used to express future. (Kriya-74).

Equi NP deletion is also handled by anwaya as in the following statement. (when there are more verbs) the later verbs have valence with the previous verb that has a Karta (subj) (Kriya-27)

nīwu rāwaccunu, pōwaccunu
you can come, (and) can go

second occurence of niwu 'you' is deleted. Another relationship that handles deletion is 'adhyārya" 'understood'. A repeated genitive noun is deleted when it expresses kin relationship (waakya-12), certain diminutive particles like aina, ēni. ē, ō are deleted (should be supplied in interpretation) (wakya-13) and in some cases either karta (subject)or karma (object) or verb is deleted (wakya-14). This means almost any element can be supplied from the context. There are also cases where deletions are handled by straight forward deletion of first element of repeated sabdapallava verb like pōrāḍi + pōrāḍi → pōrāḍi (y) āḍi 'having continuously fought' (Kriya-24). canudemmu canudemmu-canudemmu teen.....' Come! To come' (Kriya-25).

Sitaramacharyulu has some interesting observation on the selection of subject in a sentence sequencel In Telugu a sentence can begin with a sequentia participle connecting it to and deriving from the verb of the previous sentence as in

āme iṭiki weḷḷindi. weḷḷi nidra pōyindi
she home went. Having gone she slept.

In the second sentence, the subject should be the same for the participle and finite verb. This point was discussed earlier, while talking about Chinnayasuri's dependency (Samanaasraya) concept. However, Sitaramacharyulu found a violation and formulated in the following statement.

"A sequential verb (related to the previous finite verb) serves as a source for a new sentence, if it is required. If so any member of the subjects of the participle can be subject to the new sentence' (wakya-16).

Ex : (poem) dhawalaakṣul cani kaanciri.....
the white eyed women went and saw.....
(prose) kani kadruwa winatan juuci.....
having seen, Kadruwa Winatan saw.....
(Noun) (acc.)

The first participle in the prose sentences obviously has plural subject while the second one has singular though it is one of the members of the same set.

Sitaramacharyulu observed many more interesting patterns of agreement than his predecessors. These are extremely useful for tracing the syntax of classical Telugu. He has a number of rules to describe the number, gender and case agreement between heads and attributes of various types, which I am not going to detail here. There are more interesting observations on subject-predicate agreement in respect to gender, number and person. He observes that a mass noun in singular governs plural agreement in verb as in

muni nikāyamellan .....
'The whole group of sages (sg).
atani(n) būjinciri(pl).
him worshipped. (Sabda-17).

Sitaramacharyulu notices some peculiar cases of agreements where the subject is a conjuct Noun Phrase but the verb agrees only with one of the constituents. In some cases this agreement is hierarchical like I > II > III persons (Kriya-26).

Ex.a. wipra Kulunḍa ! welwaḍumu niwunu ni
Oh ! Brahmin come out you and your
(II sg)

nisadiyun
(tribal) girl (and).

b. nēnu nā sēnayu dāḍiwetteda
! (and) my army invade (I sg)

Even more surprising are the cases where the verb agrees with the nearest member of the constituent of the conjuct noun phrase, in respect to gender and number (Wākya-15).

Ex : sura, gandharwa prabhṛtulu dharaṇi, saila,
Sura Gandharva etc. earth Mountains
(a set of demi gods)
āpaga, abdhi dhātrijādul, nik ē (y)
rivers, oceans, (and) trees etc. to you what
apakṛti gāwince
harm did (sg).

Sitaramacharyulu has also dealt with some stylistic devices in his grammar. He observes "itlaniye" 'he said thus' occurs in the beginning of narration anina 'when (he) said thus' occurs after the completion of the narration (Wākya-10). He also mentions a style in which a small sentence embodies the essence of the following narration (Wākya-20).

Finally, I would like to make it clear that this essay is not a complete acount of the treatment of syntax of Chinnayasuri and Sitaramacharyulu, nor is it completely evaluative of their works. The purpose of this paper has been to show that the traditional grammars have many illuminating insights, though they lack sufficient technology. I also think that we certainly benefit by thoroughly examining them.

ఆధునిక కవిత్వంలో ఆత్మాన్వేషణ

డా. ఎన్. వి. రామారావు

ఇంద్రియాణి పరాణ్యాహు రింద్రియేభ్యః
మనసస్తు పరాబుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః

దేహంకంటే ఇంద్రియాలు, ఇంద్రియాలకంటే మనసు, మనసుకంటే బుద్ధి, బుద్ధి కంటే ఆత్మ—ఒకదాని కంటే ఒకటి శ్రేష్ఠములైనవి అని భగవద్గీత ఆత్మ ప్రాధాన్యాన్ని వచిస్తున్నది. భారతీయుల దృష్టిలో ఆత్మకు నాశము లేదు. ఈ ఆత్మ తత్త్వాన్ని అర్థం చేసుకొని, బుద్ధితో మనసును నిగ్రహించుకొని, దుఃఖాన్ని సర్జించి సుఖాన్ని పొందాలి అని గీతోపదేశం. ఒకవిధంగా ఆత్మలో జరిగే సంఘర్షణకు ప్రతిరూపమే భగవద్గీత.

ఆత్మ మథనం నుంచి పుట్టేదే కవిత్వం. అది జీవుని వేదనకు ప్రతిబింబం. జీవితం అన్వేషణకు మూలకంకాగా ఆ అన్వేషణం నుంచి జనించిన ఆత్మవేద నామృతమే కవిత. క్రౌంచపక్షి వియోగానికి పరితపించిన హృదయం నుంచే ఆదికావ్యం ఆవిర్భవించింది శోకం నుంచే శ్లోకం అవతరించింది. ప్రాచీన మహర్షులు మౌనంతో తపస్సులో లీనమై ఆత్మస్వరూపాన్ని దర్శిస్తే, ఆధునిక ఋషులైన కవులు తమ కవితా సాధన ద్వారా ఆత్మను అన్వేషిస్తున్నారు. 'కలివేళ సుకవి జనులే మౌనుల్' అని అప్పకవి చెప్పిన మాటలు యదార్థమైనవి.

కవితా వాహిని వస్తువును ఆధారంగా చేసుకొని, ఆత్మను ఆలంబనంగా చేసుకొని రెండు పాయలుగా ప్రవహిస్తూ వస్తున్నది. అవే వస్త్వాశ్రయరీతి, ఆత్మాశ్రయరీతి అని వ్యవహరింపబడుతున్నవి. వస్త్వాశ్రయరీతిలో ఇతివృత్త కల్పనకు, పాత్రపోషణకు ప్రాధాన్యం వుంటుంది. ఆత్మాశ్రయరీతిలో నాయికా

నాయకులు మొ॥ రూపకల్పన వుండదు. ఇందులో కవియే ఆలంబన విభావం. ఏ భావమైనా అతణే ఆశ్రయించుకొని అతని చుట్టేతిరుగుతుంది. రాగవిరాగాలు, కష్ట సుఖాలు అన్నీ కవి స్వయంగా అనుభవించి-వివేచించి బహిర్గతం చేస్తాడు. వస్త్వాశ్రయరీతిలో తన వ్యక్తిత్వాన్ని విస్మరించి, అభిరుచులను అణచుకొని, కథలో, పాత్రల్లో లీనమౌతాడు. అందువల్ల కవి ఆత్మీయతాముద్ర ఆత్మాశ్రయ రీతిలో గోచరించినంత ప్రస్ఫుటంగా వస్త్వాశ్రయ పద్ధతిలో గోచరించదు. ఇందులో కవి ప్రత్యేకభావాలను స్వంతంచేసుకొని, మథించి, తీవ్రంగా, నూటిగా బయటకు వ్యక్తం చేస్తాడు. అందుకేనేమో "ఉత్తమమైన ఆత్మపరమైన కావ్యంలో ఉన్నంత కవిత్వ లావణ్యము మరొక కావ్యంలో ఉండదు. ఊపిన చోట అది ఊపినంత మరొకటి ఊపదు" అని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అభిప్రాయపడ్డారు.

అయితే – ప్రాచీన తెలుగు కవిత్వం అంతా వస్త్వాశ్రయంగానే కొన సాగింది. ఆధునిక యుగంలోనే ఆత్మాశ్రయ పద్ధతికి ఆదరణ హెచ్చింది. ఇందుకు అపవాదంగా నిల్చేవిమాత్రం చాటుపద్యాలు, శతకాలు ముఖ్యంగా తెలుగుశతక వాఙ్మయం ప్రాచీన కవుల తాత్విక చింతనకు, అంతర్మథనకూ నెలవై వారి ఆత్మీయతను ప్రతిబింబిస్తున్నది. పండితారాధ్యుని శివతత్వసారం, పాల్కురికి సోమన వృషాధిప శతకం, యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకం శివకవుల ఆధ్యాత్మికతకు నిదర్శనాలు. ప్రబంధయుగంలో జీవించిన ధూర్జటి ఆత్మలోని ఘర్షణకూ, ఆవేదనకూ ప్రతీక శ్రీ కాళహస్తీశ్వర శతకం.

ఆటవెలదిని పటుభంగిమలలో నర్తింప జేసిన వేమన ఆత్మాన్వేషణ అతని అసంఖ్యాక పద్యాలలో అంతర్లీనంగా పొడసూపుతుంది.

తరువ తరువ బుట్టు తరువున ననలంబు
తరువ తరువ బుట్టు దధిని ఘృతము
తలప తలప బుట్టు తనువున తత్త్వంబు
విశ్వదాభిరామ వినుర వేమ.

అని నిరంతర చింతనకు ప్రాధాన్యమిస్తూ

తన్ను వెదకి చూడ తానె పో జీవుండు
తత్త్వ మరసి చూడ తానె యాత్మ
మన్ను మిన్ను లేదు, మాయ తావేదయా
విశ్వదాభిరామ వినుర వేమ.

అని ఆత్మాన్వేషణ విలువను గుర్తించాడు వేమన.

అయితే–శతకాల్లో కవి మానసిక సంఘర్షణకు సంబంధించిన అంచులన్నీ కనిపించవు. భావ వైవిధ్యానికి వీటిలో అంతగా అవకాశంలేదు కవితాత్మ పొందిన రాపిడులు ఆధునిక యుగంలోనే విస్తృతంగా గోచరిస్తాయి. ఆధునిక జీవితం నవీన భావ సంచలనానికి గురికావటం, రోజురోజుకూ సంక్లిష్టమయం కావటంతో కవిలోని ఆత్మాన్వేషణ క్రొంగొత్త అంచుల్ని స్పృశించింది. అనేక మైన స్పందనలతో కవి పొందిన అనుభూతులు వివిధ రూపాలలో ఆవిష్కృత మైనాయి.

తెలుగులో ఆధునిక కవిత్వం ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో అవతరించింది. నవకవితా వైతాళికుడైన గురజాడ అప్పారావు

విరిగి పెరిగితి పెరిగి విరిగితి
కష్ట సుఖముల పార మెరిగితి
పండునన్నవి ఆశలెన్నో
ఎండిరాలగ బొగిలితిన్
అందజాలని పళ్ళకోసము అల్లిజాపితి
నేలపాకిన చెట్లపళ్ళను విలువ లెరుగక
పాదరక్షల మట్టితిన్
పంజరంబుల నున్న కట్లను
వగల దన్నగ లేక సుక్కితి
నింగి పర్వగ లేని జన్మము
నీరసంబని రోసితిన్.

అన్న ఆత్మజిజ్ఞాసతో కలం చేపట్టగా తర్వాతి కవుల రచనల్లో ఆత్మాశ్రయధోరణి పరివ్యాప్తమైంది.

కాల్పనిక వాద ప్రభావంతో సాహిత్యరంగంలో స్త్రీ స్థానాన్ని గురించిన పునరాలోచన ప్రారంభమైంది. ప్రబంధ యుగానంతరం వెలువడిన సాహిత్యంలో స్త్రీ విలాసవస్తువుగా, కామానికి ఆలంబనగా మాత్రమే వర్ణితమైంది. సమాజంలో ఆమెకూడా ఒక భాగస్వామి అనీ, ఆమెకూ మనసనేది ఒకటివుందని వారు విస్మరించారు. కందుకూరి వీరేశలింగం పంతులు ఈ దురవస్థను గమనించి స్త్రీవిద్య, వితంతువివాహాలను ప్రోత్సహించి స్త్రీజాతి ఉద్ధరణకు పాటుపడటంతో సమాజంలో స్త్రీకి గౌరవం కలిగింది. సాహితీపరుల దృక్పథంలో కూడా ఈ మార్పు ప్రసరించింది. ఈ పరివర్తన ప్రభావమే భావకవితా యుగకర్త అయిన రాయప్రోలు ప్రతిపాదించిన అమలిన శృంగార సిద్ధాంతం. స్త్రీ పురుషుల మధ్య శృంగారసంబంధానికేకాక, స్నేహభావానికీ, వాత్సల్యానికీ తావుందని తృణకంకణం మొదలగు కావ్యాల ద్వారా చాటిచెప్పారు రాయప్రోలు సుబ్బారావు. దానితో స్త్రీ మాతృమూర్తిగా, ప్రణయ దేవతగా, ఆప్తసఖిగా భావకవులకు గోచరించింది. ప్రేమ, ప్రణయాల అర్థాలే మారిపోయాయి.

లోకముతో మనకేటికి లోలాక్షి రా పోదము,
ఆ మబ్బు ఈ మబ్బు ఆకాశ మధ్యాన ఱద్దుకున్నట్లు
మనమైక్య మౌదాం

అని బసవరాజు అప్పారావు ప్రభృతులు స్వేచ్ఛాప్రణయాన్ని ఆరాధించారు. గిరికుమారుని ప్రేమగీతాలలో విశ్వనాథ, సౌభద్రుని ప్రణయ యాత్రలో నాయని కులపాలికా ప్రణయం పేరిట గార్హస్థ్య జీవితంలోని ప్రణయ మాధుర్యాన్ని చవిజూపారు. నండూరి సుబ్బారావు జానపద శృంగారం ఆలంబనంగా చేసుకొని దివ్యానుభూతులను అందించారు.

గుండె గొంతుకలోన కొట్లాడుతాది
కూకుండనీదురా కూసింతసేపు

అని ఎంకినాయుడుబావల దాంపత్యంలోని మధుర విషాద అనుభూతులను హృదయంగమంగా చిత్రించారు.

భావకవిత్వాన్ని గురించి ప్రస్తావించినప్పుడు కృష్ణశాస్త్రి పేరుచెప్పకపోతే అది అసంపూర్ణంగా మిగిలిపోతుంది. ఆయన కృష్ణపక్షం, కృష్ణ పక్షానికన్న కృష్ణ శాస్త్రి గురించే ఎక్కువగా చెబుతుంది. కవి ఆత్మీయత అందులో అంత ప్రస్ఫుటంగా ద్యోతకమౌతుంది. ఒకసారి ప్రకృతిలో లీనమై

ఆకులో ఆకునై
పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై
ఈ అడవి దాగిపోనా
ఇచటనే ఆగిపోనా

అని పాడుకొంటాడు. మరొకసారి—

నాకుగాదులు లేవు నాకుషస్సులు లేవు
నేను హేమంత కృష్ణానంత శర్వరిని

అని—

కంటక కిరీటధారినై, కాళరాత్రి మధ్యవేళల
జీమూత మందిరములలో కొల్వుదీర్తునని

చీకటిలో కలిసిపోతాడు.

ఏను మరణించుచున్నాను
ఇటు నశించు నాకొరకు చెమ్మగిల నయనమ్ము లేదు
పసిడి వేకువ పెండ్లింద్ల బడిన ఎవరు
కరగనేర్తురు జరాంధకారమ్మతికి

అని విషాదదైన్యాన్ని వెళ్ళబోసుకుంటాడు.

కవి యొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక కావ్యంలో ఊదబడినచో అది భావకవిత్వం అని విశ్వనాథ పలికిన వాక్కులు కృష్ణశాస్త్రి కవితకు అక్షరాలా అన్వయిస్తాయి.

భావకవిత్వం వెలార్చిన శాఖలలో భక్తి కవిత ఒకటి. భగవంతుణ్ని గురించిన అన్వేషణమే భక్తి. కవుల తాత్విక జిజ్ఞాసకూ, ఆధ్యాత్మిక చింతనకూ ప్రతిరూపం భక్తి కవిత.

కలుష దుర్దాంతపంక సంకలిత కుహరముల
జనించు మరీయాళ్ళి మలిన ధార స్వామి
భవదీయ పాద దేశమున బారి
పరమపావన జాహ్నవీ ప్రతిభగాంచు

అని అహంకారాన్ని అణచుకొని ఆత్మను కన్నీటితో పునీతం చేస్తాడు కవి. భక్తుడు తనను ప్రేయసిగా భావించుకొని తన హృదయేశ్వరుడైన భగవంతునితో సాయుజ్యం కొరకు తపించటం మధుర భక్తి సంప్రదాయం.

రాధనురా ప్రభూ, నిరపరాధనురా
అనురాగ భావనారాధన మగ్న మానసనురా

అని కవి రాధయై, గోపికయై కృష్ణుని కొరకు అన్వేషించటాన్ని మధురంగా గానంచేశారు భావకవులు.

మోళియింపకోయ్ మురళి మోళియింపకోయ్
తీయని తేనియ బరువు మోయలే దీ(బతుకు

అని వేణుగానలోలుని గానమాధుర్యాన్ని కీర్తించారు. జీవాత్మలైన గోపికలు, పరమాత్మ అయిన కృష్ణుని సాయుజ్యం కొరకు పడిన పరితాపాన్ని రసరమ్యంగా చిత్రించారు భావకవులు.

జీవితాన్నిగురించిన జిజ్ఞాసలో మృత్యువుపైకూడ నవకవుల దృష్టి ప్రసరించింద. జనన మరణాలు జంట బిడ్డలుగా పేర్కొనిన దువ్వూరి రామిరెడ్డి మృత్యువును సకియగా సంభావించినారు తమకు ఆత్మీయులైన భార్యాబిడ్డలు, ఆత్మబంధువులు మరణించిన సందర్భంలో వారి వియోగానికి పరితపించిన కవులు ఆత్మవేదనను స్మృతి కావ్యాల ద్వారా వెలువరించారు. విశ్వనాథ వర లక్ష్మీ త్రిశతి, దువ్వూరి భగ్నహృదయము, నాయని విషాద మోహనము ఈ స్మృతి కావ్య ప్రక్రియలో పేర్కొనదగినవి.

భావకవిత్వంపై తిరుగుబాటుగా ఈ శతాబ్ది నాలుగోపాదంలో అభ్యుదయ కవిత్వం వెలసింది.

నేను సైతం ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను
నేను సైతం భువన భవనపు బావుటాసై పైకి లేస్తాను

అని మహాకవి శ్రీశ్రీ 1933లో జయభేరి మోగించి అభ్యుదయ కవిత్వ ప్రవర్తకుడైనాడు ఆయన సారధ్యంలో అభ్యుదయ కవిత్వం మూడు పూవులూ ఆరు కాయలుగా విలసిల్లి పద్యంగా, గేయంగా, వచన కవితగా పరివ్యాప్తమైంది.

ద్వితీయ ప్రపంచ సంగ్రామ ఫలితంగా ఏర్పడిన ప్రపంచ అశాంతి, ఆర్థిక వ్యత్యాసాల మూలంగా ఉత్పన్నమైన వర్గసంఘర్షణ సమసమాజవాదానికి దారితీశాయి. కార్ల్‌మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక భౌతికవాదం పునాదిగా వెలసిన సమాజవాదం అభ్యుదయ కవితకు ఊపిరిగా నిలచింది. ఆధునిక మానవ జీవితం అనేక కల్లోలాలకు నిలయంగా మారింది. సుఖదుఃఖాలు, వర్గభేదాలు, న్యాయాన్యాయాలు మొదలగు విషయావళయంగా ఏర్పడింది. ఈ విషమత్వం లోంచి సమత్వం సాధించడానికి జరిగిన ఆత్మమథనమే అర్వాచీన కవుల రచనల్లో ప్రతిబింబిస్తుంది.

వచన కవితలోని ఆయోమయాన్ని, అస్పష్టతనూ తొలగించి దానికి బలాన్ని, జవాన్ని సమకూర్చిన విశిష్ట కవి బాలగంగాధర తిలక్. అతని రచనలో సర్వత్రా భాసించేవి మానవతా దృక్పథం, కారుణ్యవాదం.

నా కవిత్వం కాదొక తత్త్వం
మరి కాదు మీరనే మన స్తత్వం
కారు ధనికవాదం–సామ్యవాదం
కాదయ్యో ఆయోమయం–జరామయం

అని చాటి

నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసిన దయాపారావతాలు
వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు

అంటూ పఠితల్లో వెన్నెల కురిపించిన రాత్రిని ప్రత్యక్షంచేస్తారు తిలక్.

ఒక్క కౌముదీ శీతల కిరణరేఖ జాల్వారినా
ఒక దయామయి అడుగు సవ్వడి పలుకరించినా
కోటి పువ్వుల్ని జల్లుతాను
అన్నా!
దూర తీరాన తెల్లని ఓడ తెరచాప కదలినపుడు
భావ హృదయాన నిశ్వసనానిలం వీచినపుడు
ఒక్క దుఃఖితుడు నవ్వినపుడు
ఒక్క పతితుడు కన్విప్పినపుడు
అక్కడ నా అడుగుజాడ గుర్తించగలవు

అని పీడితుల పక్షాన, దుఃఖితుల పక్షాన నిలబడి మానవతా విలువల్ని, దయా భావాన్ని ఎలుగెత్తి చాటుతాడు.

మాత్రా ఛందస్సులో రసమయకావ్యాలు రచించి లబ్ధ ప్రతిష్ఠులైన సి. నారాయణరెడ్డి గారు వచనగేయ ప్రక్రియలో కూడా ముందంజ వేసి తమ ప్రతిభను నిరూపించుకొన్నారు. ఉదయం నా హృదయం, మార్పు నా తీర్పు, తేజస్సు నా తపస్సు, ఇంటిపేరు చైతన్యం మొదలైనవి వారి రమ్యలేఖినినుంచి వెలువడిన కవితా సంపుటాలు. మననం, జ్వలనం. ఉద్గమనం, ఉన్మీలనం అన్నవి వారి మథనం కావ్యంలోని శీర్షికలు.

ఇవాళ నేను/ఎర్రనెత్తురు తొడుక్కున్నాను
తెల్లని ఆశయాలనూ
పచ్చని ప్రణాళికలనూ
జల్లులుగా పుక్కిలించే
నల్లని చీకట్ల మధ్య
ఎర్ర నెత్తురు తొడుక్కున్నాను
చచ్చిన చీకటికిది గోరి
విచ్చిన వేకువకిది దారి
ఇవిగో వేయి వెలుగురేకులు

యువశక్తుల చేతుల పిడిబాకులు
జనం నా జెండా జాగృతి నా ఏజెండా

ఆని జన జాగృతిని ప్రబోధిస్తుంది మథనం కావ్యం. ఇటీవల వెలువడిన 'నడక నా తల్లి' సంపుటిలో కూడ వారి అంతర్మథనం, చైతన్య భావధార ద్యోత మానమౌతాయి.

జీవిస్తున్నాను మృత్యుశిఖను పూలు ముడవాలని
మరణిస్తున్నాను బ్రతుకుమంటలపై నడవాలని...
ఎంత పేదవడిపోయిన వీ ప్రతిభా కరాంగుళులు
ఊహిస్తున్నాను నుడుల ఉంగరాలు తొడగాలని

అని తుడిస్తే పోనిదీ, అనాదీ అయిన మురికిని అగ్నిగంగతో కడగాలని ఈ రచయిత సంకల్పం.

చేతనావర్తం కవులలో ఒకరుగా వెలుగులోకి వచ్చిన కోవెల సుప్రసన్న ఋతంభర కావ్యం మనస్సులోని అన్ని మూలలనూ ముసుగులేకుండా చూపి సుంది. ఆంతరంగం పొందవలసిన దివ్యత్వాన్ని చాటి చెబుతుంది.

ఈ వైతరణిలో ఉన్న నాకు ఏవో గుసగుసలు విన్పించి
దూరంగా దూరంగా
నక్షత్రాల తోరణాల వెనకాల
మనోమయ జీవనం వెలుపల
తీయని పిలుపులు వినబడి
మగతగా నిద్ర పోతున్న నన్ను
ఏదో రహస్య హస్తం
బురదలోంచి పైకి లాగినట్లు గుర్తు

ఆని మనసు పొందే పరిణామాన్ని సూచిస్తూ, మానవులంతా దివ్యులై ఉన్నత శిఖరాలను అధివసించాలని ఆకాంక్షిస్తాడు ఈ కవి.

అనంత ద్వారాలు భళ్లున తెరచుకునే వేళ
మనస్సుకు విశ్వచేతనకూ మళ్లీ ముడిపడే వేళ

అచింత్య సౌందర్యజ్వాలా తోరణ వెలిగే వేళ
ఎదురుచూచే వేళ తప్పక సాక్షాత్కరిస్తుంది

అంటూ ఆనంద ప్రభాతాన్ని ఆహ్వానిస్తాడు.

కవయిత్రి నాయని కృష్ణమూర్తి ఆత్మాన్వేషణకు దర్పణం అగ్నిపుత్రి కావ్యం.

మంచు తుప్పర నుండి
మహాసముద్రం దాకా
అన్నింటిలోనూ ప్రతిఫలించే
అరుణ కిరణ ప్రసారం లాంటి
నువ్వునువ్వే లేకపోతే
నా బ్రతుకంతా
కాటుక పట్టిన కత్తి కాదూ–
ఎక్కడో ఏడు కొండల ఎత్తున
ఒక్కడివై అందనంటావా
అయినా నువ్వు నా ప్రేమవే కావూ

అని గుండెగూడులో గొంగళి పురుగులాగ ముడుచుకోవాలని చూస్తున్న మనసు చిలకను ఆప్యాయంగా పలకరిస్తుందీమె. ఎంత హేతువాదబద్ధంగా ఆలోచించినా ఒక అతీత శక్తికి సంబంధించిన 'స్పృహ', ఒక కాల్పనిక మూర్తి గుండెను ఆక్రమిస్తుంది.

ని చూపుల్లోని
ఆయస్కాంత శిలాశక్తిని
నిద్రలేపి
అతి సాహసంగా మోగిసే
హృదయ తంత్రుల్ని
నిస్తంద్ర మోహనంగా

నీ వైపుకు లాక్కుంటున్నావు,
గొంతులో నుంచి
సుంతైనా వెలికి పెగలని
మాటల నిండా
నా మనస్సునే నింపి
నిర్విరామంగా/నీ చుట్టూ తిప్పుకొంటున్నావు

అని సుప్తాగాధాల అట్టడుగున గుప్తంగా దాచుకొన్న ఆ మూర్తిని ఆవిష్కరిస్తుంది ఈ కావ్యం.

మానవతాదృక్పథంతో ప్రపంచశాంతిని ఆకాంక్షించటం, ఆధ్యాత్మిక దృష్టితో సర్వమానవ సమానత్వాన్ని సాధించటం ఆధునిక దృక్పథం. నేటి కవుల రచనల్లో ఈ దృక్పథమే వ్యక్తమౌతుందనటం అత్యుక్తికాదనుకుంటాను.

తిక్కన కవిత్వాశయాలు

డా. ఎల్లూరి శివారెడ్డి

ఏ కవి జీవితాన్నైనా సంప్రదాయం సంస్కరిస్తుంది. సాంఘికజీవనస్థితి ప్రభావితం చేస్తుంది. ఆ కవిచేత సమాజంకూడా ప్రభావిత మవుతుంది. తిక్కనకవి నాటి దేశపరిస్థితి ఎలా ఉండేదో దాని కాయన ఎలా స్పందించాడో తెలియవలసి ఉంది. నన్నయ భారతాంధ్రీకరణానికి కారణం వైదిక మతోద్ధారణ, బ్రాహ్మణాధిక్యతా ప్రతిష్ఠాపన అనే వాదం ఎలా ఉన్నా భాషాసేవ కావ్యేతిహాస నిర్మాణం కమనీయంగా నెరవేరినవి. ఏ కాలమందైనా, ఏ సమాజంలోనైనా జనసముదాయాన్ని మతం ప్రచలితం చేసినంతగా మరేది కదిలించలేదు. ఈ విషయం ప్రపంచసాహిత్యంలో అంతటా గోచరిస్తుంది. శైవులను అణచివేసి వారి నిలయాలను తమ ఆలయాలుగా వారి శిల్పాలను తమ మత విగ్రహాలుగా మార్చుకొన్నారు ఆనాటి శైవులు ! ఆ ఆవేశం అంతవరకే పరిమితం కాలేదు. సాహిత్యంలోకి ప్రవేశించి పాల్కురికి సోమనాథుని వంటి వారి రచనల్లోను ప్రతిఫలించింది. సోమనాథుని కవితావేశాన్ని మతావేశం మాటుపరిచింది. ఆ సంస్కృతాయినభావాలు ఆయన రచనల్లో పుష్కలంగా ఉన్నవి. 'నామాల కుక్కల నర్చింపదగునె' 'వేదభరాక్రాంతుల నదనుగార్థములు' అనేవి మచ్చు కుకొన్ని. ఆతని మతాభినివేశం చాలాసార్లు సాహిత్య శిల్ప దృష్టిని ప్రక్కకునెట్టి తాండవం చేసింది. అయితే సోమనాథుని కవిత్వపు పరుగు సహజమైనది. తీవ్రమైనది. కొద్దిగా అతని రచనలకు నిగ్రహం తోడైతే సర్వజన సమాదరణ లభించేది. మరి తిక్కన కవి కూడా శైవుల ఇంటపుట్టినవాడే. ఆయనకు శైవమతాభినివేశం ఉన్నా వైష్ణవద్వేషం సోకలేదు. ఆయన తన మతాభినివేశాన్ని కవితావేశంగా మలచుకొన్నాడు. అసలు ఆవేశమే లేనిది సహజమైన కవిత అలవడటంకల్ల. తనకున్న కవితావేశానికి తోడు భిన్నవిషయాలను

సమన్వయించుకునే దృక్పథం కూడా తిక్కనకు గలదు. ఇదే ఆయన అద్వైత భావన. సోమనాథుడు వివేకాన్ని ఆవేశానికి లోనుచేస్తాడు. తిక్కన ఆవేశాన్ని వివేకానికి విధేయం కావిస్తాడు. పదమూడవ శతాబ్దిలో తిక్కనను ఆదర్శ మూర్తిగా నిలబెట్టింది ఈ సుగుణమే.

నిర్వచనోత్తర రామాయణపీఠికలో తిక్కన కవి 'అనులోదాత్త మనీష నేనుభయభాషా ప్రౌఢి పాటించు శిల్పమునన్ బారగుడ కళావిదుడను' అని చాటుకొన్నాడు. నిజంగా ఇది ఆవేశానికితోడైన ఆత్మవిశ్వాసం. యోగ్యునికి ఆవేశం ఆత్మవిశ్వాసజనకమై ఉంటుంది. ఆ ప్రౌఢ వయస్సున తన ప్రౌఢకావ్య నిర్మాణ సమర్థతను తిక్కన కవి ఆవిధంగా చాటుకోవడంలో అనౌచిత్య మేమీ లేదు. అయితే ఆ ఆత్మ విశ్వాసము భారతరచనాకాలం నాటికి 'నానేర్చిన భంగి చెప్పి వరణీయుడ నయ్యెద భక్తకోటికిన్' అను వినయంగా పరిణమించింది. ఆ పరిణామం ఆత్మీయతా విపరిణామం. ఆలోగా ఆయన దృష్టి విస్తరించింది. దృక్పథం విరివియైనది. భారతాధ్యయనంలో ఆయనకు లభించిన శాంతియేదో ఆయన లౌకిక జీవితాన్ని తేజస్వంతం చేసింది. వేదాంతాధ్యయనానంతరం సాధారణంగా జనులకు లౌకికజీవితం మీద విరక్తి కలుగుతుంది. కాని తిక్కన కవి వ్యక్తిత్వమే విశిష్టమైంది.

తాను నేర్చిన విద్య, తనకు లభించిన వెలుగు ఇహపరాలను రెంటిని సమన్వయించేదిగా ఉండాలని ఆయన భావన. అందువల్ల ఆయనకు కావ్యజగత్తు, వ్యవహార జగత్తు, అతీంద్రియ జగత్తు ఏకమై భాసించినవి. కావ్యజగత్తులోని రసానందం, వ్యవహార జగత్తులోని జీవన మాధుర్యము, అతీంద్రియ జగత్తులోని బ్రహ్మానందం ఈ మూడింటికీ మన ఊహకందని సమన్వయమేదో తిక్కన సాధించినాడు. ఆ విజ్ఞానముతోనే భారతానువాదం సాగించాడు. అంత మహో ద్గ్రంథములో అశ్రద్ధాలేశమైనా మన బుద్ధికి తట్టదు. ఆ కార్యాన్ని అంతటి వర్చస్వీగా నెరవేర్చగలగటం తిక్కన కవి వంటి మనస్వికి గాక ఇతరులకు సాధ్యమా అన్న దిగ్భ్రమ కలిగిస్తుంది. ఆయన 'అంతఃసన్నిధి' కల్పించుకొని ఆ కావ్యార్థాన్ని సంగతం చేసెదనన్నాడు. మరి ఆయన చెప్పిన 'కావ్యంబు నర్థంబు' అంటే కావ్యరసమని, అభినవ గుప్తపాదులు అర్థ శబ్దాన్ని రసపరంగా వాడిన విషయం విమర్శకులకు తెలిసిందే. ఆయన రచించిన నిర్వచనోత్తర

రామాయణ పీఠిక ఆయన కవిత్వాశయాలకు రత్నపేటికవంటిది. అందులోని సారాంశం ఇది :

రచన వివేకచిత్తుల హృదయావర్జకంగా ఉండాలి. పదాలు పూరేకులలాగా అర్థం తావిలాగా గుప్పుమనాలి. ఇంపైన పదాల పోహళింపుతో రచన పూల మాలలాగా అమరి ఉండాలి. లేకపోతే కృతి లోకానికి ఉపకృతి అవుతుందా అని ఆయన భావం. దిర్విటులవంటి కుకవుల మాటల్లో పలుకుల పొందు ఉండదు. స్థాయిత్వమే లేని వారి భావం రసభంగం కలిగిస్తుంది. కుకవి చెప్పిన మాటలే చెప్పి విసుగుకలిగిస్తాడు. కుకవుల అనౌచితిని గమనించి లోకం నవ్వుకుంటుంది. తిక్కన సమకాలీనులకు కొందరికి ప్రాస, యతులు పాశాలుగా పరిణమించినవి. వాటి పీడ వదిలించుకోవటానికి వర్ణసాద్యశ్యంతో సరిపెట్టుకొని కాలం గడిపారు. అలాంటివారిలో ప్రముఖులు శైవులే తిక్కనకవికి ఇది నచ్చలేదు. ఇలా యతి ప్రాసల్ని పులిమిపుచ్చడం రచనకు మచ్చ అని ఆయన ఉద్దేశం. సమర్థునికి నియమాలు అడ్డంకి కావన్నది ఆయన అభిప్రాయం. భాషాపరంగా లింగవచనాలు భేదించే రచన చేయడం ఆయనకు అనిష్టం. తెలుగు భాషలో ఇమడని ఆంటే బాత్యంకాని పంస్కృతం ఆయనకు నచ్చదు. తన రామాయణ రచన నిర్వచనం కాబట్టి అందులో వాక్యసాంగత్యం చేయడానికైనా గద్యాన్ని వాడనని ఘంటాపథంగా వాకొన్నాడు. ఇవి ప్రత్యక్షంగా ఆయన చెప్పుకొన్న కొన్ని భావాలు. 'సార్థకం కాని నియమాన్ని ఆయన వదిలించుకొన్నాడు. నిర్వచన రచనను మానుకున్నాడు ఆమలమూ, ఉదాత్తమైన ఆయన మనీష పలికించే ప్రతి వాక్యం కవిత్వతత్వంతో కమనీయంగా ఉంటుందని, రస రమ్యంగా రవళిస్తుందని రసవేత్తలందరికి తెలిసిన విషయమే * ఆయన చెప్పుకొన్న కవితా నియమాలన్ని రామాయణ రచనలోకంటె భారతకథనంలోనే ఎక్కువగా అనుభవానికి రావడం జరిగింది.

శ్రుతిదుష్టమైన శబ్దాన్ని పరిహరిస్తాడు. శక్తిమంతమైన శబ్దాన్ని వరిస్తాడు. ఆయన వ్యవహార ధురంధరుడు కావడంచేత లోకంలో ఏశబ్దం చెవిలో పడినా పదిలంగా దాచుకొని అవసరమైనపుడు దాన్ని అందంగా వినియోగించుకోగలిగిన క్రియాశీలి. ఆయన వాడిన తెలుగు పదజాలం జనజీవాలు కలిగినది. మాటల మధ్య మమకారాన్ని పెంచిన కవి తిక్కన

సోమయాజి. అయన సమకాలీన కవులు ఛందస్సులో, భాషలో, పాత్రపోషణలో అతివాద మవలంబించారు. ఆయన మాత్రం హితవాది. ఆయన సంస్కారం అనుభవసంపన్నమైంది. మహాకవి వ్యవహారధురీణుడుకావాలి అలాకాకపోతే జీవనసవంతిలోని స్పందనా మాధుర్యానికి వెలియైపోతాడు. కి.శ. 1210 నుంచి 1290 వరకు విస్తరించిన ఆయన జీవితంలో మానవజీవితమందలి ఎగుడు దిగుళ్లను సునిశితంగా పరిశీలించే అవకాశం కలిగింది. ఆమనిషిలో వ్యుత్పత్తి, ప్రతిభ, ప్రతిభటాత్వాన్ని వర్ణించాయి. అహమహమికతో తారసిల్లాయి.

తిక్కననాటికే ధ్వన్యాలోకముద్ర భారతీయ సాహిత్యంలో పడిఉందని, తెలుగుదేశంలో కూడా ఆ సిద్ధాంతాన్ని అనుసరించినవారూ, ప్రభావితులైనవారూ ఉన్నారని భావించటానికి ఆస్కారం ఉంది. అభినవగుప్తుడు రసధ్వనిని సర్వ శ్రేష్ఠంగా సమర్థించారు. తిక్కన కూడా రసపదాన్ని బహుధా ప్రయోగించాడు. ధ్వని సుందరంగా రచించాడు. ఆయనను కలలో కనిపించిన హరిహరనాథుడు 'ఆత్మ సమ్మోదముబొంద కావ్యరసముంగొనియాడుచు నుండుదువు' అని సంభావించాడు. ఐహికమునందు ప్రతి అల్పవిషయాన్ని ఉదాత్తంగా పరికించే దృష్టి గల తిక్కనకవికి బ్రహ్మానందమందెంత అభీష్టముందో కావ్యానందంలో అంతటి అభిరుచి ఉంది. ఆయనకు అనుభవ దశలో ప్రతి భావం రసమై రాణించును. 'రసనాత్ రసత్వమేషాం' అని చెప్పటానికి ఇదే కారణం.

పరమేశ్వరుని మోముస 'దరహాసరసం' తళుక్కుమన్నదట. దరహాసం కూడా ఆయనకు రసమే. రసపదాన్ని వాడినంతమాత్రాన తదేకదృష్టితో రసాన్ని పోషించాడని అర్థం కాదుగాని చెప్పినదానికంటె ఎన్నోరెట్లు అధికంగా రసపోషణచేసినాడు అని చెప్పడానికి వేలకొలది పద్యాలు తార్కాణంగా చూప వచ్చును. కవిబ్రహ్మ ఎన్నోమార్లు భావాల, చిత్తవృత్తుల ప్రస్తావన గావించాడు. కల్లు తెమ్మని సుధేష్ణ చెప్పగా ద్రౌపది 'నిర్వేదం' చెందిందట! భీముడు కీచకుని 'చిత్తభవవికారాలు' పాపినవాడట. కీచకుని చావుకు ఉపకీచకులు 'శోకవిస్మయ పరీతచేతస్కులు' అయినారట! భీముడు ద్రౌపది 'సల్లాపరసం' అనుభవించారట. సంజయునికి 'భావశుద్ధి' కలదట. తిక్కన కవిలో మనం గమనించవలసింది ముఖ్యంగా రసపోషణ మరియు నాటకీయత. భావితరాలకు ఆయన

చూపిన కవిత్వాదర్శాలలో ఈ రెంటి యందు ఆయన పొందిన సిద్ధి అనిదం పూర్వం.

కవి మొదట సహృదయుడు. తదుపరి సంధాత. పిమ్మట విమర్శకుడు. ఈ మూడు గుణాలు ప్రతిభామహితుడైన ప్రతి కవిలో గోచరిస్తాయి. భారతాను వాదం ఇంత రసరమ్యంగా నెరవేరడానికి తిక్కనకవి ప్రతిభే కారణం. ఆప్రతిభ ఆయన చూపిన వస్తుమననం, భావుకత, అభ్యాసం అనేవి కారణంగా పరిఢవిల్లి నాయి. తిక్కనకవి వ్యాసభారతమును అధ్యయనంచేసి, ఆ ఇతిహాసార్థాన్ని పర వశ రీతిలో అనుభవించి ఆ అనుభవానికి తోడుగా జీవనిష్ఠమైన ప్రతిభావాన్ని జోడించి సర్వాంగసుందరమైన అనువాదాన్ని వినిర్మించాడు. అనువాదకుల కెవరి కైన తిక్కనకవి అనుసరణీయుడు, ఆదర్శమూర్తి.

అనుభవమహిత కావ్యాలని, కల్పనాప్రధాన కావ్యాలని కావ్యాలను రచనా తత్వాన్నిబట్టి వేరుచేయవచ్చును. అనుభవస్పర్శగల కావ్యాలలో ప్రతిపదమొక విశిష్టార్థాన్ని ధ్వనింపజేస్తుంది. ప్రతి అర్థము కస్తూరి పరిమళంవలె, చందన స్పర్శలాగా ఒక సంవేదనను కలిగిస్తుంది. అట్టివే సాహిత్యంలో చిరస్థాయిగా నిలువగలుగుతాయి. తక్కినవి కాలగర్భంలో మరుగునపడిపోతాయి. అలంకార భూయిష్టములై, కల్పనాప్రధానమై కేవల వస్తు నిరూపకాలైన కావ్యాలు హృద యుల్లో చిత్త వికాసాన్ని కలిగింపవు. చిత్తాన్ని స్వాయత్తంచేసుకునే భావవర్చస్సు కేవలం ఉత్తమ కావ్యాల్లో స్పందిస్తుంది. కావ్యాల్లో భావం ప్రధానం. సహృద యుని హృదయాన్ని ఆర్ద్రమొనరించేగుణం భావానికే ఎక్కువగా ఉంది. ఆశక్తి అలంకారాలకు లేదు. వృత్తిరీతులకురాదు. అవి భావకళకు ఉపస్కారకములై శోభిస్తాయి అంతే! కేవలం కావ్యాంగాలే ప్రధానమై భావమప్రధానమైతే దానిలో జీవకళ లోపిస్తుంది. తిక్కన కవి వస్తువును భావకళచే ప్రాణవంతం చేస్తాడు. ఆయన కావ్యతత్వంలో ఇది ముఖ్యమైన అంశం. అందువల్ల భారతంలో ఊహా చిత్రాలకు, పేలవమైన వస్తువర్ణనకు స్థానం లేదు. విషయం ఎదుట ఉన్నప్పుడు చిత్తం ఎన్ని వికారాల పాలవుతుందో వర్ణించేనైపుణి రసపోషణానికి మూలద్రవ్యం. ఈ దృష్టివల్లనే తిక్కనకవి ఏ విషయమును వర్ణించినా అది అనుభవమంత గాఢమై సహృదయుని మనోదర్పణంలో ప్రతిఫలిస్తుంది. కవితయభారతాన్ని కావ్యకళా దృష్టితో గమనించినపుడు మూలభారతంకన్న

మిన్నగా కనిపిస్తుంది. కథను ధర్మాభిముఖంగా నడిపించటంలో వ్యాసముని అద్భుతమైన సిద్ధి పొందెను. ఆసిద్ధి మరియొకరు ఆశింపదగినది కాదేమో! భారతాన్ని కాలక్రమేణ దేశభాషలలోనికి పరివర్తనం చేసికొన్నప్పుడు అప్పటికి అభివృద్ధిచెందిన కావ్యశాస్త్ర సంస్కారాన్ని ఆసరాగా చేసుకొని భారతరచనను తిక్కన భూషించాడు. అది సహజంగా జరిగిన—జరుగవలసిన మార్పు.

తిక్కన కవి నాటకీయతను గూర్చి కొంత సమాలోచించాలి. ఈజగత్తు ఒకలీల. మానవజీవితం ఒక నాటకం. ప్రతిజీవి ఒకపాత్ర. లోకతత్వం తెలిసిన కవులు మానవజీవితాన్ని జగన్నాటకంగా దర్శిస్తారు. ప్రకృతిలో నాటకకృతిలో రెండింటా గుణారోపం సమానమే అందుకే నాట్యశాస్త్రంలో భరతముని 'లోక వృత్తానుకరణం నాట్యం' అని అన్నాడు. ప్రపంచం విభిన్న చిత్తవృత్తులకూడలి. అలాగే నాటకం కూడా! దురవగాహంగా ఉన్న జగన్నిర్మాణతత్వాన్ని ఎంత ఆకళించుకోగలిగితే కవికి కావ్యనిర్మాణం అంతగా సుకరం అవుతుంది. తిక్కనకవి అలాంటి జగత్ తత్వవేత్త.

తిక్కన కవికి భరతుని నాట్యశాస్త్ర పరిజ్ఞానం సుష్ఠుగా ఉందని ఊహించటానికి అవకాశం ఉంది. విరాటుని సభలోనికి వచ్చిన బృహన్నల తనకున్న నాట్యశాస్త్ర పరిజ్ఞానాన్ని 'గాయామి నృత్యామ్యధ వాదయామి, భద్రోఽస్మి నృత్యే కుశలోస్మిగీతే' అని చాటుకున్నాడని మూలభారతంలో ఉంది. ఈ విషయాన్నే తిక్కన కవి ఇలా విస్తరించాడు.

"విశ్రుతవాద్యంబులు మం । జ్రుతి సంభావ్యగీతసుగతులు సద్భా।
వాశ్రయములుఁదజ్జన్యర । సాశ్రయములైన యభినయంబు లెఱుఁగుదున్"

బృహన్నలకు అభినయ విద్య తెలుసునట। ఆయన వాద్యాలు గీతగతులు ఎఱుగునట। భావాలు, తజ్జన్యరసాలు నేర్చాడట. ఇవి నాట్యశాస్త్రంలోని భావోత్పత్తి రసోత్పత్తిని గురించి భరతుడు చెప్పిన విషయాలే. ఇవన్నీ కథలో బృహన్నల నేర్చినా నేర్వకున్నా తిక్కన కావ్యశాస్త్ర పరిజ్ఞానాన్ని పట్టి చూపడానికి ప్రబల నిదర్శనాలు. 'శ్రమము చేయింతుఁ జతురతా విహీనములైన పాత్రములనైన.... నిపుణ నైపథ్యవిధులకు నేర్తును' అని బృహన్నల నోట తిక్కన పలికించాడు.

ఇక్కడ పాత్రలచేత శ్రవ్య చేయించటం అంటే అభినయ సూచనలను వర్ణించి శ్రవ్య కావ్యాన్ని దృశ్య కావ్యంగా పరిణమింప చేయటం అని మనం భావించాలి.

నాటకీయతకు సహాయపడే మరో లక్షణం సంభాషణల రచన. భారతరచనలోని సంభాషణలు అలతిఅలతిగా ఉంటాయి. సాధారణంగా పాత్రలచేత దీర్ఘోపన్యాసం చేయించే అలవాటు తిక్కన సోమయాజికి లేదు. శ్రీకృష్ణుడు రాయబారానికి వెళ్లినపుడు చేసిన ఉపన్యాసమే కొంత దీర్ఘంగా ఉంటుంది. అలాంటి సందర్భాలు రెండో మూడో తప్ప ఎక్కువగాలేవు. సంభాషణలు చిన్నవిగా ఉంటే భావాలు చిక్కగా ఉండి మాటలకొక శోభ కలుగుతుంది. అదీగాక ఉద్యోగ పర్వంలో భావచిత్రణకేగాని కథాంశాల ఒరవడికి అవకాశం తక్కువ. చిత్తవృత్తుల చిత్రీకరణమే రసపోషణకు రమ్యపథం అని భావబ్రహ్మయైన కవిబ్రహ్మ అభిమతం. దీని కనుగుణగానే భారతాన్ని తీర్చిదిద్దాడు.

ఎంత సమర్థుడైన కవిఐనా నాటకీయతకు పనికిరాని వస్తువును తీసుకొని దానిని దృశ్యకావ్య లక్షణ సంభరితంగాతీర్చుటకు పూనుకోడు. అయితే రచనలో అటువంటి అవకాశం ఉంటే తన ప్రతిభచేత దానికి మెరుగు దిద్దుతాడు. మహాభారతంలోని వస్తువు నాటకీకరణకు ఎంతో అనుకూలమైంది. అందులో విరటోద్యోగ పర్వాలు దీనికి అనువైన కథాంశాలు కలిగినవి. తిరుపతి వేంకట కవులు ఉద్యోగ పర్వంలోని ఇతివృత్తాన్ని స్వీకరించి దానిని పాండవోద్యోగంగా తరువాతికథను పాండవ విజయంగా నాటకీకరించటం ఇందుకు నిదర్శనం. విశ్వనాథవారు విరాటపర్వేతివృత్తాన్ని వస్తువుగా తీసుకొని నర్తనశాలగా నాటకీకరించారు. వీరందరికి స్ఫూర్తినిచ్చింది తిక్కన భారతమేగాని వ్యాసభారతంకాదు. నిదానంగా గమనిస్తే తిరుపతి వేంకటకవుల నాటకంలోని కొన్ని వద్యాలకు ఛాయలు భారతంలో ఉన్నవే. గమనించండి.

'నీవిటమున్ను వచ్చితిది నిక్కము పార్థునిఁదొల్తగాంచితిన్' అనే తిక్కన పద్యం 'ముందుగ వచ్చితీపు మునుముందుగ నర్జును నేను జూచితిన్' అనే పద్యంగా అవతరించింది. తిక్కన కవి నాటకీయతాలక్షణాలే పాండవోద్యోగ పాండవ విజయ నాటక రచనలకు కారణమై ఉన్నాయని భావించటంలో విప్రతిపత్తిలేదు.

తిక్కనకవి 'కేవలభావానందమయా' అని హరిహరనాథున్ని స్తుతించాడు. అదే విశేషణాన్ని మనం తిక్కనకవి పరంగా వాడి ఆయన స్వభావాన్ని సూచింపవచ్చు. ఇహలోకంలోని భావసుఖాన్ని పరిపూర్ణంగా రుచిచూచినవాడాయన. తిక్కనకవి, ఆనంద పద లాంఛనుడని విమర్శకులు గుర్తించారు. 'విజ్ఞానానంద రసాభిజ్ఞహృదయ' అని తిక్కన వాడిన ఒక విశేషణం కావ్యప్రయోజనాల్లో ఆయన ఆనందోపదేశాలకు సమప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని విశదీకరిస్తున్నది. మానవజాతికి తెలిసినా తెలియకున్నా అది శాంత నిర్వాణం లక్ష్యంగా గమిస్తూ వరణమిస్తున్నది. ఉపదేశం నుండి ఆనందం వేరుకాదు. వేరుచేయకూడదు. లతాంతం నుండి పరిమళాన్ని వేరుచేయటం ఎలాంటిదో ఆనందంనుంచి ఉపదేశాన్ని పృథక్కరించటం అలాంటిది. ఆంధ్రమహాభారతంలో రసానందం, ఉపదేశం రెంటికి సమాన ప్రతిపత్తి గలదు. ఆ ఇతిహాస వస్తువే అలాంటిది. కవిబ్రహ్మచూపు కూడా అదే.

తిక్కన మహాకవి కావ్యకళను సంపూర్ణంగా గ్రహించిన రసికుడు. తిక్కన ప్రతికర్మను అనుభవ మధురంగా నెరవేర్చగలిగిన సుఖాత్మక చిత్తవృత్తి గలవాడు. ఆదే ఆయన చెప్పుకొన్న 'ఆత్మసమ్మోదము'. ఖేదాన్ని మోదంగా పరిణమింపజేసుకొని భావలోకాన్ని దివ్యలోకంగా తీర్చుటలో ఆయన దొక విశిష్ట ప్రవృత్తి. ఎంత జుగుప్స కలిగించు వస్తువైనా ఆయన భావనలో రమణీయంగా భాసిస్తుంది. అందుకే ఆయన ప్రాచీన ధ్రకవితకు పరమేష్ఠి. అంతటి మహా రచనచేసి 'కావ్యంబు సరసులైన కవుల చెవులకు నెక్కినగాని నమ్మడెందు పరిణతిగలుగు కవీశ్వరుండు' అని తలచాడు. ఈ మాట 'ఆ పరితోషాద్విదుషాం నసాధుమన్యే ప్రయోగవిజ్ఞానం' అని కాళిదాసు మాటకు దీటుగా ఉంది. కాళిదాసు సరసన నిలువదగు తెలుగుకవులలో తిక్కన అగ్రేసరుడు—ఉదర్శపురుషుడు

తెలుగు నవలారీతులు

శ్రీ వాసిలి వసంతకుమార్

తెలుగు 'నవల' పుట్టు పూర్వోత్తరాల ప్రశ్నను వదిలేస్తే, అది తెలుగు హృదయాలలో చక్కటి స్థానాన్ని ఆక్రమించటానికి మొదటి సారిగా ప్రయత్నించి వంద సంవత్సరాలు దాటిందని చెప్పుకోవచ్చు. బాలారిష్టాలు అధికంగా లేకుండా ఆవిర్భవించిన తెలుగు నవల ఈ వంద సంవత్సరాలలోను మూడు పూవులు ఆరుకాయలుగా వర్ధిల్లుతూ వచ్చింది. ఎప్పటి కప్పుడు 'ఆధునికత'ను తనలో నింపుకుని పరిమళిస్తూ, వికసిస్తూ వచ్చింది. ఎప్పటి కప్పుడు క్రొత్త బాటలు నిర్మించుకుంటూ, ఆ బాటలలో ప్రయాణం సాగిస్తూ, అందులో ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొంటూ, అనుకున్న గమ్య స్థానాన్ని చేరుకుంటూ, ఆధునికత ముసుగును ధరించి ఆనందంతో చిలుకవ్వులు ఒలకబోస్తూ ముద్దరాలుగా ఉన్న నాటి తెనుగు నవల నేడు ప్రౌఢగా మారింది. అందుకనే, ఈనాడు తేనె తెనుగు మాగాణిపై ఆగతాంబూలాన్ని అందుకుంటోంది.

ఇలా, ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియలలో ఉన్నత ఆసనాన్ని అలంకరించిన తెలుగు నవలలోని ఆధునిక రీతులను లేదా ధోరణులను పరిశీలించే ముందు 'ఆధునికత' అంటే ఏమిటో కాస్త ఆలోచించాలి.

ఎప్పటి కప్పుడు వ్యక్తి వికసిస్తుంటాడు. సమాజం పురోగమిస్తుంటుంది. ప్రకృతి పరిణామం చెందుతుంటుంది. అందుకనే, ఈ చరాచర ప్రపంచంలో ఒక విధమైన చైతన్యం లీలగా గోచరిస్తుంటుంది. వ్యక్తిని, సమాజాన్ని, ప్రకృతిని సాహిత్యం అద్దం పడుతుంది. కాబట్టి, సాహిత్యంలో కూడా ఈ చైతన్యం ప్రతిఫలిస్తుంది.

అంటే, వికసించే వ్యక్తి, పురోగమించే సమాజం, పరిణామం చెందే ప్రకృతి సాహిత్యంలోని చైతన్య స్థితికి దోహదం చేస్తాయి. ఈ మూడింటి యొక్క తాత్వికత, అంతర్లీనంగా ప్రవహించే చైతన్య స్రవంతి సాహిత్య వికాసానికి ఆలంబనాలవుతాయి.

వ్యక్తి, సమాజం, ప్రకృతి ఎప్పటి కప్పుడు మారుతుంటాయి కాబట్టి, వికసిస్తుంటాయి కాబట్టి, పరిణామం చెందుతుంటాయి కాబట్టి వీటిలో ఎప్పటి కప్పుడు ఆధునికత ప్రతిఫలిస్తూనే ఉంటుంది. ఈ ఆధునికతే సాహిత్యంలో కూడా గోచరిస్తుంది.

ఆధునికతను అనుసరించే ఆధునిక నవలా రీతులు జనించి, వికసిస్తాయి. తెలుగు నవల కూడా గడచిన శతాబ్దంలో అనేక నవీన ధోరణులకు పుట్టిల్లయ్యింది. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతోనే ఈ ఆధునిక నవలా రీతులు తెలుగులో ఆవిర్భవించడం జరిగింది. తెలుగు నవలను పరిశీలిస్తే ఇతివృత్తం లోను, శిల్పంలోను, తత్వంలోను, శైలిలోను ఆధునిక రీతులు స్పష్టంగా సాక్షాత్కరిస్తాయి.

ప్రతి వ్యక్తికీ తనదైన వ్యక్తిత్వం, ప్రతి సమాజానికీ తనదైన ధర్మం, ప్రతి జాతికీ దేశానికీ తనదైన సంస్కృతి, జాతీయత, నాగరికత వుంటుంటాయి. అలాగే తెలుగు సాహిత్యానికీ కూడా తనదైన ఒక లక్ష్యం ఉంది. వ్యక్తిని లేదా సమాజాన్ని లేదా సంస్కృతిని ప్రతిబింబింప చేయడమే తెలుగు సాహిత్యం లక్ష్యం.

తెలుగు నవల పుట్టినప్పటినుండీ హైందవ సంస్కృతిని, తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబింప చేస్తూ వస్తోంది. తెలుగు నవల మొదటి సారిగా కాల్పనిక వాదంలో వూపిరి పీల్చుకొన్నప్పటికీ, పాశ్చాత్య ప్రభావంతో తెనుగు సాహిత్య ఉద్యానవనంలో పుష్పించి, వికసించినప్పటికీ హైందవ సంస్కృతిని, ఆంధ్ర సంస్కృతిని తన తత్వంగా చేసుకోవటం వల్ల తెలుగు నవల ప్రారంభ దశలో 'సాంస్కృతిక నవల'గా వేరు గడించింది. అంటే, సంస్కృతిని ప్రతిబింబింప చేయటమే తెలుగు నవల ప్రారంభ దశలో సాధించిన ఆధునికతగా

అనుకోవచ్చు. వ్యక్తి ఎక్కడికెళ్ళినా వ్యక్తికి ఎదురయ్యే ప్రశ్నలు రెండే. అవి 'నీపేరేమిటి?' 'నీవూరేది?' అనేవి. ఈ రెండు ప్రశ్నలకు సమాధానాలు లభించిన తర్వాతే వ్యక్తిని గురించిన తక్కిన ప్రశ్నలు వేసేది. దీన్ని బట్టి, వ్యక్తికన్నా వ్యక్తి జన్మస్థలానికి, నివాస స్థానానికి ఈ సమాజం అధిక ప్రాముఖ్యమిస్తుం దన్న విషయం వెల్లడవుతోంది. అందుకనే కాబోలు, తెలుగు నవల కూడా ప్రారంభ దశలో తెలుగు వారి సంస్కృతిని, భారతీయుల సంస్కృతిని ప్రపం చానికి అందించేందుకు ప్రయత్నించింది.

హైందవ సంస్కృతి, ఆంధ్ర సంస్కృతి నలుగురికీ తెలిస్తే కాని ఆంధ్రుడు ఎవడో, ఎటువంటి తత్వం కలవాడో, ఎటువంటి సంస్కృతి నాగరికత కలవాడో తెలీదనే ఉద్దేశంతో మన రచయితలు మొదటగా సాంస్కృతిక నవలలు రచించారు. ఆ తర్వాతే వ్యక్తికి సంబంధించిన నవలలు రచించటం జరిగింది.

సంస్కృతికి ప్రాధాన్యమిస్తూ నవలలు రచించటమే నాటి ఆధునిక నవలా రీతి. ఈ ఆధునిక నవలా రీతిలో ఉన్నవ లక్ష్మీనారాయణ, విశ్వనాథ సత్యనారాయణ, త్రిపురనేని గోపీచంద్, ఆడివి బాపిరాజు, చివుకుల పురుషోత్తం మొదలైనవారు నవలా రచన చేయడం జరిగింది.

సంస్కృతి తర్వాత 'ప్రేమ-ప్రణయం' అనేవి నాటి సామాజికులను, రచయితలను బాగా ఆకర్షించాయి. ఈ రెండూ కాల్పనిక వాద లక్షణాలయినా వీటితో నవలలు రాయాలనే ఉద్దేశం రచయితలలో ప్రబలింది. అలా తమ ఉద్దేశాలకు అనుగుణంగా నవలా రచన కొనసాగించడమే నాటి ఆధునికత. అంటే, ఉద్దేశ ప్రధాన నవలను కూడా మరొక ఆధునిక నవలా రీతిగా చెప్పుకోవచ్చు.

సంస్కృతి ఇదీ అని చెప్పి దానికి హద్దులు నిర్ణయించినట్లుగా వ్యక్తి ప్రేమ-ప్రణయాలను నిర్వచించి, వాటికి హద్దులను నిర్ణయించలేం. సంస్కృతి అనేది జాతికంతటికీ ఒక్కటే అవుతుంది. కాబట్టి అందులో పెద్దగా మార్పు ఉండదు. అయితే ప్రేమ-ప్రణయం వ్యక్తులనుబట్టి మారుతుంటుంది కాబట్టి వాటిలో మార్పు స్పష్టంగా గోచరిస్తుంది. అందుకనే ఈనాటికీ ప్రేమ, ప్రణయం వస్తువు

లుగాగల నవలలు విరివిగా వచ్చేస్తున్నాయి. నాటి, నేటి రచయితల ప్రేమ తత్వా లను పరిశీలిస్తే వారి ప్రేమతత్వాలు వేరువేరుగానే ఉంటున్నాయి. నాటి రచనల్లో విశ్వనాథ ప్రేమతత్వం వేరు, చలం ప్రేమతత్వం వేరు. అలాగే గోపీచంద్ ప్రేమతత్వం వేరు. బుచ్చిబాబు ప్రేమతత్వం వేరు. ఈనాటి రచయిత్రుల్లో యద్ధనపూడి ప్రేమతత్వం వేరు, లత ప్రేమతత్వం వేరు. అలాగే మాదిరెడ్డి ప్రేమతత్వం వేరు, ముళ్ళపూడి ప్రేమతత్వం వేరు.

ఇలా ప్రతిరచయిత నాటి నుండి నేటివరకు విభిన్న ధోరణుల్లో అనేక రకాల ప్రేమ నవలలు రాస్తున్నారు.. ఇలా ఒక ఉద్దేశాన్ని ప్రధానంగా చేసుకొని రచించిన నవల లన్నింటినీ 'ఉద్దేశ ప్రధాన నవలలు'గా వింగడించవచ్చు. ఇలాగే ఒక ఉద్యమానికో ఒక ఇజానికో కట్టుబడి చేసే రచనలు (నవలలు) ఉద్దేశ ప్రధాన నవలలే అవుతాయి.

వ్యక్తి సంబంధమైన ప్రేమ–ప్రణయం ఎప్పుడైతే నవలల్లో ప్రధాన పాత్ర వహించాయో నాటినుండే రచయితలు వ్యక్తి మనస్తత్వాన్ని గురించి ఆలో చించడం ప్రారంభించారు. గోచరించే వ్యక్తి మాత్రమే పరిపూర్ణుడు కాడని గోచరించని వ్యక్తి వ్యక్తి అంతరాంతరాల్లో ఉంటాడని వీరు గ్రహించారు.

వ్యక్తిలో చేతనా చేతన స్థితులు ఉంటాయని, చేతనా స్థితి మాత్రమే బహిర్గతమౌతుంటుందని, అచేతనా స్థితి బహిర్గతంకాదని గుర్తించిన రచయితలు ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్‌ల మనస్తత్వ సిద్ధాంతాలకు ప్రాధాన్యమిచ్చి నవలలు రచించడం ప్రారంభించారు. అలాగే, వ్యక్తి చేతన, ఉపచేతన, అచేతనలకు ప్రాధాన్యమిచ్చి నవలా రచన కొనసాగించారు. ఇలా మనస్తత్వ సిద్ధాంతాలకు ప్రాముఖ్యమిచ్చి రచనలు చేయటమే నాడు ఆధునిక ధోరణిగా భావించారు. మనో విశ్లేషణకు అగ్ర తాంబూలం ఇవ్వడం వల్ల వీటిని 'మనో వైజ్ఞానిక నవల'లని చెప్పవచ్చు.

బాహ్యజీవితంతో మాత్రమే సరిపెట్టుకోక, వ్యక్తి జీవితాన్ని లోతుగా గాఢంగా పరిశీలించి, అవగాహన చేసుకుని, వ్యక్తి ఆంతరంగిక వికాసాన్ని సమీక్షించుకుని, వాటికి ఉన్నత స్థానమిచ్చి, వ్యక్తి జీవితానికి ఒక అర్థాన్ని

పరమార్థాన్ని, సమన్వయాన్ని సిద్ధింపచేయటమే మనోవైజ్ఞానిక నవల ఆదర్శం. అదే తెలుగు 'మనో వైజ్ఞానిక నవల' సాధించిన విజయం కూడా.

ప్రతి నవలలోను పాత్రల మనస్తత్వం అంతో ఇంతో వెల్లడౌతూనే ఉంటుంది. అయితే, మనోవైజ్ఞానిక నవలల్లో పాత్రల మనస్తత్వం ప్రతి అంశంలో, ప్రతి విషయంలో, ప్రతి సందర్భంలో, ప్రతి సంభాషణలో, ప్రతి ఆలోచనలో, ప్రతి వర్ణనలో ప్రతిఫలిస్తుంది. తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబు, గోపీచంద్, రాచకొండ విశ్వనాథశాస్త్రి, నవీన్, ఆర్ ఎస్. సుదర్శనం, వడ్డెర చండీదాస్ మొదలైనవారు మనోవైజ్ఞానిక నవలలు రచించారు. బహుముఖాలుగా పాత్రల మనస్తత్వానికి చిత్రికపట్టడమే మనోవైజ్ఞానిక నవల సాధించిన ఘన విజయం.

వ్యక్తి మనస్తత్వం తర్వాత రచయితలను బాగా ఆకర్షించింది వ్యక్తి తత్వం. ప్రతి వ్యక్తి ప్రతిదాన్ని గురించి ఆలోచిస్తాడు. ఆ ఆలోచనలు వ్యక్తి తత్వాన్ని ప్రతిబింబింపచేస్తాయి. అలా ఆలోచించడంవల్ల వ్యక్తికి తన జీవిత అర్థం, తనజీవిత పరమార్థం తెలుస్తాయి. వ్యక్తి తత్వానికి అద్దంపట్టే హేతువాదం, మానవతావాదం, అస్తిత్వవాదం మొదలైనవన్నీ తెలుగు నవలల్లో ప్రాణంపోసుకున్నాయి. అంటే, వ్యక్తితత్వానికి ప్రాముఖ్యమిస్తూ, వ్యక్తితత్వాన్నే ప్రధానంగా చేసుకుని తెలుగు రచయితలు నవలలు రచించారన్నమాట.

వ్యక్తి జీవిత అర్థాన్ని తెలియజేస్తూ విశ్వనాథ, చలం, గోపీచంద్, బుచ్చిబాబు, జి వి. కృష్ణారావు, శారద, పాలగుమ్మి పద్మరాజు, భాస్కరభట్ల కృష్ణారావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, వడ్డెర చండీదాస్, వాసిరెడ్డి సీతాదేవి మొదలైనవారు తాత్విక నవలలను రచించారు. వ్యక్తి జీవితపరమార్థాన్ని తెలుపుతూ విశ్వనాథ, గోపీచంద్, ఉన్నవ లక్ష్మీనారాయణ, చివుకుల పురుషోత్తం మొదలైనవారు తాత్విక నవలలు రచించారు.

వాస్తవిక జీవితాన్ని, తర్కంతో ముడిపెడితే ఏమవుతుందో గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర'లో చిత్రించారు. హేతువాదదృష్ట్యా రచింపబడ్డ నవల ఇది.

వ్యక్తి ధర్మం సంఘ ధర్మానికి విరుద్ధమైనపుడు, ఆ రెండింటి మధ్య సంఘర్షణ చెలరేగితే సంభవించే అనర్థాన్ని జి.వి. కృష్ణారావు 'కీలు బొమ్మలు' తెలియజేస్తుంది. మానవతావాద దృక్పథంతో రచింపబడ్డ నవల ఇది.

ధనికులకు, పేదలకు మధ్య జరిగే పోరాటాన్ని చిత్రించే నవల రాచ కొండ విశ్వనాథశాస్త్రి 'గోపులొస్తున్నాయి జాగ్రత్త'.

వ్యక్తి తనకోసం తాను జీవించాలి. తనకు తానుగా వికాసం చెందాలి, తనదైన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలి, తనదైన అస్తిత్వాన్ని కలిగి ఉండాలి. ఇటువంటి స్థితికోసం వ్యక్తి తన జీవితంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదు ర్కొనటానికి సిద్ధమైఉండాలి అనేది 'అస్తిత్వవాద' ధోరణి.

ఈ అస్తిత్వవాద ధోరణిలో నవలలు రచించటమే ఈనాడు ప్రపంచ మంతటా అత్యంత ఆధునికంగా భావింపబడుతోంది. ఈ నవలారచన కత్తిమీద సాములాంటిది. ఈ నవలారచన చేయటానికి రచయితకి మనస్తత్వశాస్త్రంతోను, సామాజికశాస్త్రంతోను, వ్యక్తి జీవితంతోను పరిపూర్ణమైన పరిచయం ఉండాలి.

తెలుగులో అస్తిత్వవాద దృక్పథంతో బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', భాస్కరభట్ల కృష్ణారావు 'వెల్లువలో పూచికపుల్లలు', ఆర్. ఎస్. సుదర్శనం 'సంసారవృక్షం', వి.ఎస్. రమాదేవి 'దారితప్పిన మానవుడు', వడ్డెర చండీ దాస్ 'హిమజ్వాల' మొదలైన నవలలు వచ్చాయి. ఇంకా గోపిచంద్ 'అసమర్థుని జీవయాత్ర', రా.వి. శాస్త్రి 'అల్పజీవి', రావూరి భరద్వాజ 'కాదంబరి', కలువ కొలను సదానంద 'గంధరగోళం' మొదలైన నవలల్లోను అస్తిత్వవాద ధోరణి కనబడుతుంది. అనుభవంలోంచి వ్యక్తి పరిణమించాలి, పురోగమించాలి, వికసిం చాలి—తనదైన వ్యక్తిత్వాన్ని, అస్తిత్వాన్ని కలిగిఉండాలి అని తెలియజెప్పటమే ఈ నవలల ఉద్దేశం.

ఇక శిల్పం దృష్ట్యా 'చైతన్యస్రవంతి ధోరణి'ని ఆధునిక తెలుగు నవలా రీతిగా చెప్పుకోవచ్చు. వ్యక్తి ఆలోచనలు ఒక క్రమ పద్ధతిన సాగవు. సామా న్యంగా నవలల్లో వ్యక్తి ఆలోచనలు ఒక క్రమపద్ధతిన చిత్రింపబడతాయి.

అయితే, చైతన్య స్రవంతి నవలల్లో వ్యక్తి ఆలోచనలను వున్నవి వున్నట్టుగా, వాస్తవికంగా ఆద్దం పట్టడం జరుగుతుంది. చైతన్య స్రవంతి నవలల్లోని పాత్రల ఆలోచనలకు, ప్రవర్తనకు దేశకాలాదులతో ప్రమేయం ఉండదు. అయితే, పాత్రల ఆలోచనల ద్వారా వ్యక్తమైన విషయాలు, ఆ పాత్రల జీవితాల్లో ఏదో ఒక సందర్భంలో ప్రాముఖ్యతను వహించి వుంటాయి.

చైతన్య స్రవంతిలోని వాక్యాలు, మాటలు, సంభాషణలు, వర్ణనలు అసంపూర్ణంగాను, అసందర్భంగాను వుంటుంటాయి. ఒక్కోసారి అవి అసహ్యాన్ని కూడా కలుగజేసేలా వుంటాయి. ఈ నవలారీతిలోని వాక్యాలకు, సంభాషణలకు నిర్దుష్టమైన సరియైన ప్రారంభం ముగింపు వుండవు. ఒక విషయాన్ని గురించి మాట్లాడుతూ దాన్ని మధ్యలో ఆపేసి మరో విషయాన్ని గురించి సంభాషించడం జరుగుతుంది. అందుకనే, చైతన్య స్రవంతి ధోరణిలో రచింపబడ్డ నవలలను వ్యక్తి మనస్తత్వాన్ని యదాతథంగా, వాస్తవికంగా చిత్రిక పట్టే నవలలుగా చెప్పుకోవచ్చు.

ఈ ధోరణిలో మన ఆంధ్ర సాహిత్యంలో నవీన్ 'అంపశయ్య', కొంత వరకు బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', అలాగే రాచకొండ విశ్వనాధశాస్త్రి 'అల్పజీవి', వినుకొండ నాగరాజు 'తాగుబోతు', ఆర్.ఎస్. సుదర్శనం 'మల్లీ వసంతం', వడ్డెర చండీదాస్ 'హిమజ్వాల' మొదలైన నవలలు వచ్చాయి. ఈ నవలలన్నీ వ్యక్తి అంతరంగాన్ని, వ్యక్తి ఆలోచనలను వాస్తవికంగా, యదాతథంగా చిత్రిక పట్టాయి.

ఇక, శైలి శిల్పం విషయాల్లో తెలుగునవల పేజీలకు పేజీలు సాగిసోయే అతి దీర్ఘ వర్ణనల నుండి వర్ణనలకు అసలు ప్రాధాన్యం లేని దశకు ఎదిగింది. ఈనాటి నవలల్లో ఒకటి రెండు వర్ణనలున్నా అవి సాధ్యమైనంత సంక్షిప్తంగా వుంటున్నాయి. అతి ముఖ్యం అనుకొంటేనే వర్ణనలకు ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతోంది. ఇలా వర్ణనలకు నవలలో సాధ్యమైనంత తక్కువస్థానాన్ని ఇవ్వటం కూడా ఆధునిక తెలుగు నవలా రీతిగానే చెప్పుకోవచ్చు.

అలాగే, పూర్వం అంటే తెలుగునవల ఆవిర్భవించిన తొలి రోజుల్లో సంభాషణలు అతి దీర్ఘంగాను, అస్వాభావికంగాను, అవాస్తవికంగాను, కృతకం

గాను సాగేవి. అయితే, ఈనాడు తెలుగునవలల్లో సంభాషణలు నిత్యవ్యవహారం లోను, వాస్తవికంగాను, స్వాభావికంగాను, సాధ్యమైనంత సరళంగాను, సంక్షిప్తంగాను వుంటున్నాయి. సంభాషణల విషయంలో తెలుగునవల సాధించిన ఆధునికత ఇది

ఇక పాత్రల విషయానికి వస్తే, పూర్వం పాత్రలు పరిణామ రహితాలుగా వుండేవి. అయితే, ఈ నాటి నవలల్లోని పాత్రలు పరిణామశీలవంతాలై వుంటున్నాయి. పూర్వంలా నవలంతటా ఒకేలాకాక, సమయాన్ని సందర్భాన్ని బట్టి ఈనాటి పాత్రలు క్రమవికసనం చెందుతున్నాయి. అలాగే, ఈనాటి నవలల్లో సాధ్యమైనన్ని తక్కువ పాత్రలు, నిత్య జీవితంలో మనకు తారసపడే వ్యక్తుల్లాంటి పాత్రలు ఎక్కువయ్యాయి. అంచే, తెలుగునవల ఈనాడు వాస్తవికతకు అనుయాయి అయ్యిందన్నమాట, పాత్రల విషయంలో కూడా ఆధునిక తెలుగు నవల ఇలా ఎదిగిందనే చెప్పుకోవచ్చు.

ఏది ఏమైనా, తెలుగునవలా చరిత్రను సింహావలోకనం చేస్తే అది ఎప్పటికప్పుడు స్పందిస్తూ, చైతన్యవంతమౌతూ, నవ్యధోరణులతో వికసిస్తూ వచ్చిన విషయం స్పష్టమౌతుంది. ఇదే తెలుగునవల సాధించిన విజయం.

IP4

శ్రీం

శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ప్రసన్నః

శ్రీ స్వామి రామస్వామి

కనక వజ్ర రత్నమాల శ్రీమాల
శ్రీ స్వామి శ్రీరామస్వామి
శ్రీ మహేశ్వరి పరమేశ్వరి కన్యకా పరమేశ్వరీ
వరంబున జనన మందెను శ్రీ సుపుత్రుండు
పుణ్యదంపతులగు శ్రీ వెంకటయ్య
బాలకృష్ణమ్మలకు; ముదముతో శ్రీరాముని
పేరిడిరి శ్రీ స్వామికి రామస్వామియని.

అల్లారు ముద్దుగా, ముదముతో పెరిగి దొడ్డవాడయ్యే
ధీశాలి, ధనశాలి, ధైర్యశాలి,

బీద సాదలతో కలసిమెలసి
ఆడుకొన్న కళ్యాణస్వామి
వేరూరు పురప్రముఖులకు నిలయమై నిల్చె
శ్రీస్వామి రామస్వామి.

ఆవనిపై బంధుమిత్రులచేత సాదరముగ
గౌరవ ప్రేమల బడయుచున్న శ్రీస్వామిని
పుడమిపై వర్ధిల్లుమని ఆశీర్వదించె
శ్రీమాత భరతమాత.

స్వబుద్ధితో స్వయంకృషితో
స్వయంశక్తితో సాటిలేని మేటి
ధీశాలి ధైర్యశాలి శ్రీస్వామి రామస్వామి
కష్టములను నిష్ఠురములను లెక్కసేయడు
పట్టుపట్టిన ఆపట్టు విడువడు.

పట్టింది బంగారమై పెట్టింది అమృతమై
పట్టు పట్టుమని యిచ్చె పదిలముగను.
పట్టు కొమ్మయై నిల్చె పుడమిపై
పనులు సాధించి పూర్తి చేసినవారికి.

సుమనస్సుతో సువాక్కు చెప్పె ఆదరముగ
ఆశ్రయించిన వారికి,
కార్యములను సాధించె పట్టుదలతో
సుఫలితములందు కొనెను దిగ్విజయముతో.

బాదం వంశ మణిరత్నం

శ్రీ కన్యకా పరమేశ్వరి వరఫలం

శ్రీ వెంకటయ్య బాలకృష్ణమ్మల నోమునోంట

కార్యశూరుడు

దానవీరుడు

చేతిలో పరుసవేది ఉన్న

ప్రజ్ఞాధురీణుడు

సంఘ శ్రేయోభిలాషి

నిత్య సంతోషి

బంధుమిత్ర హృత్సంతోషి

ఆర్త జనపోషి

వ్యాపారదక్షుడు

పరోపకార ప్రజ్ఞాచక్షుడు

నిరంతరం సమున్నతుడై

మరో షష్టిపూర్తి జరుపుకోవాలి

శ్రీస్వామి మారామస్వామి

- అలంపూరు వెంకటిరాములు

(శ్రీ బాదం రామస్వామిగారి షష్ట్యబ్ది సందర్భంగా బి.ఆర్. అసోసియేట్స్ సిబ్బంది పక్షాన సమర్పించిన సుభాషిత రత్నములు)

V.R NARLA MEMORIAL LIBRARY · V.R.I.
V.R NARLA
D. P. R. I.
Acc. No.

192

BOB

AQUA101B103

BC

Cover
Printed at Sri Kanaka Durga Pre
Hyderabad, India.

మహమ ఫౌండేషన్ పుస్తకాం పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA101B103
పుస్తకం పేరు	వ్యాసప్రభావ బారం రామస్వామి షష్ట్యబ్దపూర్తిసంచిక
తారీఖు	31 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	310
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	c.f. iv, iv(b) no
లేని పేజీలు	no
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	Manthri
పరీక్ష చేసినది	MADHU MATHI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంస్థితి	good

21 పాఠాలకొరకు

8(b), 8(d), 8(f)

8(h), iii, 2, 180, 192

BCI